

'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 10+8 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 51

సోమవారం 13-5-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



స్వర్ణ పతకాలు నెగ్గిన ఆంధ్రప్రదేశ్ అథ్లెట్లు అనూష, రష్మీ

ఫెడరేషన్ కప్ జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజు ఆంధ్రప్రదేశ్‌కు రెండు స్వర్ణ పతకాలు లభించాయి. భువనేశ్వర్‌లో ఆదివారం మొదలైన ఈ టోర్నీలో మహిళల ట్రిపుల్ జంప్‌లో మల్లాల అనూష.. మహిళల జావెలిన్ త్రోలో కె.రష్మీ పసిడి పతకాలను సొంతం చేసుకున్నారు. అనూష 13.53 మీటర్ల దూరం గెంతి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. షీనా (కేరళ: 13.32 మీటర్లు) రజతం... గాయత్రి శివకుమార్ (కేరళ: 13.08 మీటర్లు) కాంస్యం గెల్చుకున్నారు. జావెలిన్ త్రో ఫైనల్లో రష్మీ జావెలిన్‌ను 54.75 మీటర్ల దూరం విసిరి విజేతగా నిలిచింది. నాలుగు రోజులపాటు జరిగే ఈ టోర్నీలో ఒలింపిక్ చాంపియన్, ప్రపంచ చాంపియన్ అయిన జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ప్రధాన ఆకర్షణ కానున్నాడు. మూడేళ్ల తర్వాత స్వదేశంలో పోటీపడుతున్న నీరజ్ మంగళవారం జావెలిన్ త్రో క్వాలిఫయింగ్ రౌండ్‌లో, బుధవారం జరిగే ఫైనల్లో బరిలోకి దిగుతాడు.



గెలిచి నిలిచిన చెన్నై

- కీలక పోరులో రాజస్తాన్‌పై విజయం
- రాయల్స్‌ను కట్టడి చేసిన సిమర్‌జీత్, తుషార్
- రాణించిన రుతురాజ్
- ఓటమితో రాజస్తాన్‌కు తప్పని 'ప్లే ఆఫ్స్' నిరీక్షణ



సిమర్‌జీత్

చెన్నై: రాజస్తాన్ రాయల్స్... చెన్నై సూపర్‌కింగ్స్! మొదటి జట్టు గెలిస్తే నేరుగా 'ప్లే ఆఫ్స్' చేరుతుంది. రెండో జట్టు గెలిస్తే 'ప్లే ఆఫ్స్' వేటలో ముందడుగు వేస్తుంది. అలా కీలకమైన ఈ పోరులో సొంతగడ్డపై చెన్నై... పేస్ బౌలింగ్‌తో కట్టడి చేసి... అనంతరం బ్యాటింగ్‌లోనూ రాణించి రాయల్స్‌కు చెక్ పెట్టి... ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముందుగా రాజస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు నష్టానికి 141 పరుగులే చేయగలిగింది. రియాన్ పరాగ్ (35 బంతుల్లో 47 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించగా... మరెవరూ 30 పరుగులైనా చేయలేకపోయారు. చెన్నై పేస్ బౌలర్లు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సిమర్‌జీత్ సింగ్ (3/26), తుషార్ దేశ్‌పాండే (2/30) రాణించారు. తర్వాత లక్ష్యఛేదనలో చెన్నై 18.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 145 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (41 బంతుల్లో 42 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్) కుదురుగా ఆడాడు. రాజస్తాన్ స్పిన్నర్ అశ్విన్‌కు 2 వికెట్లు దక్కాయి.

జోరు తగ్గిన రాజస్తాన్

రాజస్తాన్ రాయల్స్ ఈ సీజన్‌లో వరుస విజయాలతో హోరెత్తించింది. కానీ ఈ మ్యాచ్‌లో బోర్ కొట్టించింది. యశస్వి (21 బంతుల్లో 24; 3 ఫోర్లు, 1 సిక్స్), బట్లర్ (25 బంతుల్లో 21; 2 ఫోర్లు), కెప్టెన్ సంజూ సామ్సన్ (19 బంతుల్లో 15) ఇలా టాపార్డర్ వన్డేను తలపించే ఆటే ఆడటంతో పరుగుల్లో వెనుకబడింది. రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్ (18 బంతుల్లో 28; 1 ఫోర్లు, 2 సిక్స్)లు కొట్టిన ఆ కాస్తా సిక్సర్లతో ఓ మోస్తరు స్కోరే చేసింది. కనీసం 150 పరుగుల మార్క్ అయిన దాటలేకపోవడంతో చెన్నైకి వారి సొంతగడ్డపై సులువైన లక్ష్యం అయ్యింది.

నడిపించిన నాయకుడు

రచిన్ రవీంద్ర (18 బంతుల్లో 27; 1 ఫోర్, 2 సిక్స్‌లు)లో ఇన్నింగ్స్ ఆరంభించిన కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఇన్నింగ్స్ ఆసాంతం ఒపిగ్గా ఆడాడు. వేగంగా ఆడే క్రమంలో మిచెల్ (13 బంతుల్లో 22; 4 ఫోర్లు), శివమ్ దూబే (11 బంతుల్లో 18; 2 ఫోర్లు, 1 సిక్స్) అవుటైనా... లక్ష్యం చిన్నదైనా... రుతురాజ్ మాత్రం గెలిచేదాకా జాగ్రత్త పడ్డాడు. రిజ్వీ (8 బంతుల్లో 15 నాటౌట్; 3 ఫోర్లు) బౌండరీలతో 10 బంతులు మిగిలుండగానే చెన్నై లక్ష్యాన్ని చేరింది.

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) రుతురాజ్ (బి) సిమర్‌జీత్ 24; బట్లర్ (సి) తుషార్ (బి) సిమర్‌జీత్ 21; సామ్సన్ (సి) రుతురాజ్ (బి) సిమర్‌జీత్ 15; పరాగ్ (నాటౌట్) 47; జురెల్ (సి) శార్దుల్ (బి) తుషార్ 28; శుభమ్ (సి) దూబే (బి) తుషార్ 0; అశ్విన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు)** 141. **వికెట్ల పతనం:** 1-43, 2-49, 3-91, 4-131, 5-131. **బౌలింగ్:** తుషార్ 4-0-30-2, తీక్షణ 4-0-28-0, శార్దుల్ 4-0-32-0, సిమర్‌జీత్ 4-0-26-3, జడేజా 4-0-24-0.

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రచిన్ (సి అండ్ బి) అశ్విన్ 27; రుతురాజ్ (నాటౌట్) 42; మిచెల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) చహల్ 22; మొయిన్ అలీ (సి) ఆవేశ్ ఖాన్ (బి) బర్గర్ 10; దూబే (సి) పరాగ్ (బి) అశ్విన్ 18; జడేజా (అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్) 5; సమీర్ రిజ్వీ (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (18.2 ఓవర్లలో 5 వికెట్లకు)** 145. **వికెట్ల పతనం:** 1-32, 2-67, 3-86, 4-107, 5-121. **బౌలింగ్:** బౌల్ట్ 2.2-0-24-0, సందీప్ శర్మ 3-0-30-0, అశ్విన్ 4-0-35-2, బర్గర్ 3-0-21-1, చహల్ 4-0-22-1, ఆవేశ్ ఖాన్ 2-0-12-0.



జడేజా 'అబ్‌స్ట్రక్టింగ్' అవుట్

ఆవేశ్ ఖాన్ వేసిన 16వ ఓవర్లో జడేజా లేని రెండో పరుగుకు పరుగెత్తి అవుటయ్యే ప్రమాదం నుంచి గట్టెక్కేందుకు ఉద్దేశపూర్వకంగా బంతిని అడ్డుకోవడంతో 'అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్'గా అవుటయ్యాడు. కీపర్ సామ్సన్ వికెట్లకు మీదకు వేసిన త్రోకు అడ్డుగా పరుగెత్తగా బంతి జడేజాకు తగిలింది. దీనిపై రాయల్స్ ఆటగాళ్లు అప్పీల్ చేయగా ఫీల్డ్ అంపైర్లు టీవీ అంపైర్‌కు నివేదించారు. రీప్లేను పరిశీలించిన థర్డ్ అంపైర్ అవుట్‌గా ప్రకటించాడు.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
కోల్‌కతా	12	9	3	18	1.428
రాజస్తాన్	12	8	4	16	0.349
చెన్నై	13	7	6	14	0.528
హైదరాబాద్	12	7	5	14	0.406
బెంగళూరు	13	6	7	12	0.387
ఢిల్లీ	13	6	7	12	-0.482
లక్నో	12	6	6	12	-0.769
గుజరాత్	12	5	7	10	-1.063
ముంబై	13	4	9	8	-0.271
పంజాబ్	12	4	8	8	-0.423

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ × కోల్‌కతా
వేదిక: అహ్మదాబాద్
రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

సుజీత్, జైదీప్‌లకు నిరాశ



సుజీత్

ఇస్తాంబుల్: వరల్డ్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ చివరి రోజు భారత ఫ్రీస్టయిల్ రెజ్లర్లు సుజీత్ (65 కేజీలు), జైదీప్ (74 కేజీలు) ఒలింపిక్ బెర్త్‌లను దక్కించుకోవడంలో విఫలమయ్యారు. మూడో స్థానం కోసం జరిగిన బౌట్‌లో రూథర్‌ఫర్డ్ (అమెరికా) చేతిలో సుజీత్ ఓడిపోగా... కాంస్య పతక బౌట్‌లో జైదీప్ 1-2తో దెమిర్తాస్ (టర్కీ) చేతిలో పరాజయం పాలయ్యాడు. దాంతో ఈసారి పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ నుంచి పురుషుల విభాగంలో ఒక్క రెజ్లర్ (అమన్; 57 కేజీలు) మాత్రమే పోటీపడనున్నాడు.

1500 మీటర్ల విభాగంలో దీక్ష జాతీయ రికార్డు




న్యూఢిల్లీ: సౌండ్ రన్నింగ్ ట్రాక్ ఫెస్టివల్ అథ్లెటిక్స్ మీట్‌లో భారత మహిళా అథ్లెట్ కేఎం దీక్ష 1500 మీటర్ల విభాగంలో కొత్త జాతీయ రికార్డు నెలకొల్పింది. లాస్ ఏంజెలిస్‌లో జరిగిన ఈ మీట్‌లో దీక్ష 1500 మీటర్ల దూరాన్ని 4ని:04.78 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఈ క్రమంలో 2021 నుంచి హర్‌మిలన్ బైన్స్ (4ని:05.39 సెకన్లు) పేరిట ఉన్న జాతీయ రికార్డును దీక్ష బద్దలు కొట్టింది.

భళా బెంగళూరు...

వరుసగా ఐదో విజయంతో ప్లే ఆఫ్స్ అవకాశాలు సజీవం

47 పరుగులతో ఓడిన ఢిల్లీ ● మెరిపించిన పటిదార్, గ్రీన్, జాక్స్ ● యశ్‌కు 3 వికెట్లు



రజత్ పటిదార్

బెంగళూరు: 'ప్లే ఆఫ్స్' లక్ష్యంగా సర్వశక్తులు ఒడ్డుతున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) వరుసగా ఐదో విజయంతో ఆశలు సజీవం చేసుకుంది. ఆదివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో 47 పరుగులతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించిన ఆర్సీబీ ఈ టోర్నీలో ఆరో విజయం నమోదు చేసుకుంది. ముందుగా బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 187 పరుగులు చేసింది. రజత్ పటిదార్ (32 బంతుల్లో 52; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), విల్ జాక్స్ (29 బంతుల్లో 41; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించారు. తర్వాత ఢిల్లీ 20 ఓవర్లలో 140 పరుగులకు కుప్పకూలింది. పంత్‌పై ఒక మ్యాచ్ నిషేధం కారణంగా ఈ మ్యాచ్‌లో ఢిల్లీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన అక్షర్ పటేల్ (39 బంతుల్లో 57; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించాడు.

పటిదార్ ఫటాఫట్...

డుప్లెసిస్ (6) విఫలమవగా, కోహ్లి (13 బంతుల్లో 27; 1 ఫోర్, 3 సిక్స్‌లు) ఎంతో సేపు నిలువలేదు. ఢిల్లీ ఫీల్డర్లు పదేపదే క్యాచ్‌లు నేలపాలు చేయడంతో బతికిపోయిన జాక్స్, పటిదార్ ధాటిగా పరుగులు రాబట్టారు. దీంతో 9.1 ఓవర్లో బెంగళూరు 100 పరుగులకు చేరగా, పటిదార్ 29 బంతుల్లో ఫిఫ్టీ చేశాడు. కానీ స్వల్పవ్యవధిలో అతనితో పాటు జాక్స్ అవుటయ్యాక స్కోరు మందగించింది. గ్రీన్ (24 బంతుల్లో 32; 1 ఫోర్, 2 సిక్స్‌లు), మహిపాల్ సిక్స్‌లతో 17 ఓవర్లలో 169/4 స్కోరు చేసిన ఆర్సీబీ తర్వాత ఢిల్లీ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆఖరి 3 ఓవర్లలో 18 పరుగులే చేసి 5 వికెట్లను కోల్పోయింది.

అక్షర్ ఒక్కడే!

లక్ష్యఛేదనలో ఢిల్లీ బ్యాటర్లు చెత్తగా ఆడటంతో ఆరంభం నుంచి ఆలౌట్ దాకా ఏ దశలోనూ గెలిచేలా కన్పించలేదు. ఫ్రేజర్ (8 బంతుల్లో 21; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) తర్వాత కెప్టెన్ అక్షర్ పటేల్ ఒంటరి పోరాటం చేశాడు. అతనికి షై హోప్ (23 బంతుల్లో 29; 4 ఫోర్లు) కాసేపు అండగా నిలిచాడు. మిగిలిన వారెవరూ చెప్పుకోదగ్గ స్కోరే చేయలేదు.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) అభిషేక్ (బి) ఇషాంత్ 27; డుప్లెసిస్ (సి) ఫ్రేజర్ (బి) ముకేశ్ 6; జాక్స్ (సి) అక్షర్ (బి) కుల్దీప్ 41; పటిదార్ (సి) అక్షర్ (బి) రసిఖ్ 52; గ్రీన్ (నాటౌట్) 32; మహిపాల్ (సి) అభిషేక్ (బి) ఖలీల్ 13; దినేశ్ కార్తీక్ (సి) కుల్దీప్ (బి) ఖలీల్ 0; స్వప్నిల్ (సి) కుషాగ్ర (బి) రసిఖ్ 0; కరణ్ శర్మ (రనౌట్) 6; సిరాజ్ (రనౌట్) 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు)** 187. **వికెట్ల పతనం:** 1-23, 2-36, 3-124, 4-137, 5-174, 6-174, 7-176, 8-185, 9-187. **బౌలింగ్:** ఇషాంత్ 3-0-31-1, ఖలీల్ 4-0-31-2, ముకేశ్ 3-0-23-1, అక్షర్ 3-0-24-0, కుల్దీప్ 4-0-52-1, రసిఖ్ 3-0-23-2.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (సి) జాక్స్ (బి) స్వప్నిల్ 1; ఫ్రేజర్ (రనౌట్) 21; అభిషేక్ (సి) ఫెర్గూసన్ (బి) యశ్ 2; షై హోప్ (సి) కరణ్ (బి) ఫెర్గూసన్ 29; కుశాగ్ర (ఎల్బీడబ్ల్యూ) (బి) సిరాజ్ 2; అక్షర్ (సి) డుప్లెసిస్ (బి) యశ్ 57; స్టబ్స్ (రనౌట్) 3; రసిఖ్ (సి) జాక్స్ (బి) గ్రీన్ 10; కుల్దీప్ (బి) యశ్ 6; ముకేశ్ (సి) మహిపాల్ (బి) ఫెర్గూసన్ 3; ఇషాంత్ శర్మ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (19.1 ఓవర్లలో ఆలౌట్)** 140. **వికెట్ల పతనం:** 1-8, 2-24, 3-24, 4-30, 5-86, 6-90, 7-127, 8-128, 9-135, 10-140. **బౌలింగ్:** స్వప్నిల్ 1-0-9-1, సిరాజ్ 4-0-28-1, యశ్ దయాళ్ 3.1-0-20-3, కరణ్ శర్మ 2-0-19-0, ఫెర్గూసన్ 4-0-23-2, గ్రీన్ 4-0-19-1, జాక్స్ 1-0-16-0.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com



జేఈఈ-అడ్వాన్స్‌డ్ 2024

అడ్వాన్స్‌డ్‌లో.. జయం ఇలా!

» ఈ నెల 26న జేఈఈ-అడ్వాన్స్‌డ్ పరీక్ష
» ఇప్పుడు అనుసరించే వ్యూహాలే విజయ సోపానాలు
» రివిజన్‌కు, ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం అంటున్న నిపుణులు

జేఈఈ అడ్వాన్స్‌డ్.. పరిచయం అక్కర్లేని పరీక్ష! దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు ఐఐటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్!! జేఈఈ-మెయిన్ మార్కులు, పర్సంటైల్ ఆధారంగా 2.5 లక్షల మందికి జేఈఈ-అడ్వాన్స్‌డ్‌కు అర్హత లభిస్తుంది. దేశవ్యాప్తంగా ఈ పరీక్షను ఈ నెల 26న నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో.. అడ్వాన్స్‌డ్‌లో సత్తా చూపేందుకు నిపుణుల ఎగ్జామ్ టిప్స్..

26న అడ్వాన్స్‌డ్ పరీక్ష

జేఈఈ అడ్వాన్స్‌డ్‌ను ఈ నెల(మే) 26న నిర్వహించనున్నారు. మొత్తం రెండు పేపర్లుగా మూడు సబ్జెక్ట్‌లలో పరీక్ష జరుగుతుంది. ఈసారి కూడా పరీక్ష గత ఏడాది మాదిరిగానే ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతి పేపర్‌లోనూ మ్యాథమెటిక్స్,ఫిజిక్స్,కెమిస్ట్రీల నుంచి 17ప్రశ్నలు చొప్పున అడిగే అవకాశం ఉంది. అంటే.. ఒక్కో పేపర్‌లో 51ప్రశ్నలు ఉండొచ్చు. అదే విధంగా..ఒక్కో పేపర్‌కు 180 మార్కులు చొప్పున రెండు పేపర్లను కలిపి 360 మార్కులకు పరీక్ష జరిగే అవకాశముంది.

రివిజన్‌కు ప్రాధాన్యం

ప్రస్తుతం సమయంలో విద్యార్థులు పూర్తిగా రివిజన్‌కే ప్రాధాన్యం ఇవ్వాలి. ఇప్పటికే తాము రాసుకున్న నోట్స్ లేదా రెడీ రెకనర్స్ ఆధారంగా పునశ్చరణ చేసుకోవాలి. అలా పునశ్చరణ చేసుకుంటున్నప్పుడే.. సంబంధిత టాపిక్స్ ప్రాథమిక భావనలు, సూత్రాలు, అన్వయం వంటి వాటిని అవలోకనం చేసుకోవాలి. రివిజన్ సమయంలోనూ వెయిటేజీ ఆధారంగా వాటికి ప్రాధాన్యం ఇవ్వడం మేలు చేస్తుంది. ఇందుకోసం గత ప్రశ్న పత్రాలను పరిశీలించాలి.

వెయిటేజీకి అనుగుణంగా

రివిజన్ సమయంలో అభ్యర్థులు సబ్జెక్ట్‌ల వారీగా అత్యంత ముఖ్యమైన అంశాలపై ఫోకస్ చేయాలి. మ్యాథమెటిక్స్‌లో.. కోఆర్డినేట్ జామెట్రీ, డిఫరెన్షియల్ కాలిక్యులస్, ఇంటిగ్రల్ కాలిక్యులస్, మాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్‌పై దృష్టి పెట్టాలి. కెమిస్ట్రీలో.. కెమికల్ బాండింగ్, ఆల్కైల్ హలైడ్; ఆల్కహాల్ అండ్ ఈథర్, కార్బొనైల్ కాంపౌండ్స్, అటామిక్ స్ట్రక్చర్ అండ్ న్యూక్లియర్ కెమిస్ట్రీ, థర్మోడైనమిక్స్ అండ్ థర్మో కెమిస్ట్రీలను చదవాలి. ఫిజిక్స్‌లో.. ఎలక్ట్రో డైనమిక్స్; మెకానిక్స్; హీట్ అండ్ థర్మో డైనమిక్స్‌పై పట్టు సాధించాలి.

మోడల్ టెస్ట్‌లు

ప్రస్తుతం సమయంలో రెండు లేదా మూడు మోడల్ టెస్ట్‌లకు హాజరయ్యేలా ప్లాన్ చేసుకోవాలి. పరీక్ష ఫలితం విశ్లేషించుకుని.. తాము చేస్తున్న పొరపాట్లపై అవగాహన ఏర్పరచుకోవాలి. ఆ పొరపాట్లు పరీక్ష హాల్లో పునరావృతం కాకుండా చూసుకోవాలి. ముఖ్యంగా గత నాలుగైదేళ్ల ప్రశ్న పత్రాలను సాధన చేయాలి. పరీక్షలో అడిగే ప్రశ్నల సరళి, మార్కింగ్ విధానాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. సింగిల్ కరెక్ట్ కొశ్చన్స్; మల్టిపుల్ ఛాయిస్ కొశ్చన్స్; పేరాగ్రాఫ్ ఆధారిత ప్రశ్నలను సాధన చేయాలి.

ప్రాక్టీస్ టెస్ట్ సదుపాయం

అడ్వాన్స్‌డ్‌కు హాజరవుతున్న విద్యార్థులు.. అడ్వాన్స్‌డ్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ప్రాక్టీస్ టెస్ట్‌ల సదుపాయాన్ని వినియోగించుకోవాలి. నిర్వాహక ఇన్‌స్టిట్యూట్ ఐఐటీ-చెన్నై అడ్వాన్స్‌డ్ వెబ్‌సైట్‌లో రెండు టెస్ట్‌లను అందుబాటులో ఉంచింది. వీటిని సాధన చేయడం ద్వారా ప్రశ్నల శైలిపై అవగాహన పెరుగుతుంది.

కొత్త అంశాలు

జేఈఈ-మెయిన్‌లో ఈ ఏడాది పలు టాపిక్స్‌ను తొలగించిన సంగతి తెలిసిందే. దీంతో.. మెయిన్ ఎగ్జామ్ పూర్తయ్యే వరకు విద్యార్థులు ఆ సిలబస్‌కు అనుగుణంగానే ప్రిపరేషన్ సాగించి ఉంటారు. కాని అడ్వాన్స్‌డ్ సిలబస్‌లో మాత్రం ఎలాంటి మార్పు లేదని స్పష్టమైంది. దీంతో మెయిన్ ప్రిపరేషన్ సమయంలో విస్మరించిన టాపిక్స్‌పై విద్యార్థులు ఇప్పుడు దృష్టిపెట్టాల్సి ఉంటుంది. వీటికి సంబంధించి అడ్వాన్స్‌డ్ పరీక్షలో లభిస్తున్న వెయిటేజీకి అనుగుణంగా ప్రాధాన్యం క్రమంలో సన్నద్ధమవ్వాలి.

ఒత్తిడికి దూరంగా

చివరి సమయంలో అభ్యర్థులు చేసే పొరపాటు.. రాత్రింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పట్టడం. పరీక్ష సమీపిస్తున్న తరుణంలో అతిగా చదవడం వల్ల అనవసరమైన ఒత్తిడికి గురయ్యే ఆస్కారముంది. కాబట్టి బ్యాలెన్స్‌డ్ ప్రిపరేషన్ కొనసాగిస్తూ ఒత్తిడికి దూరంగా ఉండాలి. ప్రశ్నను ఎలా అడిగినా సమాధానం ఇవ్వగలమనే ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలి. సింగిల్ కరెక్ట్ కొశ్చన్స్, మల్టిపుల్ ఛాయిస్ కొశ్చన్స్, పేరాగ్రాఫ్ ఆధారిత ప్రశ్నలను సాధన చేయడం ద్వారా పరీక్షలో ఏమైనా మార్పులు జరిగినా.. ఎలాంటి ఒత్తిడి లేకుండా సమాధానాలు ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది.

జేఈఈ అడ్వాన్స్‌డ్.. ముఖ్యాంశాలు

- ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమిస్తూ అప్లికేషన్ ఓరియంటేషన్‌తో కొశ్చన్స్ సాధన చేయాలి.
- ఇంటీజర్స్, ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- కనీసం రెండు మోడల్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లకు హాజరు కావాలి.
- అన్ని సబ్జెక్ట్‌లలో, అన్ని టాపిక్స్‌లో కాన్సెప్ట్స్, ఫార్ములాలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి.
- పరీక్ష రోజు హాల్లోకి అనుమతించే సమయాని కంటే గంట ముందుగా చేరుకోవాలి.
- మానసిక ఒత్తిడి లేకుండా చూసుకోవాలి. తేలికపాటి ఆహారం తీసుకోవాలి.
- పరీక్ష హాల్లో.. పరీక్ష సమయంలో కంప్యూటర్ స్క్రీన్‌పై అందుబాటులో ఉండే కౌంట్‌డౌన్ టైమర్‌ను చూసుకుంటూ ఉండాలి.
- మొదటి పేపర్ పూర్తయిన తర్వాత దాని గురించి మర్చిపోయి రెండో పేపర్‌కు సన్నద్ధం కావాలి.

పరీక్ష రోజు ఇలా

- ఎలాంటి పోటీ పరీక్ష అయినా.. ఎన్ని సంవత్సరాలు కృషి చేసినా.. పరీక్ష రోజు చూపే ప్రతిభే అత్యంత నిర్ణయాత్మకంగా నిలుస్తుంది.
- పరీక్ష రోజు ముందుగా ప్రశ్న పత్రం ఆసాంతం చదివేందుకు కొంత సమయం కేటాయించాలి. దాని ఆధారంగా తమకు సులభంగా ఉన్న ప్రశ్నలను గుర్తించాలి. ముందుగా వాటికి సమాధానాలు ఇవ్వాలి.
- వీలైతే పరీక్ష ముగియడానికి ముందు పది లేదా పదిహేను నిమిషాలపాటు సమాధానాలు రివ్యూ చేసుకోవాలి.
- సమాధానాలు ఇచ్చే సమయంలో ఏమైనా సందిగ్ధత ఉంటే మార్క్ ఫర్ రివ్యూ బటన్‌పై క్లిక్ చేసి.. చివర్లో సమాధానాల రివ్యూ సమయంలో నిశ్చితాభిప్రాయానికి వచ్చి సదరు సమాధానాన్ని సేవ్ చేయాలి.

జేఈఈ - అడ్వాన్స్‌డ్-2024.. ముఖ్య తేదీలు

- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం: 2024, మే 17 - 26
- జేఈఈ అడ్వాన్స్‌డ్ తేదీ: 2024, మే 26 (పేపర్-1 ఉదయం 9 నుంచి 12 వరకు; పేపర్-2 మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 వరకు)
- ఫలితాల వెల్లడి: 2024, జూన్ 9
- జోసా కౌన్సెలింగ్ ప్రక్రియ: 2024, జూన్ 10 నుంచి
- వివరాలకు వెబ్‌సైట్: https://jeeadv.ac.in

విద్య, ఉద్యోగ సమాచారం

ఫ్యాక్ట్, కేరళలో 98 అప్రెంటిస్‌లు

ఉద్యోగమండల్(కేరళ)లోని ది ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్ లిమిటెడ్(ఫ్యాక్ట్) అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 98
» **విభాగాలు:** ఫిట్టర్, మెషినిస్ట్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, మెకానిక్ మోటర్ వెహికల్, కార్పెంటర్, మెకానిక్(డీజిల్), ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, వెల్డర్(గ్యాస్ అండ్ ఎలక్ట్రిక్), పెయింటర్, సీఓపీఏ/ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్.
» **అర్హత:** 60 శాతం మార్కులతో సంబంధిత ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి. ఐటీఐ ట్రేడు సర్టిఫికేట్ ఉండాలి. » **వయసు:** 01.04.2024 నాటికి 23 ఏళ్లు మించకూడదు.
» **స్టైపెండ్:** నెలకు రూ.7000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.05.2024
» **వెబ్‌సైట్:** https://fact.co.in

ఇండియన్ ఆర్మీలో 30 డెంటల్ కార్ప్స్ పోస్టులు

ఇండియన్ ఆర్మీలో షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) ద్వారా డెంటల్ కార్ప్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 30
» **అర్హత:** బీడీఎస్/ఎండీఎస్ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 31.12.2024 నాటికి గరిష్ఠ వయోపరిమితి 45 ఏళ్లకు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.61,300 నుంచి 1,20,900.
» **ఎంపిక విధానం:** అప్లికేషన్ స్క్రీనింగ్, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.06.2024
» **వెబ్‌సైట్:** https://joinindianarmy.nic.in

టీఎంసీ, ముంబైలో సైంటిఫిక్ ఆఫీసర్ పోస్టులు

ముంబైలోని టాటా మెమోరియల్ సెంటర్‌కు చెందిన టాటా మెమోరియల్ హాస్పిటల్‌లో.. ఒప్పంద ప్రాతిపదికన సైంటిఫిక్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** పీజీ(ఆడియాలజీ/ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.50,000 నుంచి రూ.60,000
» **పనిచేయాల్సిన ప్రదేశం:** టాటా మెమోరియల్ హాస్పిటల్, డా.ఎర్నెస్ట్ బోర్జెస్ రోడ్డు, పరేల్, ముంబై.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 16.04.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.05.2024
» **వెబ్‌సైట్:** https://tmc.gov.in

ట్రిపుల్ ఐటీ, ఏపీలో పీయూసీ, బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలు

ఏపీలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్‌జీయూకేటీ) నిర్వహిస్తున్న నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండేళ్ల పీయూసీ, నాలుగేళ్ల బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు కోరుతోంది.

» **ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లు:** ఆర్‌కే వ్యాలీ క్యాంపస్, నూజివీడు క్యాంపస్, శ్రీకాకుళం క్యాంపస్, ఒంగోలు క్యాంపస్.
» **అర్హత:** 2024లో పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి.
» **ఎంపిక విధానం:** అభ్యర్థుల మెరిట్, కేటగిరీ ఆధారంగా క్యాంపస్‌లను కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.06.2024.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://www.rgukt.in

ఐపీపీబీ, న్యూఢిల్లీలో 54 ఎగ్జిక్యూటివ్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్(ఐపీపీబీ).. కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 54
» **పోస్టుల వివరాలు:** ఎగ్జిక్యూటివ్(అసోసియేట్ కన్సల్టెంట్)-28, ఎగ్జిక్యూటివ్ (కన్సల్టెంట్)-21, ఎగ్జిక్యూటివ్(సీనియర్ కన్సల్టెంట్)-05.
» **అర్హత:** బీఈ/బీటెక్ లేదా బీసీఏ/బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్/ఐటీ/ఎలక్ట్రానిక్స్)లేదా ఎంసీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** ఏడాదికి ఎగ్జిక్యూటివ్(అసోసియేట్ కన్సల్టెటంట్) పోస్టుకు రూ.10,00,000, ఎగ్జిక్యూటివ్(కన్సల్టెంట్) పోస్టుకు రూ.15,00,000, ఎగ్జిక్యూటివ్(సీనియర్ కన్సల్టెంట్) పోస్టుకు రూ.25,00,000.
» **ఎంపిక విధానం:** అసెస్‌మెంట్, ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 04.05.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.05.2024
» **పోస్టింగ్ స్థలం:** ఢిల్లీ/ముంబై/చెన్నై.
» **వెబ్‌సైట్:** www.ippbonline.com

హాల్ బెంగళూరులో సీనియర్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు

బెంగళూరులోని హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్).. తాత్కాలిక ప్రాతిపదికన సీనియర్ మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ మెడికల్ ఆఫీసర్(ఈఎన్‌టీ)-01, సీనియర్ మెడికల్ ఆఫీసర్(ఎమర్జన్సీ మెడిసిన్)-01, సీనియర్ మెడికల్ ఆఫీసర్(మెడిసిన్)-01, మెడికల్ ఆఫీసర్(జనరల్ డ్యూటీ)-01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** గ్రేడ్2 పోస్టులకు 35 ఏళ్లు, గ్రేడ్ 3 పోస్టులకు 45 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు గ్రేడ్2 పోస్టులకు రూ.40,000 నుంచి రూ.1,40,000, గ్రేడ్3 పోస్టులకు రూ.50,000 నుంచి రూ.1,60,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ద్వారా.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును చీఫ్ మేనేజర్(హెచ్ఆర్), హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, ఇండస్ట్రియల్ హెల్త్ సెంటర్, సుర్జన్‌దాస్ రోడ్, విమానపుర పోస్ట్, బెంగళూరు-560017 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 13.05.2024.
» **వెబ్‌సైట్:** https://www.hal-india.co.in

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 10+8 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 51
సోమవారం 13-5-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'



మొత్తం ఈక్విటీలకేనా?
మార్కెట్లు కుప్పకూలితే?.. పెట్టుబడులు పెట్టగలగాలి
- ప్రాఫిట్ ప్లస్‌లో



ఓటు వేయకపోతే జైలుకే!
కొన్ని దేశాల్లో ఓటు వేయకుంటే విధించే శిక్షలపై కథనం
-8లో




సరిహద్దు సమరం
ఒడిశాలో బీజేడీ, కాంగ్రెస్, బీజేపీ హోరాహోరీ

జార్ఖండ్.. ఎవరికి రిజర్వుడ్!
- ఎలక్షన్ స్పెషల్‌లో



దేశానికి 'కేజ్రీవాల్ కీ గ్యారంటీ'
ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ దేశ ప్రజలకు 'కేజ్రీవాల్ కీ గ్యారంటీ' పేరిట 10 హామీలు ఇచ్చారు.
- వివరాలు 6లో



లోక్‌సభ పోరు నేడే

నాలుగో దశలో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో ఎన్నికలు

ఏపీ అసెంబ్లీకి.. రాష్ట్రంలో కంటోన్మెంట్ ఉప ఎన్నికకు కూడా పోలింగ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు సాధారణ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు సోమవారం జరగనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. వామపక్ష తీవ్రవాద ప్రభావమున్న 13 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో మాత్రం సాయంత్రం 4 గంటలకే ముగించనున్నారు. ఈ మేరకు పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ ప్రకటించారు.

బరిలో 525 మంది..: లోక్‌సభ ఎన్నికల్లో 1,65,28,366 మంది పురుష ఓటర్లు, 1,67,01,192 మంది మహిళా ఓటర్లు, 2,760 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 3,32,32,318 మంది

మిగతా 2వ పేజీలో ▶



13 అసెంబ్లీ స్థానాల పరిధిలో 4 గంటల వరకే..

3,32,32,318 ఓటర్లు
అభ్యర్థులు 525

ఓట్ల లెక్కింపు జూన్ 4



ఏర్పాట్లన్నీ పూర్తి: సీఈవో వికాస్‌రాజ్

పార్టీల 'ఆఖరి' పోరాటం!

ప్రలోభాలతో ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు
ఆదివారం పోల్ స్లిప్పుల పంపిణీ.. వాటితోపాటు నగదు, గిఫ్టులు!
మరోవైపు ప్రచారం తీరును సమీక్షించుకున్న అభ్యర్థులు
పోలింగ్ తమకు అనుకూలంగా ఉండేలా చేయడంపై ప్రణాళికలు
3లో

'లక్ష'ణంగా బందోబస్తు

లోక్‌సభ ఎన్నికలకు భారీగా బలగాల మోహరింపు
ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేలా ఏర్పాట్లు
ఏ సమస్య ఉన్నా డయల్ 100 లేదా 112 టోల్‌ఫ్రీ
'సాక్షి' ఇంటర్వ్యూలో డీజీపీ రవిగుప్తా 2లో

పెత్తందారులకు మళ్లీ షాకే!

ఏపీలో సాధికారత, సంక్షేమాభివృద్ధికి జై కొట్టేందుకు జనం సిద్ధం 7లో

తోడు దొంగలు

కుట్రలు, కుతంత్రాలు, అవినీతే చంద్రబాబు, రామోజీ నీతి
40 ఏళ్లుగా ఒకరికొకరు సహకరించుకుంటూ వేల కోట్ల సామ్రాజ్యాల నిర్మాణం
7లో

వన్స్‌మోర్



ఇంటింటి ప్రగతి.. సమ్మిళిత అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని నడిపిస్తున్న ఏపీ సీఎం జగన్

మళ్లీ జగన్ వస్తేనే భవిష్యత్తు మరింత గొప్పగా మారుతుందని బలంగా నమ్ముతున్న ప్రజలు
సమగ్రాభివృద్ధి దిశగా ఏపీ దూసుకెళ్లాలంటే మళ్లీ రావాల్సిందేనని అన్ని చోట్లా బలమైన ఆకాంక్ష
సిద్ధం సభలు.. బస్సు యాత్ర.. ఎన్నికల ప్రచార సభల్లో అది ప్రస్ఫుటితమైందంటున్న పరిశీలకులు
మళ్లీ 'ఫ్యాన్'కు పట్టం ఖాయమని జాతీయ మీడియా సంస్థలు చేపట్టిన 22 సర్వేల్లోనూ వెల్లడి
5లో

ఇదండీ సంగతి



రెండ్రోజులు వానలు

తెలంగాణపై కొనసాగుతున్న ఉపరితల ద్రోణి ప్రభావం

సాక్షి, హైదరాబాద్: రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేసింది. తూర్పు మధ్యప్రదేశ్ నుంచి విదర్భ, మరఠ్వాడ, కర్ణాటక, తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వివరించింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట్, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆదివారం రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. గరిష్ట ఉష్ణోగ్రత రామగుండంలో అత్యధికంగా 40.5 డిగ్రీ సెల్సియస్‌గా, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో అత్యధికంగా 24.8 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. ఈనెల 14 నుంచి రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని ఆ శాఖ తెలిపింది.

గాలులు.. వర్షాలు

రాష్ట్రంలో పలుచోట్ల వర్ష బీభత్సం
పిడుగుపాటుకు ముగ్గురు మృతి
ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో కూలిన విద్యుత్ స్తంభాలు
5లో



ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడిన సీఎం రేవంత్

హెచ్‌సీయూ విద్యార్థులతో సీఎం ఆటవిడుపు



సాక్షి, హైదరాబాద్/రాయదుర్గం: నిన్నటిదాకా పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బిజీగా గడిపిన సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ఉదయం ఏడుగంటలకే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చేరుకున్నారు. ముందుగా యోగా సెంటర్ గ్రౌండ్‌లో జరిగిన తుత్తూరు– టీమ్ థాచపా జట్ల మధ్య జరిగిన ఎగ్జిబిషన్ మ్యాచ్‌ను తిలకించారు. అనంతరం హెచ్‌సీయూ విద్యార్థులతో కలిసి అదే గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడారు. ఇండియా ఏ టీమ్, ఇండియా బీ టీమ్‌గా రెండు జట్లు బరిలో దిగాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఇండియా 'ఏ'టీమ్ తరఫున ఆడారు. హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో ఇండియా ఏ టీమ్ ఐదు గోల్స్ చేయగా, ఇండియా బీ టీమ్ 3 గోల్స్ చేసింది. ఇండియా 'ఏ'టీమ్ 2 గోల్స్ తేడాతో విజయం సాధించింది. తెల్లటి జెర్సీ ధరించిన రేవంత్ మైదానంలో హుషారుగా కదులుతూ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ కనిపించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సెంట్రల్ యూనివర్సిటీ ఎన్ఎస్‌యూఐ ఇన్‌చార్జ్ అజయ్‌ల నేతృత్వంలో జరిగిన ఈ మ్యాచ్‌లో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి, మైనార్టీ రెసిడెన్షియల్ గురుకులాల చైర్మన్ ఫహీం ఖురేషి, తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఎ. ఫహీమ్, టీశాట్ సీఈఓ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షూ ఇబ్బంది పెట్టినా

సీఎం రేవంత్ హెచ్‌సీయూ విద్యార్థులతో ఫుట్‌బాల్ ఆడుతుండగా, ఆయన వేసుకున్న షూ కొంత ఇబ్బంది పెట్టింది. మ్యాచ్ మధ్యలో కాలు పట్టుకొని కాసేపు ఇబ్బంది పడినట్టు కనిపించారు. చివరకు షూ తీసేసి కేవలం సాక్స్‌తోనే మ్యాచ్ కొనసాగించారు.

మంత్రి పొంగులేటి లంచ్ బ్రేక్

సత్తుపల్లిలో రోడ్డు పక్క హోటల్‌లో భోజనం



రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో రోడ్డు పక్కన హోటల్‌లో భోజనం చేశారు. అశ్వారావుపేట నుంచి ఎర్రుపాలెం వెళుతూ మార్గమధ్యలో సత్తుపల్లిలో ఆగారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, డాక్టర్ మట్టా దయానంద్, మువ్వా విజయబాబుతో కలిసి హోటల్‌లో భోజనం చేశారు. - సత్తుపల్లి

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

లక్షకు పైగా బలగాల మోహరింపు



లోక్‌సభ ఎన్నికలకు పక్కాగా బందోబస్తు

- పౌరులు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు
- మావోయిస్టు ప్రభావిత జిల్లాలు, సున్నిత పోలింగ్ స్టేషన్లు ఉన్న ప్రాంతాలపై ఫుల్ ఫోకస్
- స్ట్రాంగ్ రూంల వద్ద కేంద్ర బలగాలతో పహారా
- ఏ సమస్య ఉన్నా డయల్ 100 లేదా 112 టోల్‌ఫ్రీ

'సాక్షి' ఇంటర్వ్యూలో డీజీపీ రవిగుప్తా

(నాగోజు సత్యనారాయణ)

రాష్ట్రవ్యాప్తంగా 17 లోక్‌సభ స్థానాలకు, కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నిక ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పక్కాగా బందోబస్తు ఏర్పాటు చేసినట్టు డీజీపీ రవిగుప్తా వెల్లడించారు. ప్రశాంత వాతావరణంలో పౌరులు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీస్ శాఖ తరఫున అన్ని చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఎన్నికల భద్రత విధుల్లో లక్ష మందికి పైగా పోలీస్ సిబ్బందిని వినియోగిస్తున్నామని, ఓటింగ్ తర్వాత ఈవీఎంలు భద్రపర్చే స్ట్రాంగ్ రూంల వద్ద కేంద్ర సాయుధ పోలీస్ బలగాలతో ప్రత్యేకంగా పహారా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎన్నికల ప్రక్రియ శాంతియుత వాతావరణంలో ముగిసేలా తీసుకున్న భద్రత చర్యలను 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో డీజీపీ రవిగుప్తా వివరించారు.

సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక ఫోకస్

లోక్‌సభ ఎన్నికల బందోబస్తు విధుల్లో 164 కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు, 73,414 మంది సివిల్ పోలీసులు, టీఎస్ స్పెషల్ పోలీస్‌కు చెందిన 500 సెక్షన్ల సిబ్బంది, మూడు కంపెనీల తమిళనాడు పోలీసులు, ఏడువేల మంది హోంగార్డులు, 2088 మంది ఇతర ప్రభుత్వ విభాగాల సిబ్బంది కలిపి లక్ష మందికిపైగా పోలీసులు భద్రత విధుల్లో ఉన్నారు. మావోయిస్టు ప్రభావిత జిల్లాలైన ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి జిల్లాలతో పాటు హైదరాబాద్‌లోని పాతబస్తీ సహా ఇతర సున్నితమైన ప్రాంతాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాం. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా బలగాలను అదనంగా అందుబాటులో ఉంచాం. ఆ ప్రాంతాల్లో అనుభవం ఉన్న ఉన్నతాధికారులు పర్యవేక్షణ కొనసాగుతోంది. అన్నిచోట్లా పరిస్థితి పూర్తిగా అదుపులో ఉంది. ఎన్నికలకు సంబంధించి ఏ సమస్య ఉన్నా డయల్ 100 లేదా 112 టోల్‌ఫ్రీ నంబర్లలో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

48 స్ట్రాంగ్ రూంల వద్ద గట్టి భద్రత

ఓటింగ్ ప్రక్రియ తర్వాత అత్యంత కీలకమైనది కౌంటింగ్ ప్రక్రియ. అప్పటివరకు ఈవీఎంలను అత్యంత భద్రంగా ఉంచాలి. ఓటింగ్ తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు తరలించేందుకు జీపీఎస్ టెక్నాలజీ వినియోగిస్తున్నాం. ఈ ప్రక్రియను ఉన్నతాధికారులు ప్రతిక్షణం మానిటర్ చేసేలా ఏర్పాటు చేశాం. మొత్తం 48 స్ట్రాంగ్ రూంల వద్ద మొత్తం 9 కంపెనీల కేంద్ర సాయుధ పోలీస్ బలగాలతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశాం. జూన్ 4న కౌంటింగ్ ప్రారంభం అయ్యే వరకు స్ట్రాంగ్ రూంల వద్ద 24 గంటలపాటు కేంద్ర సాయుధ బలగాలే పహారా కాస్తాయి. మన పోలీసులు బయటి ప్రాంతాల్లో బందోబస్తులో ఉంటారు.

తనిఖీల్లో రూ.190.57 కోట్ల విలువైన నగదు, మద్యం స్వాధీనం

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఆదివారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 482 ఫిక్స్‌డ్ స్టాటిక్ టీంలు, 462 స్టాటిక్ సర్వైలెన్స్ టీంలు, 89 అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు, 173 అంతర్ జిల్లా చెక్ పోస్టులలో చేసిన తనిఖీల్లో రూ.190.57 కోట్ల విలువైన నగదు, మద్యం, బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులు స్వాధీనం చేసుకున్నాం. ఇందులో కేవలం నగదే రూ. 97,57,17,438 ఉంది. 91.822 కిలోల బంగారం, 166.037 కిలోల వెండి ఉన్నాయి.

9,123 కేసులు నమోదు

ఎన్నికల ప్రవర్తన నియమావళిని అతిక్రమించిన వారిపై పలు చట్టాల కింద మొత్తం 9,123 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశాం. అదేవిధంగా ప్రశాంత వాతావరణానికి భంగం కల్గిస్తారని అనుమానిస్తున్న రౌడీషీటర్లు, ఎలక్షన్ అఫెండర్లు, సమస్యలు సృష్టించే స్వభావం ఉన్నవారు.. మొత్తం 34,526 మందిని బైండోవర్ చేశాం. ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టేవారెవరినీ ఉపేక్షించేది లేదు.

సోషల్ మీడియాపై పూర్తి నిఘా

సోషల్‌మీడియాలో తప్పుడు వార్తల ప్రచారం, రెచ్చగొట్టేలా ఉండే పోస్టులు, శాంతిభద్రతల సమస్యలకు కారణమయ్యే వ్యాఖ్యలు, ఫొటోలు, వీడియోలపై దృష్టి పెట్టాం. వీటిని పోస్టు చేసేవారిపై, షేర్ చేసే వారిపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టాం. టీఎస్ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో 24 గంటల పాటు పనిచేసే ప్రత్యేక వ్యవస్థతో పాటు డీజీపీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ పర్యవేక్షిస్తుంది.

రూ.190.57 కోట్ల విలువైన నగదు, మద్యం స్వాధీనం

మార్చి 16న ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఆదివారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 482 ఫిక్స్‌డ్ స్టాటిక్ టీంలు, 462 స్టాటిక్ సర్వైలెన్స్ టీంలు, 89 అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు, 173 అంతర్ జిల్లా చెక్‌పోస్టులలో ముమ్మరంగా నిర్వహించిన తనిఖీల్లో రూ.190.57 కోట్ల విలువైన నగదు, మద్యం, బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులు స్వాధీనం చేసుకున్నాం. ఇందులో కేవలం నగదే రూ.97,57,17,438 ఉంది. 91.822 కిలోల బంగారం, 166.037 కిలోల వెండి ఉన్నాయి.

ఓటు వేసే బాధ్యత మరవొద్దు

ఓటు అనేది మన దేశం కోసం మనం నిర్వర్తించే బాధ్యత. ఓటింగ్‌ను ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే పండగగా చేసుకోవాలి. సెలవుగా భావించవద్దు. అర్హత ఉన్న ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలి. ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనాలని నేను తెలంగాణ పోలీస్ తరఫున విజ్ఞప్తి చేస్తున్నా. - డీజీపీ రవిగుప్తా



హైదరాబాద్‌లోని చైతన్యపురిలో అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న పోలీసులు

క్లుప్తంగా...

అనైతిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండండి

పోలింగ్ ఏజెంట్లకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి సూచన



సాక్షి, హైదరాబాద్: ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న దురాశతో రాష్ట్రంలోని కొన్ని మతతత్వ, ప్రాంతీయ శక్తులు పోలింగ్ సందర్భంగా అనైతిక కార్యకలాపాలకు పాల్పడే అవకాశాలున్నాయని కాంగ్రెస్ పార్టీ పోలింగ్ ఏజెంట్లను టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుడు ఎంఆర్‌జీ వినోద్ రెడ్డి హెచ్చరించారు. ఇలాంటి శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండి పోలింగ్ సజావుగా జరిగేలా జాగ్రత్తపడాలని సూచించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఎన్నికల్లో గెలుపు కోసం ఆ శక్తులు దేనికైనా వెనుకాడవు. దళారుల ద్వారా మద్యం సరఫరా చేసి, డబ్బులు పంచి ఓట్లను కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. వీటిని సమర్థవంతంగా తిప్పికొట్టి ఓటర్ల హక్కులను కాపాడాలి. పార్టీ పోలింగ్ ఏజెంట్లందరూ పోలింగ్ ముగిసేంతవరకు అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి ఘటనలు జరిగినా వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి'అని ఆ ప్రకటనలో వినోద్‌రెడ్డి పిలుపునిచ్చారు.

ఎన్నికల విధులకు 48 మంది గైర్హాజరు

కేసు నమోదుకు కలెక్టర్ ఆదేశం

దేవరకొండ: ఎన్నికల విధులకు గైర్హాజరైన సిబ్బందిపై జిల్లా అధికారులు చర్యలకు ఉపక్రమించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నల్లగొండ జిల్లా దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గాని ఎన్నికల విధులకోసం కేటాయించిన పలువురు సిబ్బంది ఆదివారం విధులకు హాజరుకాలేదు. దేవరకొండలోని డీఆర్‌సీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ హరిచందన విధులకు గైర్హాజరైన సిబ్బందిపై ఆరా తీశారు. దీంతో ఆయా ఉద్యోగులపై కేసు నమోదు చేయాలని దేవరకొండ ఆర్డీవో శ్రీరాములును ఆదేశించారు. దీంతో వెంటనే విధులకు హాజరుకాని 48 మంది సిబ్బందిపై ఆయన దేవరకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సిబ్బందిపై ప్రజాప్రాతినిధ్య చట్టం కింద ఎన్నికల కేసు నమోదు చేసినట్లు సీఐ నర్సింహులు తెలిపారు. కాగా గైర్హాజరైన వారిలో 17 మంది సిబ్బంది సాయంత్రం వరకు విధుల్లోకి చేరినట్టు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు.

నేడు వేతనంతో కూడిన సెలవు

- ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పరిశ్రమల్లోని అన్ని షిఫ్టుల కార్మికులకు వర్తింపు
- లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో కార్మిక శాఖ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: అన్నిరకాల పరిశ్రమల్లో ఏ షిఫ్టులో పనిచేసే కార్మికులకయినా సోమవారం రాష్ట్రంలో ఎన్నికల రోజు వేతనంతో కూడిన సెలవును అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కార్మికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణీ కుముదిని ఉత్తర్వులు జారీచేశారు. గతంలో రాత్రి షిఫ్టుల్లో పనిచేసే కార్మికులకు కాకుండా మిగిలిన రెండు షిఫ్టులకు మాత్రమే ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఇప్పుడు అన్ని షిఫ్టుల కార్మికులకు కూడా సెలవు ప్రకటిస్తూ సవరణ ఉత్తర్వులు జారీచేసింది. సెలవు విషయంపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కార్యదర్శివర్గ సభ్యుడు డీజీ నర్సింహారావులు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్‌ను కలసి విన్నవించారు. గత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రోజు కూడా అన్ని షిఫ్టుల్లో పనిచేసే కార్మికులకు వేతనంతో కూడిన సెలవును మంజూరు చేసిన విషయాన్ని సీపీఎం ఆయనకు ఇచ్చిన వినతిపత్రంలో ప్రస్తావించింది. హైదరాబాద్‌తోపాటు, హైదరాబాద్ పరిసర ప్రాంతాల పరిశ్రమల్లో పనిచేసేవారు పని ప్రదేశంలోనే కాకుండా, వారి సొంత గ్రామాల్లో ఓటు హక్కును కలిగి ఉన్నారని సీఈవోకు సీపీఎం నేతలు విన్నవించారు. ఈ నేపథ్యంలో సెలవు మంజూరు చేసినట్లు రాణి కుముదిని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థల ఉద్యోగులకు కూడా సెలవు ఉంటుంది. ప్రైవేటు సంస్థలు, కంపెనీలు తమ ఉద్యోగులకు సెలవు ఇవ్వని పక్షంలో కార్మిక, ఎన్నికల చట్టాల కింద కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు సీఈఓ వికాస్‌రాజ్ ఆదేశాలు జారీ చేశారు.

అందరూ ఓటేయండి: వికాస్‌రాజ్



నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో పోలింగ్ కేంద్రాలకు తరలిస్తున్న ఈవీఎంలను పరిశీలిస్తున్న వికాస్‌రాజ్, రొనాల్డ్ రాస్, అనుదీప్ దురిశెట్టి

అబిడ్స్ (హైదరాబాద్): రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో పోలింగ్ కేంద్రాలకు తరలిస్తున్న ఈవీఎంలను, సామగ్రిని పరిశీలించారు. పాతబస్తీ డీఆర్‌సీ కేంద్రాన్ని సందర్శించార. ఈవీఎంల తరలింపు, సామాగ్రి తరలింపు, పోలింగ్ స్టేషన్లకు సిబ్బంది తరలింపుపై ఎన్నికల జిల్లా అధికారి రొనాల్డ్ రాస్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. ఓటుహక్కు ఎంతో విలువైందనీ, ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆయన వెంట ఉన్నారు.

పోలింగ్ ఉద్యోగులు రేపు విధులకు రాకున్నా 'ఆన్‌డ్యూటీ'నే

సీఈఓ వికాస్‌రాజ్ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు సోమవారం జరగనున్న ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు.. తదితర పోలింగ్ సిబ్బంది మరుసటి రోజు మంగళవారం తమ విధులకు హాజరు కాకపోయినా, 'ఆన్‌డ్యూటీ'గా పరిగణించాలని ఆదేశిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వికాస్‌రాజ్ ఈ నెల 10న మెమో జారీ చేశారు. సుదీర్ఘ పోలింగ్ విధుల్లో కొనసాగి మళ్లీ మరుసటి రోజు తమ రోజువారీ విధులకు హాజరు కావడానికి ఇబ్బందిపడే అవకాశం ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఎన్నికల సామాగ్రిని తిరిగి అప్పగించినట్టు ధ్రువీకరిస్తూ రిటర్నింగ్ అధికారి/సహాయ రిటర్నింగ్ అధికారి జారీచేసిన ధ్రువీకరణ పత్రాన్ని(అక్నాలెడ్జిమెంట్) జత చేసి.. ఆన్‌డ్యూటీ సదుపాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని పోలింగ్ సిబ్బందికి సూచించారు.

గుండెపోటుతో ప్రిన్సిపాల్ మృతి

ఎన్నికల విధుల్లో ఉండగా ఘటన



నాంపల్లి (హైదరాబాద్): పోలింగ్ కేంద్రంలోనే గుండెపోటుతో ఓ ప్రిన్సిపాల్ మృతి చెందారు. ముషీరాబాద్ తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాయ్స్–1 స్కూల్ ప్రిన్సిపాల్ బొడ్డుపల్లి నర్సింహ(43)కు ఎన్నికల విధుల్లో భాగంగా నాంపల్లి సెగ్మెంట్ పరిధిలో డ్యూటీ పడింది. దీంతో ఆదివారం ఉదయాన్నే మాసబ్ ట్యాంక్ జేఎన్ఎఫ్ఏయూ కళాశాల ప్రాంగణంలోని డీఆర్‌సీ సెంటర్‌కు వచ్చారు. సిబ్బందితో కలిసి పని చేశారు. రెడ్‌హిల్స్ డివిజన్‌లోని పోలింగ్ బూత్‌కు ప్రభుత్వం కేటాయించిన వాహనంలో చేరుకున్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు. గమనించిన అధికారులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నర్సింహ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

లోక్‌సభ పోరు నేడే

▶ మొదటి పేజీ తరువాయి

ఓటేయనున్నారు. 17 లోక్‌సభ స్థానాల నుంచి మొత్తం 525 మంది అభ్యర్థులు అదృష్టాన్ని పరీక్షించుకుంటుండగా.. ఇందులో 50 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. ఈవీఎంలతో ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. పోలింగ్ ముగిశాక ఎన్నికల సిబ్బంది సంబంధిత లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించిన రిసెప్షన్ సెంటర్‌కు తీసుకెళ్లి ఈవీఎంలను అప్పగిస్తారు. అక్కడ స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరుస్తారు. మరోవైపు ఏపీ అసెంబ్లీకి కూడా సోమవారమే ఎన్నికలు జరగనున్నాయి. అక్కడి 25 ఎంపీ సీట్లకు, 175 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. వచ్చే నెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది.

గందరగోళ పడకుండా ఓటేయండి..

సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంలో అత్యధికంగా 45 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా.. ఆదిలాబాద్‌లో అత్యల్పంగా 12 మంది బరిలో ఉన్నారు. ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు ఉండటంతో 7 లోక్‌సభ స్థానాల పరిధిలో మూడు బ్యాలెట్ యూనిట్లతో, 9 లోక్‌సభ స్థానాల పరిధిలో రెండు బ్యాలెట్ యూనిట్లతో, ఒక లోక్‌సభ స్థానంలో ఒక బ్యాలెట్ యూనిట్‌తో పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఓటర్లు గందరగోళానికి గురికాకుండా.. ఈవీఎంలో అభ్యర్థుల క్రమాన్ని పోలింగ్ బూత్‌ల బయట ప్రదర్శనకు పెట్టనున్నట్టు సీఈఓ వికాస్‌రాజ్ తెలిపారు. ఇక దివ్యాంగ ఓటర్లు సులువుగా ఓటు వేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ట్రైసైకిళ్లు, ర్యాంపులను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.



సరూర్‌నగర్ స్టేడియంలో పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు సిద్ధం చేసిన ఈవీఎంలు

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్..

రాష్ట్రంలో మొత్తంగా 35,809 పోలింగ్ కేంద్రాల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో 9,900 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పరిస్థితిని కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌కాస్టింగ్ ద్వారా ప్రత్యక్షంగా పర్యవేక్షించనుంది. మిగతా పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వీడియోగ్రాఫర్లు, స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లు, ల్యాప్‌ట్యాప్‌లతో విద్యార్థులు పోలింగ్ ప్రక్రియను రికార్డు చేయనున్నారు. ఆ డేటాను ప్రిసైడింగ్ అధికారులు సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి అప్పగిస్తారు.

క్యూలో ఉంటే ఓటేయవచ్చు..

పోలింగ్ సమయం ముగిసే సరికి క్యూలో ఉన్న ఓటర్లందరికీ ఓటేసేందుకు అవకాశం ఉంటుంది. అలా క్యూలో ఉన్నవారికి పోలింగ్ అధికారులు టోకెన్లు ఇస్తారు. సమయం ముగిశాక పోలింగ్ కేంద్రానికి చేరుకునేవారికి ఓటేసేందుకు అవకాశం ఉండదు. ఎండ పెరగక ముందే ఉదయమే ఓటేస్తే మంచిదని.. వానలతో ఉష్ణోగ్రతలు కొంత తగ్గడం ఊరట కల్పించే అంశమని అధికారులు చెప్తున్నారు.

ఉదయం 5.30 గంటలకే మాక్ పోలింగ్..

రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామాగ్రిని ఆదివారం రాత్రే తరలించామని అధికారులు వివరించారు. సోమవారం ఉదయం 5.30 గంటలకే అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించడం ద్వారా పోలింగ్ ప్రక్రియను ప్రిసైడింగ్ అధికారులు ప్రారంభించనున్నారు.

10 మంది ఓటర్లకే పోలింగ్ కేంద్రం

ఈసారి అత్యల్ప సంఖ్యలో ఓటర్లున్న ప్రాంతాల్లో సైతం పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. మారుమూల ప్రాంతాల్లోని ఈ ఓటర్లు దూర ప్రాంతాలకు వెళ్లి ఓటేయాల్సిన అవసరం లేకుండా చేసింది. అత్యల్పంగా 10 మంది, 12 మంది, 14 మంది ఓటర్లున్న మూడు ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. 25మందిలోపు ఓటర్లున్నవి 11, 50 మందిలోపు ఉన్నవి 22, 100 మంది లోపు ఉన్నవి 54 పోలింగ్ కేంద్రాలు ఉండటం గమనార్హం.

హోరాహోరీగా పోరు!

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, గట్టిగా పోరాడినా అధికారం పోగొట్టుకున్న బీఆర్ఎస్, కేంద్రంలో రెండు దఫాలుగా అధికారంలో ఉన్న బీజేపీ.. ఇలా మూడు పార్టీల మధ్య గట్టి పోటీ నెలకొని ఉంది. 16 లోక్‌సభ స్థానాల్లో మూడు పార్టీలు హోరాహోరీగా పోరాడనుండగా.. హైదరాబాద్ స్థానంలో ఎంఐఎం అధినేత, సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి బీజేపీ అభ్యర్థి మాధవీలత గట్టి పోటీ ఇస్తున్నారు. గత నెల రోజులుగా మూడు ప్రధాన పార్టీల అగ్రనేతలు రాష్ట్రవ్యాప్తంగా ఉధృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించడంతో.. ఎక్కువ స్థానాల్లో గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో ఓటర్ల లెక్కలివీ..

పురుషులు	1,65,28,366
మహిళలు	1,67,01,192
మూడో జెండర్	2,760
మొత్తం ఓటర్లు	3,32,32,318
ఇందులో సర్వీస్ ఓటర్లు	15,970
యువ ఓటర్లు (18-19 ఏళ్ల వారు)	9,20,313
85ఏళ్లు పైబడిన వారు	1,93,754
దివ్యాంగ ఓటర్లు	5,27,486

పోలింగ్ ఏర్పాట్ల వివరాలివీ..

మొత్తం పోలింగ్ కేంద్రాలు	35,809
అనుబంధ పోలింగ్ కేంద్రాలు	453
ఎక్కువ పోలింగ్ కేంద్రాలున్న నియోజకవర్గం	మల్కాజ్‌గిరి (3226)
పోల్ సిబ్బంది	1,96,000
సెక్టర్ అధికారులు, రూట్ అధికారులు	3,522
సూక్ష్మ పరిశీలకులు	12,909
కేంద్ర బలగాలు	160 కంపెనీలు
పొరుగు రాష్ట్రాల నుంచి హోంగార్డులు, ఇతర బలగాలు	20 వేల మంది
రాష్ట్ర పోలీసు సిబ్బంది	72 వేల మంది

క్లుప్తంగా...

నేడు ఓటేయనున్న గవర్నర్లు



సాక్షి, హైదరాబాద్: సోమవారం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తమ కుటుంబసభ్యులతో కలిసి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఉదయం 11.30 గంటలకు ముషీరాబాద్ రాంనగర్‌లోని జేవీ హైస్కూల్‌లో ఓటు వేస్తారు. ఉదయం 7 గంటలకు మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం సలీంనగర్ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాలులో త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి కుటుంబసభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకుంటారు. ఉదయం 7 గంటలకు అంబర్‌పేట అసెంబ్లీ పరిధి బర్కత్‌పురాలోని దీక్షా మోడల్ స్కూల్‌లో తమ కుటుంబసభ్యులతో కలిసి కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఓటేస్తారు. బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ తమ కుటుంబసభ్యులతో కలిసి ముషీరాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని శాంతినికేతన్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఓటు హక్కు ఉపయోగించుకుంటారు. మలక్‌పేట తిరుమల హిల్స్ రెసిడెంట్స్ అసోసియేషన్ పోలింగ్ బూత్‌లో బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నేత పి.మురళీధర్‌రావు అంబర్‌పేట అసెంబ్లీ పరిధిలోని డీడీ కాలనీలో ఓటు హక్కు వినియోగించుకుంటారు. తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ పోలింగ్‌బూత్‌లో మాజీ ఎమ్మెల్సీ ఎస్.రామచంద్రరావు ఓటేయనున్నారు.

కాంగ్రెస్ రిగ్గింగ్‌ను అడ్డుకోండి

- గడువు ముగిసినా ఎన్నికల ప్రచారం చేస్తోంది
- ఈసీకి బీఆర్‌ఎస్ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ పార్టీ రిగ్గింగ్‌కు పాల్పడేందుకు కుట్రలు చేస్తోందని బీఆర్‌ఎస్ ఆరోపించింది. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలోని హుజూర్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్ చింతలపాలెం మండలంలోని తమ్మారం, శోభనాద్రిగూడెం, నక్కగూడెం, పిక్లా నాయక్ తండాల్లోని పలు పోలింగ్ బూత్‌లను స్వాధీనం చేసుకొని రిగ్గింగ్ చేసేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని బీఆర్‌ఎస్ అనుమానాలు వ్యక్తం చేసింది. అదేవిధంగా దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని కోరుట్ల, తెలుదేవరపల్లి, పాత తెలుదేవరపల్లి, బొల్లారం, ఉస్మాన్ కుంట, దేవరచర్ల, ఎల్లమంద, పాత కంబాలపల్లి, గువ్వలగుట్ట, కంబాలపల్లి, చీత్రియాల, పొగిళ్ల, గుంటిపల్లి గ్రామాల్లో ఈ తరహా యత్నాలు చేస్తోందని విమర్శించింది. ఈ కుట్రలను వెంటనే అడ్డుకోవాల్సిందిగా బీఆర్‌ఎస్ తరపున ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ ఈసీని కోరారు. శనివారం సాయంత్రం 6 గంటలకు ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత కూడా టీపీసీసీ ప్రచారం చేసిందని ఆరోపిస్తూ ఆ మేరకు ఆ పార్టీ సోషల్ మీడియా గ్రూపుల్లో సర్క్యులేట్ అవుతున్న వీడియో క్లిప్పింగులు, ఇతర ఆధారాలను ఎన్నికల కమిషన్‌కు అందజేశారు.

సిద్దిపేటలో బీఆర్‌ఎస్ నేత ఇల్లు సీజ్

- ఇంట్లో డబ్బు, మద్యం ఉందనే సమాచారంతో తనిఖీలు
- కేవలం రూ.250 మాత్రమే దొరకడంతో వెళ్లిపోయిన పోలీసులు



ఇంట్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

సిద్దిపేట కమాన్: సిద్దిపేట జిల్లా కేంద్రం అంబేడ్కర్ నగర్‌లోని బీఆర్‌ఎస్ నేత జువ్వన్న కనకరాజు ఇంటిని పోలీసులు ఆదివారం సీజ్ చేయడం చర్చకు తెరలేపింది. కనకరాజు తన భార్య ఆరోగ్యం బాగాలేకపోవడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా, సిద్దిపేట టూటౌన్ పోలీసులు ఆయన ఇంట్లో డబ్బు, మద్యం నిల్వ ఉంచారనే సమాచారంతో ఆ ఇంటిని సీజ్ వేశారు. విషయం తెలుసుకున్న కనకరాజు సాయంత్రం ఇంటి వద్దకు వచ్చి పోలీసులను నిలదీశారు. ఆయనకు మద్దతుగా భారీ ఎత్తున బీఆర్‌ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు రావడంతో పోలీసులు సైతం భారీగా మోహరించారు. ఈ నేపథ్యంలో కనకరాజు సమక్షంలోనే ఇంట్లో పోలీసులు విస్తృతంగా గంటసేపు తనిఖీలు చేపట్టారు. అయితే ఎలాంటి నగదు, మద్యం దొరకలేదు. కేవలం దేవుడి హుండీలో రూ.250 మాత్రం దొరకడంతో పోలీసులు వెనుదిరిగారు. అధికార పార్టీ నేతలు కక్షపూరితంగానే పోలీసులను ఉసిగొల్పి తన ఇంటిపై దాడి చేశారంటూ కనకరాజు ఆవేదన వ్యక్తం చేశారు.

చివరి క్షణం వరకు అప్రమత్తం

పార్టీ అనుకూల ఓట్లు పోల్ అయ్యేలా చూడటంపై బీఆర్‌ఎస్ దృష్టి

- క్షేత్రస్థాయి పరిస్థితులపై అధినేత కేసీఆర్ నిరంతర సమీక్ష
- లోక్‌సభ సెగ్మెంట్ల పరిధిలోని నేతలతో కేటీఆర్, హరీశ్ టెలికాన్ఫరెన్స్
- అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే మెరుగయ్యామనే భావన
- పోలింగ్ ముగిసేంత వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: మరికొద్ది గంటల్లో రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో పార్టీ అనుకూల ఓటర్లు ప్రతిఒక్కరూ పోలింగ్‌లో పాల్గొనేలా చూడటంపై భారత్ రాష్ట్ర సమితి దృష్టి పెట్టింది. శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం ముగిసింది మొదలు పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు పార్టీ అభ్యర్థులు, కీలక నేతలతో ఫోన్ ద్వారా మాట్లాడుతున్నారు. ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న కేసీఆర్ లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా స్థానిక రాజకీయ స్థితిగతులను సమీక్షించారు. ఎన్నికల ప్రచార తీరు, ప్రజల నుంచి వచ్చిన స్పందనను తెలుసుకోవడంతో పాటు పోలింగ్ ముగిసే వరకు అనుసరించాల్సిన వ్యూహంపై దిశా నిర్దేశం చేస్తున్నారు.

నేతలతో కేటీఆర్, హరీశ్ టెలీ కాన్ఫరెన్స్

కేసీఆర్‌తో పాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా తాము ప్రాతినిధ్యం వహిస్తున్న అసెంబ్లీ సెగ్మెంట్లతో పాటు తాము ఇన్‌చార్జీలుగా ఉన్న లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని నేతలతో మాట్లాడుతూ పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. పలు లోక్‌సభ సెగ్మెంట్లకు చెందిన పార్టీ నేతలు, బూత్ స్థాయి కార్యకర్తలతో కేటీఆర్, హరీశ్‌రావు ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమవారం జరిగే పోలింగ్‌కు సంబంధించి పలు సూచనలు చేశారు. ఏజెంట్ల నియామకం మొదలుకుని పార్టీ అనుకూల ఓటర్లు పోలింగ్ బూత్‌కు చేరుకునేంత వరకు వ్యవహరించాల్సిన తీరుపై దిశా నిర్దేశం చేశారు. ఎదుటి పార్టీలు క్షేత్ర స్థాయిలో ఏవైనా ప్రలోభాలకు గురి చేస్తున్నాయా? అనే కోణంలోనూ ఆరా తీశారు. ప్రలోభాల పర్వం దృష్టికి వస్తే ఈసీ, పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

మెజారిటీ ఓట్ల సాధనకు కార్యాచరణ

లోక్‌సభ ఎన్నికల్లో 12 నుంచి 14 స్థానాల్లో విజయం సాధిస్తామని పార్టీ అధినేత కేసీఆర్ చేసిన ప్రకటన నేపథ్యంలో బీఆర్‌ఎస్ కేడర్‌లో ధీమా పెరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన మాజీ ఎమ్మెల్యేలు పార్లమెంటు ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు వచ్చేలా చూడటం ద్వారా తమ పట్టును చాటుకోవాలని భావిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో చివరి నిమిషం వరకు అప్రమత్తంగా ఉండేలా పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే బూత్‌ల వారీగా మెజారిటీ ఓట్లు సాధించేలా కార్యాచరణ అమలు చేస్తున్నారు.

బస్సు యాత్రతో కొత్త జోష్

కేసీఆర్ 16 రోజుల పాటు చేసిన బస్సు యాత్ర, రోడ్ షోలు పార్టీకి భారీగా కలిసి వస్తాయని బీఆర్‌ఎస్ అంచనా వేస్తోంది. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు, కాంగ్రెస్, బీజేపీ విధానాలపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత సోమవారం జరిగే పోలింగ్‌లో ప్రతిబింబిస్తుందని లెక్కలు వేస్తున్నాయి. 17 లోక్‌సభ నియోజకవర్గాలకు గాను హైదరాబాద్ మినహా మిగతా అన్నిచోట్లా బీజేపీ లేదా కాంగ్రెస్‌కు బీఆర్‌ఎస్ మాత్రమే ప్రధాన ప్రత్యర్థిగా ఉందని, పోలింగ్ రోజున అప్రమత్తంగా వ్యవహరిస్తే మెరుగైన ఫలితాలు కష్టం కాదని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

చింతమడకలో ఓటేయనున్న కేసీఆర్



సాక్షి, సిద్దిపేట: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వ గ్రామం చింతమడకలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. సిద్దిపేట జిల్లా చింతమడకలో సోమవారం కేసీఆర్‌తో పాటు సతీమణి శోభ సైతం ఓటు వేయనున్నారు. ఇందుకోసం చింతమడకలో హెలీప్యాడ్‌ను సిద్ధం చేశారు. పట్టణంలోని భరత్‌నగర్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు ఓటు హక్కు వినియోగించుకుంటారు.

మధుయాష్కీ ఇంట్లో తనిఖీలు

లింగోజిగూడ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వచ్చిన ఇతర పార్టీల ఫిర్యాదుల మేరకు ఆదివారం హయత్‌నగర్‌లోని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ఇంట్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మధుయాష్కి ఇంట్లో ఎన్నికలకు సంబంధించిన వ్యవహారాలు నడుస్తున్నాయన్న ఫిర్యాదు మేరకు అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అలాంటివేవీ కనిపించకపోవడంతో అధికారులు వెనుదిరిగారు. బీజేపీ ఓటమి భయంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయిస్తోందని మధుయాష్కీగౌడ్ ఆరోపించారు. తనిఖీల అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో ఓట మి చెందుతామని తెలియడంతో బీజేపీ దాడులకు పథకం పన్నిందన్నారు. ఎన్ని దాడులు చేసినా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు భయపడమని, ఈ ఎన్నికలలో కాంగ్రెస్‌దే విజయమని మధుయాష్కి స్పష్టం చేశారు.



కోమటిచెరువు వద్ద మాజీ మంత్రి హరీశ్, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

హరీశ్‌రావు.. సండే సందడి

సిద్దిపేటజోన్: ఎన్నికల ప్రచారంలో ఊపిరిసలపకుండా తిరిగిన మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదివారం సాయంత్రం కాసింత సేదతీరారు. కోమటిచెరువు వద్ద ప్రకృతి అందాలను ఆస్వాదించారు. మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి కోమటిచెరువు వద్ద సందడి చేశారు. మ్యూజికల్ ఫౌంటెన్, నెక్లెస్ రోడ్ తిలకించారు. హరీశ్‌రావు స్వయంగా ఎలక్ట్రిక్ వాహనాన్ని నడుపుతూ పట్టణమంతా కలియతిరిగారు.

ఆ బూత్‌లో సిబ్బంది అందరూ మహిళలే!



పోలింగ్ బూత్‌లో విధుల్లో ఉన్న మహిళలు, పోలీస్ సిబ్బంది

వర్ధన్నపేట: వరంగల్ జిల్లా వర్ధన్నపేట పుస్కోస్ పాఠశాలలోని 203వ నంబర్ పోలింగ్ బూత్‌లో సిబ్బంది అంతా మహిళలే. ఎన్నికల సిబ్బందితోపాటు బందోబస్తు కోసం వచ్చిన పోలీసులు సైతం మహిళలే కావడం విశేషం. పోలింగ్ ఏర్పాట్ల కోసం వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి సిబ్బంది ఆదివారం పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు.

ఓట్ల కోసం 'ఆఖరి' పోరాటం!

ప్రలోభాలతో ఓటర్లను ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీల ప్రయత్నాలు

- ఆదివారం ఇంటింటికీ వెళ్లి పోల్ స్లిప్పుల పంపిణీ.. వాటితోపాటు నగదు, గిఫ్టులు!
- మరోవైపు ప్రచారం తీరును సమీక్షించుకున్న అభ్యర్థులు
- పోలింగ్ తమకు అనుకూలంగా ఉండేలా చేయడంపై ప్రణాళికలు
- బూత్‌లు, గ్రామాల వారీగా నమ్మకస్తులైన అనుచరులకు బాధ్యతలు



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రచారము గిసి, పోలింగ్ మధ్యలో మిగిలిన చివరి అంకంలో ప్రలోభాలు మొదలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల స్థాయిలో కాకపోయినా తమ శక్తి మేరకు ఓటర్లను ఆకర్షించడంలో ప్రధాన రాజకీయ పక్షాల కేడర్ ఆదివారమంతా బిజీగా గడిపింది. వీలైనంత మందిని కలుస్తూ, పోలింగ్ స్లిప్పులు పంచుతూ, నగదు, బహుమతులు పంచడంపై ఫోకస్ చేసింది. నియోజకవర్గాన్ని బట్టి ఒక్కో ఓటుకు రూ.300 నుంచి రూ.1,000 వరకు ముట్టజెప్పినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణాలు, నగర ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల వారీగా గంపగుత్త ఓట్లను వేయించుకునే ప్రయత్నాలు చేసినట్టు తెలిసింది. ఇలా ప్రలోభాల కోసం ఒక్కో నియోజకవర్గానికి రూ.50 కోట్ల నుంచి 150 కోట్ల దాకా ఖర్చు చేసినట్టు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

బూత్‌ల వారీగా సమీక్షలతో..

శనివారం సాయంత్రం ప్రచారం ముగియడంతో.. ఆదివారం ఉదయం నుంచే ప్రధాన పార్టీల అభ్యర్థులు, నేతలు సమీక్షల్లో పడ్డారు. ప్రచారం జరిగిన తీరుతోపాటు అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాలు, పోలింగ్ బూత్‌ల వారీగా ఓట్ల లెక్కలు వేసుకున్నారు. సోమవారం ఉదయం నుంచే పోలింగ్ తమకు అనుకూలంగా జరిగేలా ఏం చేయాలన్న దానిపై ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. బూత్‌లు, గ్రామాల వారీగా తమకు నమ్మకస్తులైన అనుచరులకు బాధ్యతలు అప్పగించారు. పోలింగ్ ఏజెంట్ల నియామకాన్ని పూర్తి చేశారు.

ఎవరి ధీమా వారిదే..

ఎన్నికల్లో హోరాహోరీ తలపడుతున్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ మూడు ప్రధాన పార్టీలు కూడా ఓటరు కరుణ తమవైపే ఉందంటూ ధీమా వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు గాను కచ్చితంగా 14 చోట్ల గెలిచి తీరుతామని కాంగ్రెస్ శిబిరం అంటుంటే.. ఎట్టి పరిస్థితుల్లోనూ డబుల్ డిజిట్ సీట్లు వస్తాయని బీజేపీ నేతలు ఆశలు పెట్టుకున్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అనుకూల పవనాలు వీస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోనూ ప్రభావం చూపుతామని కాంగ్రెస్ వారు అంటుంటే.. ప్రధాని మోదీ హవా, కాంగ్రెస్‌పై ప్రజల్లోని వ్యతిరేకత తమకు బలమని బీజేపీ నేతలు భరోసాగా ఉన్నారు. మరోవైపు రాష్ట్రంలో బలమైన పార్టీ బీఆర్‌ఎస్ కూడా.. తమకు డబుల్ డిజిట్ స్థానాలు వస్తాయని అంచనా వేసుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాస్త వెనుకబడినా.. లోక్‌సభ ఎన్నికల్లో బాగా పుంజుకున్నామని గులాబీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మొత్తమ్మీద సోమవారం జరిగే పోలింగ్ కోసం మూడు ప్రధాన రాజకీయపక్షాలు శక్తి మేరకు సన్నద్ధమయ్యాయి.

కిటకిటలాడిన యాదాద్రి



యాదగిరిగుట్ట: వేసవి సెలవులతో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో శ్రీస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, మాడ వీధులు, కొండపైన, కొండ కింద బస్టాండ్, శ్రీసత్యనారాయణ స్వామి వ్రత మండపం, కల్యాణకట్ట, ప్రసాద విక్రయశాల, లక్ష్మీ పుష్కరిణి తదితర ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. దీంతో ధర్మ దర్శనానికి సుమారు మూడున్నర గంటల సమయం పట్టిందని, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. శ్రీస్వామిని 40వేలకు పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో రూ.57,76,291 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.



ఆలోచించేలా, సందేహించేలా, ప్రశ్నించేలా మీ మనసుకు శిక్షణనివ్వండి.
మీ గురించి ఇతరులు ఏం అనుకుంటారోనని పట్టించుకోకండి.
– రిచర్డ్ ఫెయిన్‌మాన్

సాక్షి

సోమవారం, 13 మే 2024

జనస్వామ్యమా! జయీభవ!!

ఏటా వచ్చే వేసవికి అదనంగా ఈసారి ఎన్నికల వేసవిని చవిచూస్తున్నాం. కాకపోతే రెంటి మధ్యా ఒక తేడా ఉంది. సూర్యతాపం ద్విగుణీకృతమవుతున్నకొద్దీ, వోటర్లలోనూ ఎన్నికల సమరోత్సాహం త్రిగుణీకృతమవుతుంది. అదే ప్రజాస్వామ్యంలోని అందమూ, చందమూ, ఆకర్షణా. ప్రజాస్వామ్యం అత్యుత్తమం కాకపోవచ్చుకానీ, ఇప్పటివరకూ అనుభవంలోకి వచ్చిన అన్ని వ్యవస్థల్లో అదే ఉత్తమమని పండితులెందరో తేల్చారు. ప్రజాస్వామ్యానికి ఎన్నికలే వెన్నెముక. తమ కలలు, కాంక్షలతో ముడిపడినవి కనుకే ఎన్నికలు జనానికి మండు వేసవిలోనూ మంచు లేపనమవుతాయి.

రాచరికం, సైనిక నియంతృత్వం లాంటి చేదు అనుభవాల దరిమిలా ప్రజాస్వామ్యాన్ని తెచ్చుకున్నామని పొరబడేవారున్నారు. రాజ్యమూ, సామ్రాజ్యమూ ఉనికిలోకి రాకముందే, మనుషులు గుంపు కట్టడం నేర్చిన తొలి దశలోనే అంకురించిన తాత్వికత– ప్రజాస్వామ్యం. కాలికమైన అంతరాలను, అడ్డంకులను దాటుకుని నేటికీ పురివిప్పుతున్న రాజకీయ తాత్వికత అదే. వేట– ఆహార సేకరణ దశలో మనిషి ప్రకృతి శక్తులతో పోరాడుతున్నప్పుడే తోటి మనుషుల తోడు, తోడ్పాటుల విలువ గుర్తించాడు; అభిప్రాయాల కలబోతనూ, ఐక్య కార్యాచరణనూ అలవరచుకున్నాడు. అందరినీ కలుపుకొనిపోయే నాయకత్వాన్నీ ఆనాడే ప్రతిష్ఠించుకున్నాడు. గణతంత్రం పేరిట సాముదాయికంగా అభివృద్ధి చేసుకున్న సమాజాలతోనే రాజకీయ చరిత్ర ప్రారంభమైందని విజ్ఞులంటారు.

గణతంత్రంలో నాయకుడు సమానులలో మొదటివాడే తప్ప అసామాన్యుడూ కాదు, అడ్డు అదుపుల్లేని అధికార శ్రీమంతుడూ కాదు. నేడు ప్రతి వోటుకూ ఒకే విలువ ఉన్నట్టే, నాడు ప్రతి ఒకరికీ ఒకే విలువ. పురాణేతిహాసాల్లో ఇందుకు సాక్ష్యాలు కనిపిస్తాయి. రామాయణంలో దశరథుడు తన పెద్దకొడుకు రాముడికి పట్టాభిషేకం చేయడానికైనా; మహాభారతంలో యయాతి తన చిన్న కొడుకు పూరునికి రాజ్యం కట్టబెట్టడానికైనా పౌర, జానపదుల ఆమోదం తప్పనిసరి. సమష్టి స్థానంలో వ్యక్తి ప్రాధాన్యం పుంజుకున్న దశలోనూ మంత్రి పరిషత్తులో చర్చించే నిర్ణయాలు తీసుకునేవారు. విభీషణ శరణాగతి ఘట్టంలో రాముడు వానరవీరుల అభిప్రాయాన్ని అడుగుతాడు.

ప్రజాస్వామ్య చరిత్రలో ఎన్నో మలుపులూ, మరకలతోపాటు మెరుపులూ మన చూపుల్ని జిగేలుమనిపిస్తాయి. గణాలు వ్రాతాలుగా, వ్రాతాలు జనాలుగా, జనాలు మహాజనాలుగా మారే క్రమంలోనే సామ్రాజ్యాలు ఉనికిలోకి వచ్చాయి. మనదేశంలో మగధ సామ్రాజ్యావతరణకు ముందున్నది గణతంత్రమే. ఆనాడు దేశం పదహారు జనపదాలుగా ఉండేది. గ్రీస్, మెసపోటేమియాలలో గణతంత్ర రాజ్యాలు ఉండేవి. నాటి గ్రీస్‌లోని ఏథెన్స్ అధినేత పెరిక్లీస్ ప్రజాస్వామిక అనుభవాన్ని కొత్త పుంతలు తొక్కించి జనతంత్రానికే ఘన చిహ్నమయ్యాడు; సంపన్నుల ప్రతిఘటనకు ఎదురొడ్డుతూ పేదలవైపు నిలబడి కలబడడంలోనూ ప్రజానాయకులకు తొలిమూసై మణిపూస అయ్యాడు. బలవత్తరులైన పర్షియన్ల దాడిని దీటుగా తిప్పికొట్టినా, సాటి గ్రీసు రాజ్యమైన స్పార్టాతో యుద్ధమొచ్చిన దశలో ప్లేగు వాతబడి అతను కన్నుమూయడం ఏథెన్స్ స్వాతంత్ర్యానికీ; ప్రజాస్వామ్యానికీ చితిపేర్చింది. ఆ తర్వాత, స్పార్టా సహా గ్రీస్ అలెగ్జాండర్ సామ్రాజ్యంలో, ఆ తర్వాత రోమన్ సామ్రాజ్యంలో చిన్న వలసగా మసకబారిపోయింది. అలా కొడిగట్టిన ప్రజాస్వామ్యం తిరిగి కాంతినీ, క్రాంతినీ తెచ్చుకోవడానికి రెండువేల సంవత్సరాలు పట్టింది.

ఏథెన్స్ ప్రభవించిన తాత్విక శిఖరాలే సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్! సోక్రటీస్ ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకించినా; ప్లేటో అన్ని అధికారాలనూ రాజ్యం చేతుల్లో పెట్టి, ఉదారవాద నియంతృత్వమనే ఊహాస్వర్గానికి నిచ్చెన వేసినా; అరిస్టాటిల్ మధ్యేమార్గంగా రాజ్యాంగబద్ధ ఆదర్శ రాజ్యాన్ని నొక్కి చెప్పినా– ముగ్గురూ పశ్చిమ దేశాల రాజకీయ తాత్విక చింతనను ఉద్దీపింపజేసిన వారే. ప్రత్యేకించి అరిస్టాటిల్ ఆధునిక కాలంలో జాన్ లాక్, మాంటెస్క్యూ వంటి ప్రజాస్వామ్య దిశానిర్దేశకులకు ఒరవడి అయ్యాడు. గ్రీకుల బహుళ దేవతారాధనను వ్యతిరేకించినందుకు సోక్రటీస్‌ను ఉరితీయడం ఏథెన్స్ ప్రజాస్వామ్య పరిమితిని, అపరిణతిని నొక్కిచెప్పి; భావప్రకటనా స్వేచ్ఛలేనిది ప్రజాస్వామ్యమే కాదన్న నీతినీ బోధించింది. పౌర ప్రాతినిధ్యం నుంచి రాచరిక నియంతృత్వంలోకి జారిపోయిన రోమ్ అనుభవమూ ఇలాంటిదే. వ్యక్తులు ఉత్తములూ, ఉన్నత సంకల్పవంతులూ అయితే చాలదు; వ్యవస్థలను బలోపేతం చేస్తేనే ప్రజాస్వామ్యానికి ఉనికీ, మనికీ అన్నది రోమ్ నేర్పిన గుణపాఠం. యూరప్ అంతటా ప్రజాస్వామ్య వ్యవస్థల సంపూర్ణ పతనం; ప్రజాస్వామ్య పునరుజ్జీవనానికి ఇంగ్లండ్ వేగుచుక్క కావడం; ఫ్రెంచి విప్లవం తిప్పిన మలుపులు; ప్రజాస్వామ్య మార్గంలో అమెరికా వేసిన ముందడుగు– ఇదంతా మరో చరిత్ర. వోటుహక్కు చరిత్రనే తిరగేస్తే, ఏథెన్స్ ప్రజాస్వామ్యంలోనూ బానిసలకు వోటు హక్కు లేదు. ఆ తర్వాతా శ్రామికులకు, స్త్రీలకు వోటు హక్కు లభించడానికి పెద్ద పోరాటాలే జరిగాయి. యూరప్ దేశాలు అనేకం ప్రజాస్వామ్యంలోకి రావడానికి ఇరవయ్యో శతాబ్ది చివరి వరకూ ఎదురుచూశాయి.

ఇలాంటి చీకటి వెలుగుల చిత్రపటంలో భారత్ ఉనికే ఉజ్వలమూ, ఉత్తేజవంతమూ! వోటు హక్కును సార్వత్రికం చేసిన తొలి ఘనత మనదే. భారత్ ఒక దేశంగా మారడాన్నే అనుమానించి అవహేళన చేసిన నాటి బ్రిటిష్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ సహా అందరి అంచనాలను తలకిందులు చేస్తూ ప్రజాస్వామిక ప్రస్థానంలో ముందడుగు వేస్తూనే ఉన్నాం. బహుళ మతాలూ, భాషల వైవిధ్యం వైరుధ్యం కాదనీ, ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువనీ ప్రపంచానికి చాటి చెప్పాం.

భారత ప్రజాస్వామ్యమా! జయతు జయతు!

పేదల ఊసు పెద్దలకు పట్టదా?

విశ్లేషణ



డా॥ కత్తి పద్మారావు

భారతదేశంలో తీవ్రమైన ఆహార సంక్షోభం నెలకొని ఉంది. పౌష్టికాహార లోపంతో పిల్లలు, స్త్రీలు, బాలింతలు బాధపడుతున్నారు. కోట్లాది కార్మికులకు పనిలేదు. ఉద్యోగాలు లేక యువతకు పెళ్లిళ్ళు కూడా జరగడం లేదు. ఇదొక సామాజిక సమస్యగా రూపుదిద్దుకుంటోంది. బీజేపీ ఇచ్చిన ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ అడ్రస్ గల్లంతైంది. మతం మనిషికి తిండి పెట్టదు అని ప్రజలు తెలుసుకుంటున్నారు. అలాంటి పార్టీతో చంద్రబాబు అంటకాగుతున్నారు. దేశంలో తమ పేరు మీద సాగుభూమి లేనివారు ఎందరో! ఊరు పేరేగాని ఊరిలో సెంటు భూమి లేదు. 'ఇండియా' కూటమి కూడా తన ప్రణాళికలో భూమి పంపకాన్ని గురించి మాట్లాడకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. భూమి పంపకాన్ని నిరాకరించటం అంటే సామ్యవాదాన్ని నిరాకరించటమే!

18వ సార్వత్రిక ఎన్నికలు ఏప్రిల్ 19 నుండి జూన్ 1 వరకు ఏడు విడతలుగా జరుగుతున్నాయి. తిరిగి మళ్లీ మూడోసారి అధికారంలోనికి రావడానికి మోదీ విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ఏ ఉత్తరప్రదేశ్ మీద అయితే వాళ్లు ఎక్కువ ఆధారపడి ఉన్నారో అక్కడ సామాజిక రాజకీయ చైతన్యం పెల్లుబికింది. ముఖ్యంగా ముస్లింలలో ఎంతో మార్పు రావడం వల్లే రాయబరేలీలో రాహుల్ గాంధీ నిలబడటానికి పూనుకున్నారు. మతోన్మాద దాడులు, మహిళా సాధికారతను పునాదులతో తొలిచే భావజాలం, కార్పొరేట్ శక్తులకు దేశాన్ని తాకట్టు పెడుతున్న బీజేపీ విధానాలు లౌకికవాదులను, ఓబీసీలను, దళితులను, స్త్రీలను ఆలోచింపజేస్తున్నాయని చెప్పక తప్పదు. ముఖ్యంగా 370 ఆర్టికల్ రద్దు ద్వారా జమ్మూ కశ్మీర్ శాసనసభను రద్దుచేసి, ఆ రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా విడగొట్టిన ఉదంతాన్ని ప్రజాస్వామిక వాదులు అర్థం చేసుకుంటున్నారు. రాష్ట్రాల ఆదాయాన్ని తగ్గించి, జీఎస్టీ ద్వారా కేంద్రీకృత ఆర్థిక పెత్తనాన్ని పెంచి, రాష్ట్రాల ఉనికిని నామమాత్రం చేయాలని చేస్తున్న ప్రయత్నాలను కూడా ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. ముఖ్యంగా రాష్ట్రాలకు ప్రత్యేక హక్కులు కలిగిన భాష, సంస్కృతి, విద్య, విద్యుత్, మానవ వనరులపై కూడా కేంద్ర ప్రభుత్వమే పెత్తనం చేయాలనే చర్యలపై రాష్ట్ర ప్రభుత్వాలు చైతన్యవంతంగా ఆలోచిస్తున్నాయి. ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలైన పత్రికల మీద చేస్తున్న దాడి బ్రిటిష్ వాళ్ళ కాలంలో కూడా జరగలేదని జర్నలిస్టు మేధావులు వాపోతున్నారు.

ఏప్రిల్ చివరి వారంలో వచ్చిన 'గ్లోబల్ రిపోర్ట్ ఆన్ ఫుడ్ క్రైసిస్' ప్రకారం, భారతదేశంలో తీవ్రమైన ఆహార సంక్షోభం నెలకొని ఉంది. పౌష్టికాహార లోపంతో పిల్లలు, స్త్రీలు, బాలింతలు బాధపడుతున్నారు. అత్యధిక స్త్రీలు రక్తలేమితో ఇబ్బంది పడుతున్నారు. కోట్లాది మంది కార్మికులకు పనిలేదు. భారతదేశం మొత్తం వలసలతో అన్నార్తులై పొట్ట చేత పట్టుకుని నగర శివారుల్లోని మురికివాడలలో జీవిస్తున్నారు. నిజానికి పంజాబ్ రైతులు చేసిన రైతు ఉద్యమ ప్రభావం భారతదేశం మొత్తం మీద ఉంది. సంయుక్త కిసాన్ మోర్చా హోరాహోరీ రైతు ఉద్యమాన్ని నడిపింది. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలనే డిమాండ్‌పై రాజీలేని పోరాటం చేసింది.

ముఖ్యంగా అడవుల నరికివేత వల్ల, నీటిపారుదల ప్రాజెక్టులకు ప్రోత్సాహం ఇవ్వకపోవడం వల్ల దేశంలో తీవ్రంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మండుటెండల్లో ప్రజలు ఆహారం కోసం పని చేయాల్సిన పరిస్థితులు వచ్చాయి. మతం మనిషికి అన్నం పెట్టదు అని ప్రజలు తెలుసుకుంటున్నారు. మరీ ముఖ్యంగా భారతదేశంలో 75 సంవత్సరాల స్వాతంత్ర్యం తరువాత కూడా గ్రామాలలో మంచి నీళ్ళు దొరకడం లేదు. మద్యాన్ని అందించటంలో సఫలమైన ప్రభుత్వాలు, మంచినీళ్ల అందించడంలో విఫలమయ్యాయి.



ఇకపోతే దేశంలో నిరుద్యోగం విలయ తాండవం చేస్తోంది. ఉద్యోగాలు లేక యువతకు పెళ్లిళ్ళు కూడా జరగడం లేదు. ఇదొక సామాజిక సమస్యగా రూపుదిద్దుకుంటోంది. కాగా ఎన్నికల నేపథ్యంలో నిరుద్యోగం ప్రధాన అంశంగా చర్చకొస్తోంది. ప్రతిపక్ష నేతలు నిరుద్యోగ సమస్యపై నిలదీస్తుండగా అధికార బీజేపీ నేతలు సమస్యను పూర్తిగా పక్కన పెట్టేశారు. ప్రధాని మోదీ ప్రసంగాలు, బీజేపీ మేనిఫెస్టో యువతకు భరోసా కల్పించలేదు. పైగా ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ అడ్రస్ గల్లంతైంది. నిరుద్యోగ రేటు పెరగడం ఆందోళన కలిగించే విషయం.

ఇకపోతే 'ఇండియా' కూటమి కూడా తన ప్రణాళికలో భూమి పంపకాన్ని గురించి మాట్లాడకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఎందుకంటే భారతదేశంలో కోట్లాది మందికి సాగుభూమి సెంటు కూడా లేదు. ఊరు పేరేగాని ఊరిలో సెంటు భూమి లేదు. ఇంటి స్థలం లేదు. మంచినీళ్ల వసతి లేదు. చనిపోతే పాతిపెట్టడానికి శ్మశానం లేదు. దేశంలోని సుమారు 7 లక్షల గ్రామాల్లో అంటరానితనం కొనసాగుతూనే వుంది. భారతదేశంలో దళితులు ఆర్థిక సామాజిక రాజకీయ న్యాయం లేక పేదరికంలో, అస్పృశ్యతలో, అవిద్యలో మగ్గిపోతున్నారు. బీటెక్‌లు, ఎంటెక్‌లు, బీఏలు, ఎంఏలు చదివినా నిరుద్యోగులుగా, ఉపాధి హామీ కూలీలుగా జీవిస్తున్నారు. ఈ రోజున దళిత వాడల్లో విద్యార్థులు, స్త్రీలు నిరాశా నిస్పృహలలో జీవిస్తున్నారు. వారి కుటుంబానికి తలా రెండెకరాల భూమి ఇవ్వటం ద్వారా ఆర్థిక సాధికారతను కల్గిస్తాం అని ఏ ప్రభుత్వమూ చెప్పటం లేదు. రాజకీయ పార్టీల మేనిఫెస్టోలు అంబేడ్కర్ ఆలోచనకు భిన్నంగా ఉన్నాయి.

భూమి పంపకాన్ని నిరాకరించటం అంటే సామ్యవాదాన్ని నిరాకరించటమే. ఇప్పుడు ఎన్నికల్లో ప్రకటించిన ఏ మేనిఫెస్టోలో కూడా భూమి పంపకం గురించి రాయక పోవటం, అస్పృశ్యతా నివారణ ఒక ఎన్నికల ఎజెండాగా లేకపోవటం, కుల నిర్మూలన కార్యక్రమం ఎవరి లక్ష్యంగా లేకపోవటాన్ని దళిత మేధావులు, ఆలోచనాపరులు అర్థం చేసుకుంటున్నారు. రాజ్యాధికారమే వీటన్నిటికీ పరిష్కారం అని ఆలోచిస్తున్నారు. నిజానికి ప్రసిద్ధమైన కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో, ఐఐటీల్లో, వైద్య విశ్వవిద్యాలయాల్లో, అన్ని కళాశాలల్లో దళిత విద్యార్థులు ఎంతో వివక్షకు గురి అవుతున్నారు.

మోదీ ఇంత తిరోగమన చర్యలతో ముందుకు వెళ్తుంటే, నారా చంద్రబాబు నాయుడు ఎన్డీయే కూటమిలో చేరటం ఆయనకున్న దళిత వ్యతిరేకతనూ, హిందూ మతోన్మాద భావజాలాన్నీ, కులాధిపత్య వైఖరినీ, మైనారిటీల పట్ల ద్వేషాన్నీ తెలియజేస్తున్నాయి. చంద్రబాబు నాయుడుకూ, మోదీకీ మధ్య భావజాలంలో, దళితులు, స్త్రీల పట్ల వ్యతిరేకతలో ఏ విధమైన తేడాలేదు అని అర్థం అవుతోంది. ముఖ్యంగా మోదీ యూనివర్సిటీల్లో జీవపరిణామ, మానవ పరిణామ చారిత్రక సిద్ధాంతాల బోధనకు భిన్నంగా మతవాద భావజాలాన్ని ప్రోత్సహించటం లౌకిక భావజాల వ్యాప్తికి గొడ్డలి పెట్టు అవుతుంది.

ఇకపోతే అంబేడ్కర్ భావజాల ప్రచారంలో తమిళనాడు ముందుంది. తమిళనాడులోని అన్ని థియేటర్లలో సినిమా ప్రారంభంలో అంబేడ్కర్ జీవిత పోరాటం గురించి ఐదు నిమిషాల నిడివిగల డాక్యుమెంటరీ ప్రదర్శించాలని అక్కడి ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఆదేశించారు. అంబేడ్కర్ ఆ రాజ్యాంగం ద్వారానే బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు ముఖ్యమంత్రులు ప్రధానులు, రాష్ట్రపతులు అవుతున్నారని గ్రహించాలి.

అంబేడ్కర్ రాజ్యాంగం భారతదేశ పునర్ నిర్మాణానికి ఆయువు పోసింది. ఏ దేశంలో స్త్రీ వ్యక్తిత్వంతో జీవిస్తుందో, ఏ దేశంలో కుటుంబ వ్యవస్థ బలంగా నిలబడుతుందో, ఏ దేశంలో స్త్రీ ఉత్పత్తి శక్తి దేశ సౌభాగ్యానికి ఊపిరి పోస్తుందో ఆ దేశం ఆర్థిక సంపదవున్న ప్రపంచ పంక్తిలో నిలబడగలుగుతుంది. నిజానికి అంబేడ్కర్ అడుగు అడుగులో స్త్రీ సమానత్వం కోసం పోరాడారు. వారి అభ్యున్నతి కోసం, వారి విద్యాభ్యాసం కోసం, వారి సాధికారిత కోసం, వారి భావ చైతన్యం కోసం, వారి రాజకీయ హక్కుల కోసం పోరాడారు. హిందూ కోడ్ బిల్లు విషయంలో మొదటిసారిగా కేంద్ర ప్రభుత్వంలో న్యాయ శాఖ మంత్రిగా రాజీనామా చేసి ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి హిందూ కోడ్ బిల్లును సాధించారు. ఈనాడు ప్రభుత్వాలు స్త్రీ సాధికారితను నిలబెట్టాలి అంటే నిరుద్యోగులయిన స్త్రీలకు ఉద్యోగ వసతి కల్పించాలి. విధవరాండ్రకు నెలకు పది వేల రూపాయల పింఛన్ ఇవ్వగలిగిన స్థాయికి రావాలి. ప్రతి దళిత స్త్రీకి రెండు ఎకరాల భూమి ఇచ్చి భారతదేశంలో వ్యవసాయ విస్తృతికి కృషి చేయాలి. ఇంటింటికీ మంచినీటి వసతి, విద్యుత్ వసతి కల్పించి, ఆరోగ్య సంరక్షణ కోసం పౌష్టికాహారాన్ని అందించి స్త్రీ శారీరక మానసిక శక్తిని పెంచి దేశ సౌభాగ్యానికి బాటలు వేయాలి.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు । 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కొత్త సమీకరణం



అన్నట్టు, 'నియంతృత్వంలోకి జారుతోంది' అనేది, 'ఇప్పటికే నియంతృత్వం' అనేదానికి భిన్నం. అంటే, మనం ఇంకా నియంతృత్వం కాదని రుజువు చేసే ఘటనలు మనం నియంతృత్వంలోకి జారడం లేదనేదాన్ని మాత్రం రుజువు చేయవు.

– రమేశ్ శ్రీవత్స్, వ్యంగ్య వ్యాఖ్యాత

ఇదో కోణం



ఓటు వేయడానికి కశ్మీరీ జనాలు చూపే ఉత్సాహం సందేహాస్పదమైనది. అత్యంత కఠిన సమయాల్లో కూడా, మహిళలు, ముఖ్యంగా గ్రామీణ కశ్మీర్‌లో గంటల తరబడి వేచివుండేవారు, బారులు తీరేవారు, ఒకరినొకరు తోసుకునేవారు. బహుశా వారికది వినోదం కావొచ్చు, బయటికి వెళ్లడానికీ, మాట్లాడుకోవడానికీ, గాలి కబుర్లు పంచుకోవడానికీ అదొక అవకాశం.

– గజాలా వహాబ్, సంపాదకురాలు

రోగాలు ఇలా వస్తాయి!



1960ల్లో (యూఎస్) ప్రభుత్వ బయో ఆయుధాల ల్యాబులు 'టిక్'లకు (ఒక రకం పేను) అసాధారణ వ్యాధుల ఇంజెక్షన్లు ఇచ్చేవి. వెంటనే, ఆ ప్రాంత ప్రజలకు ఆ వ్యాధులు వచ్చేవి. ఇప్పుడు టిక్కుల వల్ల వచ్చే లైమ్ వ్యాధి 'ఎండెమిక్' అయిపోయింది. సహజంగానే ప్రభుత్వం దీన్ని అంగీకరించలేదు.

– టకర్ కార్ల్‌సన్, జర్నలిస్ట్

ఆట మొదలు



పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ముజఫరాబాద్‌లో నిరసనకారులు, పాకిస్తానీ భద్రతా దళాలతో ముఖాముఖి తలపడుతున్నారు. అన్ని వచ్చే పోయే మార్గాలను మూసివేయడంతో స్థానికులు పోలీసు అధికారులను ఘెరావ్ చేసి చితకబాదారు.

– సోనమ్ మహాజన్, వ్యాఖ్యాత

నెమ్మదిగా చేద్దాం!



హైవేల మీద నెమ్మదిగా పోయే ట్రక్కులను ఎడమ లేన్‌లోకి మళ్లమని అడగటమంటే, ప్రభుత్వ కార్యాలయాల్లోని అధికారులను ఫైల్‌ను కదల్చమని అడగటమే! ఇద్దరూ 'తొందరేముంది?' అన్నట్టుగానే చూస్తారు.

– హేపీమాన్ జాకబ్, ప్రొఫెసర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఆ దేశం మీద జాలిపడు!

ఆ దేశం మీద జాలిపడు!
ఏ దేశ ప్రజలు గొర్రెల్లా ఉంటారో
ఆ జాతిని చూసి జాలిపడు

ఏ గొర్రెల కాపరులు వారిని తప్పుదారి పట్టిస్తారో
ఆ దేశపు బూటకపు నాయకత్వాన్ని చూసి జాలిపడు
ఏ దేశ మేధావులు నోరు విప్పరో
ఏ సద్గుణ సంపన్నులు గాలి కబుర్లతో
గాలితో యుద్ధాలు చేస్తుంటారో
వారందరినీ చూసి జాలిపడు!

అవసరమైనప్పుడైనా గొంతెత్తలేని
జాతి జనుల చూసి జాలిపడు
దాడులు చేసే వారిని పొగడుతూ ఉండడం
హింసిస్తూ ప్రపంచాన్ని బలవంతంగా
పాలించాలనుకునే ఆంబోతుల్ని– హీరోలనుకుని,
భజనలు చేస్తున్న భక్తుల్ని చూసి జాలిపడు!

తమ భాష తమదే తప్ప, మరో భాష అర్థం చేసుకోలేని
అవివేకులను చూసి జాలిపడు
తమ సంస్కృతీ సంప్రదాయాలు తమవే తప్ప,
ఇంకా వేరేవి కూడా ఉంటాయని
తెలుసుకోలేని మూర్ఖుల్ని చూసి జాలిపడు!

డబ్బే ఊపిరిగా బతికే వారిని చూసి జాలిపడు
బాగా మెక్కి నిద్రిస్తున్న వారిని ఇంకా నిద్రపుచ్చుతున్న
కాపలాదారుల కపటత్వాన్ని చూసి జాలిపడు
హక్కుల్ని, బాధ్యతల్ని గాలికి వదిలేసే దేశ ప్రజల్నీ...
వారి దేశాన్నీ... చూసి జాలిపడు!
తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కొట్టుకుపోతున్నా,
మిన్నకుండే వానపాము మనస్తత్వాన్ని చూసి జాలిపడు!
స్వేచ్ఛాలోచనతో తలెత్తుకు సగర్వంగా బతికిన
ఓ నా ప్రియమైన దేశమా? నువ్విప్పుడు నిరంతరం
కన్నీళ్ళెందుకు కారుస్తున్నావ్?

(ఖలీల్ జీబ్రాన్ భావానికి కవితా రూపం ఇచ్చింది,
అమెరికన్ కవి లారెన్స్ ఫెర్‌లిగెట్టి)
తెలుగు అనువాదం: డా॥ దేవరాజు మహారాజు

ఎన్నాళ్లీ దాటవేత ధోరణి?

గత దశాబ్ద కాలంగా కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇతర వెనుకబడిన తరగతులు (ఓబీసీ) కేంద్రంగా తన ఎన్నికల రాజకీయాలు చేస్తుండటం బహిరంగ రహస్యమే. బీజేపీ గత 2014 ఎన్నికల సమయంలో విడుదల చేసిన తమ ఎన్నికల మేనిఫెస్టోలో జనగణనలో ఓబీసీ కుల గణన జరిపి, ఆ యా వర్గాల సాధికారత, సామాజిక న్యాయాన్ని విస్తృత పరుస్తామని ప్రకటించింది. ఆ తర్వాత అధికారం చేపట్టిన బీజేపీ... ఇప్పటి వరకు పదేళ్ల గడుస్తున్నా... ఓబీసీ కులగణనపై స్పష్టమైన అభిప్రాయం ప్రకటించలేదు. అంతేకాక కొంతమంది బీజేపీ నేతలు కులగణన వలన కుల అస్తిత్వం, అసమానతలు పెరుగుతాయని అసంబద్ధ వ్యాఖ్యలు చేశారు. దీంతో వెనుకబడిన కులాల ప్రజలు మరోమారు తీవ్ర నిరాశకు లోనయ్యారు. అలాగే ప్రతిపక్షాలూ మోదీని ఓబీసీ వ్యతిరేకిగా విమర్శలు కురిపిస్తున్నాయి. ఆ క్రమంలోనే మోదీ పలు వేదికలపై ప్రసంగిస్తూ... పార్లమెంటు సమావేశాల్లోనూ గత యూపీఏ ప్రభుత్వమే ఓబీసీలకు అన్యాయం చేసిందని ఆరోపిస్తూ... తనను తాను (సబ్సే బడా ఓబీసి) అతి పెద్ద ఓబీసీగా అభివర్ణించుకున్నారు. కానీ ఆయన ప్రభుత్వ విధానాల్లో, పదవుల్లో, సంక్షేమ పథకాల పంపిణీలో ఆ వర్గానికి చేసింది ఏమీ లేదు.



ఓబీసీ కులాల్లో ఉప వర్గీకరణ చేయాలని 2017లో జస్టిస్ రోహిణి కమిషన్ ఏర్పాటు చేశారు. ఈ కమిషన్ 2023లో తమ నివేదిక సమర్పించింది. 97 శాతం ఉద్యోగ, విద్యావకాశాల్లో ఓబీసీల్లోని 25 శాతం కులాలే పొందుతున్నాయనీ, కేవలం పది కులాలకు 24.95 శాతం ఉద్యోగాలు లభిస్తున్నాయనీ ఈ కమిషన్ తేల్చింది. దాదాపు 983 కులాలకు (మొత్తం ఓబీసీల్లో 37 శాతం కులాలకు) విద్య, ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం లేదని, 994 కులాలకు విద్య, ఉద్యోగాల్లో 2.68 శాతం ప్రాతినిధ్యమే ఉందని తమ నివేదికలో వెల్లడించింది. ఇదిలా ఉంటే అసలు ఓబీసీల జనాభా వివరాలు లేని ఈ విశ్లేషణ ఏ మేరకు శాస్త్రీయమైనది? ఓబీసీ జనగణన లేని ఈ ఉప వర్గీకరణతో న్యాయం ఏ విధంగా జరుగుతుంది అన్నవి ఇవ్వాళ ఓబీసీలను వేధిస్తున్న ప్రశ్నలు.

కులగణన చేయాలని దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు– కులాన్ని ఉపరితల అంశంగా భావించే కమ్యూనిస్టు పార్టీలు, విప్లవోద్యమ సంస్థలు కూడా జనగణనలో ఓబీసీ కులగణనకు మద్దతు తెలిపాయి. ఇవేవీ పట్టనట్లుగా బీజేపీ ప్రభుత్వం... ఓబీసీ కులగణన చేయడానికి సాంకేతిక అంశాలు అడ్డుపడుతున్నాయని దాటవేత ధోరణిని ప్రదర్శిస్తుంది. జనగణనలో ఇప్పటికే షెడ్యూల్డ్ క్యాస్ట్ కులాలను, షెడ్యూల్డ్ తెగల జనాభాను లెక్కిస్తున్నప్పుడు ఓబీసీ కులాల జనాభాను లెక్కించడానికి సాంకేతిక సమస్యలు ఏమి అడ్డుపడుతున్నాయి?

భారతదేశంలో రాజకీయ పార్టీలు కుల సమీకరణాల పైన ఆధారపడుతూ ఎన్నికల రాజకీయాలు చేస్తున్నాయని చాలా మంది భారతీయ, పాశ్చాత్య రాజనీతి శాస్త్రవేత్తలు సూత్రీకరించారు. సంప్రదాయంగా బీజేపీ అగ్ర కులాల, పట్టణ స్థాయి ఎగువ మధ్య తరగతి ప్రజల పార్టీగా 2014 వరకూ పరిమితం అవుతూ వచ్చింది. నిజానికి బీజేపీ ఓబీసీ కులాల వ్యతిరేక పార్టీ. 1990లో కేంద్రంలో అధికారంలో ఉన్న నేష నల్ ఫ్రంట్ ప్రభుత్వం వీపీ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో మండల్ కమిషన్ ప్రకారం ఓబీసీలకు విద్యా, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఈ నిర్ణయాన్ని బీజేపీ వ్యతిరేకించింది. ఈ అన్ని విషయాలనూ దృష్టిలో ఉంచుకుని ఓబీసీల ఆకాంక్షలైనటువంటి కుల గణన, చట్ట సభల్లో రిజర్వేషన్, జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించడం వంటి వాటిని సాకారం చేసే పార్టీలకే ఓబీసీలు అండగా నిలవాలి.

– నెల్లి సత్య
ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి, ఓయూ । 95503 95232

బహుజనులకు పట్టం కట్టాలి!

తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత ఇక్కడి ప్రజలు తమ కష్టాలన్నీ తీరిపోయినట్లే అని భావించారు. మరీ ముఖ్యంగా బహుజనులు తమ సమస్యలకు పరిష్కారాలు దొరికినట్లు సంతోషించారు. కానీ మొదటి పదేళ్ల అధికారంలో ఉన్న ఉద్యమపార్టీ ప్రజాకాంక్షలను ఏమాత్రం నెరవేర్చలేకపోయింది. సామాజికంగా వెనుకబడి ఉన్న ప్రజలను మాటలతో మభ్యపెట్టడం తప్ప అది వారికి చేసిన మేలు ఏదీ లేదు. దీంతో తెలంగాణ మూడవ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మాటల ప్రభుత్వంగానే తన పనితీరు ద్వారా నిరూపించుకుంటున్నది.



2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో ఇచ్చిన 'ఆరు గ్యారంటీలు' ఏవీ కూడా అధిక జనాభాగా ఉన్న బీసీ, ఎస్సీ ఎస్టీల సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను మార్చేలా లేవు. 'మహాలక్ష్మి' పేరుతో ప్రతి మహిళకి నెలకి రూ. 2,500 ఇవ్వడం, గ్యాస్ సిలిండర్‌ను రూ. 500కు ఇవ్వడం, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం ఏర్పాటు చేయడం; రైతు భరోసా పేరుతో ప్రతియేటా రైతులకి ఎకరాకి రూ. 15,000 ఇవ్వడం, వరి పంటకు క్వింటాలుకు అదనంగా రూ. 500 బోనస్ ఇవ్వడం; గృహ జ్యోతి పేరుతో ప్రతి కుటుంబానికి రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్; 'ఇందిరమ్మ ఇల్లు' పేరుతో ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, 5 లక్షల రూపాయలు; 'యువ వికాసం' పేరుతో ఇచ్చే విద్యార్థులకు రూ. 5 లక్షల 'విద్యా భరోసా' కార్డు, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూలు; 'చేయూత పథకం' పేరుతో రూ. 4,000 నెలవారీ పింఛను, పది లక్షల 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' బీమా ఏర్పాటు చేయడం... ఈ ఆరు గ్యారంటీలూ, వీటికి అదనంగా ఇచ్చిన 400 హామీలు అన్నీ ఆచరణలో దీర్ఘకాలం అమలుకు సాధ్యం కానివే. ఇవేవీ బహుజనులకు అంతగా ఉపయోగపడేవి కాదు. అందుకే ఈసారి బీసీ, ఎస్సీ, ఎస్టీ వంటి అణగారిన వర్గాలు తగు విధంగా స్పందించాల్సిన అవసరముంది. అప్పుడే సామాజిక న్యాయాన్ని అందించే పార్టీలకే అధికారం దక్కుతుంది.

తెలంగాణలో ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్–బీజేపీ–బీఆర్ఎస్‌ల మధ్య త్రిముఖ పోటీ జరుగుతున్నదని చాలామంది అనుకుంటున్నారు. కానీ నిజానికి ద్విముఖ పోటీ మాత్రమే జరగనుంది. అది ఎలాగంటే పది శాతమైనా లేని అగ్రకులాలకూ, 90 శాతం పైగా ఉన్న అణగారిన కులాలకూ మధ్యనే రాజకీయ యుద్ధం జరగనున్నదనిపిస్తోంది. ఈ యుద్ధంలో బహుజనులు గెలవాలి.

– పుల్లెంల గణేష్
సామాజిక విశ్లేషకుడు । 95530 41549

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.షష్ఠి తె.4.45 వరకు (తెల్లవారితే మంగళవారం), తదుపరి సప్తమి , **నక్షత్రం:** పునర్వసు ప.1.44 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** రా.10.13 నుండి 11.53 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.22 నుండి 1.10 వరకు, తదుపరి ప.2.57 నుండి 3.45 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.15 నుండి 12.54 వరకు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.32, **సూర్యాస్తమయం:** 6.19.



నిజామాబాద్ జిల్లా ముదక్‌పల్లిలో కారుపై విరిగిపడ్డ చెట్టుకొమ్మలను నరికివేస్తున్న దృశ్యం



ఆసిఫాబాద్‌లో విద్యుత్ స్తంభంపై కూలిన చెట్టు

గాలులు.. వానలు

- రాష్ట్రంలో పలుచోట్ల వర్ష బీభత్సం
- ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో కూలిన విద్యుత్ స్తంభాలు
- పిడుగుపాటుకు ముగ్గురు మృతి

నిజామాబాద్/ఆసిఫాబాద్/బెల్లంపల్లి: ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఆదివారం గాలి వాన బీభత్సం సృష్టించింది. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలో బలమైన ఈదురుగాలుల ధాటికి పలు ఇళ్లపైకప్పులు ఎగిరిపోయాయి. చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మంచిప్ప, ముదక్‌పల్లి శివార్లలో ఈదురుగాలులకు 2 డీపీ ట్రాన్స్‌ఫార్మర్లు, 14 విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. ముదక్‌పల్లిలోని చిలుకల చిన్నమ్మ ఆలయ సమీపంలో చెట్టుకొమ్మలు విరిగి కారుపై పడ్డాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంతోపాటు మాచారెడ్డి, రాజంపేట మండలాల్లో భారీ వర్షం కురియడంతో ధాన్యం తడిసిపోయింది. ఎల్లారెడ్డి పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో టెంట్లు కూలిపోయాయి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో...

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో దాదాపు రెండు గంటలపాటు వర్షం కురిసింది. స్థానిక పీటీజీ పాఠశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కోసం ఏర్పాటు చేసిన టెంట్లు కూలిపోయాయి. కుర్చీలు కొట్టుకుపోయాయి. పలు కాలనీల్లో చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్ స్తంభాలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ఈదురు గాలులకు తిలక్ స్టేడియంలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో టెంట్లు కూలిపోయాయి. కుర్చీలు కొట్టుకుపోయాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో...

ఉమ్మడి వరంగల్‌లోని హనుమకొండ, వరంగల్, జనగామ, ములుగు జిల్లాల్లో ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. కరెంటు సరఫరా నిలిచిపోవడంతో చాలా ప్రాంతాలు అంధకారంలో ఉన్నాయి.



కొనుగోలు కేంద్రంలో మృతదేహాలు

పిడుగుల దెబ్బ..

పెద్దశంకరంపేట (మెదక్)/జైనథ్: రాష్ట్రంలో వేర్వేరు ఘటనల్లో పిడుగుపాటుకు గురై ఆదివారం ముగ్గురు మృతిచెందారు. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం రామోజీపల్లికి చెందిన పాల్వంచ శ్రీరాములు (50) ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రానికి వచ్చారు. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. ఈ క్రమంలో వరుసకు మనువడు అయిన శివరాజ్ (13)తో కలిసి ధాన్యం కుప్పపై టార్పాలిన్ కప్పే క్రమంలో పిడుగుపాటుకు గురై ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీరాములుకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. శివరాజ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి పూర్తి చేశాడు.

ఆదిలాబాద్ జిల్లాలో...



కిరణ్

ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం గిమ్మ గ్రామానికి చెందిన మామిడిపెల్లి కిరణ్ (45) చేనువద్దకు మంద సంటెన్న, కోల భోజన్న, కూరెల్లి టిల్లు, కుండ రమేశ్ వెళ్లారు. మధ్యాహ్నం 3 గంటలకు ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో అందరూ సమీపంలోని మోదుగు చెట్టు కిందకు వెళ్లారు. ఈ క్రమంలో ఒక్కసారిగా చెట్టుపై భారీ శబ్దంతో పిడుగు పడింది. ఈ ఘటనలో ఐదుగురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను గ్రామస్తులు ఆటోలో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా, కిరణ్ మార్గమధ్యంలోనే మరణించాడు. మంద సంటెన్న పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

గాలివాన బీభత్సంపై సీఎం ఆరా

- సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఆదిలాబాద్, మెదక్, సంగారెడ్డితోపాటు ఇతర జిల్లాల్లో ఆదివారం గాలివాన కురవడం, పిడుగులు పడటంతో సంభవించిన నష్టంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ సూచనలు ఉన్నందున జిల్లాల్లో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎక్కడ ఎలాంటి ఆపద వచ్చినా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సహాయ చర్యలు చేపట్టాలని కోరారు. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలంలో పిడుగు పడి ఇద్దరు మృతి చెందడం పట్ల సీఎం విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామన్నారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని గిమ్మ గ్రామంలో పిడుగుపాటుకు ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయని, వారికి తగిన వైద్య సాయం అందేలా చూడాలని అక్కడి అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచిపోతే, రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు.

పోలీసుల చేజింగ్... కారు పల్టీ

వాహనంలో రూ.99.94 లక్షలు లభ్యం ● ఓ రాజకీయ పార్టీ వారిదని అనుమానం



కేశ్వాపురం వద్ద పల్టీకొట్టిన ఇన్నోవా కారు. (ఇన్‌సెట్‌లో) లభ్యమైన డబ్బుల బ్యాగులు

కూసుమంచి: ఓ ఇన్నోవా కారులో భారీగా నగదు తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు ఆ వాహనాన్ని వెంబడించగా వారిని తప్పించే క్రమంలో ఆ కారు పల్టీ కొట్టింది. కారులోని రెండు బ్యాగుల్లో రూ. 99.94 లక్షల విలువైన రూ.500 నోట్ల కట్టలు లభ్యమయ్యాయి. దీన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ఆదివారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కేశ్వాపురం గ్రామ సమీపాన చోటుచేసుకుంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది డబ్బు తరలింపుపై పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. ఓ ఇన్నోవా కారులో భారీగా డబ్బు తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ఆ వాహనాన్ని వెంబడించారు. ఈ క్రమంలో ఇన్నోవా కూసుమంచి నుంచి ఖమ్మం వెళ్తుండగా కేశ్వాపురం వద్దకు రాగానే కారును కొత్తతండా వైపు మళ్లించే క్రమంలో అదుపు తప్పి కల్వర్టు పక్కనే ఉన్న గుంతలో పల్టీ కొట్టింది. అక్కడే ఉన్న స్థానికులు డ్రైవర్ సైదయ్య, పక్కనే కూర్చున్న పాల్వంచ రాజేష్‌ను బయటకు తీశారు. వీరు కారులోని బెలూన్లు తెరచుకోవటంతో ప్రాణాలతో బయటపడ్డారు. రాజేష్‌కు తీవ్ర గాయాలు కాగా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. రాజేష్‌ను ముదిగొండ మండలం వాసిగా గుర్తించారు. కాగా ఈ డబ్బు ఎవరిది?, ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు.. అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. అయితే ఇది ఓ రాజకీయ పార్టీకి చెందిన వారిదిగా ప్రచారం జరుగుతోంది.

బెట్టింగ్‌లతో రూ.2 కోట్లు పోగొట్టాడని..

- కొడుకును హత్య చేసిన తండ్రి
- మెదక్ జిల్లాలో ఘటన



ముకేశ్‌కుమార్



రోదిస్తున్న తల్లి

చిన్నశంకరంపేట (మెదక్): పచ్చని కుటుంబంలో ఆన్‌లైన్ బెట్టింగ్ చిచ్చురేపింది. బెట్టింగ్‌లతో రూ.2 కోట్ల విలువచేసే ఆస్తులు కోల్పోవడంతో ఆగ్రహానికి గురైన తండ్రి, కొడుకుని హతమార్చాడు. మెదక్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని భగీరథ పల్లికి చెందిన రెడ్డి సత్యనారాయణ, పెంటమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. రైల్వే ఉద్యోగం చేసి మేడ్చల్‌లో స్థిరపడ్డారు. అక్కడే ఇల్లు నిర్మించుకోవడంతోపాటు మరో చోట కూడా భవనం కొనుగోలు చేశారు. సత్యనారాయణ తన ఉద్యోగానికి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకొని పెద్ద కుమారుడు ముకేశ్ కుమార్‌కు రైల్వే ఉద్యోగం ఇప్పించారు. అయితే అతను ఉద్యోగం సరిగా చేయక, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. ఇప్పటికే రూ. రెండు కోట్లు పోగొట్టాడు. మేడ్చల్‌లో విలువైన భవనంతో పాటు 320 గజాల ప్లాటును అమ్మి వచ్చిన డబ్బులను ఆన్‌లైన్ బెట్టింగ్‌లో ధార పోశాడు. ఇప్పుడు మిగిలింది వీరు ఉంటున్న నివాస గృహం. అది కూడా అమ్మేద్దాం అంటూ తల్లిదండ్రులను వేధించడం మొదలు పెట్టాడు. కుమారుడి వేధింపులు భరించలేక స్వగ్రామం భగిరథపల్లిలో శనివారం మధ్యాహ్నం బంధువులు, కుటుంబ సభ్యులతో కలసి తండ్రి పంచాయితీ పెట్టారు. కుమారుడిని సముదాయించేందుకు ప్రయత్నించినప్పటికీ అతను ఇల్లును అమ్మేస్తానని మొండికేశాడు. రాత్రి భోజనాలు చేసి అందరూ నిద్రించారు. ఈ క్రమంలో తండ్రి సత్యనారాయణ అర్ధరాత్రి వేళ కుమారుడిపై ఇనుప రాడ్‌తో దాడిచేయగా తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడి మృతి చెందాడు. జరిగిన విషయాన్ని సత్యనారాయణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వివరించారు. ఆదివారం ఉదయం రామాయంపేట సీఐ వెంకటేశ్, చిన్నశంకరంపేట ఎస్‌ఐ నారాయణగౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీలో మూడు రోజులు వానలే



సాక్షి, విశాఖపట్నం: దక్షిణ అంతర్గత కర్ణాటక, దాని పరిసర ప్రాంతాలపై సముద్ర మట్టానికి 1.5 కి.మీ. ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉంది. మరోవైపు రాష్ట్రంపైకి దక్షిణ, నైరుతి దిశ నుంచి గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా ఇప్పటికే ఏపీలో వర్షాలు కురుస్తున్నాయి. ఇవి రానున్న మూడు రోజులపాటు కొనసాగనున్నాయి. ఉత్తర, దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆదివారం నివేదికలో తెలిపింది. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు సంభవించే అవకాశం ఉందని పేర్కొంది. గంటకు 30–40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. కాగా ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు అనపర్తి (తూర్పు గోదావరి)లో 3.1, ఆలమూరు (కోనసీమ) 3, పరవాడ (అనకాపల్లి) 2.6, మంగళగిరి (గుంటూరు)లో 2 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

పోల్ మేనేజ్‌మెంట్‌పై బీజేపీ దృష్టి

- బూత్ కమిటీల ద్వారా అనుకూల ఓటింగ్‌శాతం పెంపుపై కేంద్రీకరణ
- ఇప్పటికే బూత్‌లలో కూర్చునే ఏజెంట్లకు శిక్షణ
- అక్రమాలు జరిగితే ఈసీకి ఫిర్యాదు చేసేలా లీగల్ సెల్ టీమ్స్ సిద్ధం



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో పోల్ మేనేజ్‌మెంట్‌పై బీజేపీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. సోమవారం ఉదయం పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి సాయంత్రం ముగిసే దాకా అప్రమత్తంగా పనిచేసేలా పార్టీ పోల్ మేనేజ్‌మెంట్ కమిటీ వివిధ విభాగాలను సిద్ధంగా ఉంచింది. నాంపల్లిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ కమ్ వార్ రూమ్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా పర్యవేక్షణకు చర్యలు చేపట్టింది. హైదరాబాద్ నుంచి జిల్లాలు, పార్లమెంట్ సెగ్మెంట్‌ల పరిధిలో సమన్వయానికి పోల్ మేనేజ్‌మెంట్, లీగల్‌సెల్ టీమ్‌లు పనిచేస్తున్నాయి. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో 17 బృందాలను ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలో పోలింగ్‌బూత్ కమిటీలతో కోఆర్డినేషన్ చేసేలా చూస్తున్నారు. పోలింగ్ ముగిసే దాకా బూత్‌లలో గంటగంటకూ నమోదవుతున్న ఓటింగ్ శాతంపై దృష్టితోపాటు మందకొడిగా పోలింగ్ జరుగుతున్న చోట్ల వేగం పెంచేలా పార్టీ కేడర్, యంత్రాంగం ద్వారా చర్యలు చేపట్టాలని భావిస్తోంది. కింది స్థాయిలో పోలింగ్ బూత్ కమిటీల ద్వారా పార్టీకి అనుకూలంగా ఉన్న ఆయా వర్గాల ఓట్లు వేయించుకోవడం ద్వారా ఓటింగ్ శాతం పెంచుకునేలా ఏర్పాట్లు చేసింది. ప్రత్యర్థి పార్టీలు ఓటర్లను ప్రలోభపరిచే చర్యలను ఎక్కడికక్కడ అడ్డుకోవడంతోపాటు, ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘానికి, రాష్ట్రంలోని ఎన్నికల ప్రధానాధికారికి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో, ఇతరత్రా రూపాల్లో ఫిర్యాదులు పంపించేలా 17 ఎంపీ సెగ్మెంట్‌లలో 17 లీగల్ బృందాలు, 17 అలర్ట్ టీమ్‌లను ఏర్పాటు చేసింది. అన్ని ఎంపీ స్థానాల పరిధిలో పోలింగ్ బూత్‌లలో కూర్చునే ఏజెంట్లకు శిక్షణ కూడా ఇచ్చారు.

పోలింగ్ నాడు శివరాత్రి అనుకోండి... 4న దసరా, సంక్రాంతి చేసుకుందాం

పార్టీ ఎన్నికల ఏజెంట్లు ఆయా బూత్‌లలో పోలింగ్ ముగిసే దాకా బయటకు రాకుండా అక్కడే ఉండాలని బీజేపీ రాష్ట్ర ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ డా.కె.లక్ష్మణ్ సూచించారు. మాక్‌పోలింగ్ సమయం నుంచే అప్రమత్తంగా ఉంటూ, పోలింగ్ నాడు శివరాత్రి అనుకొని మధ్యాహ్నం భోజనం కూడా మానుకొని ఏజెంట్ విధుల్లో నిమగ్నం కావాలని బూత్ కమిటీలకు స్పష్టం చేశారు. జూన్ 4న ఫలితాలు వెలువడ్డాక దసరా, సంక్రాంతి పండగలు ఒకేసారి చేసుకుందామని చెప్పారు. ఆదివారం పార్టీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కార్యకలాపాల సమీక్ష సందర్భంగా ఆయా అంశాలపై చర్చించారు. జూన్ 4న వెలువడే ఫలితాల్లో బీజేపీ తెలంగాణలో 10–12 సీట్ల వరకు గెలుస్తుందనే ధీమా వ్యక్తం చేశారు. మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ కులగణనకు తాము వ్యతిరేకం కాదని, బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడిగా బీసీల్లో చైతన్యానికి కృషి చేస్తున్నామన్నారు. రిజర్వేషన్ల రద్దుపై విపక్షాల ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టామని చెప్పారు. ఎన్డీఏగా బీహార్‌లో తామే కులగణన చేశామని, అదే కర్ణాటకలో కాంగ్రెస్ కులగణన చేసినా వ్యతిరేకత వస్తుందని బయట పెట్టలేదని గుర్తు చేశారు.

త్రినయని సీరియల్ నటి పవిత్ర దుర్మరణం

- మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ సమీపంలో రోడ్డు ప్రమాదం
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- ప్రమాదానికి అతివేగమే కారణం



భూత్పూర్: రోడ్డు ప్రమాదంలో త్రినయని సీరియల్ నటి పవిత్ర దుర్మరణం చెందారు. ఈ ఘటనలో మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శేరిపల్లి(బి) వద్ద జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి 12.20 గంటలకు జరిగిన ఈ ప్రమాద ఘటనకు సంబంధించి పోలీసులు చెప్పిన వివరాలిలా.. కర్ణాటక రాష్ట్రం మండ్యా జిల్లా ఉమ్మడిహల్లి గ్రామానికి చెందిన ప్రముఖ టీవీ నటి పవిత్ర(42), తన చెల్లెలి కూతురు ఉపేక్ష, బంధువు చంద్రకాంత్‌తో కలిసి స్కార్పియో కారులో శనివారం సాయంత్రం బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. భూత్పూర్ సమీపంలో శనివారం మధ్య రాత్రి డ్రైవర్ శ్రీకాంత్ అతివేగంగా నడపడంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని జడ్చర్ల నుంచి భూత్పూర్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొంది. దీంతో పవిత్రతో పాటు ఉపేక్ష, చంద్రకాంత్, డ్రైవర్ శ్రీకాంత్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే పవిత్ర మృతిచెందింది. పవిత్రకు కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ ఘటనపై పవిత్ర కుమారుడు ప్రజ్వల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. కాగా.. జీ తెలుగులో త్రినయని సీరియల్‌లో 'తిలోత్తమ'గా పవిత్ర ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారు. టీవీ సీరియల్ షూటింగ్ కోసం హైదరాబాద్‌కు వస్తుండగానే ఈ దుర్ఘటన జరిగినట్లు తెలుస్తోంది.

తెలంగాణలోని ప్రధాన కేంద్రాల్లో ఆదివారం నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లో)

కేంద్రం	ఉష్ణోగ్రత
రామగుండం	40.5
ఆదిలాబాద్	40.3
మహబూబ్‌నగర్	40.1
ఖమ్మం	40.0
నిజామాబాద్	39.9
నల్లగొండ	39.8
భద్రాచలం	39.2
మెదక్	39.0
హన్మకొండ	38.5
హైదరాబాద్	37.8
హకీంపేట్	37.8
దుండిగల్	37.5

పులివెందులకు చేరుకున్న ఏపీ సీఎం జగన్

- నేడు భాకరాపురంలో ఓటు హక్కు వినియోగించుకోనున్న ముఖ్యమంత్రి

పులివెందుల: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం సాయంత్రం వైఎస్సార్ జిల్లా పులివెందులకు చేరుకున్నారు. తన సతీమణి వైఎస్ భారతమ్మతో కలిసి సాయంత్రం 6.15 గంటలకు భాకరాపురంలోని స్వగృహానికి ఆయన చేరుకున్నారు. అనంతరం స్థానిక నాయకులతో కొద్దిసేపు ముచ్చటించారు. సోమవారం ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య భాకరాపురంలోని 138 పోలింగ్ బూత్‌లో వారు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అనంతరం సీఎం జగన్ తాడేపల్లికి బయలుదేరుతారు.

వన్స్ మోర్

ఇంటింటి ప్రగతి.. సమ్మిళిత అభివృద్ధి దిశగా ఆంధ్రప్రదేశ్‌ని నడిపిస్తున్న సీఎం వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: గత 59 నెలలుగా సుపరిపాలనతో ఇంటింటి ప్రగతి, సమ్మిళిత అభివృద్ధిని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాక్షాత్కారం చేశారు. సుపరిపాలన.. ఇంటింటి అభివృద్ధి.. సుస్థిరాభివృద్ధి మరింత ఉధృతంగా కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగనే రావాలని ఏపీ ప్రజలు బలంగా కోరుకుంటున్నారు. ఫ్యాన్ గుర్తుపై 2 బటన్లు నొక్కి ఓట్లేసి వైఎస్సార్‌సీపీకి మరోసారి అఖండ విజయాన్ని అందించేందుకు సిద్ధమయ్యారు. సిద్ధం సభలు, మేమంతా సిద్ధం బస్సు యాత్ర, ఎన్నికల ప్రచార సభల్లో సీఎం జగన్‌కు జనం బ్రహ్మరథం పట్టడం.. టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి సభలకు ప్రజాస్పందన లేకపోవడాన్ని బట్టి వైఎస్సార్‌సీపీ మరోసారి ఘన విజయం సాధించడం తథ్యమని రాజకీయ పరిశీలకులు తేల్చిచెబుతున్నారు. జాతీయ మీడియా సంస్థలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 22కుపైగా సర్వేల్లోనూ వైఎస్సార్‌సీపీ తిరిగి అఖండ విజయం సాధిస్తుందని వెల్లడైంది. సీఎం జగన్ సుపరిపాలనపై సానుకూల పవనాలు ప్రచండంగా వీస్తుండడంతో అనుకూల (పాజిటివ్) ఓటుతో వైఎస్సార్‌సీపీ మరోసారి చారిత్రక విజయం సాధించడం ఖాయమని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

ఇంటింటి భవిష్యత్తు మరింత గొప్పగా మారాలంటే..

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో సీఎం జగన్ 99 శాతం అమలు చేశారు. సంక్షేమ పథకాల ద్వారా పేదల ఖాతాల్లోకి డీబీటీ రూపంలో రూ.2.70 లక్షల కోట్లు నేరుగా జమ చేశారు. నాన్ డీబీటీ రూపంలో మరో రూ.1.79 లక్షల కోట్ల మేర ప్రయోజనాన్ని చేకూర్చారు. వాటిని సద్వినియోగం చేసుకున్న ప్రజలు తమ జీవనోపాధులను మెరుగుపర్చుకున్నారు. చంద్రబాబు హయాంలో 2018–19లో రాష్ట్రంలో పేదరికం 11.77 శాతం ఉంటే 2022–23 నాటికి సీఎం జగన్ పాలనలో 4.19 శాతానికి తగ్గడమే అందుకు స్పష్టమైన నిదర్శనం. మళ్లీ జగన్ వస్తేనే ఇంటింటి భవిష్యత్తు మరింత గొప్పగా మారుతుందని ప్రజలు బలంగా నమ్ముతున్నారు.

సాగు మరింత లాభసాటిగా మారాలంటే..

సీఎం జగన్ విప్లవాత్మక సంస్కరణలతో వ్యవసాయ రంగాన్ని చక్కదిద్దారు. గ్రామాల్లో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తు నుంచి విక్రయం వరకూ రైతన్నలను చేయిపట్టుకుని నడిపిస్తున్నారు. రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం, సున్నా వడ్డీకే పంట రుణాలు, ఉచిత పంటల బీమా అందిస్తున్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, విపత్తుల వల్ల పంట నష్టపోతే ఆ సీజన్ ముగిసేలోగా రైతులకు పరిహారం అందిస్తున్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చారు. చంద్రబాబు హయాంలో వ్యవసాయ రంగంలో రాష్ట్ర వృద్ధి రేటు 2018–19లో 8.3% తో దేశంలో 12వ స్థానంలో ఉంటే 2023–24 నాటికి 13 శాతానికి వృద్ధి రేటు పెరిగింది. వ్యవసా య వృద్ధి రేటులో రాష్ట్రం ఆరో స్థానంలో నిలిచింది. మళ్లీ జగన్ వస్తేనే వ్యవసాయం మరింత లాభసాటిగా మారు తుందని రైతన్నలు, కౌలు రైతులు బలంగా విశ్వసిస్తున్నారు.

విద్యా ప్రమాణాలు మరింత ఉన్నతంగా మారాలంటే..

ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు ద్వారా కార్పొరేట్ స్థాయికి అభివృద్ధి చేసిన సీఎం జగన్ పేదింటి బిడ్డలకు ఇంగ్లిషు మీడియం బోధన అందుబాటులోకి తెచ్చారు. సీబీఎస్‌ఈ సిలబస్ తీసుకొచ్చారు. అమ్మ ఒడి, విద్యా కానుక, గోరుముద్ద లాంటి పథకాలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సగటు నమోదు నిష్పత్తి రేటు వంద శాతానికి చేరుకుంది. మూడో తరగతి నుంచే విద్యార్థులకు టోఫెల్ శిక్షణ ఇస్తున్నారు. 2025–26 నుంచి ఐబీ (ఇంటర్నేషనల్ బాకలారియేట్) సిలబస్ ప్రవేశ పెట్టనున్నారు. ప్రస్తుతం ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థులు 2035 నాటికి పదో తరగతి పరీక్షలు ఐబీ సిలబస్‌తో రాయనున్నారు. ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలైన హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్, కేంబ్రిడ్జి, ఎంఐటీ భాగస్వామ్యంతో ఆన్‌లైన్ సర్టిఫైడ్ కోర్సులను అందిస్తున్నారు. ఉన్నత ప్రమాణాలతో చదువులు పూర్తి చేసుకుని బయటకు వచ్చిన మన విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా కార్పొరేట్ సంస్థలు ఉద్యోగాలు ఇచ్చేందుకు పోటీ పడే వాతావరణాన్ని కల్పిస్తున్నారు. మళ్లీ జగన్ వస్తేనే విద్యా సంస్కరణలు కొనసాగి ఉన్నత విద్యా ప్రమాణాలతో తమ పిల్లల భవిత బాగుంటుందని తల్లితండ్రులు బలంగా భావిస్తున్నారు.

వైద్యరంగంలో సంస్కరణలు కొనసాగాలంటే..

వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చి సీఎం జగన్ వైద్య సేవలను పేదల చెంతకు చేర్చారు. ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా చికిత్సలు పేద, మధ్య తరగతికి అందుతున్నాయి. విస్తరించిన ఆరోగ్యశ్రీతో రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తూ ప్రజారోగ్యానికి భరోసా కల్పించారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఆరోగ్యాంధ్రప్రదేశ్ దిశగా అడుగులు పడ్డాయి. నాడు–నేడు ద్వారా ప్రభుత్వాసుపత్రులను బలోపేతం చేయడంతో పాటు 17 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇవన్నీ కొనసాగి నాణ్యమైన వైద్యం ఉచితంగా పేదలకు, మధ్య తరగతికి అందాలంటే మళ్లీ ఇదే ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారు.

సుస్థిరాభివృద్ధి దిశగా రాష్ట్రం దూసుకెళ్లాలంటే..

విభజిత ఆంధ్రప్రదేశ్‌ను 2014–19 మధ్య అవినీతి పాలనతో చంద్రబాబు అధోగతి పాలు చేశారు. సీఎం జగన్ అధికారం చేపట్టాక ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ రాష్ట్రాన్ని సుస్థిరాభివృద్ధి వైపు నడిపించారు. రాష్ట్ర అప్పులు కాంపౌండెడ్ యాన్యువల్ గ్రోత్ రేట్(సీఏజీఆర్) చంద్రబాబు హయాంలో 2014–19 మధ్య 21.87 శాతం ఉంటే.. సీఎం జగన్ హయాంలో 12.13 శాతానికి తగ్గింది. దేశ జీడీపీలో మన వాటా చంద్రబాబు హయాంలో 4.47 శాతం ఉండగా సీఎం జగన్ హయాంలో 4.83 శాతానికి పెరిగింది. దేశ జీడీపీలో రాష్ట్ర జీఎస్‌డీపీ చంద్రబాబు హయాంలో 2018–19లో 11 శాతం ఉంటే.. సీఎం జగన్ హయాంలో 2023–24 నాటికి 16.2 శాతానికి పెరిగింది. దేశ జీడీపీలో అత్యధిక జీఎస్‌డీపీ వాటా ఉన్న రాష్ట్రాల్లో ప్రస్తుతం ఏపీది నాలుగో స్థానం కావడం గమనార్హం. చంద్రబాబు హయాంలో ఏపీ 14వ స్థానంలో ఉండేది. ఇక తలసరి ఆదాయం చంద్రబాబు హయాంలో 2018–19 లో రూ.1,54,031 మాత్రమే ఉంటే 2023–24 నాటికి ఏకంగా రూ.2,19,518కి పెరిగింది. మళ్లీ జగన్ వస్తేనే రాష్ట్రం సుస్థిరాభివృద్ధి వైపు దూసుకెళుతుందని ప్రజలు బలంగా నమ్ముతున్నారు.

రాష్ట్రం రూపురేఖలు సమూలంగా మారాలంటే..

సువిశాలమైన 974 కి.మీ.ల పొడవైన తీర ప్రాంతం రాష్ట్రం సొంతం. తీరం మన బలం అంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు దాన్ని ఎన్నడూ ఉపయోగించుకోవాలనే ఆలోచన చేయలేదు. సీఎం జగన్ రూ.16,500 కోట్లతో నాలుగు పోర్టులు(కాకినాడ గేట్‌వే, మూలపేట, రామాయపట్నం, మచిలీపట్నం) నిర్మిస్తున్నారు. పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను నెలకొల్పుతున్నారు. ఇవన్నీ పూర్తయితే పోర్టు ఆధారిత పరిశ్రమలు స్థాపించేందుకు దిగ్గజాలు క్యూ కట్టడం ఖాయం. రామాయపట్నం పోర్టు వద్ద ఇండోసోల్ పరిశ్రమ అప్పుడే ఉత్పత్తులను ప్రారంభించడమే అందుకు నిదర్శనం. మళ్లీ జగన్ వస్తేనే పోర్టు ఆధారిత పరిశ్రమలు వస్తాయని, రాష్ట్రం రూపురేఖలు సమూలంగా మారుతాయని యువత బలంగా నమ్ముతోంది.

ఉద్యోగ, ఉపాధి విప్లవం మరింత గొప్పగా కొనసాగాలంటే..

పారదర్శక పారిశ్రామిక విధానంతో సులభతర వాణిజ్యం(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో సీఎం జగన్ ఏటా రాష్ట్రాన్ని దేశంలో నంబర్ వన్ స్థానంలో నిలిపారు. విశాఖలో 2023 మార్చిలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో రూ.13,08,887 కోట్లతో పెట్టుబడి పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఒప్పందాలు చేసుకున్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేస్తూ 59 నెలల్లో రూ.3,02,085 కోట్ల పెట్టుబడి పెట్టారు. ఎంఎస్‌ఎంఈలకు పోత్సాహకాలు ఇవ్వడంతో వాటి సంఖ్య 1.9 లక్షల నుంచి ఏకంగా 7 లక్షలకు పెరిగింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 58.22 లక్షల మంది ఉపాధి పొందారు. మళ్లీ జగన్ వస్తేనే భారీ పరిశ్రమలు వస్తాయని, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉంటాయని యువత బలంగా విశ్వసిస్తోంది.

మహాస్వప్నం సాకారం కావాలంటే..

విశాఖపట్నం సమీపంలో రూ.5 వేల కోట్లతో భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును సీఎం జగన్ నిర్మిస్తున్నారు. ఒకవైపు విదేశీ వర్సిటీల నుంచి ప్రతిష్టాత్మక కోర్సులు పూర్తి చేసిన రాష్ట్ర యువత.. బలమైన గ్రోత్ ఇంజిన్ లాంటి విశాఖ నగరం.. ఐకానిక్ బిల్డింగ్‌లు.. పెద్ద ఎత్తున వచ్చే ఐటీ, ఇతర పరిశ్రమలు.. కోస్తా తీరమంతటా విరాజిల్లేలా 'బ్లూ' ఎకానమీని ఆవిష్కరించడానికి సీఎం జగన్ నడుం బిగించారు. మళ్లీ వైఎస్ జగన్ వస్తేనే ఆ మహాస్వప్నం సాకారమై రాష్ట్రం అన్ని రంగాల్లో దేశంలో అగ్రగామిగా నిలుస్తుందని సామాన్యుల నుంచి మేధావుల వరకూ బలంగా విశ్వసిస్తున్నారు.

ఆమ్ ఆద్మీకి 10 గ్యారంటీలు

కేజ్రీవాల్ సొంత మేనిఫెస్టో

- చైనా ఆక్రమించిన మన భూభాగం వెనక్కి
- యువతకు ప్రతిఏటా 2 కోట్ల ఉద్యోగాలు
- దేశవ్యాప్తంగా పేదలకు ఉచిత విద్యుత్
- ప్రజలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం
- 'ఇండియా' అధికారంలోకి వస్తే వచ్చే ఐదేళ్లలో అమలు
- హామీలపై కూటమి పార్టీలను ఒప్పిస్తానని వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ 'కేజ్రీవాల్ కీ గ్యారంటీ' పేరిట దేశ ప్రజలకు 10 హామీలు ఇచ్చారు. కేంద్రంలో 'ఇండియా' కూటమి అధికారంలోకి రాగానే ఈ హామీలు అమలు చేస్తామని ప్రకటించారు. మోదీ కీ గ్యారంటీ కావాలో, కేజ్రీవాల్ కీ గ్యారంటీ కావాలో దేశ ప్రజలు తేల్చుకోవాలని చెప్పారు. కేజ్రీవాల్ కీ గ్యారంటీ అంటే ఒక బ్రాండ్ అని స్పష్టం చేశారు. ఆయన ఆదివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. తాను ఇచ్చిన హామీలన్నీ దేశాన్ని బలోపేతం చేయడానికి ఉద్దేశించినవేనని తెలిపారు. రానున్న ఐదేళ్ల కాలంలో ఈ పది హామీల అమలును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. తాను ఇస్తున్న పది హామీలపై 'ఇండియా' కూటమిలోని భాగస్వామ్యపక్షాలతో చర్చించలేదని అన్నారు. ఈ హామీలను నెరవేర్చేలా కూటమిలోని పార్టీలను ఒప్పిస్తానని కేజ్రీవాల్ వెల్లడించారు. ఢిల్లీ ప్రజలకు తాను గ్యారంటీలన్నీ అమలు చేశానని, మోదీ కీ గ్యారంటీ మాత్రం అమలు కాలేదని విమర్శించారు. ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తానంటూ మోదీ ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరలేదన్నారు.

బీజేపీ కుట్ర విఫలం

తాను అరెస్టయిన తర్వాత ఢిల్లీ, పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ప్రభుత్వాలను పడగొట్టేందుకు బీజేపీ కుట్ర పన్నిందని కేజ్రీవాల్ ఆరోపించారు. బీజేపీ కుట్ర విఫలమైందని చెప్పారు. తన అరెస్టు తర్వాత ఆప్ మరింత ఐక్యంగా మారిందని వ్యాఖ్యానించారు. ఆదివారం ఢిల్లీకి చెందిన ఆప్ ఎమ్మెల్యేలతో కేజ్రీవాల్ సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలు, ఎన్నికల వ్యూహాలపై వారితో ఆయన సుదీర్ఘంగా చర్చించారు.

'ఆప్'ను గెలిపిస్తే నేను జైలుకెళ్లను

కేజ్రీవాల్ ఆదివారం ఢిల్లీలో రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీని గెలిపిస్తే తాను జైలుకు వెళ్లబోనని తెలిపారు. చీపురు గుర్తుపై ఓటు వేయాలని ప్రజలను కోరారు. ప్రజల బాగు కోసం పనిచేసినందుకే తనను జైలుకు పంపించారని విమర్శించారు. ఢిల్లీ ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం బీజేపీకి నచ్చలేదన్నారు. తాను మళ్లీ జైలుకు వెళితే ఢిల్లీలో అభివృద్ధి నిలిచిపోతుందని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించడానికే భగవంతుడు తనను జైలు నుంచి బయటకు రప్పించాడని ప్రజలు చెబుతున్నారని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు.

హామీలు ఇవే...

1. పేదలకు ఉచిత విద్యుత్
దేశవ్యాప్తంగా నిత్యం 24 గంటలపాటు కరెంటు సరఫరా చేస్తాం. ఎక్కడా కరెంటు కోతలు ఉండవు. దేశంలోని పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తాం.

2. నాణ్యమైన విద్య
ప్రతి గ్రామంలోనూ, ప్రతి ప్రాంతంలోనూ అద్భుతమైన ప్రభుత్వ పాఠశాలలు నిర్మిస్తాం. ఈ దేశంలో పుట్టిన ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య ఉచితంగా విద్య అందిస్తాం.

3. ఉచితంగా చికిత్స
ప్రతి గ్రామంలో మొహల్లా క్లినిక్ నిర్మిస్తాం. ప్రతి జిల్లాలో అద్భుతమైన ప్రభుత్వ ఆసుపత్రులు నిర్మిస్తాం. దేశంలోని ప్రతి వ్యక్తికీ మెరుగైన చికిత్స ఉచిత అందిస్తాం.

4. చైనా ఆక్రమించిన భూమి స్వాధీనం
డ్రాగన్ దేశం చైనా ఆక్రమించిన మన దేశ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటాం. ఈ విషయంలో అవసరమైన చర్యలు చేపట్టేందుకు మన సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తాం.

5. అగ్నివీర్ యోజన నిలిపివేత
అగ్నివీర్ పథకాన్ని నిలిపివేస్తాం. అన్నిరకాల సైనిక నియామకాలు పూర్వ విధానంలోనే జరుగుతాయి. ఇప్పటివరకు అగ్నివీర్ పథకంలో రిక్రూట్ అయిన అగ్నివీరులందరినీ పర్మినెంట్ చేస్తాం.

6. పంటలకు కనీస మద్దతు ధర
స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్పీ) ఖరారు చేస్తాం. రైతులకు కనీస మద్దతు ధర చెల్లిస్తాం.

7. ఢిల్లీకి రాష్ట్ర హోదా
ఢిల్లీకి పూర్తిస్థాయి రాష్ట్ర హోదా కల్పిస్తాం.

8. యువతకు ఉద్యోగాలు
నిరుద్యోగాన్ని క్రమపద్ధతిలో తొలగించేలా చర్యలు తీసుకుంటాం. యువతకు ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తాం.

9. అవినీతి నుంచి విముక్తి
నిజాయితీపరులను జైలుకు పంపించి, అవినీతిపరులను రక్షించే బలమైన వ్యవస్థను బీజేపీ సృష్టించింది. ఈ వ్యవస్థను రద్దు చేస్తాం. ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల తరహాలో అవినీతిపై కఠిన చర్యలు తీసుకుంటాం. బీజేపీ వాషింగ్ మెషీన్‌ను ప్రజల సక్షమంలోనే బద్దలు కొడతాం.

10. స్వేచ్ఛా వాణిజ్యం
వస్తు సేవల పన్ను(జీఎస్టీ)ను సరళతరం చేస్తాం. వ్యాపారులు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తాం.



ఎన్నికల విచిత్రం

వీరి నెత్తిపైన ఉన్నది ఎన్నికల సామగ్రిలో భాగమే.. అయితే, ఇది బహుళార్థకం అన్నమాట! పోలింగ్ స్టేషన్‌కు చేరుకునేదాకా ఇలా ఎండ నుంచి కాపాడే గొడుగులా ఉపయోగపడుతుంది. జార్ఖండ్‌లోని ఖుంటీలో ఆదివారం ఎన్నికల సామగ్రితో వెళ్తున్న అధికారుల తిప్పలివి.

పీఓకేలో తీవ్ర ఘర్షణలు

ఒక పోలీసు అధికారి మృతి.. 100 మందికి పైగా గాయాలు

ఇస్లామాబాద్: ఆందోళనకారులకు, భద్రతా సిబ్బందికి మధ్య ఘర్షణలతో పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే) అట్టుడికిపోతోంది. శనివారం మొదలైన రగడ ఆదివారం మరింత ఉధృతమైంది. గోధుమ పిండి ధరలు విపరీతంగా పెరగడం, విద్యుత్ చార్జీలు మండిపోతుండడం పట్ల జనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. పాకిస్తాన్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు. వారిని అడ్డుకొనేందుకు ప్రయత్నించిన భద్రతా సిబ్బందిపై తిరగబడుతున్నారు. తుపాకులతో కాల్పులు తెగబడుతున్నారు. ఆదివారం పీఓకేలోని ఇస్లాంగఢ్‌లో జరిగిన కాల్పుల్లో ఒక పోలీసు అధికారి మరణించారు. 100 మందికిపైగా గాయపడ్డారు. వీరిలో ఎక్కువ మంది పోలీసులే ఉన్నారు. పీఓకేలో పలు ప్రాంతాల్లో మొబైల్, ఇంటర్నెట్ సేవలను అధికారులు నిలిపివేశారు. తాజా పరిస్థితిపై సమీక్షించేందుకు పాకిస్తాన్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ సోమవారం అత్యవసర సమావేశం నిర్వహించనున్నారు. పీఓకేలో పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ చెప్పారు.

ఢిల్లీలో మళ్లీ బాంబు బెదిరింపు కలకలం

అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు 8 ఆస్పత్రులకు మెయిళ్లు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఆగంతకుల బాంబు బెదిరింపులు మరోసారి కలకలానికి కారణమయ్యాయి. బాంబులతో పేల్చేస్తామంటూ ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం(ఐజీఐ)తో పాటు ఎనిమిది ఆస్పత్రులకు ఈ–మెయిల్ హెచ్చరికలు అందాయి. మే ఒకటో తేదీన దేశ రాజధాని పరిధిలోని 150కి పైగా స్కూళ్లకు కూడా ఇదేవిధంగా బెదిరింపు మెయిళ్లు అందడం, పూర్తిస్థాయిలో తనిఖీల అనంతరం అవన్నీ వట్టివేనని తేలడం తెల్సిందే. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో ఐజీఐ టెర్మినల్–3లో బాంబులు పెట్టినట్లు మెయిల్ అందడంతో తనిఖీలు చేపట్టారు. భారీగా పోలీసులను మోహరించారు. అంతకుముందు, మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఢిల్లీ ప్రాంతంలోని 8 ఆస్పత్రులకు బెదిరింపులు అందాయి. అదేవిధంగా, గుజరాత్‌లోని అహ్మదాబాద్ విమానాశ్రయానికి బెదిరింపు మెయిల్ అందింది. అప్రమత్తమైన అధికారులు హుటాహుటిన ఆయాచోట్లకు ఫైరింజన్లను పంపించారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో పోలీసు బృందాలు పూర్తి స్థాయి తనిఖీలు చేపట్టాయి. ఎటువంటి అనుమానాస్పద వస్తువులు, పేలుడు పదార్థాలు కనిపించలేదని ఢిల్లీ నార్త్‌జోన్ డీసీపీ ఎంకే మీనా చెప్పారు. బురారీ ఆస్పత్రి, సంజయ్ గాంధీ మెమోరియల్ హాస్పిటల్, దాదాదేవ్ హాస్పిటల్, గురు తేజ్ బహదూర్ హాస్పిటల్, బారా హిందూరావ్ హాస్పిటల్, జనక్‌పురి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ ఆస్పత్రి, అరుణా అసఫ్ అలీ గవర్నమెంట్ ఆస్పత్రులకు ఈ బెదిరింపులు వచ్చాయి.

ఇండోనేసియాలో వరదలు.. 37 మంది మృతి

జకార్తా: ఇండోనేసియాలోని సుమత్రా దీవిలో ఆకస్మికంగా కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా 37 మంది మృతి చెందగా మరో 18 మంది వరకు కనిపించకుండా పోయారు. మరాపి అగ్నిపర్వతం నుంచి రాళ్లు, లావా కలిసి కొండచరియలు విరిగిపడ్డాయి. దీనికి తోడు, శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలతో ఎగువ నుంచి వచ్చిన బురద ప్రవాహం నాలుగు జిల్లాల పరిధిలోని నివాసప్రాంతాలను తుడిచిపెట్టింది. వందకు పైగా నివాసాలు, భవనాలు వరదలో మునిగిపోయాయి. యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలను చేపట్టినట్లు అధికార యంత్రాంగం తెలిపింది.

జార్ఖండ్ మంత్రి ఆలంగీర్‌కు ఈడీ సమన్లు

రాంచీ: మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ నేత, జార్ఖండ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఆలంగీర్ ఆలం(70)కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సమన్లు జారీ చేసింది. ఈ నెల 14వ తేదీన రాంచీలోని జోనల్ కార్యాలయంలో హాజరవ్వాలని కోరారు. మనీలాండరింగ్ ఆరోపణలపై ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనున్నట్లు ఆదివారం ఈడీ వర్గాలు తెలిపాయి. ఆలం వ్యక్తిగత కార్యదర్శి, రాష్ట్ర అధికారి సంజీవ్ కుమార్ లాల్(52), ఆయన పనిమనిషి జహంగీర్ ఆలం(42)కు చెందిన ఫ్లాట్‌లో గత వారం ఈడీ తనిఖీల్లో రూ.32 కోట్ల లెక్కల్లో చూపని నగదు పట్టుబడిన విషయం తెల్సిందే.

జన్యుమార్పిడి పంది కిడ్నీ గ్రహీత ఆకస్మిక మృతి

బోస్టన్: ప్రపంచంలో తొలిసారిగా జన్యుమార్పిడి చేసిన పంది మూత్రపిండాన్ని అమర్చుకున్న వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందారు. అమెరికాలోని వేమౌత్ పట్టణంలో నివసించే 62 ఏళ్ల రిచర్డ్ 'రిక్' స్లేమాన్‌కు మసాచుసెట్స్ జనరల్ ఆస్పత్రిలో మార్చి నెలలో వైద్యులు విజయవంతంగా కిడ్నీని అమర్చారు. అది కనీసం రెండు సంవత్సరాలపాటు ఎలాంటి సమస్యల్లేకుండా పనిచేస్తుందని వైద్యులు ఆనాడు తెలిపారు. అయితే శనివారం ఆయన హఠాన్మరణం చెందారని వైద్యులు వెల్లడించారు. ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీ వల్లే ఆయన మృతిచెందినట్లు ఎలాంటి ఆధారాలు ఇంకా లభ్యంకాలేదని వైద్యులు స్పష్టం చేశారు. సొంత కిడ్నీ పాడవడంతో 2018 డిసెంబర్‌లోనే స్లేమాన్‌కు మరో మనిషి కిడ్నీ అమర్చారు. అయితే ఐదేళ్ల తర్వాత అది నెమ్మదిగా పాడవుతూ వచ్చింది. దీంతో గత ఏడాది నుంచి మళ్లీ డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. దీంతో వైద్యులు ఈసారి మరో ప్రత్యామ్నాయంలేక జన్యుమార్పిడి పంది కిడ్నీ అమర్చేందుకు ఆయనను ఒప్పించి రెండు నెలల క్రితం అమర్చారు.

ప్రజలే నా వారసులు

ప్రధానమంత్రి మోదీ స్పష్టీకరణ

- వికసిత్ భారత్‌ను ప్రజల చేతికి ఇవ్వాలన్నదే నా లక్ష్యం
- విపక్ష కూటమిలో కనిపించే ఉమ్మడి లక్షణం అవినీతి
- పౌరసత్వ సవరణ చట్టాన్ని ఎవరూ రద్దు చేయలేరు
- ఈసారి కాంగ్రెస్‌కు యువరాజు వయసు కంటే తక్కువ సీట్లే



బారక్‌పూర్/హుగ్లీ: ''నాకు వారసులెవరూ లేరు. దేశ ప్రజలే నా వారసులు. అభివృద్ధి చెందిన భారత్‌ను వారి చేతికి ఇవ్వాలన్నదే నా లక్ష్యం. ప్రజలను లూటీ చేసి, వారసుల కోసం కోటలు కట్టాలన్నదే ప్రతిపక్షాల అసలు లక్ష్యం. విపక్ష కూటమిలో కనిపించే ఉమ్మడి లక్షణం అవినీతి'' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. తాను బతికి ఉన్నంతకాలం పౌరసత్వ సవరణ చట్టాన్ని(సీఏఏ) ఎవరూ రద్దు చేయలేరని ఉద్ఘాటించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గతంలో ఎన్నడూ లేనన్ని తక్కువ సీట్లు వస్తాయని చెప్పారు. కాంగ్రెస్ యువరాజు(రాహుల్ గాంధీ) వయసు కంటే తక్కువ సీట్లతో ఆ పార్టీ సరిపెట్టుకోవాల్సిందేనని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పాలనలో హిందువులు ద్వితీయ శ్రేణి పౌరులుగా మారిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం బెంగాల్‌లోని బారక్‌పూర్, హుగ్లీ, హౌరా, పుర్సురాలో సార్వత్రిక ఎన్నికల ప్రచార సభల్లో ప్రధానమంత్రి ప్రసంగించారు. బిహార్ రాజధాని పాట్నాలో రోడ్ షోలో పాల్గొన్నారు. బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. ఆ పార్టీ గూండాలు సందేశ్‌ఖాలీలో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. అయినప్పటికీ నిందితులను తృణమూల్ కాంగ్రెస్ నాయకత్వం నిస్సిగ్గుగా కాపాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, ఆ పార్టీ అరాచకాలను ఎదిరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మహిళలపై హేయమైన నేరాలకు పాల్పడిన దుర్మార్గులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ప్రధాని మోదీ ప్రసంగం ఆయన మాటల్లోనే...

పౌరసత్వం ఇవ్వడానికే సీఏఏ

తృణమూల్ కాంగ్రెస్ పాలనలో బెంగాల్ రాష్ట్రం అవినీతి కేంద్రంగా, బాంబుల తయారీ పరిశ్రమగా మారిపోయింది. చొరబాట్లు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ఇక్కడి స్థానికులు మైనార్టీలుగా మారిపోతున్నారు. ప్రజలను కాపాడాల్సిన ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలకు దాసోహం అంటోంది. ప్రతి ఇంటికీ మంచినీటి సరఫరా గురించి నేను మాట్లాడితే తృణమూల్ నాయకులు బాంబుల బాష మాట్లాడుతున్నారు. హిందువులను బాగీరథీ నదిలో విసిరేస్తామంటున్నారు. వారికి ఆ అధికారం, ధైర్యం ఎక్కడి నుంచి వచ్చాయి? బెంగాల్‌లో శ్రీరాముడి పేరు పలికే పరిస్థితి లేదు. జనం శ్రీరామనవమి జరుపుకోలేకపోతున్నారు. కాంగ్రెస్ సహా విపక్ష ఇండియా కూటమి పార్టీలు ఓటు జిహాద్ పిలుపులకు మద్దతిస్తున్నాయి. బుజ్జగింపు రాజకీయాలను నమ్ముకుంటున్నాయి. పొరుగు దేశాల్లో మత వివక్షకు గురైన బాధితులకు భారతదేశ పౌరసత్వం కల్పించేందుకు పౌరసత్వ సవరణ చట్టం తీసుకొచ్చాం. ప్రతిపక్షాలు ఓటు బ్యాంకు రాజకీయాలతో ఈ చట్టాన్ని గుడ్డిగా వ్యతిరేకిస్తున్నాయి. చట్టంపై అబద్ధాల రంగు చల్లుతున్నాయి. ఈ చట్టం పౌరసత్వం ఇవ్వడానికే తప్ప లాక్కోవడానికి కాదు.

400కు పై సీట్లు.. నినాదం కాదు, తీర్మానం

లోక్‌సభ ఎన్నికల్లో మూడు దశల పోలింగ్ ముగిసింది. ఓటింగ్ బీజేపీ కూటమి పట్ల సానుకూలంగా జరిగింది. ఈసారి ఎన్నికల్లో మాకు 400కు పైగా సీట్లు వస్తాయనేది నినాదం కాదు. అది ప్రజల తీర్మానం. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేవు. కేంద్రంలో స్థిరమైన, బలమైన ప్రభుత్వం బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేతోనే సాధ్యం. ఈ ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించిన ప్రతిపక్షాలు పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేస్తున్నాయి' అని మోదీ స్పష్టం చేశారు.

జార్ఖండ్‌లో పేలుడు.. నలుగురు మృతి

మేదినీనగర్: జార్ఖండ్‌లోని పలాము జిల్లాలో జరిగిన పేలుడు ఘటనలో ముగ్గురు బాలలు సహా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. పలాము లోక్‌సభ స్థానానికి సోమవారం పోలింగ్ జరగనుండగా చోటుచేసుకున్న ఈ ఘటన సంచలనం రేపింది. బాధితులంతా ఒకే కుటుంబానికి చెందిన వారని స్థానికులు తెలిపారు. మనాటు పోలీస్ స్టేషన్ పరిధిలోని రహియా నౌదిహాలోని ఓ స్క్రాప్ దుకాణంలో ఆదివారం ఈ ప్రమాదం జరిగినట్లు ఎస్పీ రీష్మా తెలిపారు. బాంబు పేలుడుతోపాటు ఇతర కోణాల్లోనూ దర్యాప్తు కొనసాగుతోందని ఆమె వివరించారు.

నిజ్జర్ హత్య కేసులో మరో భారతీయుడి అరెస్ట్

వాషింగ్టన్/ఒట్టావా: ఖలిస్తాన్ వేర్పాటువాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో కెనడా పోలీసులు తాజాగా మరో భారతీయుడిని అరెస్ట్‌చేశారు. బ్రాంప్టన్ సిటీలో నివసించే 22 ఏళ్ల అమన్‌దీప్ సింగ్‌ను హత్య, హత్యకు కుట్ర నేరాల కింద అరెస్ట్‌చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఉదంతంలో గత వారమే ముగ్గురు భారతీయులను అక్కడి పోలీసులు అరెస్ట్‌చేశారు. అమన్‌దీప్‌ను ఒంటారియాలో మే 11న అరెస్ట్‌చేసినట్లు రాయల్ కెనడియన్ పోలీసులు ఆదివారం ప్రకటించారు. బ్రిటిష్ కొలంబియాలో 2023 జూన్ 18వ తేదీన గురునానక్ గురుద్వారా వద్ద 45 ఏళ్ల నిజ్జర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపిన విషయం తెల్సిందే. నిజ్జర్‌ను చంపిన ఇద్దరు షూటర్లలో అమన్‌దీప్ ఒకడని గ్లోబల్ న్యూస్ ఒక కథనం వెలువర్చింది.

పవార్ వర్సెస్ పాటిల్

అహ్మద్‌నగర్‌లో ప్రతీకార పోరు ● దిగ్గజాలిద్దరికీ ప్రతిష్టాత్మకమే

బీజేపీ నుంచి పాటిల్ కుమారుడు ● నీలేశ్‌కు టికెటిచ్చిన పవార్

మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ లోక్‌సభ స్థానం 2009 నుంచీ బీజేపీ కంచుకోట. అక్కడ ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్, రాధాకృష్ణ విఖే–పాటిల్ కుటుంబాల మధ్య ఇక్కడ చిరకాలంగా శత్రుత్వం కొనసాగుతోంది. ఈసారి విఖే పాటిల్ కొడుకు, సిట్టింగ్ ఎంపీ సుజయ్ మహాయుతి కూటమి తరఫున బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. మాజీ ఎమ్మెల్యే నీలేశ్ లంకేను ఎన్సీపీ(ఎస్పీ) తరఫున పవార్ తొలిసారి లోక్‌సభ బరిలో నిలిపారు. కుమారున్ని ఎలాగైనా గెలిపించుకోవాలని రాధాకృష్ణ, అగాడీ మద్దతుతో లంకేను గట్టెక్కించి పైచేయి సాధించాలని పవార్ పట్టుదలతో ఉన్నారు. అహ్మద్‌నగర్‌లో నేడు పోలింగ్ జరుగుతోంది.

సుజయ్‌కి ఈజీ కాదు

సుజయ్ ముత్తాత విఠల్‌రావు విఖే పాటిల్ దేశంలో తొలి చక్కెర సహకార కర్మాగారం స్థాపించారు. తండ్రి రాధాకృష్ణ ప్రస్తుత ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వంలో మంత్రి. 2019లో రాధాకృష్ణ బీజేపీలో చేరారు. అంతకు ముందు రెండు దశాబ్దాలు కాంగ్రెస్‌తో, అంతకుముందు శివసేనలో ఉన్నారు. 1995 నుంచి అహ్మద్‌నగర్ జిల్లాలోని షిర్డీ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. రాధాకృష్ణ తండ్రి బాలాసాహెబ్ విఖే పాటిల్ 8 సార్లు ఎంపీగా చేశారు. వాజ్‌పేయి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. సుజయ్ 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్సీపీ నేత సంగ్రామ్ జగ్తాప్‌పై భారీ మెజారిటీతో నెగ్గారు. ఎన్సీపీలో చీలిక తర్వాత ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ వర్గంతో కొనసాగుతున్న సంగ్రామ్ జగ్తాప్ ఈసారి సుజయ్ కోసం ప్రచారం చేస్తుండటం విశేషం. అజిత్ నుంచి ప్రధాని మోదీ దాకా అగ్ర నేతలు కూడా భారీ ర్యాలీలు నిర్వహించారు. అయినా ఈసారి సుజయ్ విజయం అంత తేలిక కాదంటున్నారు.


నీలేశ్


సుజయ్

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పవార్..

కిలకం

నీలేశ్ లంకే 2019 అసెంబ్లీ ఎన్నికల్లో పార్నర్ అసెంబ్లీ స్థానం నుంచి ఎన్సీపీ టికెట్‌పై గెలిచారు. 2023లో పార్టీ చీలిక తర్వాత అజిత్ వర్గంలోకి వెళ్లి తర్వాత శరద్ వర్గంలోకొచ్చారు. జిల్లా రాజకీయాలపై పట్టున్న ఆయన సుజయ్‌కి గట్టి పోటీ ఇస్తున్నారు. ఈ ఎన్నికలను ధనబలం, ప్రజాబలం మధ్య పోరుగా అభివర్ణిస్తున్నారు. కరోనా వేళ ఉచిత చికిత్స ప్రజల మనసు గెలుచుకుంది. సహకార నాయకుడు, కాంగ్రెస్ మాజీ మంత్రి బాలాసాహెబ్ థోరట్ తదితరుల మద్దతు నీలేశ్‌కు కలిసి రానుంది. శరద్ పవార్ కూడా ఇక్కడ గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుని సుడిగాలి ప్రచారం చేశారు. నీటి సరఫరా, ఆరోగ్య సంరక్షణ వంటి స్థానిక సమస్యలపైనే నీలేశ్ తన ప్రచారాన్ని కేంద్రీకరించారు. - సాక్షి, నేషనల్ డెస్క్

ఎలక్షన్ బీట్

నాలుగో దశ పోలింగ్ నేడే

రాష్ట్రాలు	10
స్థానాలు	96
జనరల్	64
ఎస్టీ	12
ఎస్సీ	20
మొత్తం అభ్యర్థులు	1,717
మొత్తం ఓటర్లు	17.7 కోట్లు
పురుషులు	8.97 కోట్లు
మహిళలు	8.73 కోట్లు

అసెంబ్లీ ఎన్నికలు	
ఆంధ్రప్రదేశ్	175 సీట్లు
ఒడిశా	28 (తొలి విడత)

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల నాలుగో దశ పోలింగ్‌కు పూర్తిస్థాయి ఏర్పాట్లతో కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. సోమవారం 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలోని 96 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలింగ్ చేపట్టనున్నారు. పశ్చిమబెంగాల్‌లోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 3,647 పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టంచేశారు. ఒక్క బర్ధమాన్ జిల్లాలోని 153 కంపెనీ(ఒక్కో దాంట్లో 100 మంది సిబ్బంది)ల కేంద్ర బలగాలను మోహరించారు.

పోటీలో ప్రముఖులు..

సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, కేంద్ర మంత్రులు గిరిరాజ్ సింగ్, నిత్యానంద్ రాయ్, రావ్‌సాహెబ్ ధన్వే, కాంగ్రెస్ నాయకుడు అధీర్ రంజన్ చౌదరి, తృణమూల్ కాంగ్రెస్ ఫైర్‌బ్రాండ్ నాయకురాలు మహువా మొయిత్రా తదితర కీలక నేతలు ఎన్నికల కదనరంగంలో దిగిన స్థానాల్లోనూ ఈరోజే పోలింగ్ జరగనుంది. మాజీ క్రికెటర్, టీఎంసీ నేత యూసుఫ్ పఠాన్, బీజేపీ నాయకురాలు పంకజ ముండే తదితరులూ ఈ దశలోనే తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారిగా..

రాష్ట్రం	సీట్లు
ఆంధ్రప్రదేశ్	25
తెలంగాణ	17
ఉత్తరప్రదేశ్	13
మహారాష్ట్ర	11
మధ్యప్రదేశ్	8
పశ్చిమబెంగాల్	8
బిహార్	5
జార్ఖండ్	4
ఒడిశా	4
జమ్మూకశ్మీర్	1

లఖీంపూర్ ఖేరీలో రైతులను వాహనంతో తొక్కించి చంపిన కేసులో నిందితుడి తండ్రి, కేంద్ర మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా సైతం ఖేరీ నియోజకవర్గంలో ఈసారి గెలుపు తలుపు తడతారో లేదో ఈ దశలోనే తేలిపోనుంది. అసన్‌సోల్ నుంచి శత్రుఘ్నసిన్హా, బీజేపీ పశ్చిమబెంగాల్ మాజీ చీఫ్ దిలీప్ ఘోష్, టీఎంసీ నేత కీర్తీ ఆజాద్ పోటీచేస్తున్న స్థానాల్లోనూ ఈరోజు పోలింగ్ జరుగుతోంది. 2019లో ఆర్టికల్ 370ని రద్దుచేశాక జమ్మూకశ్మీర్ పరిధిలోని శ్రీనగర్ లోక్‌సభకు తొలిసారిగా ఎన్నికలు జరుగుతున్నాయి. ఇక్కడ 24 మంది బరిలో నిల్చారు. ఈ 96 స్థానాలకుగాను 2019 ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి 40 చోట్ల విజయం సాధించింది. ఇప్పటికే తొలి మూడు దశల పోలింగ్ పూర్తయింది. తొలి దశలో 66.14 శాతం, రెండో దశలో 66.71 శాతం, మూడో దశలో 65.68 శాతం పోలింగ్ నమోదైంది. 2019తో పోలిస్తే ఈసారి భయంకరమైన ఎండల దెబ్బకు తొలి 3దశల్లో పోలింగ్ తగ్గిందని ఈసీ భావిస్తోంది. దేశంలో పెరిగిన అవినీతి, నిరుద్యోగం, పెచ్చరిల్లిన ధరలు, అంబానీ, అదానీల నుంచి కాంగ్రెస్‌కు టెంపోల నిండా బ్లాక్‌మనీ ఆరోపణలు, దక్షిణభారతదేశ ప్రజలు ఆఫ్రికన్ల పోలికలతో ఉంటారని కాంగ్రెస్ నేత శ్యామ్ పిట్రోడా వ్యాఖ్యలు, మణిశంకర్ అయ్యర్ పాక్ 'అణుబాంబు' మాటలపై బీజేపీ, కాంగ్రెస్ పరస్పర దూషణలు నాలుగోదశ ప్రచారంలో రాజకీయసెగలు పొగలు కక్కాయి. మధ్యప్రదేశ్‌లో ఈరోజు 8 స్థానాలలో పోలింగ్ ముగిస్తే రాష్ట్రంలోని మొత్తం 29 సీట్లకూ ఎన్నికలు పూర్తయినట్లే.

అసెంబ్లీ స్థానాలకూ..

ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం 175 ఎమ్మెల్యే స్థానాలకు, ఒడిశా అసెంబ్లీలోని 147 స్థానాలకుగాను తొలిదశలో 28 స్థానాలకు సోమవారం పోలింగ్ జరుగుతోంది.

మెజారిటీ నిధులు మైనార్టీలకు ఖర్చుపెట్టారు

సోనియా గాంధీపై అమిత్ షా ఆరోపణ

రాయ్‌బరేలీ/ప్రతాప్‌గఢ్: రాయ్‌బరేలీ ఎంపీగా సోనియాగాంధీ 70 శాతానికిపైగా ఎంపీ నిధులను కేవలం మైనారిటీలకే ఖర్చుచేశారని బీజేపీ అగ్రనేత అమిత్ షా ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్ పట్టణంలో ఆదివారం అమిత్ షా బీజేపీ ప్రచారర్యాలీలో స్థానికులనుద్దేశిస్తూ ప్రసంగించారు. ''రాయ్‌బరేలీ నియోజకవర్గంలో మీరు గాంధీల కుటుంబాన్ని దశాబ్దాలపాటు గెలిపించారు. అయినా అభివృద్ధి పనులు అంతగా జరగలేదు. అభివృద్ధిపై కాంగ్రెస్‌కు నమ్మకం లేదు. మీ కష్టాలు, కన్నీళ్లు తుడిచేందుకు వాళ్లు మీ దగ్గరకు కూడా రారు. రాయ్‌బరేలీలో బీజేపీని గెలిపిస్తే మోదీ అభివృద్ధి ప్రయాణంలో రాయ్‌బరేలీని తోడు తీసుకెళ్తాం. ఈసారి యువరాజు(రాహుల్) ఈ స్థానంలో పోటీచేస్తున్నారు. ఎంపీ నిధుల్లో మీకేమైనా దక్కాయా? మీకు అందకపోతే అవి ఎటు పోయినట్లు? అవి కాంగ్రెస్ ఓటుబ్యాంక్‌లో పడ్డాయి. ఇక్కడి ఎంపీ సోనియాగాంధీ 70 శాతానికిపైగా నిధులను మైనారిటీలకే ఖర్చుచేశారు'' అని ఆరోపించారు.

తెలంగాణలో రూ.1,500 కూడా ఇవ్వలేదు

''కేంద్రంలో గెలిస్తే పేద మహిళకు ఏటా రూ.1 లక్ష జమచేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. కాంగ్రెస్ ఇటీవలి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచింది. అక్కడ ప్రతి మహిళకు రూ.15,000 ఇస్తామని ప్రకటించారు. గెలిచి ఇన్ని నెలలైనా అక్కడ రూ.15,000కాదుకదా కనీసం రూ.1,500 కూడా ఇవ్వలేదు. రాయ్‌బరేలీ గాంధీ, నెహ్రూల కుటుంబ సీటు. నిజమేకానీ గెలిచాక సోనియా, ఆమె కుటుంబం ఎన్ని సార్లు రాయ్‌బరేలీలో పర్యటించి మీ బాగోగులు తెల్సుకున్నారు? సోనియాకు ఒంట్లో బాగోలేదు. మరి రాహుల్, ప్రియాంకలకు ఏమైంది?'' అని అమిత్ షా ప్రశ్నించారు.

పాక్ అణుబాంబుకు భయపడం

''పాక్ ఆక్రమిత కశ్మీర్ భారత్‌ది కాదా? రాహుల్ బాబా.. పాక్ అణుబాంబుకు భయపడాలనుకుంటే భయపడండి. కానీ మేం భయపడం. పీఓకేను ఎప్పటికైనా తీసుకుంటాం. కశ్మీర్‌లో ఉగ్రవాదం అంతానికి మోదీ ఆర్టికల్ 370ని రద్దుచేస్తే ఈ ఇద్దరు యువరాజులు(రాహుల్, అఖిలేశ్ యాదవ్) మళ్లీ ఆ ఆర్టికల్‌ను తీసుకొస్తారట. ఎన్నికల్లో కూటమి గెలవబోదు. గెలిచినా వారిలో ప్రధాని కాబోయేది ఎవరు?. ఇదే ప్రశ్న మీడియా అడిగితే ఏడాదికి ఒకరు ఉంటారని సమాధానం చెప్పారు. ప్రధాని పదవి పచారీ కొట్టు కాదు తరచూ మార్చడానికి'' అని షా ఆగ్రహం వ్యక్తంచేశారు.

పోలింగ్ సందర్భంగా హింసకు టీడీపీ కుట్ర

- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణా రెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం జరిగే పోలింగ్ సందర్భంగా పలు నియోజకవర్గాల్లో హింసకు పాల్పడేందుకు టీడీపీ కుట్ర పన్నిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో భద్రతకు ఎన్నికల సంఘం మరిన్ని పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమైన నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు, ఏజెంట్ల ద్వారా హింసకు ఆ పార్టీ ప్లాన్ చేసిందని తెలిపారు. దీనికి సంబంధించి చంద్రబాబు ఇప్పటికే ఆపార్టీ నాయకులకు డైరెక్షన్ ఇచ్చినట్టుగా తమ వద్ద సమాచారం ఉందన్నారు. హింసకు పాల్పడి, ఆ ఘటనలకు అనుకూల మీడియాలో విస్తృత ప్రచారం కల్పించి, ఆ నెపాన్ని వైఎస్సార్‌సీపీపై నెట్టివేయాలని వ్యూహం పన్నారని తెలిపారు. ఇలా తప్పుడు ప్రచారంతో ఓటర్లను ప్రభావితం చేయడానికి, పోలింగ్ స్టేషన్లలో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు యత్నిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఓటమి తప్పదన్న ఫ్రస్టేషన్లో టీడీపీ ఇలాంటి కుట్రలు పన్నుతోందని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఎన్నికల సంఘం, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఎలాంటి కవ్వింపు చర్యలకు టీడీపీ పాల్పడినా, హింసను ప్రేరేపించేందుకు యత్నించినా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, ఏజెంట్లు, శ్రేణులు పూర్తి సంయమనంతో వ్యవహరించాలని కోరారు. పోలింగ్ అత్యంత ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకరించాలని చెప్పారు.

పులివెందులలో హింసకు టీడీపీ పన్నాగం

కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి కడప: హింసకు తావు లేకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా పోలింగ్ జరిగేలా ఎన్నికల కమిషన్(ఈసీ) చర్యలు తీసుకోవాలని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. పోలింగ్‌లో హింసకు టీడీపీ కుట్ర చేస్తోందని తెలిపారు. పోలింగ్ ప్రారంభంలోనే వైఎస్సార్ జిల్లా పులివెందులలో మొదటగా హింస రేపాలన్నది టీడీపీ పన్నాగమన్నారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి గలాటాలు చేయాలని ప్రణాళిక రూపొందించుకుందన్నారు. ఇప్పటికే చంద్రబాబు దీనికి సంబంధించి డైరెక్షన్ ఇచ్చారని, వారి అనుకూల అభ్యర్థులు, ఏజెంట్లతో హింసకు యత్నిస్తోందని తెలిపారు. అనుకూల మీడియాలో ఆ ఘటనలకు విస్తృత ప్రచారం కల్పించి, వైఎస్సార్‌సీపీనే చేయించినట్లుగా తప్పుడు ప్రచారానికి కుట్ర జరిగిందన్నారు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు, వ్యక్తిత్వ హననానికి పాల్పడేందుకు ఈ వ్యూహం రచించారన్నారు. స్వేచ్ఛగా, నిర్భయంగా ఎన్నికలు జరిగితే టీడీపీకి నష్టమని, అందుకే ఇలాంటి కుట్రలకు తెర తీస్తున్నారన్నారు.



పెత్తందారులకు మళ్లీ షాకే!

సాధికారత, సంక్షేమాభివృద్ధికి జై కొట్టేందుకు జనం సిద్ధం

- ఊరూరా కళ్లెదుటే అభివృద్ధి.. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు
- మళ్లీ జగన్ వస్తేనే ఈ సంక్షేమాభివృద్ధి కొనసాగుతుందని బలంగా నమ్ముతున్న జనం
- సాధికారత కోసం వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు మేమంతా సిద్ధమంటున్న పేదలు
- రైతన్నను చేయి పట్టుకుని నడిపిస్తున్న ఆర్బీకేలు.. అండగా రైతు భరోసా
- ఇన్‌పుట్ సబ్సిడీ, మద్దతు ధర, నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు
- సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ఉన్న ఊళ్లోనే సులభంగా పనులు
- ఆరోగ్య శ్రీ, విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్‌తో ఆరోగ్యానికి కొండంత అండ
- చేయూత, ఆసరా పథకాలతో కుటుంబానికి అండగా నిలబడ్డ మహిళలు
- అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యాదీవెన, వసతి దీవెన, ఇంగ్లిష్ మీడియంతో చదువుల దిగులు లేదిక
- 4 పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లతో తీర ప్రాంతం కళకళ
- పునర్‌వ్యవస్థీకరణతో 13 నుంచి 26కు పెరిగిన జిల్లాలు.. పెరిగిన ఉపాధి అవకాశాలు
- టాటాలు, బిర్లాలు, అదానీలు, అంబానీలు, మిట్టల్, సంఘ్వీ, భజాంకా, భంగర్‌లు రాష్ట్రంలో పెట్టుబడులు
- భారీ పరిశ్రమల ఏర్పాటు.. 1.9 లక్షల నుంచి 7 లక్షలకు పెరిగిన ఎంఎస్‌ఎంఈలు
- వివిధ రంగాల అభివృద్ధితో ఏకంగా 58.22 లక్షల మందికి ఉద్యోగాలు, ఉపాధి
- తగ్గిన నిరుద్యోగం, పేదరికం.. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రం నంబర్ వన్
- ఈ అభివృద్ధి పరంపర కొనసాగాలంటే మళ్లీ జగన్‌కే పట్టం కట్టాలని ప్రజలు నిర్ణయం

‘పేదలంటే మారుమూల పల్లెల్లో, పట్టణాల్లోని మురికి వాడల్లోనే ఉండాలి.. పెత్తందారుల ఇళ్లలో పనులు చేస్తూ, వాళ్లు తినగా మిగిలింది తింటూ బతకాలి.. పిల్లలను స్కూల్ లెవల్ వరకు తెలుగు మీడియంలో మాత్రమే చదివించాలి.. ఇంగ్లిష్ మీడియంలో చదివించాలనే ఆలోచనే రాకూడదు.. టెన్త్ తర్వాత పెత్తందారుల ఫ్యాక్టరీలో ప్యాకింగ్ విభాగంలో, లోడింగ్.. అన్‌లోడింగ్ సెక్షన్‌లో, సెక్యూరిటీ గార్డులుగా పెట్టుకోమని బతిమిలాడాలి.. అమరావతిలో పేదలనే వారు అసలు ఉండకూడదు.. ఎన్నో ఏళ్లుగా ఇలా కొనసాగుతోంటే ఈ సీఎం జగన్ వచ్చాక, ఆ పరిస్థితి మార్చేస్తున్నారు.. సీఎం ఇలా చేస్తే మేము చూస్తూ ఊరుకుంటామా.. కోర్టుల్లో కేసులేశాం.. లేని వివాదాలు సృష్టించాం.. భయాందోళనలు పెంచేశాం.. డబ్బు సంచులతో ఎస్‌ఆర్ ఐలను దింపాం.. పనోళ్లను పనోళ్లుగా ఉంచకుండా పేదరికాన్ని తగ్గించేస్తే మేమంతా ఏమైపోవాలి?’ అని చంద్రబాబు ఆయన పెత్తందారుల గ్యాంగ్ ఊగిపోతోంది.

ఈనాడు రామోజీ పరిస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఎన్ని మందులు వాడినా హిస్టీరియా తగ్గడం లేదు. రాత్రిళ్లు ఉన్నట్టుండి లేచి కూర్చుంటున్నారట. అదిగో జగన్.. జగన్.. మళ్లీ వస్తున్నాడు అంటూ కలవరిస్తున్నారట! తప్పకుండా ఆయన కల నెరవేరుతుంది. పేదరికంపై, పేదలపై, దిగువ మధ్యతరగతి వర్గాలపై విషం నింపుకున్న ఈ పెత్తందారులు ఫలానా మంచి పని చేశామని ఒక్కటంటే ఒక్కటి చెప్పుకోలేని దుస్థితిలో నిస్సిగ్గుగా మంచి చేస్తున్న ప్రభుత్వంపై దుర్మార్గంగా నిందలు వేస్తున్నారు. దుష్ప్రచారాలు చేస్తున్నారు. వీరందరి వలువలూడదీసి తరమడానికి ఓటర్లంతా సిద్ధంగా ఉన్నారు. ఊరూరా అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు బారులు తీరి కనిపిస్తున్నారు. ఆ రెండు బటన్లు ఎప్పుడెప్పుడు నొక్కుదామా అని వేచి చూస్తున్నారు.

సాక్షి, అమరావతి: పెత్తందార్లకు మళ్లీ షాక్ ఇచ్చేందుకు పేదలు, దిగువ మధ్య తరగతి ప్రజలంతా సిద్ధమయ్యారు. ఇంటింటా అభివృద్ధి కొనసాగాలని.. రాష్ట్రం ప్రగతిపథంలో దూసుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నారు. మళ్లీ జగన్ వస్తేనే సంక్షేమాభివృద్ధి పథకాలు కొనసాగుతాయని బలంగా నమ్ముతున్నారు. సాధికారత కోసం ఎన్నికల మహా సంగ్రామంలో కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియలో ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్‌లు నొక్కి ఓట్లేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించేందుకు పేదలంతా సిద్ధమయ్యారు. గత ఎన్నికల్లో 50 శాతం ఓట్లు.. 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో అభ్యర్థులను గెలిపించి, వైఎస్సార్‌సీపీకి ప్రజలు చారిత్రక విజయాన్ని అందించారు. 2019 మే 30న సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. తొలి ఏడాదిలోనే 95 శాతం హామీలు అమలు చేసి ఎన్నికల మేనిఫెస్టోకు సరైన నిర్వచనం చెప్పారు. 59 నెలల్లో 99 శాతం హామీలు అమలు చేశారు. ఎలాంటి వివక్ష చూపకుండా, లంచాలకు తావులేకుండా.. అర్హతే ప్రామాణికంగా అందరికీ సంక్షేమ పథకాలు అందించారు. సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలో పేదల ఖాతాల్లో రూ.2.70 లక్షల కోట్లు జమ చేశారు. నాన్ డీబీటీ పథకాల ద్వారా మరో రూ.1.79 లక్షల కోట్ల ప్రయోజనాన్ని చేకూర్చారు. డీబీటీ, నాన్ డీబీటీ కలిపి పేదలకు మొత్తం రూ.4.49 లక్షల కోట్ల లబ్ధి చేకూరింది. వాటిని సద్వినియోగం చేసుకున్న పేదలు.. జీవనోపాధులను మెరుగుపర్చుకుని తమ కాళ్లపై తాము నిలబడగలుగుతున్నారు. రాష్ట్రంలో పేదరికం చంద్రబాబు హయాంలో 11.77 శాతం ఉంటే.. 2022–23 నాటికి అది 4.19 శాతానికి తగ్గడమే అందుకు నిదర్శనం.

సాధికారత కోసం పేదలంతా సిద్ధం

విభజన తర్వాత 2014 ఎన్నికల్లో వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తానని, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని.. ఇంటికో ఉద్యోగం లేదా నెలకు రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానంటూ 650కిపైగా హామీలు ఇచ్చిన చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసింది. 2019 ఎన్నికల్లో వేరుపడిన ఆ పార్టీలు ఇప్పుడు మళ్లీ కూటమిగా ఏర్పడి పోటీ చేస్తూ అలవికాని హామీలు ఇచ్చాయి. ఆ హామీల అమలు సాధ్యం కాదని నిర్ధారణకు వచ్చిన బీజేపీ.. టీడీపీ కూటమి మేనిఫెస్టోను ముట్టుకోవడానికి కూడా వెనుకంజ వేసింది. సీఎం జగన్ గత ఎన్నికల తరహాలోనే అమలు చేయదగిన హామీలతోనే కేవలం రెండే రెండు పేజీలతో మేనిఫెస్టోను విడుదల చేశారు. కూటమికి ఇక్కడ సారథ్యం వహిస్తున్న చంద్రబాబు.. చెప్పిన మాటపై నిలబడడని, మోసం చేస్తారనే అభిప్రాయం ప్రజల్లో బలంగా నాటుకు పోయింది. చెప్పిన హామీలన్నీ అమలు చేసిన సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం కుదిరింది. దీంతో సాధికారత కోసం మళ్లీ జగనే రావాలని పేదలంతా బలంగా కోరుకుంటున్నారు.

భవిష్యత్తు మరింత గొప్పగా మార్చుకునేందుకు..

- రాష్ట్రంలో 70 శాతం ప్రజల జీవనాధారం వ్యవసాయం. సీఎం జగన్ గ్రామాల్లో ఆర్బీకే (రైతు భరోసా కేంద్రాలు)లను ఏర్పాటు చేసి, విత్తు నుంచి విక్రయం దాకా రైతుల చేయిపట్టి నడిపిస్తున్నారు. రైతు భరోసా ద్వారా పెట్టుబడి సహాయం.. ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తున్నారు. రైతులపై ఎలాంటి భారం పడకుండా ఉచిత పంటల బీమా పథకాన్ని తెచ్చారు. పండించిన పంటల ఉత్పత్తులను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టపోతే.. ఆ సీజన్ ముగిసేలోగా పరిహారాన్ని అందించి రైతులకు దన్నుగా నిలుస్తున్నారు. తద్వారా వ్యవసాయాన్ని పండుగగా మార్చారు.
- గ్రామ, వార్డు సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలు సొంత ఊళ్లోనే సులభంగా అన్ని పనులను చక్కబెట్టుకుంటున్నారు. ఆరోగ్యశ్రీ వైద్య ఖర్చుల పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం.. జగనన్న సురక్ష, విలేజ్ హెల్త్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రజల ఆరోగ్యానికి సీఎం జగన్ భరోసా కల్పించారు. పునర్‌వ్యవస్థీకరణ ద్వారా 26 జిల్లాలను ఏర్పాటు చేశారు.
- వైఎస్సార్ చేయూత, ఆసారాతో మహిళలకు సీఎం జగన్ అండగా నిలిచారు. ఆ పథకాల ద్వారా అందించిన ఆర్థిక సాయంతో ఆదాయాలను పెంచుకున్న మహిళలు ఆర్థిక సాధికారత సాధించారు.
- ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి ఆధునీకీకరించిన సీఎం జగన్.. ఇంగ్లిష్ మీడియం బోధనను ప్రవేశపెట్టారు. అమ్మ ఒడి, విద్యా కానుక, గోరుముద్ద, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలకు పెద్దపీట వేయడంతో విద్యా సాధికారత దిశగా ప్రజలు అడుగులు వేస్తున్నారు.
- సీఎం జగన్ పారదర్శక పారిశ్రామిక విధానాన్ని తెచ్చారు. సులభతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో దేశంలో ఏటా రాష్ట్రం నంబర్ వన్ స్థానంలో నిలవడమే అందుకు నిదర్శనం. దాంతో రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేందుకు అంబానీ, అదానీ, టాటా, బిర్లా, భజాంకాలు, భంగర్‌లు, సింఘ్వీ, మిట్టల్ వంటి దిగ్గజాలు వచ్చారు. దాంతో భారీ పరిశ్రమలు వస్తున్నాయి. ఎంఎస్‌ఎంఈలకు ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా వాటి సంఖ్య 1.9 లక్షల నుంచి 7 లక్షలకు పెరిగింది. నాలుగు పోర్టులు, పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను నిర్మిస్తున్నారు. వాటికి అనుబంధంగా భారీ ఎత్తున పరిశ్రమలు రానున్నాయి. ఇప్పటికే రామాయపట్నం పరిసర ప్రాంతాల్లో వస్తున్న భారీ పరిశ్రమలే అందుకు నిదర్శనం. తద్వారా ఉపాధి అవకాశాలు బాగా పెరిగాయి. సంక్షేమ పథకాల వల్ల స్వయం ఉపాధి పెరిగింది. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు, స్వయం ఉపాధి ద్వారా 58.22 లక్షల మంది ఉద్యోగాలు, ఉపాధి పొందారు. ఇంటింటి భవిష్యత్తు, రాష్ట్ర రూపు రేఖలు మరింత గొప్పగా మారాలంటేమళ్లీ జగనే రావాలని పేదలంతా బలంగా కోరుకుంటున్నారు.

తోడు దొంగలు

కుట్రలు, కుతంత్రాలు, అవినీతే చంద్రబాబు, రామోజీ నీతి

40 ఏళ్లుగా ఒకరికొకరు సహకరించుకుంటూ వేల కోట్ల సామ్రాజ్యాల నిర్మాణం

- జీజే రెడ్డి దగ్గర గుమస్తాగా పనిచేసి ఆయన కంపెనీ మార్గదర్శిని కొట్టేసిన రామోజీ
- సొంత మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి టీడీపీని కబ్జా చేసిన చంద్రబాబు
- ఆది నుంచి ఒకరి దోపిడీకి ఒకరు పూర్తి సహకారం.. రామోజీ సామ్రాజ్య విస్తరణకు సహకరించిన చంద్రబాబు
- టీడీపీ కబ్జాలు, అవినీతి, అక్రమాలకు అండదండలందించిన రామోజీ
- బాబు ఏలేరు, ఐఎంజీ భారత్ స్కామ్‌లను బయటకు తెలియనివ్వని రామోజీ
- 2014-19 మధ్య రూ.లక్షల కోట్ల కుంభకోణాలకు సహకారం
- మళ్లీ ప్రజల మెదళ్లలో విషం నింపుతూ అధికారాన్ని చేజిక్కించుకొనే యత్నం



సాక్షి, అమరావతి:

నారా చంద్రబాబునాయుడు, చెరుకూరి రామోజీరావు.. అందరికీ చిరపరిచితమైన ఈ తోడు దొంగలు పైకి అత్యంత సత్యవంతులుగా, నీతీ నిజాయితీల గురించి ఒకరు మాటల్లో, మరొకరు రాతల్లో లెక్కలేనన్ని పాఠాలు చెబుతూ సమాజ నిర్దేశకులుగా కనిపిస్తారు. వారి చరిత్ర చూస్తే అంతా అవినీతి, అక్రమాలే. కుట్రలు, కుతంత్రాలు, మోసాలు, నయవంచనలే పరమపద సోపానాలుగా ఎదిగిన వారు. రాజకీయ నాయకుడిగా చంద్రబాబు, మీడియా అధిపతిగా రామోజీరావు 40 ఏళ్లుగా ఒకరికొకరు సహకరించుకుంటూ రెండు తెలుగు రాష్ట్రాల్లో వేల కోట్ల సామ్రాజ్యాలు నిర్మించుకున్నారు. రాజకీయంగా చంద్రబాబును ఉన్నత స్థాయిలో నిలబెట్టడానికి రామోజీరావు అన్ని రకాలుగా అండదండలు అందించారు. రామోజీ వ్యాపార సామ్రాజ్య విస్తరణకు చంద్రబాబు బరితెగించి సహకరించారు. చంద్రబాబు కోసం రామోజీ తన మీడియాను విశృంఖలంగా ఉపయోగించారు. ఈ ఎన్నికల్లోనూ సిగ్గు విడిచి, బట్టలూడదీసుకుని మరీ అబద్ధాల యుద్ధం చేశారు.

జీజే రెడ్డి అనే ప్రముఖుడి దగ్గర గుమస్తాగా చేరి ఆయన ఆస్తులన్నింటినీ కొట్టేసిన ఘరానా దొంగ రామోజీ. మార్గదర్శి చిట్‌ఫండ్స్, ఈనాడు కూడా జీజే రెడ్డి ఆలోచనలే. జీజే రెడ్డిపై దేశద్రోహం కేసు నమోదవడంతో ఆయన దేశం విడిచి పారిపోయారు. దీంతో ఆయన ఆస్తులన్నింటినీ రామోజీరావు సొంతం చేసుకున్నారు. మార్గదర్శిలో రామోజీ వాటా కేవలం రూ.10 మాత్రమే. మిగిలిన పెట్టుబడి అంతా జీజే రెడ్డిదే. దీనిపై ఇటీవల ఆయన కుమారుడు యూరీ రెడ్డి కోర్టుకెక్కిన విషయం తెలిసిందే. జీజే రెడ్డే కాదు.. సొంత బంధువులను కూడా మోసం చేసి విజయవాడ, విశాఖలో వారి ఆస్తులు కొల్లగొట్టారు రామోజీ. ఇలా దోపిడీ మార్గాల్లో సమకూర్చుకున్న ఆస్తులను రక్షించుకునేందుకు రాజకీయాలను ఉపయోగించుకున్నారు. ఆ క్రమంలోనే తెలుగుదేశం పార్టీని గుప్పిట్లో పెట్టుకున్నారు. దీనికి ఎన్టీఆర్ అంగీకరించకపోవడంతో అధికారం కోసం గుంట నక్కలా వేచి చూస్తున్న చంద్రబాబును చేరదీశారు. ఎన్టీఆర్‌ను గద్దె దించడానికి చంద్రబాబుతో కలిసి కుట్ర పన్నారు. రామోజీ అండదండలతో చంద్రబాబు సొంత మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, తెలుగుదేశం పార్టీని చేజిక్కించుకున్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక రామోజీరావు వ్యాపారాలకు అన్ని రకాలుగా సహకరించారు. చంద్రబాబు అవినీతికి రామోజీ సహకరించారు. ఈనాడు విస్తరణ, మార్గదర్శి ద్వారా వేల కోట్లు దోచుకోవడానికి, ఫిలిం సిటీకి వేలాది ఎకరాల పేదల భూములు కొట్టేయడానికి సహకరించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే రామోజీ సంస్థలు వేల కోట్లకు ఎదిగాయి.

చంద్రబాబు ఏలేరు, ఐఎంజీ భారత్ కుంభకోణాలకు మద్దతు

చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు చేసిన కుంభకోణాలు, అక్రమాలకు రామోజీ కప్పెట్టేశారు. బాబు ఎంత భయంకరమైన స్కాములు చేసినా ఈనాడులో ఒక్క అక్షరం రాయలేదు సరికదా, ఆయన్నో గొప్ప విజనరీగా చిత్రీకరించారు. ఐఎంజీ భారత్, ఏలేరు భూముల కుంభకోణాలు బయటకు రాకుండా తొక్కిపెట్టారు. హైదరాబాద్‌లో స్టేడియంలు నిర్మించి, ఒలింపిక్ క్రీడాకారులను తయారు చేసే పేరుతో ఐఎంజీ భారత్‌కి 2004లో అపద్ధర్మ సీఎంగా ఉండగా చంద్రబాబు 800 ఎకరాలను అక్రమంగా కేటాయించాడు. దీన్ని కోర్టు తప్పు పట్టింది. ఆ భూములు ప్రభుత్వానికే చెందుతాయని ఇటీవల తీర్పు కూడా ఇచ్చింది. ఇలాంటి ఎన్నో అక్రమాలను కప్పి పుచ్చి చంద్రబాబును గొప్ప నేతగా చూపించే ప్రయత్నం చేశారు రామోజీ. 2004లో ఓడిపోయిన తర్వాత కూడా చంద్రబాబుకు రాజకీయంగా సహకారం అందించారు.

రామోజీ బంటుగానే చంద్రబాబు

తన రాజకీయ ఎదుగుదలకు ఉపయోగపడిన రామోజీకి చంద్రబాబు ఎప్పుడూ బంటుగానే ఉన్నారు. ఈనాడు గ్రూపు ఆర్థిక కష్టాల్లో చిక్కుకుని దివాలా తీసే పరిస్థితులకు వెళ్లినప్పుడు చంద్రబాబు సహకారం అందించారు. మార్గదర్శి అక్రమాలు బయటపడి రామోజీ జైలుకు వెళ్లే పరిస్థితి వచ్చినప్పుడు ఆయన కోసం నిలబడి తెర వెనుక నుంచి మద్దతు పలికారు. దీనికి ప్రతిగా రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు 2014లో మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు రామోజీ శాయశక్తులా ప్రయత్నించారు. 2014–19 సంవత్సరాల మధ్య ప్రపంచమే నివ్వెరపోయేలా జరిగిన అమరావతి భూముల కుంభకోణం సహా ఆయన చేసిన అరాచకాలన్నింటినీ రామోజీ కప్పిపుచ్చారు. ఈ ఎన్నికల్లో మళ్లీ చంద్రబాబును గెలిపించేందుకు సిగ్గు ఎగ్గు వదిలేసి ప్రజల మెదళ్లలో విషం ఎక్కించేందుకు సర్వశక్తులూ ఒడ్డారు. ఇలా ఆది నుంచి తోడు దొంగల్లా చంద్రబాబు, రామోజీ ఒకరికొకరు ఆలంబనగా నిలబడి మోసాలు, కుట్రలతో ప్రజలను వంచిస్తూనే ఎదిగారు. ఇప్పుడు కూడా వాటినే అస్త్రాలుగా ఉపయోగించుకుని ఈ దొంగలిద్దరూ మళ్లీ అధికారంలోకి వచ్చి దోపిడీని కొనసాగించాలని తహతహలాడుతున్నారు. కానీ నమ్మకం, విశ్వసనీయత ముందు నయవంచనలకు నిలువెత్తురూపాలైన ఈ ఇద్దరు రాక్షసుల ఆటలు సాగే పరిస్థితులు ఏమాత్రం కనిపించడం లేదు.

అవినీతి సొమ్ముకు హెరిటేజ్ ముసుగు

అఫిడవిట్ల సాక్షిగా చంద్రబాబు, లోకేశ్ అబద్ధాలు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఎందుకిన్ని మోసాలు? బతుకంతా అబద్ధాలేనా? మేనిఫెస్టో సరే.. అఫిడవిట్లో కూడా అబద్ధాలేనా? తరచి చూస్తే తండ్రీ కొడుకులు చంద్రబాబు నాయుడు... లోకేశ్ నాయుడు ఇద్దరూ ఇప్పుడే కాదు... 2019లోనూ అబద్ధాల అఫిడవిట్లే వేశారు. 2019లో హెరిటేజ్ షేర్ విలువ రూ.260.81 ఉండగా... అఫిడవిట్లో మాత్రం ఏకంగా రూ.511.90 ఉన్నట్టుగా చూపించారు. పైపెచ్చు వీళ్లకు ఉన్నవి ఒకటీరెండూ షేర్లు కాదు. 2019లో చంద్రబాబుకు 1,06,61,652 షేర్లు... లోకేశ్ నాయుడికి 4,73,800 షేర్లు ఉన్నాయి. అప్పట్లో వీటి వాస్తవ విలువ చంద్రబాబుది రూ.278 కోట్ల పైచిలుకు కాగా... లోకేశ్‌ది రూ.12.40 కోట్లు. కానీ చంద్రబాబు తన షేర్ల విలువను ఏకంగా రూ.545 కోట్లుగా చూపించారు. తానేమీ తక్కువ తినలేదన్నట్లు లోకేశ్ కూడా తన షేర్ల విలువను రూ.24.25 కోట్లుగా చూపించారు. అంటే ఇద్దరూ కలిసి తమ హెరిటేజ్ షేర్ల విలువను దాదాపు రూ.279 కోట్లు ఎక్కువగా చూపించారు. ఇదంతా ఎందుకో తెలుసా?

ఐటీ కళ్లు కప్పడానికి ముసుగు...

నిజానికి 2014 నుంచి 2019 వరకూ చంద్రబాబు నాయుడు ఈ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్నారు. ఆ సమయంలో ఆయన స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం సహా పలు కుంభకోణాలకు తెరతీశారు. ఈ స్కాముల్లో చాలా నిధులు రకరకాల మార్గాల్లో మళ్లీ తన దగ్గరికే రప్పించుకున్నారు. ఈ సొమ్ముతో ఆస్తులు పెంచుకున్నా... అవేవీ రికార్డుల్లో కనపడకుండా జాగ్రత్త పడ్డారు. చాలా ఆస్తుల్ని బినామీల పేరిట పెట్టారు. అయితే షాపుర్జీ పల్లోంజీ సహా కొన్ని కంపెనీల నుంచి తీసుకున్న డబ్బులు నేరుగా చంద్రబాబు ఖాతాల్లోకే రావటంతో దానికి ఐటీ శాఖ నోటీసులు కూడా జారీ చేసింది. ఆ నోటీసులకు జవాబిచ్చేటపుడు కూడా... నాకు నోటీసులిచ్చే అధికారం మీకు లేదంటూ బుకాయించడం... అదే కారనంతో కోర్టులో సవాల్ చేయటం తప్ప ఆదాయానికి సంబంధించిన సమాధానాలేవీ ఇవ్వలేదు. అయితే ఆ డబ్బులు పెరిగిన ఆస్తుల్లో, తన బ్యాంకు ఖాతాల్లో స్పష్టంగా కనిపిస్తూ ఉండటంతో వాటికి ఈ హెరిటేజ్ ముసుగు వేసినట్లుగా నిపుణులు చెబుతున్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో అధికారికంగా అన్ని ఆస్తులు ఎలా పెరిగాయనే ప్రశ్న వస్తుంది కాబట్టి... హెరిటేజ్ షేర్లకు అంత విలువ లేకపోయినా వాటి పేరిట చూపిస్తే సరిపోతుందని ఈ పన్నాగం పన్నినట్లు ఆర్థిక నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఈసారి అఫిడవిట్లో షేర్ల సంఖ్య పెంచేసి మరో అక్రమం...

ఇలాంటి తప్పుల్ని, మోసాల్ని సహించలేమంటూ 2019 ఎన్నికల్లో జనం బాబుకు బుద్ధి చెప్పి ఓడించటం అందరికీ తెలిసిందే. కాకపోతే మళ్లీ ఈ సారి ఎన్నికల్లో మునుపటిలాగే షేరు విలువను ఎక్కువ చేసి చూపిస్తే ఇబ్బందులు ఎదురవుతాయని అనుకున్నారో ఏమో... షేర్ల సంఖ్యను పెంచి చూపించారు. అప్పట్లో ఉన్న షేర్ల సంఖ్య 1,06,61,652 కాగా... ఇపుడా షేర్ల సంఖ్య ఏకంగా 2,26,11,525కు పెరిగినట్లు చంద్రబాబు చూపించారు. అంటే రెట్టింపుకన్నా ఎక్కువన్న మాట. అప్పట్లో వీటి మొత్తం విలువను రూ.545 కోట్లుగా చూపించిన చంద్రబాబు... ఇప్పుడు 2,26,11,525 షేర్లను ఒక్కొక్కటీ రూ.337.85గా చూపిస్తూ... హెరిటేజ్‌లోని తన షేర్ల విలువ రూ.. 767.44 కోట్లుగా పేర్కొన్నారు. లోకేష్ కూడా తన షేర్లు 4,73,800 నుంచి 1,00,37,453కు పెరిగినట్లుగా... వాటి విలువ రూ.337.85 చొప్పున రూ.549 కోట్లుగా చూపించారు.

క్లుప్తంగా...

బాసరలో హైకోర్టు జడ్జి



కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేస్తున్న జస్టిస్ కె. లక్ష్మణ్

భైంసా: బాసర సరస్వతి అమ్మవారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కూనురు లక్ష్మణ్ ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా బాసర ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అక్షరాభ్యాస మండపంలో పూజలు చేసిన అనంతరం సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. పండితులు న్యాయమూర్తి కుటుంబీకులను ఆశీర్వదించి అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు.

ఈ నెల 25లోగా ఈఏపీసెట్ ఫలితాలు

ఇంజనీరింగ్ సెట్ 'కీ' విడుదల

అభ్యంతరాలకు నేటివరకు గడువు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీఎస్ఈఏపీసెట్) ఫలితాలు ఈ నెల 25వ తేదీలోగా విడుదల కానున్నాయి. దీనికోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఇంజనీరింగ్ సెట్ ప్రాథమిక కీ ని ఆదివారం విడుదల చేశారు. కచ్చితమైన సమాధానాలతో కూడిన రెస్పాన్స్ షీట్ తమ అధికారిక వెబ్‌సైట్‌లో విద్యార్థులకు అందుబాటులో ఉందని సెట్ కో–కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. దీనిపై అభ్యంతరాలుంటే సోమవారంలోగా తెలియజేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకూ ఈఏపీ సెట్ జరిగింది. అగ్రికల్చర్, ఫార్మసీ సెట్ రెస్పాన్స్ షీట్‌ను ఈ నెల 11వ తేదీన విడుదల చేశారు. రాష్ట్ర ఇంజనీరింగ్ సెట్‌కు 2,05,351 మంది, అగ్రి, ఫార్మసీ సెట్‌కు 1,15,332 మంది హాజరయ్యారు. సెట్ రిజల్ట్ రోజే కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉంది.

రేపటి నుంచి బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

- 19వ తేదీ వరకు ఉత్సవాల నిర్వహణ
- బ్రహ్మంగారి మఠంలో ఏర్పాట్లు పూర్తి

బ్రహ్మంగారిమఠం: వైఎస్సార్ జిల్లాలోని బ్రహ్మంగారి మఠంలో మంగళవారం నుంచి జగద్గురు శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు జరగనున్నాయి. ఆయన క్రీ.శ.1693 శ్రీముఖ నామ సంవత్సర వైశాఖ శుద్ధ దశమినాడు సజీవ సమాధి నిష్ఠ వహించారు. అప్పటి నుంచి ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఈ నెల 14 నుంచి 19 వరకు ఆరు రోజుల పాటు నిర్వహిస్తారు. ఈ నెల 17న వైశాఖ శుద్ధ దశమి నాడు ఆరాధన కార్యక్రమం ఉంటుంది. 18న బ్రహ్మరథోత్సవం, 19న మహాప్రసాద వినియోగం ఉంటాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా, మహారాష్ట్రల నుంచి భారీగా భక్తులు, మాలధారులు తరలిరానున్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని మఠం ఫిట్‌పర్సన్ సి.శంకరబాలాజి తెలిపారు.

డిస్టెన్స్‌లోనూ 'స్కిల్'

దూర విద్యలో నైపుణ్యంతో కూడిన కోర్సులకు యూజీసీ ప్రతిపాదనలు

- సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిన కేంద్ర విద్యాశాఖ
- విదేశీ వర్సిటీలతో ఒప్పందం కుదుర్చుకోవాలనే యోచన
- వర్చువల్ విధానంలోనూ క్లాసుల నిర్వహణకు కార్యాచరణ
- ఐదేళ్లుగా డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌కు పెరుగుతున్న ఆదరణ



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా దూర విద్య (డిస్టెన్స్)లో సమూల మార్పులపై కేంద్ర విద్యా శాఖ దృష్టి పెట్టింది. ఇందుకు సంబంధించి ఇటీవల యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చేసిన ప్రతిపాదనలకు సూత్ర ప్రాయంగా ఆమోదం లభించింది. సాధారణ యూనివర్సిటీ విద్య మాదిరిగానే డిస్టెన్స్ మోడల్‌లోనూ నైపుణ్యంతో కూడిన కొన్ని కోర్సులను ప్రవేశపెట్టాలని యూజీసీ భావిస్తోంది. సాధారణ డిగ్రీల్లో గణనీయమైన మార్పులు వస్తున్న నేపథ్యంలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌ను ఇంకా సంప్రదాయ కోర్సులతో నిర్వహించడం వల్ల ఫలితం ఉండదని పలు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో యూజీసీ నిర్వహించిన అధ్యయనంలో నేటి తరం ఉపాధి అవకాశాలు మెరుగు పరిచే కోర్సులు దూర విద్యలోనూ ఉండాలన్న అభిప్రాయం వ్యక్తమైంది. దీంతో ఏయే కోర్సులు ఉండాలి? నిర్వహణ ఎలా? సాధ్యాసాధ్యాలేమిటి? అనే అంశాలను కేంద్ర స్థాయిలో పరిశీలిస్తున్నారు. స్కిల్ కోర్సులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని యూజీసీ భావిస్తోంది. ఈ మేరకు విదేశీ వర్సిటీలతోనూ అవగాహన ఒప్పందం కుదుర్చుకోవాలని భావిస్తున్నారు.

విదేశీ ఫ్యాకల్టీతో వర్చువల్ విధానంలో..

వాస్తవానికి డిస్టెన్స్ విద్యా విధానానికి గత ఐదేళ్ల కాలంలో 13 శాతం మేర ఎన్‌రోల్‌మెంట్ (చేరికలు) పెరిగింది. దూరవిద్యలో చదివేవారి సంఖ్య 2017–18లో దేశవ్యాప్తంగా 40.32 లక్షలు ఉండగా.. 2021–22 నాటికి ఇది 45.73 లక్షలకు చేరింది. వీరిలో 20.06 లక్షల మంది మహిళలయితే, 25.67 లక్షల మంది పురుషులు. సాధారణ విద్యతో ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారు పదోన్నతుల కోసం డిస్టెన్స్ విద్యను ఎంచుకుంటున్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇంటర్, డిగ్రీతో విద్య మానేసిన వాళ్ళు, చదువు మధ్యలోనే ఆపేసి వివాహం చేసుకున్న మహిళలు, పరిస్థితుల కారణంగా కుటుంబ పోషణ కోసం ప్రైవేటు ఉద్యోగాల్లో చేరిన వాళ్ళు డిస్టెన్స్ విధానంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. దీంతో పాటు సివిల్స్, ఇతర పోటీ పరీక్షలపై దృష్టి పెట్టే వాళ్ళు కూడా ఆర్ట్స్ కోర్సులు చదివేందుకు డిస్టెన్స్ మోడ్‌ను ఎంచుకుంటున్నారు.

డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఇప్పటివరకు సంప్రదాయ డిగ్రీ, పీజీ, సర్టిఫికెట్, డిప్లొమా, ఇంటిగ్రేటెడ్, పీహెచ్‌డీ కోర్సులకు మాత్రమే పరిమితమైంది. తాజాగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో పారిశ్రామిక భాగస్వామ్యంతో కం

మరో ఏడాదిలోనే అందుబాటులోకి

ప్యూటర్ కోర్సులు, ఇతర స్కిల్ కోర్సులూ నేర్చుకునేందుకు అవకాశం కల్పించాలని భావిస్తున్నారు. వర్చువల్ విధానంలోనూ క్లాసుల నిర్వహణకు వీలుగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. కంప్యూటర్ కోర్సులను అవసరమైతే విదేశీ బోధనా సిబ్బంది ద్వారా వర్చువల్ (విదేశాల్లోనే ఉండి) విధానంలో నేర్చుకునేలా చేయాలనే ఆలోచనలో ఉన్నారు. విద్యార్థులు కూడా ఇంట్లో ఉండే ఆన్‌లైన్‌లో క్లాసుకు హాజరయ్యే వీలు కల్పించాలన్నది కొత్త ప్రతిపాదన. మరో ఏడాదిలో ఈ విధానం అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. స్కిల్ కోర్సులు అందుబాటులోకి తెస్తే డిస్టెన్స్ కోర్సుల్లో చేరేవారి సంఖ్య మరింత పెరిగే వీలుందని అటున్నారు.

డిస్టెన్స్ విద్య ద్వారా వివిధ కోర్సుల్లో 2017-18 నుంచి చేరికలు

కోర్సు	2017-18	2018-19	2019-20	2020-21	2021-22
బీఏ	1651499	1745018	1890920	1877809	1946123
ఎంఏ	677641	613161	656154	720181	824709
ఎమ్మెస్సీ	105507	74103	109459	99948	113504
బీఎస్సీ	222218	217942	251489	184916	220782
బీకాం	464807	458889	496244	531777	431282
ఎంబీఏ	156911	125980	155337	130731	120361
ఎంకాం	171093	128801	144284	223231	152082

50 శాతం చేరికలు లక్ష్యం

దేశవ్యాప్తంగా ప్రస్తుతం దూర విద్య ద్వారా చదివే వాళ్ళు 28 శాతం మాత్రమే ఉన్నారు. దీన్ని 50 శాతానికి తీసుకెళ్ళాలని యూజీసీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొన్ని పరిశ్రమలతో ఎంవో యూ చేసుకునే యోచనలో కూడా ఉన్నారు. – ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి (ఉన్నత విద్య మండలి చైర్మన్)

స్పెషల్ బస్సులెక్కడ?



ఏపీ కంటే మనవే తక్కువ సర్వీసులు!

- ఓట్ల పండక్కి స్పెషల్ బస్సుల ఏర్పాటులో టీఎస్ఆర్టీసీ తడబాటు
- 'మహాలక్ష్మి పథకం అమలుతో ఎక్కువ బస్సులు తిప్పలేక..
- చాలినన్ని బస్సుల్లేక ప్రయాణికులు అవస్థలు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో ఓట్లేసేందుకు నగరం నుంచి సొంతూళ్లకు తరలి వెళ్లే వారి కోసం స్పెషల్ బస్సులు ఏర్పాటు చేయడంలో టీఎస్ఆర్టీసీ తడబాటుకు గురైంది. ఫలితంగా సరిపడా బస్సు సర్వీసులు లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వాస్తవానికి పోలింగ్ నేపథ్యంలో అదనంగా వీలైనన్ని ఎక్కువ బస్సులు నడపాల్సి ఉండగా, తెలంగాణ ఆర్టీసీ మాత్రం 800 బస్సులను మాత్రమే తిప్పగలిగింది. ఆదివారం ఉదయం వరకు ఆ సంఖ్య కేవలం 590 మాత్రమే. 'మహాలక్ష్మి పథకానికి ఎక్కువ బస్సులు కేటాయించడంతో ఇప్పుడు చాలినన్ని సర్వీసు నడపడం సాధ్యం కాలేదని అంటున్నారు. రాష్ట్రంలో గత డిసెంబరు నుంచి ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. మహాలక్ష్మి పథకం మొదలయ్యాక బస్సుల్లో రోజువారీ ప్రయాణికుల సంఖ్య 45 లక్షల వరకు చేరింది. దీంతో బస్సులు సరిపోక నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంటున్నారు. ఇక ఈ పథకం నేపథ్యంలో ఆర్టీసీకి 4 వేల బస్సులు సమకూరాల్సి ఉండగా, ఇప్పటివరకు ఆర్టీసీకి అదనంగా సమకూరిన కొత్త బస్సులు 300 మాత్రమే. ఫలితంగానే ఎన్నికల తేదీ కోసం ఎక్కువ సంఖ్యలో బస్సులను టీఎస్ఆర్టీసీ నడపలేకపోతోందని సంస్థ వర్గాలు చెబుతున్నాయి.

హోరెత్తిన ఏపీఎస్ఆర్టీసీ బస్సులు

మరోవైపు ఏపీఎస్ఆర్టీసీ బస్సులు కనీవినీ ఎరుగని సంఖ్యలో ఇక్కడి నుంచి తరలి వెళ్లాయి. సహజంగా సంక్రాంతి, దసరా లాంటి పెద్ద పండగల వేళ నగరం నుంచి సొంత ఊళ్లకు వెళ్లే ఆంధ్ర ప్రాంత వారి కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతుంది. ఈ ఏడాది సంక్రాంతి పండక్కి 550 ప్రత్యేక బస్సులను తిప్పగా, . ఇప్పుడు ఓటేసేందుకు పెద్ద సంఖ్యలో ఏపీకి ప్రజలు తరలుతున్నందున, ఏపీఎస్ ఆర్టీసీ గత మూడు రోజుల్లో నగరం నుంచి 1200 ప్రత్యేక బస్సులను తిప్పింది. రోజువారీ ఉండే 352 రెగ్యులర్ బస్సులకు అదనంగా వీటిని నడిపింది.

సగం కూడా తిరగని టీఎస్ఆర్టీసీ సర్వీసులు

వాస్తవానికి టీఎస్ఆర్టీసీ హైదరాబాద్ నుంచి ఏపీఎస్ఆర్టీసీ బస్సుల సంఖ్య కంటే ఎక్కువగా తిప్పాల్సి ఉండగా, దానితో సమానంగా కూడా తిప్పలేని దుస్థితి నెలకొంది. బస్సులను ఏపీ వైపు ఎక్కువగా మళ్లిస్తే, స్థానికంగా బస్సుల సంఖ్య తగ్గి వాటిల్లో మహిళల రద్దీ విపరీతంగా పెరిగి ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉందని భావించి.. ఆ సర్వీసులను బాగా తగ్గించివేసింది.



దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకూ పోలింగ్ జరుగుతోంది. పోలింగ్ రోజున సెలవు ఇవ్వాలని ఎన్నికల సంఘం ఆదేశించడంతో.. ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు సెలవులు ప్రకటించాయి. అదీ పోలింగ్ సోమవారం, దానికి ముందు శని, ఆదివారాలు కూడా కలిసి రావడంతో.. చాలా మంది ఓటేస్తే వేద్దాం.. లేకుంటే సెలవులను ఎంజాయ్ చేద్దామన్నట్టుగా ప్లాన్ చేసుకుంటున్నారు. అదే ఓటేయకుంటే.. ఏదైనా శిక్ష ఉంటే బాగుంటుంది అనిపిస్తోందా? కొన్ని దేశాల్లో అలా ఓటేయకుంటే శిక్షలు ఉన్నాయి. అవేంటో చూద్దామా..

ఓటు వేయకపోతే జైలుకే!

- పెరూలో ఎన్నికలు జరిగిన తర్వాత ఓటేసినట్టుగా స్టాంప్ వేసిన కార్డు ఇస్తారు. ఆ కార్డు చూపితేనే ప్రభుత్వం నుంచి రేషన్ సరుకులు, సేవలను పొందవచ్చు. లేకుంటే లేనట్టే. అంతే కాదు ఓటేయకుంటే కాస్త జరిమానా కూడా కట్టాల్సి ఉంటుంది.
- సింగపూర్ లో ఓటేయనివారి పేర్లను వెంటనే ఓటర్ల లిస్టు నుంచి తొలగించేస్తారు. వారు ఎలాంటి ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం ఉండదు. ఓటరు లిస్టులో మళ్లీ పేరు నమోదు చేయాలంటే.. వివరణ పత్రం రాసిచ్చి, కొంత ఫీజు కట్టి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- బెల్జియం ప్రజలు కూడా ఓటు వేయకుంటే.. స్వల్పంగా ఫైన్ విధిస్తారు. నాలుగు ఎన్నికల్లో గానీ ఓటేయకపోతే.. జైలుశిక్ష పడుతుంది.
- ఉత్తర కొరియా ఫెడరల్ ఎన్నికల్లో అందరూ తప్పనిసరిగా ఓటేయాల్సిందే. లేకుంటే దేశద్రోహంగా పరిగణిస్తారు.
- అర్జెంటీనాలో ఓటు వేయనివారు అందుకు తగిన కారణంతో వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. దానిపై అధికారులు సంతృప్తి చెందితే ఓకే. లేకుంటే స్వల్పంగా ఫైన్ వేస్తారు.
- ఆస్ట్రేలియాలో ఓటర్లు కచ్చితంగా తాము ఓటు వేయాల్సిన పోలింగ్ బూత్ కు వెళ్లాల్సిందే. అయితే ఓటు వేయొచ్చు, వేయకపోవచ్చు. తమకు ఓటు వేయడం ఇష్టం లేదని చెప్పొచ్చు. కానీ పోలింగ్ బూత్ వద్దకు వెళ్లకుంటే మాత్రం .. రూ.2.5 వేల వరకు ఫైన్ కట్టాలి. కట్టకుంటే జైలుకు పంపుతారు.
- బ్రెజిల్‌లో 16 ఏళ్లకే ఓటు హక్కు వస్తుంది. ఇక్కడ 16 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు వారు, 70 ఏళ్లు దాటిన వారు ఓటు తప్పనిసరిగా వేయాలని లేదు. మిగతా వారు మాత్రం ఓటేయాల్సిందే. లేకుంటే జరిమానా కట్టాల్సి వస్తుంది.
- లీచెన్ స్టీన్, లగ్జెంబర్గ్, నౌరూ, ఉరుగ్వే, టర్కీ తదితర దేశాల్లో ఓటు వేయనివారు తగిన వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. వివరణ సరిగా లేకుంటే ఫైన్ పడుతుంది.

ఇదే బాటలో మరికొన్ని.. కానీ శిక్షలుండవు..

థాయిలాండ్, మెక్సికో, పనామా, కోస్టారికా, బొలీవియా, బల్గేరియా, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఇటలీ, డొమినికన్ రిపబ్లిక్, ఈజిప్ట్, గ్రీస్, హోండూరాస్, లెబనాన్, లిబియా, పరాగ్వే వంటి దేశాల్లోనూ తప్పనిసరిగా ఓటేయాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. అయితే అక్కడి చట్టాల్లో ఓట్లు వేయని వారిని శిక్షించేందుకు నిబంధనలు పెట్టలేదు. ఓటేయకుంటే వివరణ అడిగి వదిలేస్తారు. దేశాలు ఏవైనా తీవ్ర అనారోగ్యం, వృద్ధాప్యం, అత్యవసర విధుల్లో ఉండటం వల్ల ఓటేయకుంటే.. శిక్షలు, జరిమానాల నుంచి మినహాయింపులు ఉంటాయి.

– సాక్షి సెంట్రల్ డెస్క్

కృత్రిమ వజ్రమంటే.. మనసూ వజ్రమే!

నేలలో తవ్వి తీసినా.. ల్యాబ్‌లో తయారు చేసినా.. డైమండ్.. డైమండే!

అందంలో, నాణ్యతలో ఎక్కడా, ఏ మాత్రం తేడా ఉండదు. అంత ఈజీగా గుర్తుపట్టగలిగే చాన్స్ కూడా లేదు. మరి తేడా ఏంటి?.. సెంటిమెంట్, ఆత్మ సంతృప్తి ఈ రెండే.. అసలైన డైమండ్ ధరించాలన్న సెంటిమెంట్, ఒరిజినల్ అన్న ఆత్మ సంతృప్తి.. ఈ రెండే తేడా.. కానీ ఈ రెండే... డైమండ్ల ఉత్పత్తి కోసం జరుగుతున్న పర్యావరణ విధ్వంసానికి, గనుల్లో హక్కుల ఉల్లంఘనలకు, మరెన్నో సమస్యలు తలెత్తడానికి పరోక్ష కారణంగా నిలుస్తున్నాయి.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 20 పెద్ద వజ్రాల గనులు ఉన్నాయి. అందులో కేవలం 11 గనుల్లోనే 70శాతం దాకా వజ్రాల ఉత్పత్తి జరుగుతోంది. ఇలా వజ్రాలను సేకరించేందుకు గనులను చాలా భారీగా తవ్వాల్సి వస్తుంది. కేవలం ఒక్క క్యారెట్ వజ్రం లభించాలంటే.. సగటున 250 టన్నుల మట్టిని జల్లెడ పట్టాల్సి ఉంటుందని అంచనా. ఇందుకోసం భారీ పెట్టుబడి, యంత్రాలు, పెద్ద సంఖ్యలో పనివాళ్లు అవసరం. వజ్రాల గనుల తవ్వకం కోసం చెట్లను తొలగించడం, భారీగా తవ్వకాలు, కాలుష్యంతో పర్యావరణానికీ చేటు. పైగా వజ్రాల కంపెనీలు ఖర్చు తగ్గించుకునేందుకు కార్మికులపై ఒత్తిడి పెట్టడం, ఎక్కువ గంటలు పనిచేయించడం, చిన్న పిల్లలను కూడా గనుల్లో వినియోగించడం వంటి దారుణాలకు పాల్పడుతున్న ఆరోపణలు ఎన్నో..

మరి కృత్రిమ వజ్రాలతో లాభమేంటి?

భూమిలోపల వజ్రాలు ఎలాంటి పరిస్థితుల్లో ఏర్పడుతాయో.. అదే స్థాయిలో ఉష్ణోగ్రతలు, పీడనాన్ని ఉపయోగించి ల్యాబ్‌లలో కృత్రిమ వజ్రాలను తయారు చేస్తారు. గనుల్లో వజ్రాల వెలికితీతకు అయ్యే ఖర్చు కంటే 70 శాతం దాకా తక్కువ ఖర్చుతోనే ఇవి తయారవుతాయి. పైగా పర్యావరణ విధ్వంసం లేదు, హక్కుల ఉల్లంఘనల సమస్యలూ ఉండవని నిపుణులు చెప్తున్నారు. ఇటీవలి కాలంలో కృత్రిమ వజ్రాల ఉత్పత్తి బాగా పెరిగిందని వివరిస్తున్నారు.



పర్యావరణ స్పృహ ఉంటే..

భూమిలో దొరికినవైనా, ల్యాబ్‌లో తయారు చేసినవైనా.. ముడి వజ్రాలేనని, రెండింటినీ కావాల్సిన ఆకారాల్లోకి సానబెట్టడం ఒకటేనని నిపుణులు చెప్తున్నారు. క్వాలిటీ, కలర్ గ్రేడింగ్ కూడా ఒకేలా చేస్తారని వివరిస్తున్నారు. రంగు, నాణ్యతను బట్టి ఒక క్యారట్ సహజ వజ్రాల రేటు రూ.లక్షన్నర నుంచి రూ.10 లక్షల వరకు ఉంటుందని.. అదే కృత్రిమ వజ్రాల రేటు క్యారట్‌కు రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకు ఉంటుందని చెప్తున్నారు. వజ్రం ఏదైనా వజ్రమేనని.. కృత్రిమ వజ్రాల కొనుగోలుతో తక్కువ ధరకు రావడం, వజ్రాలు ధరించాలన్న కోరిక తీరడం రెండూ జరుగుతాయని స్పష్టం చేస్తున్నారు. పర్యావరణ స్పృహ ఉన్నవారు కృత్రిమ వజ్రాల కొనుగోలుకు వెనుకడుగు వేయడం లేదని అంటున్నారు.

కూటమి మాట.. రిజర్వేషన్లు రద్దు..

ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఇచ్చినా బాగుపడలేదన్న చంద్రబాబు

రిజర్వేషన్లతో సాధించేదేమీ లేదని వ్యాఖ్యలు

అందరికీ ఇవ్వలేం.. కాపు రిజర్వేషన్లు సాధ్యం కాదన్న జనసేనాని

సోషల్ మీడియాలో ఇద్దరి వీడియోలు వైరల్



సాక్షి, అమరావతి: మైనారిటీలు, ఎస్సీలు, ఎస్టీలు, పేద వర్గాలకు రిజర్వేషన్లు అవసరం లేదని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కుండబద్దలు కొట్టారు! జాతీయ న్యూస్ ఏజెన్సీ ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో రిజర్వేషన్లపై తన వ్యతిరేకతను బహిర్గతం చేసిన చంద్రబాబు వాటిని రద్దు చేయాలని అభిప్రాయపడ్డారు! 'ఎస్సీ, ఎస్టీలు, ఇతర కొన్ని వర్గాలకు ఏడు దశాబ్దాలుగా రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. మరి వాళ్లు ఏమైనా బాగుపడ్డారా?' అని చంద్రబాబు ప్రశ్నించారు. వారికి రిజర్వేషన్లు అవసరం లేదన్నట్లుగా మాట్లాడారు. ముస్లింలకు రిజర్వేషన్లు రద్దు చేస్తామని బీజేపీ చెబుతుండగా ఎన్డీఏతో పొత్తులో ఉన్న చంద్రబాబు మాత్రం ఇప్పటివరకు మభ్యపెట్టేలా మాట్లాడారు. పోలింగ్‌కు ముందు చంద్రబాబు తన ముసుగు తొలగించి ముస్లింలకు రిజర్వేషన్లు అవసరం లేదని స్పష్టం చేయడంతో ఆ వర్గాలు ఆవేదనతో రగిలిపోతున్నాయి. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి అధికారం ఇస్తే ఏపీలో ముస్లింలకు అమలవుతున్న 4 శాతం రిజర్వేషన్లు రద్దు కావడం ఖాయమని చంద్రబాబు వ్యాఖ్యలతో స్పష్టమవుతోంది. చంద్రబాబు ప్రతి సందర్భంలోనూ పేదల పట్ల తన వ్యతిరేకతను చాటుకున్నారు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని వారి పుట్టుకనే అవమానించిన వ్యక్తి చంద్రబాబు. బీసీల తోకలు కత్తిరిస్తానని బెదిరించిన చరిత్ర కూడా ఆయనదే. చంద్రబాబు నరనరానా కులోన్మాదం జీర్ణించుకుపోయిందనేందుకు దళితులు, ముస్లింలు, బీసీలకు వ్యతిరేకంగా పలు సందర్భాల్లో ఆయన చేసిన వ్యాఖ్యలే నిదర్శనం. తాజాగా ఎస్సీ, ఎస్టీలు, మైనారిటీలకు రిజర్వేషన్లు అవసరం లేదంటూ వారి పట్ల తన వ్యతిరేకతను చాటుకున్నారు. ఆయన మాట్లాడిన వీడియో వైరల్ కావడంతో అది ఫేక్ అంటూ ఎప్పటి మాదిరిగానే గొంతు సవరించుకున్నారు.

నైపుణ్య శిక్షణ చాలన్న పవన్

చంద్రబాబు పార్ట్‌నర్ పవన్ కళ్యాణ్ కూడా రిజర్వేషన్లపై తన వ్యతిరేకతను చాటుకున్నారు. దేశంలో చాలా కులాలు, ఉప కులాలు ఉన్నాయని, అందరూ రిజర్వేషన్లు అడుగుతారని, కానీ అందరికీ ఇవ్వలేమని ఇటీవల ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పవన్ పేర్కొన్నారు. అర్హతను బట్టి అవకాశాలు రావాలని, అందుకు నైపుణ్య శిక్షణ ఇప్పిస్తే సరిపోతుందన్నారు. రిజర్వేషన్ల ద్వారా అందరికీ అవకాశాలు ఇవ్వలేమని, తన కులం వాళ్లు కూడా రిజర్వేషన్లు అడుగుతున్నారని, కానీ ఇవ్వలేమని స్పష్టం చేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తమ వ్యాఖ్యల ద్వారా పేద వర్గాలకు ఇచ్చే రిజర్వేషన్లకు తాము వ్యతిరేకమని తేల్చి చెప్పారు.

మూడోరోజూ అదే రద్దీ

ఏపీ వైపునకు వాహనాల పరుగులు



చౌటుప్పల్: హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై మూడురోజులుగా కొనసాగుతున్న వాహనాల రద్దీ ఏమాత్రం తగ్గలేదు. ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు సొంతూళ్లకు వెళ్తున్న వారితో ఈ రద్దీ ఏర్పడింది. తెలంగాణలో కేవలం లోక్‌సభ ఎన్నికలు మాత్రమే ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభతో పాటు అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరుగుతుండడంతో అక్కడి రాజకీయ పార్టీలు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకు న్నాయి. దీంతో హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఆంధ్రా ప్రాంతవాసులు పెద్ద సంఖ్యలో తమ గ్రామాలకు పయనమయ్యారు. అదే విధంగా రాష్ట్రంలోని ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల కు సైతం ప్రజలు పెద్ద సంఖ్యలోనే వెళ్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభమైన రద్దీ ఆదివారం అర్ధరాత్రి వరకు కూడా కొనసాగింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగిలోని టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారు లు తీరాయి.ఈ రద్దీ సంక్రాంతి పండుగ సమ యాన్ని తలపించింది. ఈ టోల్‌ప్లాజా మీదుగా సాధారణ రోజుల్లో 30–35 వేల వాహనాలు, వీకెండ్‌లో 40–45 వేల వాహనాలు వెళ్తూ వస్తుంటాయి. కాగా శుక్రవారం 48,900, శనివారం 63,000, ఆదివారం సాయంత్రం వరకు సుమారు 45,000 వాహనాలు రాకపోకలు సాగించాయి. సోమవారం ఉదయం వరకు మరో 5 వేల వాహ నాలు రాకపోకలు సాగించే అవకాశాలు ఉన్నా యని అంచనా. ఎన్నికల తేదీకి ముందు వారాంతం సెలవులు కూడా కలిసి రావడంతో ప్రజలు సొంతూళ్లకు బయలుదేరారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 10+8 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 51

సోమవారం 13-5-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం ॥ 13-5-2024

మంచిమాట



మనిషి ఏ పనీ చేయకుండా ఒక్క క్షణం కూడా ఉండటం అసాధ్యం. ఏమీ చేయటం లేదు అన్నప్పుడు ఆ మాట పలకటం కర్మయే కదా! అప్పుడు కూడా గాలి పీల్చటం, తిన్న దానిని అరిగించుకోవటం వంటి పనులు చేస్తూనే ఉంటాము కదా! ఇవి కూడా మనని పట్టి బంధించి మరొక జన్మకి కారణం అవుతాయా? అనే సందేహం కలగటం సహజం. దీనిని గురించి భగవద్గీతలో కృష్ణుడు వివరంగానే చెప్పాడు. 'అకర్మ' అని. నిజానికి జీవించి ఉండటమే ఒక కర్మ.

సకామ కర్మ - అకామ కర్మ

జీవ చైతన్యం జీవికి ధర్మం. దాని వ్యక్త స్వరూపం కదలిక. అప్పుడే పుట్టిన బిడ్డ కాళ్ళు చేతులు కదిలిస్తూ ఏడుస్తాడు. బిడ్డ ఏడవక పోయినా, కదలికలు లేకపోయినా పెద్దలు ఏడవ వలసి ఉంటుంది. ఏదోవిధంగా ఏడిపించే ప్రయత్నం చేస్తారు. అస్తవ్యస్తంగా ఉన్న ఈ కదలికలు, ధ్వనులు క్రమేణా వయస్సుని బట్టి సంకల్పాలతో సంబంధం కలిగి ఉంటాయి. అంటే అభిప్రాయానికి అనుగుణంగా కదలికలు ఉంటాయి. మొదట్లో నవ్వటం, ఏడవటం అకారణంగా ఉంటాయి. ఇది నిష్కామకర్మ.

రాను రాను వయసుని బట్టి ఈ ఏడుపులు, నవ్వులు సకారణంగా మారుతాయి. తెలిసినవారిని చూసి నవ్వటం, కొత్తవారిని చూసి ఏడవటం, ఆకలి వేస్తే, చీమ కుడితే ఏడవటం సకారణమేగా. పైగా ఎవరైనా వచ్చి తన బాధ తీర్చాలనే కోరికతో చేసినదే కనుక సకామ కర్మ అవుతుంది.

చేతులు కదలి నోటి దాకా వచ్చి వ్రేళ్ళు చీకటం మొదలవుతుంది. చేతిని నోటిదాకా తీసుకు రావటానికి ఎంత తాపత్రయ పడతారో పిల్లలు గమనించ వచ్చు. ఆ పైన ఆ కదలిక వస్తువులను చూపించటం, పట్టుకోవటంలో నేర్పు చూపించటంగా మార్పు చెందుతుంది. అదే విధంగా ఏడవటం ఊ కొట్టటంగా మారి, క్రమంగా మాటలుగా పరిణామం జరుగుతుంది. తన అభిప్రాయాలు, కోరికలు వ్యక్తీకరించటానికి మాటలని ఉపయోగించటం జరుగుతుంది. ఇది ఎంతో సహజంగా, అప్రయత్నంగా జరిగే పరిణామం.

మనోవాక్కాయకర్మలచే మొదలైన దివ్యకర్మ మానవకర్మగా మలచ బడింది. అకామకర్మ బంధించదు. సకామకర్మ బంధ హేతువు. అకామ కర్మ సకామకర్మగా రూపాంతరం చెందుతున్న క్రమంలో అది ఘనీభవించి తాను అందులో బంధించబడకుండా జాగరూకత వహించవలసి ఉంటుంది. ప్రతిదీ లాభనష్టాల లెక్కలతో బేరీజు వేయటానికి అలవాటు పడిన మనిషికి ఇది సాధ్యమా? అనిపించటం సహజం. కానీ ఆ విధంగా ఉండటమే సహజం. స్వార్థపూరితంగా ఉండటమే తెచ్చిపెట్టుకున్న లక్షణం. ఎందుకంటే పుట్టిన కొత్తలో ప్రతి మనిషి శిశువుగా ఏ పని చేసినా ప్రయోజనాన్ని ఆశించి చేయటం ఉండదు. చిన్నపిల్లలు ఒక్క క్షణం కూడా ఒక చోట స్థిరంగా కూర్చోరు. గిరా గిరా తిరుగుతూనే ఉంటారు. ఎందుకు అని అడిగితే 'ఊరికే' అంటారు. పెరిగి పెద్ద అయినాక కూడా ఏదో ఒక పని చేయకుండా ఉండలేము. దానికి ఒక సంకల్పం, లేదా కోరిక జత చేయటం జరుగుతుంది. ఈ కోరిక బంధిస్తుంది. ఎలాగూ ఏమి చేయకుండా ఉండలేము కనుక ఏదైనా మనస్సుతో, వాక్కుతో, చేతులతో ఫలితాన్ని ఆశించకుండా పదిమందికి ఉపయోగపడే పని చేస్తూ ఉంటే అది నిష్కామ కర్మ అవుతుంది. దేహం ఉన్నంత వరకు కర్మాచరణ మాన రాదు.

గాలి పీల్చటం, గుండె కొట్టుకోవటం, ఊపిరితిత్తులు పని చేయటం మన ప్రయత్నం లేకుండా ఎట్లా జరుగుతున్నాయో నిత్యకృత్యాలు కూడా అదేవిధంగా యాంత్రికంగా, అప్రయత్నంగా కొనసాగిస్తూ, వాటిలో మానసికంగా లగ్నం కాకుండా ఉన్నప్పుడు సకామకర్మ అవదు. కనుక బంధించదు, మరొక జన్మకి కారణం కాదు.

– డా. ఎస్. అనంత లక్ష్మి

ఆధ్యాత్మికం

పరమ లక్ష్యం!

మన లక్ష్యం ఏమిటి? అన్న ప్రశ్న లోకంలో తరచుగా వినబడుతూ ఉంటుంది. దానికి ఒక్కొక్కరు ఒక్కోరకమైన సమాధానాన్ని ఇస్తుంటారు. ఈ ప్రపంచం మాయ అనుకున్న వారు మనం ఎక్కడి నుంచి వచ్చామో అక్కడికే పోతామని అంటారు. శూన్యవాదులు మనం శూన్యం (ఏమీ లేని వస్తువు) నుంచి వచ్చాము కనుక శూన్యంలోకే పోతామని అభిప్రాయపడతారు. భౌతికవాదులు మాత్రం కోరుకున్న భౌతిక పదార్థాన్ని పొందడమే లక్ష్యం అంటారు. కొందరు ఆధ్యాత్మిక వేత్తలు మనం భగవంతుని నుంచి వచ్చాము కనుక అతనిలోనే కలిసిపోతామని చెప్తుంటారు. అభ్యుదయవాదులు కొందరున్నారు. వారు ఐహిక సుఖమే పరమ లక్ష్యం అంటారు. మతవాదులున్నారు, వారు పరలోకంలో సుఖపడడమే తమ లక్ష్యం అంటారు. ఈ విధంగా ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా మానవ లక్ష్యాన్ని పేర్కొంటారు.

అన్ని జన్మల్లోకెల్లా మానవ జన్మ ఉత్తమమైనది. కనుక ఇతర ప్రాణుల కంటే మానవుడు శ్రేష్ఠుడు. అంతేకాదు, ఇతర ప్రాణులకు లేని లక్ష్యం మానవునికి ఉంది.



నాల్గు పురుషార్థాలలో అర్థ కామాలను లక్ష్యంగా పెట్టుకున్న వాళ్ళున్నారు. నిజానికి మానవుడు ధనాన్ని సంపాదించి, సుఖపడరాదని ఏ ధర్మ గ్రంథమూ చెప్పదు. అయితే ధర్మబద్ధంగా ధనార్జన చేయాలని, ధార్మిక ప్రవృత్తిలోనే కోరికలను తీర్చుకోవాలని, శాస్త్రాలు ఉద్బోధిస్తున్నాయి. అందుకే పురుషార్థాలలో మొదట ధర్మాన్నే పేర్కొన్నారు.

తనకే కాక, తోటి ప్రాణులకు ఏది హితకరమైందో, ఆ కర్మకే ధర్మమని పేరు. ధర్మానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే దాన్ని స్వార్థం అంటారు. ఆచారం వ్యక్తిగతమైంది కావచ్చు కాని, ధర్మం సర్వనిష్ఠమైంది. అందరికీ ఆమోదయోగ్యమైంది. అందుకే పురుషార్థాలను సాధించాలనుకున్న వ్యక్తి మొదట ధర్మపరుడు కావాలి.

ధర్మాన్ని దారిబత్తెంగా చేసుకుని ప్రయాణించే వారికి ధనప్రాప్తి, సుఖప్రాప్తి కలుగుతాయి. అంతేకాదు, ఆ రెండింటికీ మించి మోక్ష ప్రాప్తి కూడా కలుగుతుంది. అందువల్ల మానవుని లక్ష్యం కేవలం ధనార్జనతోపాటు సుఖప్రాప్తి మాత్రమే కాదు, మోక్షం సాధించడమే పరమ లక్ష్యమని తెలుస్తుంది.

మోక్షం అంటే విడుదల. దుఃఖం నుంచి బయటపడటమే మోక్షం. అదే మానవుని పరమ లక్ష్యం. బంధనాల్లో చిక్కుకోవడానికి కేవలం కర్మలు చేస్తే చాలు. కాని వాటి నుంచి బయట పడటానికి ధార్మికుడు కావాలి. ధర్మబద్ధమైన కర్మలు చేస్తూ, ఆత్మజ్ఞానాన్ని సంపాదించుకోవాలి. ఈ శరీర తత్వంతోపాటు, ఈ శరీరంలో బంధింపబడిన తానెవరో తెలుసుకోవాలి. అంతేకాదు, మోక్ష ప్రదాతను గుర్తించాలి. శరీరం ఉంది. తాను ఉన్నాడు. శరీరం బంధనం. దాన్ని విడిచిపెడితే మోక్షం. కానీ ఎట్లా విడిచిపెట్టాలి? అందుకు చేయవలసిన పనేమిటి? తెలిస్తే గాని పరమ లక్ష్యాన్ని అందుకోలేం.

– ఆచార్య మసన చెన్నప్ప

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

ఆమె ధర్మపత్ని...

అహం ఎప్పుడూ కూడా మనిషిని పాషాణం అయ్యేట్టు చేస్తుంది. కామం తీరలేదనుకోండి. శత్రుభావం పెంచుకుని అవతలి వాళ్ళ మీద కఠినంగా వ్యవహరించేటట్లు చేస్తుంది. అయితే ప్రేమ మాత్రం కరిగిపోయే లక్షణాన్ని పొంది ఉంటుంది. అవతలివాళ్ళల్లో ఎన్ని లోపాలున్నా వారి నాశనాన్ని ప్రేమ కోరుకోదు. వారు బాగుపడాలి, సంస్కరింపబడాలి, జీవితంలో వృద్ధిలోకి రావాలి... అని కోరుకుంటుంది తప్ప వారిపట్ల ద్వేషం పెంచుకోదు. అందుకే ప్రేమ అవసరం. దానికి పూర్వ పరిచయం లేదు, భవిష్యత్తు మాత్రం ఉంది. దానికి పునాది ప్రేమలోనే ఉంది తప్ప కామంలో లేదు. అందుకే ఆమె 'ధర్మపత్ని' తప్ప కామపత్ని కాదు. ఇంత పెద్ద ప్రాతిపదికచేసి గృహస్థాశ్రమ ప్రవేశం చేయిస్తారు. కాబట్టి వివాహం నిర్ణయించేటప్పుడు పెద్దలు ముందుగా శీలం, వయసు, వృత్తి పరిశీలిస్తారు... తరువాత అభిజనం... అంటే రెండు పక్కల వంశాలు ఎంత గొప్పవి! ఆ వంశాలలో పూర్వీకులు ఎంత గొప్పగా ప్రవర్తించారో అన్న జిజ్ఞాసతో ఆ వంశానికి కీర్తిప్రతిష్ఠలు జోడించేలా ప్రవర్తించాలి. అందువల్ల వాటిని కూడా పెద్దలు పరిశీలిస్తారు.

రామాయణంలో... రామచంద్రమూర్తి శివధనుర్భంగం చేయగానే జనకమహారాజు వచ్చి సీతను అప్పగించాడు, రాముడు వెంట తీసుకెళ్ళాడు... అని చాలామంది అనుకుంటూంటారు. కానీ అది సరికాదు. బాలకాండను అయోధ్యకాండతో కలిపి చదివితే... ఆశ్చర్యపోతాం.. వారి సంస్కారం చూసి... శివధనుర్భంగం కాగానే జనకమహారాజు జలకలశంతో గబగబా వచ్చి..''మొదట ఇచ్చిన మాట ప్రకారం శివధనుర్భంగం చేసినవారికి నా కూతురును ఇస్తానని చెప్పాను... ఆ పని నీవు విజయవంతంగా చేశావు కాబట్టి ఇదుగో నా కుమార్తె..స్వీకరించు''... అన్నాడు. దానికి రాముడు....''ఒక పిల్ల నాకు భార్య కావాలంటే చూడాల్సిన విషయాలు చాలా ఉన్నాయి. అవి మా తండ్రిగారు చూడాలి. మా పురోహితులు, పెద్దలు, బంధువులను సంప్రదించి ఆయన నిర్ణయిస్తారు. దానికి నేను కట్టుబడతాను. అందువల్ల మా తండ్రి గారికి కబురు పంపండి' అన్నాడు. కబురందుకుని దశరథ మహారాజు వచ్చారు.

'నేను స్వయంవరం ఏర్పాటు చేస్తే భూమండలంలోని రాజులందరూ వచ్చిపోటీపడ్డారు. కానీ మీ రాముడు మాత్రమే శివధనుర్భంగం చేయగలిగాడు. ముందు చెప్పిన షరతు ప్రకారం నా కుమార్తెని ఇస్తున్నా. మీ కోడలిగా స్వీకరించండి' అని జనకుడు కోరాడు. దశరథుడు వెంటనే



ఎగిరి గంతేసి అంగీకరించలేదు. ఆయన అన్నాడు కదా...'ఈమె నా ఇంటి కోడలిగా రావడానికి ముందు మన రెండు వంశాలు సరిపోతాయా.. దానికి అర్హతలు మనకున్నాయా..'' అంటూ మరో గొప్పమాటంటాడు..

''రాముడు గొప్పవాడు ... పిల్లనివ్వడం మా అదృష్టం '' అంటూ వంగి మాట్లాడకండి, జనక మహారాజా! మీరు పిల్లనిస్తేనే కదా మా వంశం నిలబడేది. అప్పుడే కదా రుణ విమోచనం. ఇచ్చేవారు మీరు, పుచ్చుకునేవాడిని నేను. ఇప్పుడు వినయంగా ఉండాల్సింది నేను మహారాజా !'' అన్నాడు. ఆ తరువాత దశరథ మహారాజు కోరికపై వశిష్ఠుడు, జనకుడి కోరికపై వారి పురోహితుడు వారి వారి వంశాలను వివరించారు. అలా ఒకరి నుంచి మరొకరు క్షుణ్ణంగా తెలుసుకుని నిర్ణయించిన వివాహాలు కాలంలో ఆదర్శంగా నిలిచిపోయాయి. అందుకే గృహస్థాశ్రమానికి రామాయణం ఆదర్శం – అని కంచి మహాస్వామి అంటూండేవారు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా

డబుల్ యాక్షన్



● రామ్

హీరో రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' (2019) మూవీ సూపర్ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. తాజాగా వీరి కాంబినేషన్‌లో 'ఇస్మార్ట్ శంకర్'కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' మూవీ రూపొందుతోంది. పూరి కనెక్ట్స్‌పై పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మిస్తున్న ఈ మూవీలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కీలకపాత్రలో నటిస్తున్నారు. పాన్ ఇండియా చిత్రంగా రూపొందుతున్న 'డబుల్ ఇస్మార్ట్' నుంచి ఓ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ నెల 15న రామ్ పుట్టినరోజు సందర్భంగా ఈ మూవీ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించి, రామ్ సరికొత్త పోస్టర్ విడుదల చేశారు. ఫేస్ మాస్క్, పులి చారల చొక్కా, టోర్న్ జీన్స్ ధరించి ఒక చేతిలో సిగరెట్, మరో చేతిలో క్రాకర్స్ పట్టుకుని ఇంటెన్స్ లుక్‌తో కనిపించారు రామ్. ''డబుల్ ఇస్మార్ట్'లో డబుల్ యాక్షన్, డబుల్ మాస్, డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది. ఈ హై-బడ్జెట్ ఎంటర్‌టైనర్ మూవీ షూటింగ్ ప్రస్తుతం ముంబైలో జరుగుతోంది. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సీఈఓ: విషు రెడ్డి, సంగీతం: మణిశర్మ, కెమెరా: సామ్ కె. నాయుడు, జియాని జియాన్నెలి.

నేనేం క్రికెట్ కోసం పుట్టలేదు!



● జాన్వీ, రాజ్‌కుమార్ రావు



● జాన్వీ కపూర్

రాజ్‌కుమార్ రావు, జాన్వీ కపూర్ జంటగా నటించిన హిందీ చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. క్రికెట్ నేపథ్యంలో రూపొందిన ఈ మూవీకి శరణ్ శర్మ దర్శకుడు. ఈ సినిమాలో మహేంద్ర పాత్రలో రాజ్‌కుమార్ రావు, మహిమ పాత్రలో జాన్వీ కపూర్ నటించారని బాలీవుడ్ సమాచారం. జీ స్టూడియోస్, కరణ్ జోహార్, యశ్ జోహార్, అపూర్వ మెహతా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'నాకు ఇంకో ఏడాది అవకాశం కల్పించండి నాన్న.. నేను కచ్చితంగా సెలక్ట్ అవుతాను.. నా కలను బ్రేక్ చేయవద్దు నాన్న.. ప్లీజ్', 'మీ నాన్న కోసం నువ్వు (జాన్వీని ఉద్దేశిస్తూ..) డాక్టర్ అయ్యావు మహి.. కానీ నువ్వు ఏం కావాలనుకుంటున్నావు' (రాజ్‌కుమార్ రావు), 'నేనేం క్రికెట్ కోసం పుట్టలేదు' (జాన్వీ కపూర్) వంటి డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. క్రికెటర్ కావాలనుకున్న ఓ యువకుడు తన లక్ష్యాన్ని సాధించలేకపోతాడు. ఆ తర్వాత అతను పెళ్లి చేసుకుంటాడు. వృత్తి రీత్యా డాక్టర్ అయిన తన భార్యలో క్రికెట్ ప్రతిభ ఉందని గ్రహించి, తన భార్యకు తానే క్రికెట్ కోచింగ్ ఇచ్చి, ఆమెను ప్రోత్సహించి క్రికెటర్‌ను చేయాలనుకుంటాడు. ఈ నేపథ్యంలో ఆ భార్యాభర్తల జీవితాల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి? అనే నేపథ్యంలో 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' సినిమా కథనం ఉంటుందని బాలీవుడ్ టాక్.

హాలీవుడ్ కింగ్ ఆఫ్ కల్ట్ రోజర్ కన్నుమూత



హాలీవుడ్‌కి చెందిన ప్రముఖ దర్శక-నిర్మాత, నటుడు రోజర్ విలియం కోర్మన్ (98) కన్నుమూశారు. 1926 ఏప్రిల్ 5న డెట్రాయిట్‌లో జన్మించారు రోజర్ కోర్మన్. కాలిఫోర్నియాలోని శాంటా మోనికాలో ఈ నెల 9న ఆయన మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని ధృవీకరించినట్లు హాలీవుడ్ మీడియా చెబుతోంది. దీంతో కాస్త ఆలస్యంగా ఆయన మరణవార్త వెలుగులోకి వచ్చింది. 1950లో స్టోరీ రీడర్‌గా ఆయన సినీ కెరీర్ మొదలైంది. కెరీర్ మొదట్లో ఒడిదొడుకులు ఎదుర్కొన్న తర్వాత రోజర్ కోర్మన్ తొలిసారిగా 'మాన్‌స్టర్ ఫ్రమ్ ది ఓషియన్ ఫ్లోర్' అనే ఓ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ నిర్మించగా మంచి విజయం సాధించింది. రోజర్ 50కిపైగా సినిమాలకు దర్శకత్వం వహించారు. 350కిపైగా సినిమాలను నిర్మించారు. అలాగే 20కి పైగా సినిమాల్లో నటించారు. దాదాపు 30 సినిమాలకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గానూ చేశారు. రోజర్ కెరీర్‌లో 'ఫైవ్ గన్స్ వెస్ట్', 'డే ది వరల్డ్ ఎండెడ్', 'ది అన్‌డెడ్', 'టార్గెట్స్', 'వార్ ఆఫ్ ది శాటిలైట్స్', 'ఎక్స్: ద మ్యాన్ విత్ ది ఎక్స్ రే ఐస్', 'డెత్ రేస్' వంటి ఎన్నో హిట్ సినిమాలున్నాయి. హాలీవుడ్ పరిశ్రమ రోజర్‌ను 'పోప్ ఆఫ్ పాప్ సినిమా', 'ది కింగ్ ఆఫ్ కల్ట్' వంటి పేర్లతో పిలుచుకుంటుంది. రోజర్‌కు భార్య జూలీ కోర్మన్, కుమార్తెలు కేథరీన్, మేరీ ఉన్నారు. ఆయన మృతిపట్ల హాలీవుడ్ సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

భావోద్వేగాల అమ్మ



● శ్వేత

మదర్ సెంటిమెంట్, భావోద్వేగాలతో రూపుదిద్దుకోనున్న సరికొత్త థ్రిల్లర్ మూవీ 'అమ్మ'. ఆర్జే శ్వేత పీవీఎస్‌ను దర్శకురాలిగా పరిచయం చేస్తూ, యష్ రంగినేని ఈ సినిమాను నిర్మించనున్నారు. ఆదివారం (మే 12) మదర్స్ డే. ఈ సందర్భంగా 'అమ్మ' సినిమా టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'అమ్మ' సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడించనున్నామని చిత్ర యూనిట్ పేర్కొంది.

సింగిల్ షెడ్యూల్‌తో..

కేవలం 20 లక్షల రూపాయలతో సింగిల్ షెడ్యూల్‌తో రూపొందిన చిత్రం 'అక్కడ వారు ఇక్కడ ఉన్నారు'. తెనాలికి చెందిన కుందుర్తి త్రివిక్రమరావు స్వీయ దర్శకత్వంలో తీశారు. సాయి హర్షిణి, ఎస్వీ రమణ, కేవీ రమణ, పి. లలిత వంటి నూతన తారలు నటించిన ఈ మూవీ ఈ నెల 17న విడుదలవుతోంది. కుందుర్తి త్రివిక్రమరావు మాట్లాడుతూ–''ఇప్పట్లో సినిమా నిర్మించడమంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నది. కానీ, కేవలం 20 లక్షల రూపాయలతో పది రోజుల సింగిల్ షెడ్యూల్‌లో మా చిత్రం పూర్తి చేశాం. అయితే క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడలేదు'' అన్నారు.



● త్రివిక్రమరావు




నన్ను పెళ్లి చేసుకుంటావా? అన్నాడు

– తాన్యా రవిచంద్రన్

''నన్ను పెళ్లి చేసుకుంటావా అక్కా?' అంటూ ఓ అభిమాని నన్ను అడిగాడు. అతడి ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలో అర్థం కాలేదు'' అన్నారు హీరోయిన్ తాన్యా రవిచంద్రన్. 2017లో విడుదలైన 'పాలే విల్లియతేవా' అనే తమిళ మూవీతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారామె. ఆ తర్వాత వరుసగా తమిళ చిత్రాల్లో చాన్స్‌లు అందుకున్నారు. కార్తికేయ హీరోగా నటించిన 'రాజా విక్రమార్క' (2021) చిత్రం ద్వారా తెలుగు పరిశ్రమకు పరిచయమయ్యారు తాన్యా రవిచంద్రన్. ఆ తర్వాత చిరంజీవి హీరోగా నటించిన 'గాడ్ ఫాదర్' చిత్రంలో హీరోయిన్ నయనతార చెల్లెలు పాత్ర ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు తాన్య. కాగా ఆమె హీరోయిన్‌గా నటించిన తాజా తమిళ చిత్రం 'రసవాది'. అర్జున్ దాస్ హీరోగా నటించిన ఈ చిత్రానికి శాంతకుమార్ దర్శకత్వం వహించారు. ఈ మూవీ శుక్రవారం(మే 10) విడుదలైంది. కాగా ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తాన్యా రవిచంద్రన్ ఓ ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. ''ఇటీవల నా అభిమానులతో సమావేశమయ్యాను. ఆ సమయంలో ఓ అభిమాని 'నన్ను పెళ్లి చేసుకుంటావా అక్కా?' అని అడగడంతో అవాక్కయ్యాను. అక్క, పెళ్లి అంటూ రెండూ సంబంధం లేకుండా మాట్లాడాడు. ఆ సమయంలో అతడి ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలో నాకు అర్థం కాలేదు. ఆ ఘటన గుర్తుకొస్తే ఇప్పటికీ నవ్వొస్తుంది'' అని తాన్యా రవిచంద్రన్ చెప్పారు.

క్రైమ్ థ్రిల్లర్



● పాయల్ రాజ్‌పుత్

ఓ పోలీసాఫీసర్ జీవితంలో జరిగిన ఒక ఘటన స్ఫూర్తితో తెరకెక్కిన క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీ 'రక్షణ'. హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాలో రోషన్, మానస్, రాజీవ్ కనకాల, వినోద్ బాల ఇతర పాత్రలు చేశారు. ప్రణదీప్ ఠాకోర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ''ఓ క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ మిస్టరీ డ్రామాగా రూపొందిన చిత్రం 'రక్షణ'. ఈ మూవీలో తొలిసారి పోలీసాఫీసర్‌గా నటించారు పాయల్ రాజ్‌పుత్. త్వరలోనే ఈ సినిమా విడుదల వివరాలు వెల్లడిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వరసాగర్, కెమెరా: అనిల్ బండారి.

అన్నాచెల్లి అనుబంధం

రామ్ మిట్టకంటి, పవిత్ర, కస్వి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'చిట్టి పొట్టి'. భాస్కర గ్రూప్ ఆఫ్ మీడియా బ్యానర్‌పై భాస్కర్ యాదవ్ దాసరి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ మూవీ మోషన్ పోస్టర్‌ని రిలీజ్ చేసిన అనంతరం భాస్కర్ యాదవ్ దాసరి మాట్లాడుతూ–''అన్నాచెల్లి అనుబంధంతో నడిచే ఈ సినిమాలో భావోద్వేగాలు, తెలుగుదనం అనురాగాలు, ఆప్యాయతలు ఉంటాయి. ప్రతి ఇంట్లో ఉండే మహిళల విలువ తెలియజేసే సినిమా ఇది. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ వెంకట్, కెమెరా: మల్హర్భట్ జోషి.



● పవిత్ర, రామ్

1

సాక్షి హైదరాబాద్

సోమవారం । 13 । మే । 2024






ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న వికాస్‌రాజ్, రోనాల్డ్ రాస్, అనుదీప్.. అంబర్‌పేట్‌లో సిద్ధమైన ఎన్నికల సిబ్బంది

గతంలో పోలింగ్ ఇలా..

పరిధిలో.. (శాతాల్లో)	2014 అసెంబ్లీ& లోక్‌సభ	2018 అసెంబ్లీ	2023 అసెంబ్లీ
హైదరాబాద్ లోక్‌సభ	54.04	49.27	44.77
సికింద్రాబాద్	52.74	51.57	48.53
మల్కాజిగిరి	50.71	54.02	53.80
చేవెళ్ల	64.30	66.88	66.05

ఓటర్లు ఇలా..

హైదరాబాద్ లోక్‌సభ					
అసెంబ్లీ సెగ్మెంట్	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్లు	సర్వీస్ ఓటర్లు	మొత్తం
మలక్‌పేట	1,60,146	1,57,475	15	10	3,17,646
చార్మినార్	1,20,108	1,10.160	30	10	2,30,308
చాంద్రాయణగుట్ట	1,73,921	1,75,656	34	100	3,49,711
యాకుత్‌పురా	1,81822	1,78,859	31	13	3,60,725
బహదూర్‌పురా	1,61532	1,60,322	50	9	3,21,913
గోషామహల్	1,42,967	1,31,530	25	12	2,74,534
కార్వాన్	1,84,787	1,77,613	11	57	3,62,468
సికింద్రాబాద్ లోక్‌సభ					
అసెంబ్లీ సెగ్మెంట్	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్లు	సర్వీస్ ఓటర్లు	మొత్తం
సికింద్రాబాద్	1,32,954	1,33,355	28	24	2,66,361
ముషీరాబాద్	1,57,610	1,50,373	12	22	3,08,017
అంబర్‌పేట	1,41,080	1,38,832	12	25	2,79,949
ఖైరతాబాద్	1,55,352	1,44,265	34	18	2,99,669
నాంపల్లి	1,66,995	1,59,052	10	27	3,26,084
జూబ్లీహిల్స్	2,01,810	1,85,224	22	21	3,87,077
సనత్‌నగర్	1,31,074	1,22,295	12	12	2,53,393
మల్కాజిగిరి లోక్‌సభ					
అసెంబ్లీ సెగ్మెంట్	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్లు	సర్వీస్ ఓటర్లు	మొత్తం
మల్కాజిగిరి	2,55,325	2,52,712	11	257	5,08,305
మేడ్చల్	3,40,218	3,25,703	58	164	6.66.143
కుత్బుల్లాపూర్	3,78,362	3,46,468	162	110	7,25,102
కూకట్‌పల్లి	2,51,424	2,30,506	126	51	4,82,107
ఉప్పల్	2,79,495	2,60,516	41	159	5,40,211
ఎల్బీ నగర్	3,14,101	2,90,528	134	61	6,04,824
కంటోన్మెంట్	1,26,699	1,26,997	10	55	2,53,761
చేవెళ్ల లోక్‌సభ					
అసెంబ్లీ సెగ్మెంట్	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్లు	సర్వీస్ ఓటర్లు	మొత్తం
మహేశ్వరం	2,85,137	2,71,538	66	78	5,56,819
రాజేంద్రనగర్	3,16,979	2,95,153	38	95	6,12,265
శేరిలింగంపల్లి	4,00,361	3,57,600	141	58	7,58,160
చేవెళ్ల	1,35,429	1,34,526	05	73	2,70,033
పరిగి	1,33,568	1,32,989	09	253	2,68,819
వికారాబాద్	1,14,965	1,16,660	14	78	2,31,717
తాండూరు	1,17,821	1,25,364	07	52	2,43,244



సరూర్‌నగర్ స్టేడియంలో పోలింగ్ సామగ్రిని తీసుకెళ్తున్న ఎన్నికల సిబ్బంది



ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో..

జాగో షహర్

మేల్కొండి.. బాధ్యత చాటండి..

సాక్షి, సిటీబ్యూరో : ప్రపంచ పటంలో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. మహానగర వాసులు అన్ని రంగాల్లో పేరు గడిస్తున్నారు. కానీ.. భవిష్యత్తును నిర్ధారించే ఓటుహక్కును వినియోగించడంలో నిరాసక్తతను ప్రదర్శిస్తూ బద్ధకస్తులుగా చెరగని ముద్ర వేసుకుంటున్నారు. హైటెక్ సిటీగా పేరొందిన హైదరాబాద్‌లో అక్షరాస్యత శాతం తక్కువేమీ కాదు. మెజార్టీ శాతం చదువుకున్నవారే. అంతా హై ప్రొఫెషనల్సే.. ప్రశ్నించే తత్వమున్న వారే.. అయినా మారుమూల పల్లెజనాల కన్నా అధ్వానంగా మారిపోయారు. ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఇచ్చిన పెయిడ్ హాలీడేని కూడా.. శని, ఆది వారాల మాదిరి వారాంతపు హాలీడేలుగా, జాలీడేలుగా మార్చేసుకున్నారు. రాష్ట్రంలోనే అతి తక్కువగా పోలింగ్ నమోదయ్యేది మన నగరంలోనే. సిటీ జనాలు ఇళ్లలో నుంచి బయటికి వచ్చి ఓటేసేందుకు ఆసక్తిని కనబర్చడంలేదు. ఎక్కడ చూసినా పోలింగ్ సెంటర్లన్నీ.. ఓటర్లు లేక వెలవెలబోయి కనిపిస్తుంటాయి. మొత్తమ్మీద ప్రతి ఎన్నికల్లో 50 శాతం మాత్రమే పోలింగ్ నమోదవుతోంది. మధ్యాహ్నం 3 గంటల వరకు 35 శాతం పోలింగ్ మించకపోవడం, ఆఖరు 2 గంటల్లో మరో 15 శాతం పెరిగి కొంత పరువు కాపాడుతోంది. ఇక హైదరాబాద్ పాతబస్తీ పరిస్థితి మరింత దయనీయతను ప్రతిబింబిస్తుండడం దారుణం.

- ఓటుహక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాలూ తక్కువేం కాదు. ఎన్నికల యంత్రాంగం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో.. ఓటరు చైతన్య కార్యక్రమాలు అనేకం చేపడుతుంటుంది. స్వచ్ఛంద సంస్థలు ఓటుహక్కు ప్రాధాన్యాన్ని వివరిస్తున్నా నగర వాసులు మాత్రం ఓటు వేసేందుకు గడప దాటడం లేదు. పరిస్థితిలో ఏమాత్రం మార్పు రావడం లేదు. సినీ హీరోలు, ఇతర రంగాల ప్రముఖులు సైతం కుటుంబ సమేతంగా వచ్చి ఓటు వేస్తే.. నగరంలోని సంపన్న, మధ్యతరగతి జనాలు మాత్రం పోలింగ్ కేంద్రాల వైపు చూడకపోవడం గమనార్హం. నగర ప్రజల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగర ఓటరు సిగ్గుపడాలంటూ పలువురు సామాజిక వేత్తలు ట్విట్టర్ వేదికగా ఆగ్రహం ప్రదర్శించిన ఘటనలూ లేకపోలేదు.

ఆదిలో తక్కువనే..

హైదరాబాద్ పరిధిలో ఆదిలో తక్కువగా పోలింగ్ నమోదు కాగా, అవగాహన కార్యక్రమాలతో 1984 నుంచి 1999 వరకు 73 శాతం పెరిగింది. ఆ తర్వాత 55 శాతానికి పడిపోయింది. ప్రస్తుతం 50 శాతం లోపల నమోదు కావడం విశేషం గ్రేటర్ పరిధిలో మొత్తం ఓటింగ్‌ను పరిశీలిస్తే ప్రతి ఎన్నికల్లో గణనీయంగా తగ్గింది. బస్తీ ఓటర్లు మినహా నగరంలో యువకులు, విజ్ఞానవంతులు ఓటు హక్కును వినియోగించుకోవడం లేదు. మూడు పర్యాయాలుగా ఓటింగ్ సరళిని గమనిస్తే హైదరాబాద్, చుట్టూరా ఉన్న జిల్లాల్లోనే తక్కువగా నమోదైంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ 49.03 శాతం ఉంది. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా 46.56, రంగారెడ్డి జిల్లా పరిధిలో 59.94, మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 56 శాతం ఓటింగ్ నమోదైంది. కోర్ సిటీతో పాటు, హైదరాబాద్ చుట్టూరా ఉన్న అన్ని జిల్లాల్లోనూ ఇదే తరహా ట్రెండ్ నడుస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

యువత అనాసక్తి

నగరంలో సగానికి పైగా యువత ఓటింగ్‌పై అనాసక్తి ప్రదర్శిస్తోంది. ఓటు వేస్తే మనకేం వస్తుంది? మన ఒక్క ఓటుతో అభ్యర్థి గెలుస్తాడా? సమయం వృధా ఎందుకు? ఎందుకు ఓటు వేయాలి? అంటూ బద్ధకం ప్రదర్శిస్తోంది. నిరంతం పనుల్లో బిజీగా ఉండే యువత పోలింగ్ రోజు సెలవు ఉంటుండటంతో త్వరగా నిద్ర లేచేందుకు ఇష్టపడడంలేదు. ఎక్కడో ఉన్న పోలింగ్ కేంద్రానికి ఎందుకు వెళ్లడమని ఓటింగ్‌కు దూరంగా ఉంటోంది.



రెండేసి ఓట్లతో స్వస్థలాలకు పరుగు

మహా నగరానికి ఉపాధి కోసం వలస వచ్చిన కుటుంబాలు లోకల్ గుర్తింపు కోసం ఇక్కడ కూడా ఓటును నమోదు చేసుకోవడం సాధారణమైంది. గ్రేటర్ పరిధిలో సుమారు 1.10 కోట్ల వరకు ఓటర్లు ఉండగా అందులో 20 శాతం వరకు స్థానికేతరులు. వీరికి రెండేసి ఓట్లు ఉండటంతో అందులో 14 శాతం వరకు ఓటర్లు స్వస్థలాలకు తరలి వెళ్తుంటారు. ఈసారి ఏపీలో కూడా లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో ఏపీ ఓటర్లు పెద్ద ఎత్తున అక్కడికి తరలివెళ్లారు.





పోలింగ్ లొకేషన్లు: 1688
సమస్యాత్మకం: 1046
విధుల్లో పోలీసులు : 14 వేల మంది

కంటోన్మెంట్ ఉప ఎన్నిక.. సమాచారం

మొత్తం ఓటర్లు:	పురుషులు :	మహిళలు :	ఇతరులు :	సర్వీస్ ఓటర్లు :	మొత్తం పోలింగ్ కేంద్రాలు :
2,53,761	1,26,699	1,26,997	10	55	232

సెక్టార్లు :	పోలింగ్ సిబ్బంది :	మోడల్ పోలింగ్ కేంద్రాలు :	మహిళా పోలింగ్ కేంద్రాలు :	దివ్యాంగుల పోలింగ్ కేంద్రాలు :	యువత పోలింగ్ కేంద్రాలు :
22	2,000	05	05	01	01

నేడే పోల్ డే.. బిగ్ మండే

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ, కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలకు హైదరాబాద్ జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలతో పాటు ఎండల నుంచి రక్షణకు షామియానాలు, తాగునీటి ఏర్పాట్లు చేసింది. అవసరమైతే తక్షణ వైద్యసాయం అందేలా ఏర్పాట్లు చేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచనున్నారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా క్యూలైన్లు ఉంటాయి. అన్ని పోలింగ్ కేంద్రాల్లో పరిస్థితుల్ని రికార్డు చేసే వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘాకు 15 డ్రోన్లు రంగంలో దింపారు. జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ప్రజలు తమ పోలింగ్ కేంద్రంలో ఏ సమయంలో ఎంతమంది రద్దీ ఉందో తెలుసుకునేందుకు వీలుగా 'పోల్ క్యూ రూట్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఏ సమయంలో ఎంత రద్దీ ఉందో, గూగుల్ మ్యాప్ ద్వారా లొకేషన్‌ను కూడా తెలుసుకోవచ్చు. జీహెచ్ఎంసీ వెబ్‌సైట్ హోమ్‌పేజీ తెరవగానే దీని లింక్ కనపడేలా చేశారు. పార్కింగ్‌కు కూడా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

పోలింగ్‌కు అంతా సిద్ధం

ఆదివారం ఉదయం ప్రత్యేక బస్సుల్లో 40 పికప్ ప్రాంతాల నుంచి ఎన్నికల విధుల్లోని సిబ్బంది తమ డీఆర్‌సీ (డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్)లకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఈవీఎంలు, ఎన్నికల సామాగ్రితో తమ పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు.

ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు:

నియోజకవర్గానికి అయిదు మహిళా, అయిదు మోడల్, ఒక్కొక్కటి చొప్పున వికలాంగులు, యువత కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. సంబంధిత వ్యక్తుల ద్వారానే వీటిని నిర్వహిస్తారు. జిల్లాలో ఇలా మొత్తం 180 ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

బస్తీ ఓటర్లే కీలకం

గ్రేటర్ పరిధిలోని నాలుగు లోక్‌సభ నియోజకవర్గాల్లో బస్తీ ఓటర్లే కీలకం కానున్నారు.వీటి పరిధిలో సుమారు 5 వేలకు పైగా బస్తీలు ఉన్నాయి. ఉపాధి కోసం వలస వచ్చి నివాసం ఉంటున్నవారే అధికం ఉన్నారు. సాధారణంగా సంపన్న, మధ్యతరగతి ప్రజల కంటే బస్తీవాసులే ఓటు వేసేందుకు ఎక్కువ మొత్తంలో కదులుతుంటారు.

ఏర్పాట్లు ఇలా..

లోక్‌సభ స్థానం	మొత్తం ఓటర్లు	పోలింగ్ బూత్‌లు	సిబ్బంది	బ్యాలెట్ యూనిట్లు	కంట్రోల్ యూనిట్లు	వీవీ ప్యాట్లు	అభ్యర్థులు
హైదరాబాద్	22,17,305	1,944	7,980	4,862	2,427	2,720	30
సికింద్రాబాద్	21,11,424	1,810	8,506	6,789	2,261	2,531	45
మల్కాజిగిరి	37,79,596	3,228	19,440	8,066	4,032	4,515	22
చేవెళ్ల	29,38,370	2,877	23,752	10,791	3,594	4,025	43



"నగరంలో ఈసారి ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు పట్టుదలతో పని చేశాం. వివిధ ప్రాంతాల్లో, వివిధ వర్గాల వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. పోలింగ్ సందర్భంగా ఇబ్బందులుంటాయని ఇళ్లలోనే ఉండవద్దు. ఓటు వేయండి. విజ్ఞులు అనిపించుకోండి.

– రోనాల్డ్‌రాస్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి



ఓటు హక్కే కాదు. బాధ్యత కూడా. ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలి. పోలింగ్ రోజును హాలీడేగా కాకుండా విధి నిర్వహణలో భాగంగా చూడాలి. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాజ్యాంగం కల్పించిన ఓటును వినియోగించుకోవాలి. పోలింగ్ కేంద్రాలకు భారీ సంఖ్యలో తరలిరావాలి.

– శశాంక, రంగారెడ్డి జిల్లా కలెక్టర్



దేశంలోనే అతిపెద్ద లోక్‌సభ నియోజకవర్గమైన మల్కాజిగిరిలో ఓటింగ్ శాతాన్ని గణనీయంగా పెంచటానికి ఓటర్లు పూనుకోవాలి. ఓటుహక్కు దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్న విషయాన్ని మర్చిపోవద్దు. శ్రామికులు, కార్మికులు, ఉద్యోగులు ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి.

– గౌతమ్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్



ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేలా యువ ఓటర్లు పోలింగ్‌లో పెద్ద ఎత్తున పాల్గొనాలి. వారి కుటుంబ సభ్యులను కూడా భాగస్వామ్యం చేయాలి. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ముందుకు రావాల్సిన అవసరం ఎంతో ఉంది. నగర ఓటర్లు పోటెత్తాలి.

– అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగం తప్పనిసరి. మీ ఓటే మీ స్వరాన్ని వినిపిస్తుంది. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు జియో ట్యాగింగ్ చేశాం. రాచకొండలో 35.27 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 3,396 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశాం. మూడు స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశాం.

– తరుణ్ జోషి, రాచకొండ సీపీ



సామాజిక మాధ్యమాలపై నిఘా పెట్టాం. నకిలీ పోస్టులను సోషల్ మీడియాలో వైరల్ చేసే వారిని గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు 24/7 అందుబాటులో ఉంటాయి. తప్పుడు పోస్టులపై పార్టీలతో పాటు పౌర సమాజం కూడా ఫిర్యాదు చేయొచ్చు."

– అవినాష్ మహంతి, సైబరాబాద్ సీపీ




సెలబ్రిటీ ఓటు ఎక్కడ?

– వివరాలు 4లో

"ధర్మాన్ని కాపాడే ఏ ఒక్క అవకాశాన్నీ మనం వదలకూడదు. ఓటు కూడా అలాంటి ఒక్క అవకాశమే.."



నైట్ పార్టీలు

పోలింగ్‌కు చివరి నిమిషం వరకు ఎత్తులు జిత్తులు

- ఓటర్లను ఆకట్టుకొనేందుకు మందు పార్టీలు, నగదు పంపిణీ
- పంపకాలను అడ్డుకొనేందుకు ప్రత్యర్థుల ప్రయత్నాలు
- సర్వత్రా పోలీస్ నిఘా



సాక్షి, సిటీబ్యూరో: లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసం హోరాహోరీగా తలపడిన పార్టీలు ఆదివారం అర్ధ రాత్రి వరకు నిశ్శబ్దయుద్ధాన్ని నడిపాయి. వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు, అనుచరులు సోమవారం జరిగే పోలింగ్ కోసం ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు చివరి నిమిషం వరకు ఎత్తుకు పైఎత్తులు వేశారు. డబ్బులు, మద్యం పంపకాలు పెద్ద ఎత్తున కొనసాగాయి. వివిధ పార్టీలకు చెందిన డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు, కాలనీసంఘాలు, అపార్ట్‌మెంట్ సంఘాలకు చెందిన ప్రతినిధులకు నగదు పంపిణీ చేపట్టారు. ఇందుకోసం కిందిస్థాయి అనుచరుల ఇళ్లు, అపార్ట్‌మెంట్‌లే కేంద్రంగా మారాయి. ఈ క్రమంలో ప్రత్యర్థుల పంపకాల ఘట్టాన్ని అడ్డుకొనేందుకు అన్ని పార్టీలకు చెందిన కార్యకర్తలు నిఘా బృందాలను రంగంలోకి దించాయి. ఆయా పార్టీల్లోని కీలకమైన నాయకులు, క్రియాశీలక కార్యకర్తల కదలికలను కనిపెట్టేందుకు ప్రత్యర్థి శిబిరాలు ఎక్కడికక్కడ మోహరించాయి. పోలీసులు సైతం నిఘాను కట్టుదిట్టం చేశారు. మరోవైపు రాజకీయ నేతలు ఇంటింటికీ తమ 'అభ్యర్థన'ను చేరవేశారు. చాలాచోట్ల 'నైట్‌పార్టీలు' జోరుగా సాగాయి. అపార్ట్‌మెంట్‌లలోనే ఓటర్లను సమావేశపరిచి బాటిళ్లకొద్దీ కార్యక్రమాలు నిర్వహించడం గమనార్హం. 'తటస్థ ఓటర్లను మా వైపు తిప్పుకోవడమే కీలకం. ఈ ఓటర్ల కోసమే పోల్ మేనేజ్‌మెంట్'అని ఒక పార్టీ నాయకుడు అభిప్రాయపడ్డారు. వీరిని కనీసం 10 శాతం అనుకూలంగా మార్చుకోగలిగినా కచ్చితంగా గెలిచి తీరుతాం'అని మరో పార్టీ నేత ధీమా వ్యక్తం చేశారు. నెల రోజులుగా ప్రజల్లో తిరుగుతున్నప్పటికీ కొన్ని వర్గాల ఓటర్ల వైఖరి ఇంకా అంతుబట్టడం లేదని విస్మయం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే అన్నిచోట్ల అర్ధ రాత్రి వరకు మద్యం పార్టీలను ఏర్పాటు చేశారు. డబ్బుల పంపిణీ చేసినట్లు సమాచారం.

గెలిపిస్తారా... ఓడిస్తారా..

అన్ని రాజకీయ పార్టీలకు యూత్ ఓట్లు సవాల్‌గా మారాయి. ఎన్నికల ప్రచారంలో యువత పెద్దసంఖ్యలోనే కనిపిస్తున్నా.. ఓటింగ్ విషయంలో వారి ఆలోచనాసరళి ఎలా ఉంటుందనేది రాజకీయ నాయకులను ఆందోళనకు గురి చేస్తోంది. కొత్త ఓటర్లు ఎటువైపు మొగ్గుతారనేది మరో కీలకమైన అంశం. సామాజిక అవగాహన కొరవడడం వల్ల, ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం పట్ల బాధ్యతాయుతమైన దృక్పథం లేకపోవడం వల్ల ప్రతి ఎన్నికల్లోనూ యువత పోలింగ్‌కు దూరంగా ఉంటోంది. దీంతో గ్రేటర్‌లో 42 నుంచి 49 శాతం మాత్రమే పోలింగ్ శాతం నమోదవుతోంది. ఈ క్రమంలో యువ ఓటర్ల కోసం ఈసారి అన్ని పార్టీ లు శక్తివంచన లేకుండా కష్టపడ్డాయి. 'ఇంటిల్లిపాది తమ పార్టీకే ఓటు వేస్తారని నమ్మకం కలిగిన తరువాత మాత్రమే నగదు, నజరానాలు అందజేస్తున్నారు'అని దమ్మాయిగూడ ప్రాంతానికి చెందిన ఒక టీచర్ తెలిపారు.

ఎవరి లెక్కలు వారివే..

పోల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్లపైన కచ్చితమైన అంచనాలను సిద్ధం చేశారు. వివిధ బూత్‌ల పరిధిలో గత ఎన్నికల్లో ఎన్ని ఓట్లు వచ్చాయి. ఈ సారి అంతకంటే ఎక్కువ ఓట్లు రావాలంటే ఏం చేయాలి, ఏయే వర్గాలను కలవాలి. ఇంకా తాము కలవకుండా మిగిలిన ఓటర్లు ఎవరెవరు అనే విశ్లేషణతో, పక్కా లెక్కలతో శని, ఆదివారాలు అన్ని పార్టీలు వ్యూహాత్మక ప్రచారాన్ని కొనసాగించాయి. 'ప్రతి ఓటరు మనవాడే అనే అపోహ లేకుండా పోలింగ్ బూత్‌ల వరకు ఓటర్లను తరలించేందుకు పార్టీలు సన్నద్ధమయ్యాయి.

యశోద గ్రూప్‌లో రూ.3.26 కోట్ల పక్కదారి

- అకౌంట్స్ మేనేజర్ చేతివాటం
- నకిలీ ఖాతాలు.. జీతాల పేరిట నిధుల స్వాహా

సాక్షి, సిటీబ్యూరో: అన్నం పెట్టిన సంస్థకే అకౌంట్స్ మేనేజర్ కన్నం వేశాడు. వైద్యరంగంలో సేవలు అందిస్తున్న యశోద గ్రూప్ నిధులను కాజేశాడు. నకిలీ ఖాతాలు తెరిచి జీతాల పేరిట రూ.3.26 కోట్లు కొల్లగొట్టాడు. ఈ మేరకు ఆ గ్రూపులోని నర్సింగ్ విభాగం అకౌంట్స్ మేనేజర్‌పై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో (సీసీఎస్) కేసు నమోదైంది. ఆయన భార్యతో పాటు మరికొందరినీ పోలీసులు నిందితులుగా చేర్చారు. యశోద గ్రూప్‌లో యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (వైఎస్ఎస్‌హెచ్), యశోద హెల్త్ కేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (వైహెచ్‌ఎస్‌పీఎల్) సంస్థలు ఉన్నాయి. వీటి కార్పొరేట్ కార్యాలయం నగరంలోని నాగార్జున హిల్స్ ప్రాంతంలో ఉంది. విశాఖపట్టణం తాడిచెట్ల పాలానికి చెందిన నౌపడ రామ్ బాచుపల్లికి వలస వచ్చాడు. ఇతడు 2020 మార్చి 2వ తేదీ నుంచి వైహెచ్‌ఎస్‌పీఎల్‌లో అకౌంట్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. యశోద సంస్థ 11 బ్యాంకుల నుంచి ఉద్యోగులకు జీతాలిస్తోంది. ఈ క్రమంలో ప్రతి నెలా హెచ్‌ఆర్ విభాగం నుంచి ఉద్యోగుల లిస్టులు అకౌంట్స్ విభాగానికి వస్తుంది. అతడే ఆయా లిస్టుల్లో మార్పులు చేసి, అందుకు తగ్గట్టుగా చెక్కులు తయారు చేసి బ్యాంకులకు పంపేవాడు. ఈ క్రమంలో రామ్‌కు దుర్బుద్ధి పుట్టడంతో కొన్నాళ్ల క్రితం భారీ మోసానికి తెరలేపాడు. తన భార్య నౌపుడ కామేశ్వరితోపాటు ప్రవీణ, శ్రీరాంమూర్తి అనే పేర్లతో బ్యాంకు ఖాతాలు తెరిపించాడు.

రికార్డుల తనిఖీతో వెలుగులోకి...

యశోద సంస్థ ఉద్యోగులకు జీతాలు ఇచ్చే బ్యాంకు ఖాతాల్లోని బెనిఫీషియరీ లిస్టులో ఈ దొంగ ఖాతాలను కూడా రామ్ చేర్చాడు. ప్రతి నెలా ఇతడికి జీతం పడేది ఒక ఖాతా అయితే, తన పేరిట మరో ఖాతాను కూడా చేర్చాడు. దీంతో ఈ నాలుగు ఖాతాల్లోకి కూడా ప్రతినెలా జీతాలను బదిలీ చేశాడు. ఈవిధంగా 2021 మే–2023 సెప్టెంబర్ మధ్య రూ.3 కోట్ల 26 లక్ష 26 వేల 583 పక్కదారి పట్టించాడు. ఈ డబ్బులతో రామ్ భారీగా ఆస్తులు కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో అతడు హఠాత్తుగా గత నవంబర్‌లో ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోయాడు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో యశోద గ్రూప్ రికార్డులను తనిఖీ చే యగా రామ్ చేసిన స్కామ్ బయటపడింది.

వీరు తమ ఓటు తాము వేసుకోలేరు



మాధవీలత సునీత అసదుద్దీన్ ఒవైసీ



జ్ఞానేశ్వర్ సమీర్

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌పరిధిలోని నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో కొందరు తమ ఓటును తమకు వేసుకోలేని పరిస్థితి ఉంది. హైదరాబాద్ ఏఐఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ రాజేంద్రనగర్ పరిధిలోని శాస్త్రిపురంలో నివాసం ఉంటున్నారు. ఈ ప్రాంతం చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం కిందకు వస్తుంది. హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలత నివాసం ఈస్ట్ మారేడుపల్లిలోని మహేంద్రహిల్స్‌లో ఉంది. ఈ ప్రాంతం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. హైదరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ సమీర్ నివాసం జూబ్లీహిల్స్‌లో ఉంది. అది సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి వస్తోంది. చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ కుత్బుల్లాపూర్‌లో నివాసం ఉంటున్నారు. అది మల్కాజిగిరి లోక్‌సభ స్థానం పరిధిలోకి వస్తుంది. మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డికి తాండూరులో ఓటుంది. ఆ ప్రాంతం చేవేళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. వీరందరూ తమ ఓటును తాము వేసుకోకుండా ఇతరులకు వేయాల్సిన పరిస్థితి ఉంది.

కీసర కానిస్టేబుల్, హోంగార్డ్ సస్పెన్షన్

నగదు పట్టివేతలో తప్పుడు సమాచారం ఇచ్చారనే వేటు

కీసర: కీసర పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్, హోంగార్డ్‌ను ఉన్నతాధికారులు సస్పెన్షన్ చేశారు. నగదు పట్టివేతలో పోలీస్ అధికారులకు తప్పుడు సమాచారం అందించారని వీరిపై వేటు వేశారు. వివరాలు.. కరీంగూడ చౌరస్తా వద్ద శనివారం సాయంత్రం కీసర మొబైల్ టీమ్ కానిస్టేబుల్ శ్రీకాంత్‌యాదవ్, హోంగార్డు రాజు వాహనాల తనిఖీ చేపట్టారు. అటుగా పల్సర్ బైక్‌పై వెళ్తున్న సాయికుమార్, కార్తీక్‌లను పట్టుకొని వారి నుండి రూ.25 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇందలోంచి సుమారు రూ.6.7 లక్షలు కాజేసి రూ.18.30 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అయితే సాయికుమార్, కార్తీక్‌లు కీసర సి.ఐ.కి జరిగిన విషయాన్ని వివరించగా ఆయన ఉన్నతాధికారులకు పూర్తి సమాచారం అందించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన డీసీపీ పద్మ, ఏసీపీ మహేష్‌లు కానిస్టేబుల్, హోంగార్డ్‌ను సస్పెండ్ చేసినట్లు సమాచారం.

మల్కాజిగిరి.. అంతా రెడీ

- 37.79 లక్షల ఓటర్లు... 19,448 మంది ఎన్నికల సిబ్బంది
- 8,099 బ్యాలెట్ ,4,032 కంట్రోల్ యూనిట్లు... 4,515 వీవీ ప్యాట్లు
- పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన.. సీసీ కెమెరాలు ఏర్పాటు
- దివ్యాంగులు, వృద్ధుల కోసం అందుబాటులో వీల్‌చైర్లు

3,228 పోలింగ్ కేంద్రాలు.. ఇందులో 407 సమస్యాత్మక ప్రాంతాలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: దేశంలోనే అతిపెద్ద లోక్‌సభ నియోజకవర్గమైన మల్కాజిగిరిలో పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరగనున్న ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని మేడ్చల్, ఉప్పల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, కంటోన్మెంట్(సికింద్రాబాద్) అసెంబ్లీ సెగ్మెంట్లలో మొత్తం 37,79,596 మంది ఓటర్లు ఉండగా, ఎన్నికల నిర్వహణ కోసం 19,448 మంది సిబ్బందిని నియమించారు. 3,228 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అర్బన్‌లో 1,500 నుంచి 1,600 మంది ఓటర్లకు, గ్రామీణ ప్రాంతంలో 1,500 మంది ఓటర్లకు ఒకటి చొప్పున పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. 407 సమస్యాత్మక కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను అమర్చారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా 8,066 బ్యాలెట్ ప్యాట్లు, 4,032 కంట్రోల్ ప్యాట్లు, 4,515 వీవీ ప్యాట్లు ఏర్పాటు చేశారు. ఓటరు గుర్తింపుకార్డు లేనిపక్షంలో 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒక కార్డును చూపిస్తే, ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు.

ప్రత్యేక సదుపాయాలు

మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో దివ్యాంగ ఓటర్ల తరలింపునకు వాహనాలతోపాటు పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌చైర్లు అందుబాటులో ఉంచారు. ర్యాంప్‌లను కూడా ఏర్పాటు చేశారు. గర్భిణులు, వృద్ధులు, బాలింతలు, అనారోగ్య బాధితులకు కూడా రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద మంచినీరు, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచారు.

ఎన్నికల విధుల్లో 19,448 మంది సిబ్బంది

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఎన్నికల విధుల కోసం 19,448 మంది పోలింగ్ ఆఫీసర్(పీఓ)లు, ఏపీవోలు, ఓపీఓలు, సెక్టోరియల్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లను నియమించారు. భారీ బందోబస్తు కోసం 9,500 మంది పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించారు. మూడు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు ఒకరు చొప్పున మైక్రో అబ్జర్వర్‌ను నియమించారు. వీరంతా పోలింగ్ కేంద్రాల్లో జరిగే ప్రతి విషయాన్ని పరిశీలించి, ఎప్పటికప్పుడు సంబంధిత ఎన్నికల పరిశీలకులకు నివేదిక అందజేయనున్నారు.

సీసీ కెమెరాలు , వీడియో వెబ్ కాస్టింగ్

పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వీడియో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయటంతోపాటు 407 సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాల్లో లైవ్ వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 200 మీటర్ల వరకు వీడియో రికార్డింగ్ చేసేలా ఏర్పాట్లు చేశారు.

మియాపూర్ 220 కేవీ సబ్‌స్టేషన్‌లో ప్రమాదం

- కాలినపోయిన కరెంటు కేబుళ్లు
- రెండు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం
- ఘటనపై అనుమానం వ్యక్తం చేసిన అధికారులు
- ఘటనాస్థలాన్ని పరిశీలించిన టీఎస్‌పీడీసీఎల్ సీఎండీ



మియాపూర్ సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ముషారఫ్ ఫారూఖీ, మాదాపూర్ డీసీపీ వినీత్

గచ్చిబౌలి: మియాపూర్‌లోని 220 కేవీ ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్‌లో శనివారంరాత్రి అనుమానాస్పదస్థితిలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కేబుళ్లు కాలిపోవడంతో మియాపూర్, కైత్లాపూర్ 133/33 కేవీ సబ్‌స్టేషన్లలో విద్యుత్ పరఫరాకు అంతరాయం కలిగింది. అయితే అధికారులు, సిబ్బంది అప్రమత్తమై వెంటనే కరెంటు పునరుద్ధరించారు. సంస్థ ఎదుగుదలను ఓర్వలేక దుండగులు కుట్ర పన్ని ఈ ప్రమాదానికి పాల్పడి ఉంటారని టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టుపెట్టారు. నగరంలో 4,350 మెగావాట్ల డిమాండ్ ఉన్నప్పుడు కూడా ఈ సబ్ స్టేషన్ కేబుల్స్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదని, డిమాండ్ లేని ఈ సమయంలో ప్రమాదం జరగడంపై అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై ట్రాన్స్ కో అండ్ జెన్‌కో సీఎండీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ పోలీసు విచారణకు అదేశించారు. ఆదివారం ఘటనాస్థలాన్ని టీఎస్‌పీడీసీఎల్ సీఎండీ మహ్మద్ ముషారఫ్ ఫారూఖీ, మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ పరిశీలించారు. సబ్‌స్టేషన్లు, పీటీఆర్ వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



సబ్‌స్టేషన్ ఘటనపై కేసు

మియాపూర్: 220కేవి మియాపూర్ సబ్‌స్టేషన్‌లో అగ్ని ప్రమాద ఘటనపై ట్రాన్స్‌కో ఏఈ వెంకటలక్ష్మీ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ దుర్గా రామలింగప్రసాద్ తెలిపారు.



- ఏఐజీ ఆస్పత్రి నర్సింగ్ డే వేడుకలు
- పాల్గొన్న 1,000 మందికి పైగా నర్సులు

గచ్చిబౌలి: వాకథాన్‌లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా నర్సులు సందడి చేశారు. గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఇంటర్నేషనల్ నర్సింగ్ డే ఉత్సవాలకు వెయ్యి మందికి పైగా నర్సులు తరలివచ్చారు. ఈ సందర్భంగా 'మన నర్సులు– మన భవిష్యత్తు, ఆరోగ్య సంరక్షణకు బలమైన శక్తి'అనే నినాదంతో వాకథాన్ నిర్వహించారు. ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నర్సులు వ్యాధిగ్రస్తులకు దయ తో కూడిన సేవలు అందిస్తూ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఐజీ ఆస్పత్రి నర్సింగ్ చీఫ్ బిందు జార్జ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఓటేయడం పౌరుల బాధ్యత

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్



ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జస్టిస్ లక్ష్మణ్

రాజేంద్రనగర్: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కును వినియోగించుకోవటం పౌరుల బాధ్యత అని, ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.లక్ష్మణ్ అన్నారు. అత్తాపూర్ డివిజన్‌లోని గుడ్‌ఫ్రెండ్స్, చింతకుంట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఓటరు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పౌరుల తలరాతను మార్చే ఓటు హక్కు విషయంలో నిర్లక్ష్యం తగదన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్నవారితో ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త మ్యాడం మధుసూదన్, ప్రముఖ బిల్డర్ రామిరెడ్డి, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు వినోద్‌కుమార్, సుబ్బరాజు, సుధాకర్, ప్రభాకర్, ప్రవీణ్, నరసింహ, కె.శేఖర్, శ్రీధర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

నెలలు నిండక ముందే బాధితురాలి ప్రసవం

అమీర్‌పేట: తరచూ తన ఇంటికి వచ్చి కొడుకును ఆడించే ఓ మైనర్ బాలికపై కామాంధుడు కన్నేశాడు. మాయమాటలు చెప్పి ఆమెపై పలుమార్లు అత్యాచారం చేశాడు. ఫలితంగా గర్భవతి అయిన ఆ బాలిక నెలలు నిండక ముందే ప్రసవించింది. ఎస్‌ఆర్ నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో ఆ కామాంధుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 15 ఏళ్ల బాలిక ఓ వసతిగృహంలో ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతోంది. సెలవుల్లో ఇంటికి వచ్చే బాలిక పక్కింట్లో ఉండే శ్రీను అనే వ్యక్తి కొడుకును ఆడించేది. ఈ క్రమంలో ఆమెపై కన్నేసిన శ్రీను మాయమాటలు చెప్పి పలుమార్లు అత్యాచారం జరిపాడు. అయితే బాలిక భయంతో ఆ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. ఈ క్రమంలో రెండు రోజులుగా కడుపునొప్పిగా ఉందని కుటుంబసభ్యులకు చెప్పడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షించగా గర్భవతి అని తేలింది. అనంతరం కొద్దిరోజులకు నెలలు నిండకముందే ఆ బాలిక ప్రసవించింది. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

వంట చేస్తుండగా వృద్ధురాలి మెడలోని గొలుసు చోరీ



సీసీ కెమెరా ఫుటేజీలో అనుమానితుడిగా భావిస్తున్న వ్యక్తి

పంజగుట్ట: గుర్తుతెలియని వ్యక్తి ఓ ఇంట్లో చొరబడి వంట చేసుకుంటున్న వృద్ధురాలి మెడలోని బంగారుగొలుసు చోరీ చేశాడు. పంజగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీనగర్ కాలనీలోని, శాలివాహన నగర్‌లో నివాసం ఉండే విజయలక్ష్మి(75) ఆదివారం ఉదయం వంట చేసుకుంటోంది. ఆ సమయంలో ఇంట్లో ఆమె ఒంటరిగా ఉంది. ఇంటి వెనక నుంచి గోడదూకి వచ్చిన అగంతకుడు మెల్లిగా వెనక నుంచి ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి ఆమె పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పంజగుట్ట ఏసీపీ మోహన్ కుమార్, ఇన్‌స్పెక్టర్ శోభన్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ ఘటనాస్థలాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించి అనుమానితునిగా భావిస్తున్న ఒక వ్యక్తిని గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బలవంతంగా బాలికకు పసుపుతాడు కట్టాడు..

ఇన్‌స్టాగ్రాంలో ఫొటోలు పెట్టి వేధిస్తున్న యువకుడిపై కేసు

వెంగళరావునగర్: ఇష్టం లేకుండా పసుపుతాడు కట్టడమే కాకుండా ఇన్‌స్టాగ్రాంలో ఫొటోలు పెట్టి వేధిస్తున్న యువకుడిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదివిన బాలిక 2023లో కుటుంబసభ్యులతో కలిసి వనపర్తిలో జరిగిన ఓ పెళ్ళికి వెళ్ళింది. అక్కడ వంశీయాదవ్ అనే యువకుడు పరిచయమై ప్రేమ ప్రతిపాదన చేయగా బాలిక తిరస్కరించింది. స్నేహంగా ఉంటానని నమ్మించగా సరేనంది. అయితే డిసెంబర్ 25న మరోసారి ప్రేమిస్తున్నానని చెప్పడంతో ఒప్పుకుంది. ఈ క్రమంలో 2024 జనవరి 21న వనపర్తికి ఆమెను రప్పించాడు. అక్కడ తన స్నేహితుడి గదికి ఆమెను తీసుకెళ్లి బలవంతంగా పసుపుతాడు కట్టి ఫొటోలు తీసి ఇన్‌స్టాగామ్‌లో పెట్టాడు. వాటిని తొలగించాలని బాలిక ఎంతగా ప్రాధేయపడినా ఒప్పుకోలేదు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

అమ్మిన ప్లాట్లనే అమ్మి.. 2.10 కోట్లు దోచి..

- సాయి నిఖిత ఎస్టేట్స్ సంస్థ నిర్వాకం
- హైదరాబాద్ సీసీఎస్‌లో కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: ఒకరికి అమ్మిన ప్లాట్లను తిరిగి మరొకరికి అమ్ముతూ అమాయకుల నుంచి రూ. 2.10 కోట్లు వసూలు చేసి మోసగించిన రియల్ ఎస్టేట్ సంస్థపై హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. సాయి నిఖిత ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అమీర్‌పేట కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తోంది. దీనికి హబ్సిగూడలోనూ ఓ శాఖ ఉంది. ఈ సంస్థకు దివ్య అ నే వ్యక్తితోపాటు మరికొందరు డైరెక్టర్లుగా ఉన్నారు. దివ్యతో పాటు మార్కెటింగ్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు బీబీనగర్‌లో బృందావనం-11 పేరుతో డీటీసీపీ అప్రూవ్డ్ లేఔట్ విక్రయిస్తున్నామని ప్రచారం చేశారు. మల్కాజ్‌గిరికి చెందిన నగేష్‌తోపాటు రమ్యకృష్ణ, సూర్య కిరణ్, సంధ్య, సంగీత, వెంకట సబ్బయ్య, సతీష్ తదితరులు డబ్బులు చెల్లించి ప్లాట్లు కొనుగోలు చేశారు.

ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా..

నగదు చెల్లించినవారు తమ ప్లాటు రిజిస్ట్రేషన్ చేయాలంటూ ఒత్తిడి చేసినా ఆ సంస్థ డైరెక్టర్లు వాయిదా వేస్తూ వచ్చారు. దాదాపు ఐదు నెలలు వేచి చూసిన అనంతరం వారు ఆరా తీయగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. తమకు విక్రయిస్తామంటూ చూపించిన ప్లాట్లను నిర్వాహకులు గతంలోనే వేరే వారికి అమ్మినట్లు తెలుసుకున్నారు. దీంతో తమ డబ్బు తిరిగి ఇవ్వాలంటూ డైరెక్టర్స్, మార్కెటింగ్ విభాగ ప్రతినిధులను కోరినా ఫలితం లేకపోయింది. విసిగివేసారిన బాధితులు సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

నిర్లక్ష్యం వద్దు



ఓటేద్దాం.. ఎన్నుకుందాం..!

బాధ్యతతో మెలుగు



• నేటి ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ • ఎస్‌హెచ్‌ఓల పర్యవేక్షణలో పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు • ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరుతున్న అధికారులు







కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో పోలింగ్ ఏర్పాట్లు పూర్తయ్యాయి. కూకట్‌పల్లి అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ నుంచి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని సిబ్బంది తరలించారు. సర్కిళ్ల పరిధిలోని పోలింగ్ బూత్‌లకు పోలీసు బందోబస్తుతో తీసుకెళ్లారు. ఇప్పటికే గుర్తించిన పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓల పర్యవేక్షణలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నారు. గత వారం రోజులుగా సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. పోలింగ్ కేంద్రాల మహిళలు, వృద్ధులు, వికలాంగులకు వేర్వేరు క్యూ లైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కూకట్‌పల్లి నియోజకవర్గ ఓటర్లు	
పురుషులు	2,51,424
మహిళలు	2,30,506
ఇతరులు	126
మొత్తం ఓటర్లు	4,82,056
పోలింగ్ బూత్‌లు	417

ఓటర్ స్లిప్పుల పంపిణీ....

కూకట్‌పల్లి నియోజకవర్గంలో బూత్ లెవెల్ సిబ్బంది, అంగన్‌వాడీ, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఓటర్ స్లిప్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కానీ అన్ని ప్రాంతాల్లో వీటిని పంపిణీ చేయలేకపోయారు. దీంతో పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులే ఓటర్ స్లిప్పులను ఇంటింటికీ పంచుతూ కనిపించారు. కొంతమంది పార్టీ నాయకులు ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ ఓటర్ స్లిప్పులు పంచుతూ ఎన్నికల ప్రచారం చేసుకున్నారు. అత్యధిక కాలనీల్లో ప్రజలకు ఓటర్ స్లిప్పులు అందకపోవడంతో ఓటర్లు ఆందోళన చెందుతున్నారు.

◆ దీంతో ఎన్నికల కమీషన్ ఏర్పాటు చేసిన యాప్‌ల ద్వారా తమ పోలింగ్ స్టేషన్ వివరాలు తెలుసుకున్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, అల్లాపూర్, ఓల్డ్ బోయినపల్లి, బాలానగర్, ఫతేనగర్, బేగంపేట, మూసాపేట డివిజన్‌లు ఉన్నాయి. ఈ డివిజన్లలోని అన్ని పోలింగ్ బూత్‌లలో అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలీసు అధికారులు గత వారం రోజులుగా సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించారు. ఎన్నికల్లో గొడవలు చేసే వారిపై ప్రత్యేక దృష్టి సారించారు.

సెంటర్‌లను సందర్శించిన ఎన్నికల అధికారులు ....

◆ కూకట్‌పల్లిలోని అన్ని పోలింగ్ బూత్‌లను ఎన్నికల అధికారులు సందర్శించారు. ఎన్నికల సిబ్బంది ఈవీఎంలు, వివిధ పోలింగ్ కేంద్రాలకు తరలించే ఏర్పాట్లను అధికారులు స్వయంగా పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా వివాదాలకు తావు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

బూత్‌లలో సెల్‌ఫోన్‌కు అనుమతి లేదు

◆ పోలింగ్ బూత్‌లలో సెల్‌ఫోన్‌కు అనుమతి లేదని ఎన్నికల అధికారులు తెలిపారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల అధికారులు ఇప్పటికే అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. 6గంటల తరువాత క్యూ లైన్లలో ఉన్న ఓటర్లకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలోని పోలింగ్ బూత్‌ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.



జేఎన్‌టీయూ నుంచి ఎన్నికల సామగ్రిని పోలింగ్ బూత్‌ల అధికారులకు అందజేస్తున్న ఎన్నికల అధికారులు



ఓ పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఎన్నికల అధికారులు, పోలీస్ సిబ్బంది

ముస్లిం రిజర్వేషన్ల రద్దు లౌకికవాదానికి విరుద్ధం

కాచిగూడ: ప్రధాని నరేంద్రమోదీ ముస్లింల రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పడం ప్రజాస్వామ్య, లౌకిక, గణతంత్ర విధానానికి పూర్తి విరుద్ధమని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. మన దేశం లౌకిక ప్రజాస్వామ్య దేశమని చెప్పుకున్నప్పటికీ ప్రధానమంత్రి ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పడం దారుణమన్నారు. అన్ని వర్గాలకు, అన్ని మతాలకు సమానమైన హక్కులు, ప్రయోజనాలు కల్పించాలని రాజ్యాంగం నిర్దేశించినప్పటికీ సాక్షాత్తు దేశ ప్రధాని ఈ విధంగా మత రాజకీయాలు చేయడం దురదృష్టకరమని అన్నారు. తెలంగాణలో ఇస్తున్న 4 శాతం రిజర్వేషన్లు మతపరమైనవి కావని, ముస్లింలలో ఉన్న పలు ఉపకులాలు, ప్రాతినిధ్యం లేని వర్గాలకు ఇస్తున్నవని పేర్కొన్నారు. సంపద ఉన్న వర్గాలను తొలగించి అర్హత కలిగిన వారికి మాత్రమే రిజర్వేషన్లు కల్పిస్తున్నారన్నారు.

వేలిపై సిరా చుక్క.. కంప్యూటర్ కోర్సులో 80శాతం రాయితీ పక్కా

కాచిగూడ: ఓటు వేయండి.. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో 80 శాతం రాయితీతో శిక్షణ పొందండి అంటూ పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆదివారం ప్రకటించింది. యువతలో ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు, ప్రజలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు నేషనల్ కంప్యూటింగ్ కౌన్సిల్ ద్వారా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఈ రాయితీని ప్రకటించినట్లు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అడపా వెంకట్‌రెడ్డి తెలిపారు. 80 శాతానికి పైగా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ ద్వారా శిక్షణ అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఓటు వేసిన సిరా గుర్తు గల వేలిని చూపిస్తూ సెల్ఫీ దిగి వాట్సాప్ నెంబర్ సెల్: 9505800047 కు పంపిన యువతీ యువకులకు, విద్యార్థులకు కోర్సు ఫీజులో 80 శాతం రాయితీ కూపన్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఆన్‌లైన్ కోర్సుల వివరాలు, రిజిస్ట్రేషన్ వివరాలు పంపడం జరుగుతుందన్నారు.

సినిమాలు యువతను పెడదారి పట్టించొద్దు

'గాంజా శంకర్' సినిమా పేరు మార్చండి: వేముల రామకృష్ణ

కాచిగూడ: యువతను పెడదోవ పట్టించే విధంగా సాయిధరమ్ తేజ్ నటించిన 'గాంజా శంకర్' సినిమా పేరును వెంటనే మార్చాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. గాంజా శంకర్ సినిమా పేరుపై సినిమా నిర్మాత, దర్శకులు పునరాలోచించాలని ఆయన సూచించారు. ఇలాంటి పదాల వల్ల సమాజంపై ముఖ్యంగా విద్యార్థులు, యువతపై పెనుప్రభావం చూపుతుందని ఆయన ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో పేరున్న పెద్ద హీరోలు సినిమాల్లో ధూమపానం, మద్యం సేవిస్తూ కనిపిస్తున్నారని, ఈ హీరోలు నేటి యువతకు ఏమి సందేశం ఇవ్వదల్చుకున్నారని ఆయన ప్రశ్నించారు. కమర్షియల్ సినిమాలు తీయడంలో తప్పులేదని, కానీ మన సంస్కృతి, సంప్రదాయాలను మర్చిపోయి యువతను పెడదోవ పట్టించే విధంగా ఉన్న సినిమాలు చేస్తే అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. దీనిపై సెన్సార్ బోర్డు స్పందించి సినిమా దర్శక, నిర్మాతలకు నోటీసులు అందజేయాలని ఆయన కోరారు.

ప్రతి ఒక్కరు ఓటు వేయండి



కూకట్‌పల్లి: నేడు జరిగే ఎన్నికల్లో మీ ఓటును స్వచ్ఛందంగా వేయాలని నాగసాయి ప్రిసిషన్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత బీఎన్‌రెడ్డి పేర్కొన్నారు. డబ్బులు, ఇతర ప్రలోభాలకు లొంగకుండా ఓటువేయాలని చంద్రయాన్- 3 ఫేమ్, భారత పౌరుడిగా నీ కర్తవ్యం ఓటువేసి దేశ, రాష్ట్ర ప్రజలకు మేలు చేసే నాయకుడిని ఎన్నుకుందామన్నారు. స్వచ్ఛందంగా ఓటువేస్తే తప్పు చేసిన నాయకుడిని నిలదీయవచ్చన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన మాటలను గౌరవించి ప్రతి ఒక్కరు ఓటువేసి రాజ్యాంగాన్ని కాపాడుకుందామన్నారు.

ఆకట్టుకున్న చేనేత హస్తకళ ప్రదర్శన





మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో వినియోగదారుల సందడి

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శనకు స్థానికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ మేళాలో పట్టుచీరలు, ఫ్యాన్సీ, డిజైనర్, పోచంపల్లి, డ్రెస్ మెటీరియల్స్, చూడీదార్స్, షూటింగ్స్, షర్టింగ్స్, జ్యువెలరీ,బెడ్‌షీట్స్ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు వినోద్‌జైన్ ఓ ప్రకటనలో తెలిపారు. ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పాడ, అస్సాం సిల్క్, బగల్పూర్ సిల్క్, కర్ణాటక గ్రేడ్స్ ప్రింటెడ్ చీరలు, మధ్యప్రదేశ్ చందేరి, మహేశ్వరి, రాజస్థాన్ కోట బందా, బ్లాక్ ప్రింట్స్, గద్వాల్, నారాయణపేట, పోచంపల్లి, జిందాని, బనారస్, లక్నో డ్రెస్ మెటీరియల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. హరియాణా బెడ్ కవర్లు, లక్నో కుర్తీస్, డ్రెస్ మెటీరియల్స్, డోర్ కర్టెన్స్, జైపూర్ స్టోన్స్, ఒరిస్సా పెయింటింగ్స్ అండ్ క్రాఫ్ట్స్‌తో పాటు గృహోపకరణాలు, కొండపల్లి బొమ్మలు అందుబాటులో ఉన్నాయన్నారు. సామాన్యుల నుంచి సంపన్నుల వరకు అందరికి అందుబాటు ఉండేలా ధరలు ఉన్నాయని వివరించారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ మేళా అందుబాటులో ఉంటుందన్నారు. ఈ మేళాను మోతీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇక్ఫాయ్ డైరెక్టర్‌కు ప్రతిష్టాత్మక అవార్డు

బంజారాహిల్స్: విద్య, మార్కెటింగ్ బ్రాండింగ్ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ఇక్ఫాయ్ డైరెక్టర్ సుధాకర్‌రావుకు పూణెలోని ప్రతిష్టాత్మక ఎంఐటీ (మిట్) ఆర్ట్ డిజైన్ అండ్ టెక్నాలజీ యూనివర్శిటీ సీకే ప్రహ్లాద్ చైర్ అవార్డును అందజేసింది. డిజైన్ థింకింగ్‌ను ఇటీవల మార్కెటింగ్‌లో వస్తున్న మార్పులకు అనుగుణంగా సుదర్శన్‌రావు చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసిస్తూ ఈ అవార్డు అందజేశారు. మిట్ యూనివర్శిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సునీత కరాడ్, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ మంగేష్, ఫౌండర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విశ్వనాథ్ డి.కరాడ్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. తనకు ఈ అవార్డు లభించడం ఆనందంగా ఉందని, తనపై బాధ్యత మరింత పెరిగిందని సుధాకర్‌రావు అన్నారు.



అవార్డు అందుకుంటున్న ఇక్ఫాయ్ డైరెక్టర్ సుధాకర్‌రావు

సంప్రదాయ సంగీతాన్ని భావితరాలకు అందించాలి

చిక్కడపల్లి: సంస్కృతికి ప్రధానమైన సంప్రదాయ సంగీతాన్ని పరిరక్షిస్తు భావితరాలకు అందించాల్సిన బాధ్యత గురువులు, తల్లిదండ్రులుపై ఉందని వివిధ రంగాల ప్రముఖులు కోరారు. ఆదివారం రాత్రి త్యాగరాయ గానసభలో శ్యామ గాయత్రి మ్యూజిక్ అకాడమీ నిర్వహణలో శాస్త్రీయ సంగీత గురువు చిల్ల శివ పార్వతి జన్మదిన సందర్భంగా ఆమె శిష్య బృందం గానం, నాట్య గురువు జ్యోతి శేఖర్ శిష్యురాలు గాయత్రి శేఖర్ కూచిపూడి నాట్య ప్రదర్శన జరిగింది. ముఖ్య అతిథిగా కళా పోషకుడు గుదిబండి వెంకట్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. శివ పార్వతి ఎందరో ఔత్సాహికులకు సంప్రదాయ సంగీత నేర్పిస్తూ వారిని ఉత్తమ గాయకులుగా సమాజానికి అందిస్తున్నారని అభినందించారు. శ్రీ రామసాంస్కతిక సంస్థ స్థాపకుడు గొర్తి చంద్రశేఖర్, ప్రముఖ గాయకుడు త్రినాథరావు, శేఖర్‌లను అభినయ నాట్య మంజరి బిరుదుతో సత్కరించారు.



శివపార్వతిని సన్మానిస్తున్న దృశ్యం

స్ట్రాంగ్ రూమ్‌లో పోస్టల్ బ్యాలెట్ బాక్సులు

పార్టీల ఏజెంట్ల సమక్షంలో సీజ్ చేసిన రిటర్నింగ్ అధికారి

సాక్షి,మేడ్చల్‌జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా భోగారంలోని హోలీ మేరీ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్‌రూమ్‌లో ఆదివారం పోలైన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను భద్రపరిచారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ పరిధిలో పోలైన పోస్టల్ బ్యాలెట్ సీల్డ్ బాక్సులను పోలీసుల బందోబస్తుతో వివిధ పార్టీల ఏజెంట్ల సమక్షంలో సీల్‌చేసి భద్రపరచినట్లు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి తెలిపారు.

పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల తరలింపు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా భోగారంలోని హోలీ మేరీ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఆదివారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)ను తరలించారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు మేడ్చల్, ఉప్పల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఎల్బీనగర్, కంటోన్మెంట్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల నిర్వహణలో భాగంగా 8,066 బ్యాలెట్ ప్యాట్లు, 4,032 కంట్రోల్ ప్యాట్లు, 4,515 వీవీ ప్యాట్లను ఎన్నికల సిబ్బంది తరలించారు. వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌతమ్ ఆధ్వర్యంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఈవీఎంలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాలతో పటిష్టమైన పోలీసు భద్రతతో పోలింగ్ కేంద్రాలకు తరలించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు షురూ

శంషాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (రాజేంద్రనగర్)లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ బయాలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దోస్త్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని రాజేంద్రనగర్ కళాశాలకు మొదటి ఆప్షన్ ఇవ్వాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9441956233, 7032713785 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో సాయుధ బలగాలు

బంజారాహిల్స్: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ యంత్రాంగం తగిన రీతిలో బందోబస్తు ఏర్పాటు చేసింది. ఇతర రాష్ట్రాల నుంచి కూడా బందోబస్తు నిమిత్తం పోలీసులను రప్పించారు. వెస్ట్‌జోన్ పరిధి కిందకు వచ్చే ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో 68, జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో 151 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సీఐఎస్ఎఫ్ సాయుధ బలగాలను బందోబస్తులో ఉంచారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న చోట గేటు వద్ద ఇద్దరు, పోలింగ్ బూత్ వద్ద ఇద్దరు పహారా కాయనున్నారు. వెస్ట్‌జోన్ పరిధిలో మొత్తం 5 వేల మంది పోలీసులు పోలింగ్ విధుల్లో పాల్గొననున్నారు. ప్రతి పోలింగ్ బూత్‌కు వెళ్లే దారిలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేశారు.

కైత్లాపూర్‌లో 622.08 లీటర్ల మద్యం పట్టివేత

పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు

కూకట్‌పల్లి: ఎన్నికల తనిఖీల్లో భాగంగా అక్రమంగా తరలిస్తున్న 622.08 లీటర్ల మద్యాన్ని బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను అల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పర్వత్‌నగర్ ప్రాంతంలో ఓ వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసిన వ్యక్తులు పర్వతనగర్ నుంచి కూకట్‌పల్లి వైపు వస్తున్నారు. కైత్లాపూర్ బ్రిడ్జి కింద సబ్ ఇన్‌స్పెక్టర్ మల్యానాయక్ తన బృందంతో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. 622.08 లీటర్ల మద్యంపై బ్లూ కవర్ కప్పి తరలిస్తుండగా అనుమానం వచ్చిన పోలీసులు కవర్ తీసి చూడగా మద్యం సీసాలు కనిపించారు. దీని విలువ సుమారు రూ.6,84,288 ఉంటుందని తెలిపారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో మద్యం స్వాధీనం చేసుకున్నామని అన్నారు. డ్రైవర్ వినయ్‌తో పాటు మరో ఇద్దరు అనిల్, సైదులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ దేవరాజ్, కానిస్టేబుల్ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల అదుపులో మద్యంతో పట్టుబడ్డ నిందితులు

ఆర్యవైశ్యులను ఏకతాటిపైకి తెచ్చేందుకు కృషి

కవాడిగూడ: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ కృషి చేస్తున్నదని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సికింద్రాబాద్ జోన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన ఐవీఎఫ్ సెంట్రల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తాలు వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ... ఆర్యవైశ్యులు సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు అన్ని రంగాలలో రాణించేలా ఐవీఎఫ్ కృషిచేస్తున్నదన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు ఐవీఎఫ్ యువజన కమిటీ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. పేద కుటుంబాలకు చెందిన ఆర్యవైశ్య పిల్లలు ఉన్నత విద్య అభ్యసించేందుకు ఆర్థిక సాయం అందించడంతోపాటు బాలబాలికలకు ఉచితంగా వసతి గృహాలను సైతం ఏర్పాటు చేసిందన్నారు. పుణ్యక్షేత్రాల వద్ద వసతి గృహాలను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా కృషిచేస్తున్నదన్నారు. పేద కుటుంబాలకు చెందిన ఆర్యవైశ్యులను ఆదుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ కమిటీ సలహాదారుడు సత్తయ్య, కోశాధికారి నారాయణ, అడిషనల్ సెక్రటరీ శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శి సత్యనారాయణ, యువజన కమిటీ అధ్యక్షుడు రవిందర్, మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి మంజుల తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకుల సందడి

గోల్కొండ: గోల్కొండ కోట పర్యాటకులతో కిటకిటలాడింది. నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున పర్యాటకులు కోటకు తరలివచ్చారు. పాఠశాలలకు సెలవులు కావడంతో తమ తమ పిల్లలతో పలు కుటుంబాలు కోటకు తరలివచ్చాయి. కోటలోని నగీనాబాగ్, క్లాపింగ్ పోర్టికో తదితర ప్రాంతాల వద్ద పిల్లలు సందడి చేస్తూ ఆటలు ఆడుకున్నారు. పలువురు యువ జంటలు క్లాపింగ్ పోర్టికో వద్ద గల భారీ ఫిరంగి వద్ద సెల్ఫీలు దిగారు. రామభక్తులు కోట ఎగువ భాగంలో గల భక్త రామదాసు బందీఖానాను సందర్శించి భక్త రామదాసు చరసాలను సందర్శించారు.



నృత్యం.. మంత్రముగ్ధం



మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆకట్టుకున్నాయి. చెన్నై నుంచి వచ్చిన భరతనాట్య కళాకారిణి రక్షా దేవనాదన్ నట్టైకురంజి రాగం వర్ణం, జయదేవ అష్టపది అంశాలను ప్రదర్శించి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. కళాకారులు దీక్ష, అద్వితీ, శ్లోక, నయోనికా, లాస్య, లక్ష, సమన్విత, హెత్విక, తమదైన శైలిలో నృత్యాలు ప్రదర్శించారు.

–మాదాపూర్



14న భగీరథ మహర్షి జయంతి వేడుకలు

నగర సంఘం అధ్యక్షుడు ఉప్పరిశేఖర్

గచ్చిబౌలి: భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామని రాష్ట్ర సగర సంఘం అధ్యక్షుడు ఉప్పరిశేఖర్ తెలిపారు. గచ్చిబౌలి అంజయ్యనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కఠోర దీక్షతో ఒంటి కాలిపై తపస్సు చేసి పరమ శివుడిని ఒప్పించి పవిత్ర గంగను దివి నుంచి భువికి తీసుకొచ్చిన మహనుభావుడు భగీరథుడు అని అలాంటి మహనీయుని జయంతి వేడుకలను నిర్వహించడం సమాజానికి అవసరమన్నారు. సగరజాతి కులగురువైన ఆయన వేడుకలను తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామ, మండల, జిల్లా కేంద్రాలలో కూడా సగరులు ఎక్కడికక్కడ ఘనంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులు భగీరథుని జయంతి వేడుకలు జరుపుతున్నప్పటికీ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడానికి ఎన్నికల కోడ్ రావడంతో ఈ ఏడాది నిర్వహించడం లేదని స్పష్టం చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే వేడుకల్లో బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు,బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఇతర ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఉషా గాయత్రికి ఆత్మీయ సత్కారం

నాంపల్లి: సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు ఆధ్వర్యంలో యువ కళావాహిని నిర్వహణలో ప్రముఖ కూచిపూడి నృత్య గురువు డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రికి కేంద్ర సంగీత నాటక అ కాడమి పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ఆత్మీయ సత్కార సభ జరిగింది. ఈ కార్యక్రమా న్ని ఆదివారం రాత్రి నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో నిర్వహించారు. సారిపల్లి కొండలరావు అధ్యక్షత న జరిగిన సభకు ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణ హాజయ్యారు. దూరదర్శన్ పూర్వ డైరెక్టర్ హైదరాబాద్ డాక్టర్ పాలకుర్తి మధుసూదనరావు హాజరై సభను ప్రారంభించారు.

సీఎం ప్రకటనపై న్యాయవాద సంఘాల హర్షం

కాచిగూడ: తెలంగాణ న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం పట్ల హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస చారి, ప్రధాన కార్యదర్శి డి.హర్షవర్ధన్, నాంపల్లి మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రాజవర్ధన్ రెడ్డి, సికింద్రాబాద్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వసంత్ కుమార్, తెలంగాణ లాయర్స్ ఫోరం అధ్యక్షుడు కొండూరు వినోద్ కుమార్‌లు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. న్యాయవాదుల ఆరోగ్య బీమా పథకానికి అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని ఇటీవల బార్ అసోసియేషన్ ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు.

దొంగల ముఠా అరెస్టు

లాలాపేట: దృష్టి మరల్చి దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతున్న ఓ ముఠాను అరెస్టు చేసిన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన ముఖేష్ (35) మేస్త్రీ. ఈ నెల 6న నాగోల్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లడానికి తన సామగ్రితో ఆటో కోసం వేచి ఉన్నాడు. అదే సమయంలో బార్కాస్‌కు చెందిన యాసిన్ అలీ ఖాద్రీ(21) సెంట్రింగ్ వర్కర్, పహాడిషరీఫ్‌కు చెందిన షేక్ ఉస్మాన్, లారీ మెకానిక్, యాకుత్‌పురాకు చెందిన సయ్యద్ ఆదిల్(24) కార్ వాషింగ్ కార్మికుడు, సజ్జు నలుగురు ఆటోలో వచ్చి అతన్ని ఆటో ఎక్కించుకున్నారు. మార్గమధ్యలో మాటలతో అతన్ని దృష్టి మరల్చి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను దొంగిలించారు. తార్నాకలో గుడ్ లాండ్ బార్ అండ్ రెస్టారెంట్ వద్దకు రాగానే ఆటోలో స్థలం సరిపోవడం లేదంటూ దించేశారు. దీంతో బాధితుడు మరో ఆటోలో సికింద్రాబాద్‌కు చేరుకున్నాడు. అక్కడికి వెళ్లి చూసుకునేసరికి తన సెల్‌ఫోన్ కనిపించలేదు. మొదటి ఆటోలోని తోటి ప్యాసింజర్లుగా నటించిన వారే తన ఫోన్ చోరీ చేశారని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముగ్గురిని అరెస్టు చేయగా ఒకరు పరారీలో ఉన్నారు. వీరిపై గతంలో పలు స్టేషన్లలో కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పోలింగ్‌కు రెడీ..


నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పోలింగ్ సామగ్రి పంపిణీ..


నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో ఈవీఎంలతో సిబ్బంది..


నాంపల్లిలో ఈవీఎంలను పరిశీలిస్తున్న సిబ్బంది


అంబర్‌పేటలో పోలింగ్ సామగ్రి పరిశీలిస్తున్న సిబ్బంది


అబిడ్స్‌లో మోడల్ పోలింగ్ స్టేషన్ ముస్తాబు



పోలింగ్ కేంద్రాలకు బయలుదేరిన సిబ్బంది

ఆఖరి రోజూ అదే రద్దీ

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో..



- ఓటింగ్ కోసం తరలిన జనం
- సుమారు 20 లక్షల మందికి పైగా సొంత ఊళ్లలోనే ఓటింగ్
- మరో 500 బస్సులను అదనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ
- కిక్కిరిసిన రైళ్లు

సాక్షి, సిటీబ్యూరో: అది సంక్రాంతి కాదు. దసరా, దీపావళి అంతకంటే కాదు. కానీ నగరవాసులు సొంత ఊళ్లలో ఓట్ల పండుగ కోసం పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. మూడు రోజులుగా బస్సులు, రైళ్లు, ప్రైవేట్ వాహనాలు కిటకిటలాడాయి. ఏపీలో లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా కావడంతో సొంత ఊళ్లోనే ఓటు హక్కును వినియోగించుకొనేందుకు పెద్దఎత్తున తరలి వెళ్లారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు కూడా నగర వాసులు పెద్ద సంఖ్యలో వెళ్లారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ, రైల్వే ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాయి. ఆదివారం కూడా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఆర్టీసీ మరో 500 బస్సులను అదనంగా ఏర్పాటు చేసింది. దక్షిణమధ్య రైల్వే హైదరాబాద్ నుంచి విశాఖకు మరో రెండు రైళ్లను ప్రత్యేకంగా అందుబాటులోకి తెచ్చింది. నగరంలోని సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వేస్టేషన్‌లు, మహాత్మాగాంధీ, జూబ్లీ బస్‌స్టేషన్‌లు, ఎల్బీనగర్, ఉప్పల్, మెహదీపట్నం, ఆరాంఘర్,తదిర ప్రధాన కూడళ్లు ప్రయాణికుల రద్దీతో కనిపించాయి. ఎన్నికల సందర్భంగా ఈ మూడు రోజుల్లో సుమారు 20 లక్షల మందికి పైగా నగరవాసులు సొంత ఊళ్లకు తరలి వెళ్లినట్లు అంచనా. కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు, మియాపూర్, పటాన్‌చెరు, బీహెచ్ఈఎల్, హైటెక్‌సిటీ, ఖాజాగూడ తదితర ప్రాంతాలకు చెందిన నగరవాసులు పెద్ద ఎత్తున బయలుదేరారు. జగద్గిరిగుట్ట, జీడిమెట్ల, కుషాయిగూడ, ఈసీఐఎల్, ఉప్పల్, రామంతాపూర్, కర్మన్‌ఘాట్, తదితర ప్రాంతాల నుంచి తెలంగాణ జిల్లాలకు చెందిన ప్రజలు పెద్దఎత్తున బయలుదేరి వెళ్లారు.

బోసిపోయిన భాగ్యనగరం..

భాగ్యనగరం బోసిపోయింది. హోరెత్తిన మైకులు మూగబోయాయి. రోడ్లపైన పరుగులు తీసిన ప్రచార రథాలు మూలకు చేరాయి. సభలు, సమావేశాలు లేవు, రెండు రోజుల క్రితం వరకు వాగ్యుద్ధాలు చేసిన యోధులంతా ఇళ్లల్లో సేదదీరారు. అగ్రనాయకులు మొదలుకొని అనుచరగణాల వరకు మరో అంకానికి తెరతీశారు. దీంతో నగరంలో ఆదివారం ఎక్కడా ఎలాంటి సందడి కనిపించలేదు. మరోవైపు నగరవాసులు పెద్ద ఎత్తున సొంత ఊళ్లకు తరలి వెళ్లడం వల్ల కూడా రోడ్లపైన వాహనాల రాకపోకలు తగ్గుముఖం పట్టాయి. సాధారణంగా ఎన్నికలకు ముందు రోజు కనిపించే హడావుడి లేదు. ఎక్కడి వాళ్లు అక్కడే గప్‌చుప్ అన్నట్లుగా చడీ చప్పుడు లేదు. తుఫాన్ ముందు ప్రశాంతత నెలకొన్నట్లుగా సోమవారం నాటి లోక్‌సభ ఎన్నికల ఘట్టానికి ముందు రోజు నగరం సర్వత్రా ప్రశాంతంగా కనిపించింది.


నిర్మానుష్యంగా బషీర్‌బాగ్ ఫ్లై ఓవర్.

సెలబ్రిటీల ఓటు ఇక్కడే..

పార్లమెంట్ ఎన్నికల్లో పలువురు సినీ ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలో చాలామంది ప్రముఖులు ఓటు వేయనుండగా చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో కూడా మరికొంతమంది తారలు ఓటు వేయనున్నారు. గతేడాది నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సినీ ప్రముఖులు పెద్ద సంఖ్యలో ఓటు వేసి తమ బాధ్యతను చాటిచెప్పారు. ప్రతిఒక్కరూ ఓటు వేయాలంటూ పిలుపునిచ్చారు. ఓటు ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రజలపై సినీతారల ప్రభావం ఎక్కువగా ఉండడంతో ఆ ఎన్నికల్లో ఓటర్లు కూడా భారీగా తరలివచ్చి తాము సైతం అంటూ ఓటు వేశారు. సోమవారం జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో సైతం అటు సినీ ప్రముఖులు, ఇటు ఓటర్లు అదే స్ఫూర్తిని కొనసాగించేందుకు సిద్ధమవుతున్నారు. – బంజారాహిల్స్

- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కుటుంబ సమేతంగా బంజారాహిల్స్‌లోని నందినగర్ కమ్యూనిటీ హాలులో ఓటు హక్కు వినియోగించుకుంటారు.
- జూనియర్ ఎన్టీఆర్ బంజారాహిల్స్‌లోని ఓబుల్‌రెడ్డి స్కూల్‌లో, కల్యాణ్‌రామ్ ఎమ్మార్వో ఆఫీసు పోలింగ్ బూత్‌లలో ఓటు వేస్తారు.
- సినీ ప్రముఖుల్లో చిరంజీవి, సురేఖ, రామ్‌చరణ్, ఉపాసన, నితిన్‌లు జూబ్లీహిల్స్ క్లబ్ బూత్ నెంబర్–149లో ఓటు హక్కు వినియోగించుకుంటారు.
- హీరో రవితేజ ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ, సెంట్రల్ నర్సరీ బూత్ నెంబర్ 157లో, అక్కినేని నాగార్జున, అమల జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–45, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో, మహేష్‌బాబు, నమ్రత శిరోద్కర్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఓటు వేస్తారు.
- విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, బ్రహ్మాజీ, జీవిత, రాజశేఖర్‌లు జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్, ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో మోహన్‌బాబు, మంచు విష్ణు, రాఘవేంద్రరావు, కోట శ్రీనివాసరావు, పరుచూరి గోపాలకృష్ణ, విశ్వక్‌సేన్, రాణా, సురేష్‌బాబు ఓటు వేస్తారు.
- అల్లు అర్జున్, స్నేహారెడ్డి, అల్లు అరవింద్, అల్లు శిరీష్‌లు జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–69 బీఎస్ఎన్ఎల్ ఆఫీస్‌లో ఓటేస్తారు.
- హీరో వెంకటేష్, బ్రహ్మానందం మణికొండ హైస్కూల్‌లో, రాజమౌళి, రమ షేక్‌పేట ఇంటర్నేషనల్ హైస్కూల్‌లో, సుధీర్ బాబు దర్గా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, అల్లరి నరేష్ జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–45లోని మహిళా ఆర్థిక సహకార సంస్థలో, తనికెళ్ల భరణి యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో, సినీ దర్శకుడు శేఖర్ కమ్ముల పద్మారావు నగర్ వాకర్స్ టౌన్ హాలులో ఓటు వేస్తారు.







పదండి ఓటేద్దాం

- ఓటర్లలో అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు, సీనియర్ సిటిజన్, కాలనీ సంఘాల కృషి
- యువ ఓటర్లపైన ప్రత్యేక దృష్టి



సాక్షి, సిటీబ్యూరో: మరికొద్ది గంటల్లో పోలింగ్ ప్రారంభం కానుంది. రానున్న ఐదేళ్ల కాలానికి ప్రభుత్వాన్ని ఎన్నుకొనే కీలకమైన సమయం వచ్చేసింది. ఇంచుమించు నెల రోజులుగా హోరాహోరీగా ఎన్నికల పోరులో తలపడిన రాజకీయ పార్టీల భవితవ్యం తేలే సమయం కూడా ఇదే. కానీ నగర ఓటర్లలోని నిర్లిప్తత, బాధ్యతారాహిత్యం ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదకరంగా మారుతుందని స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్, యంగిస్థాన్ వంటి స్వచ్ఛంద సంస్థలు, సీనియర్ సిటిజన్స్ సంఘాలు ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాయి. కాలనీ సంఘాల ప్రతినిధులు, అపార్ట్‌మెంట్ సంఘాల ప్రతినిధుల సమన్వయంతో ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకొనేవిధంగా అవగాహన కార్యక్రమాలు కొనసాగించాయి. ఆదివారం కూడా పలు స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు ప్లకార్డులతో కూడళ్లలో నించుకొని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల సంఘం ఆడియో, ఎస్సెమ్మెస్ సందేశాలతో ఓటర్లను కర్తవ్యోన్ముఖులను చేసింది. యువతీ యువకులు, మహిళలు, దివ్యాంగుల కోసం ప్రతి నియోజకవర్గంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఎందుకీ ఉదాసీనత..

తెలంగాణలోని ప్రతి మూరుమూల ప్రాంతంలో ఉన్న ఓటర్లు బాధ్యతగా ఓటు వేస్తున్నారు. పౌరుడిగా విధులు నిర్వహిస్తున్నారు. కానీ గ్రేటర్‌లోని ఓటర్లు మాత్రమే ప్రతి ఎన్నికల్లోనూ ఉదాసీనంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోంది. సాధారణ బస్తీలు, కాలనీల్లో నివసించే పేద, సామాన్య వర్గాలు ఓటింగ్‌లో పాల్గొంటున్నప్పటికీ మధ్యతరగతి, ఆ పై వర్గాలు మాత్రం ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉంటున్నాయి. ప్రత్యేకించి యువత బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదు. సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్ గేమ్‌లు, వీడియోలు, ఎంటర్‌టైన్‌మెంట్ పైన ఉండే శ్రద్ధ ఓటు వేయడంపైన కనిపించడం లేదని సామాజిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం కొత్తగా ఓటు హక్కును పొందిన యువతీ యువకులు లక్షల్లోనే ఉన్నారు. ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్, ఎల్బీనగర్, తదితర నియోకవర్గాల్లో కొత్త ఓటర్లు పెద్ద సంఖ్యలో ఉన్నారు. అన్ని వర్గాలకు చెందిన ఓటర్లు బాధ్యతగా ఓటు వేస్తే నగరంలో ఈసారి ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుంది. అదే సమయంలో అభ్యర్థుల ఎన్నిక సైతం కొంతమేరకు పారదర్శకంగా ఉంటుంది. కానీ నగరవాసులు ఏ మేరకు ఈ బాధ్యతను నిర్వహిస్తారనేది సందేహం. వివిధ సందర్భాల్లో నగరంలో పోలైన ఓట్లు 55 శాతం లోపే ఉండడం గమనార్హం. కొన్ని సందర్భాల్లో దారుణంగా 42 శాతం మాత్రమే నమోదైంది.

పోలింగ్ పరిశీలనకు కంట్రోల్‌రూమ్

సాక్షి, సిటీబ్యూరో: పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలించేందుకు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్ తెలిపారు. దీని ద్వారా పోలింగ్ కేంద్రాల్లోని పరిస్థితులు, పోలింగ్ శాతం ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చునన్నారు. పోలింగ్ కేంద్రాల్లోని సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహిస్తున్నదీ లేనిదీ వెబ్‌కాస్టింగ్ ద్వారా గుర్తించి అవసరమైనప్పుడు తగిన సూచనలు చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకుగాను ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఆరుగురు చొప్పున కంప్యూటర్ ఆపరేటర్లు షిఫ్ట్ సిస్టమ్‌లో పనిచేస్తారని తెలిపారు.

రూ.23.84 కోట్ల నగదు సీజ్

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు రూ.23,84,36, 012 నగదు, రూ.26,03,12,917 విలువ గల వస్తువులు సీజ్ చేసినట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ తెలిపారు.అక్రమ మద్యం రవాణాచేస్తూ పట్టుబడ్డ 354 మందిపై కేసులు నమోదు చేసి 356 మందిని అరెస్ట్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు ఒక్కరోజే రూ.65,18,700 నగదు, రూ.5,36,280 విలువ చేసే వస్తువులు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

డీఆర్‌సీ సెంటర్‌ను సందర్శించిన జీహెచ్ఎంసీ కమిషనర్


యూసుఫ్‌గూడ డీఆర్‌సీ సెంటర్‌ను సందర్శించిన కమిషనర్

బంజారాహిల్స్: యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో సికింద్రాబాద్ పార్లమెంటు పరిధి కిందకు వచ్చే ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల ఈవీఎంలు, వీవీ ప్యాట్లు తరలించే డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్(డీఆర్‌సీ) సెంటర్ ఏర్పాటు చేశారు. సోమవారం జరగనున్న పోలింగ్‌కు సంబంధించి ఆదివారం మధ్యాహ్నం నుంచి పోలింగ్ బూత్‌లకు ఈవీఎంలను చేరవేసే ప్రక్రియను భారీ పోలీసు బందోబస్తు మధ్య చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్ డీఆర్‌సీ సెంటర్‌ను సందర్శించారు. ఈవీఎంలు, వీవీప్యాట్ల పంపిణీ ప్రక్రియ సజావుగా సాగే విధంగా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సంబంధిత అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

సజావుగా ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు: తరుణ్ జోషి


సరూర్‌నగర్ ఇండర్ స్టేడియంలో రాచకొండ సీపీ తరుణ్ జోషి పరిశీలన

నాగోలు: లోక్ సభ ఎన్నికల పోలింగ్ సజావుగా సాగేలా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రాచకొండ సీపీ తరుణ్‌జోషి తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లు, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించడానికి ఆయన ఆదివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, గుర్రంగూడలోని స్ఫూర్తి కళాశాలలను సందర్శించారు. అక్కడి స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ కేంద్రాలకు సబంధించిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. కౌంటింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ అధికారులు కలవకుండా పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మెటల్ బారికేడ్ వ్యవస్థ ప్రయోజనాలు వివరించి, వాటిని ఏర్పాటు చేసేలా ప్రత్యేక సూచనలు ఇచ్చారు. కమిషనర్ వెంటఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, డీసీపీ పద్మజ, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బందికి అవగాహన

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ, కంటోన్మెంట్ అసెంబ్లీ పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్ తెలిపారు. పోలింగ్ అధికారులు, సిబ్బందికి మరోమారు పోలింగ్ నిర్వహణపై రూపొందించిన వీడియో ద్వారా అవగాహన కల్పించారు. మాక్‌పోలింగ్ ఉదయం 5.30 గంటలకు నిర్వహించాలని, 15 నిమిషాల వరకు వేచి చూసినా ఏజెంట్లు ఎవ్వరూ రాకపోయినా మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకుంటుందని తెలిపారు.

ఏర్పాట్లను పరిశీలించిన వికాస్‌రాజ్

ఆదివారం కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియం, సికింద్రాబాద్ వెస్లీ కాలేజీలోని డీఆర్ సెంటర్లను తనిఖీ చేశారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌తో కలిసి హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని చార్మినార్, యాకుత్‌పుర అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సోమవారం పోలింగ్ రోజున ఎండ తీవ్రత ఎక్కువగా ఉండకపోవచ్చునని, అయినప్పటికీ ఓటర్లకు పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. నగరంలో ఓటు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ బాధ్యత గుర్తెరిగి ఓటును వినియోగించుకోవాలని కోరారు.

బందో'మస్త్'



ఎన్నికల విధుల్లో 14 వేల మంది పోలీసులు

- నగరంలో 1688 చోట్ల పోలింగ్ లోకేషన్లు
- వీటిలో 1046 సమస్యాత్మకంగా గుర్తింపు
- ఆయా చోట్ల కేంద్ర బలగాల మోహరింపు
- నేడు నగరంలో మద్యం విక్రయాలు బంద్
- ఎలక్షన్ ఏర్పాట్లను సమీక్షించిన నగర సీపీ

సాక్షి, సిటీబ్యూరో: పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన పోలింగ్ సోమవారం జరగనుంది. దీని నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా నగర పోలీసు విభాగం ఏర్పాట్లు చేసింది. వీటిని నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం మరోసారి సమీక్షించారు. పలు కీలక సూచనలు, సలహాలు జారీ చేశారు. నగర కమిషనరేట్ పరిధిలో రెండు పార్లమెంట్ స్థానాలు (హైదరాబాద్, సికింద్రాబాద్) పూర్తిగా, మరో రెండు (మల్కాజ్‌గిరి, చేవెళ్ల) పాక్షికంగా వస్తాయి. నగర పోలీసు విభాగంలో ఉన్న 14 వేల మందితో పాటు కేంద్ర నుంచి వచ్చిన 22 కంపెనీల సాయుధ బలగాలను వినియోగిస్తున్నారు. సిటీలోని 1688 ప్రాంతాల్లో (లోకేషన్స్), 4027 పోలింగ్ స్టేషన్లు (బూత్) ఉన్నాయి. గతంలో చోటు చేసుకున్న ఉదంతాలు, తాజా పరిణామాలు, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కేటగిరీలుగా విభజించిన పోలీసులు నగరంలో 1046 సమస్యాత్మక పోలింగ్ లోకేషన్లు ఉన్నట్లు గుర్తించారు. శాంతిభద్రతల పరంగా, ఏఎస్డీగా పిలిచే 'ఆబ్‌సెంట్, షిఫ్ట్, డెత్' ఓటర్లు ఎక్కువగా ఉన్న వాటినీ క్రిటికల్ పోలింగ్ లోకేషన్ల జాబితాలోకి చేర్చారు. వీటి వద్ద లా అండ్ ఆర్డర్ పోలీసులతో పాటు కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలను మోహరిస్తున్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోనూ మూడు చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ (ఎఫ్ఎస్టీ) ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ సబ్–ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి నేతృత్వంలో ముగ్గురు సాయుధ కానిస్టేబుళ్లు, స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, వీడియో గ్రాఫర్ ఇందులో ఉంటారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై వీళ్లు డేగకన్ను వేస్తారు. ఇదే సంఖ్యలో ఉండే స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (ఎస్ఎస్టీ) సైతం అసిస్టెంట్ సబ్–ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి నేతృత్వంలో ఇద్దరు కానిస్టేబుళ్లు, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, వీడియో గ్రాఫర్ కలిగి ఉంటాయి. ఈ టీమ్స్ అన్నీ మూడు షిఫ్ట్‌ల్లో 24 గంటలూ పని చేస్తాయి. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు 450కిపైగా కేసుల్లో దాదాపు 1200 మందిని పోలీసులు బైండోవర్ చేశారు. దాదాపు 480 పెండింగ్‌లో ఉన్న నాన్–బెయిలబుల్ వారెంట్లను ఎగ్జిక్యూట్ చేశారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లతో పాటు లాడ్జిలు, హోటళ్లు, పబ్లిక్ ప్రదేశాల్లో ముమ్మరంగా తనిఖీలు, సోదాలు చేస్తున్నారు. అంతర్ జిల్లా, అంతర్ కమిషనరేట్ సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లోని సిబ్బంది వాహనాలు తనిఖీలు చేపడుతున్నారు. నగర పోలీసులు ఇప్పటి వరకు రూ.16 కోట్ల నగదు, 7370 లీటర్ల మద్యం, రూ.కోటి విలువైన మాదకద్రవ్యాలు, రూ.13 కోట్ల విలువైన వెండి, బంగారం, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడానికి ఉద్దేశించిన వస్తువులు రూ.17 లక్షల విలువైనవి స్వాధీనం చేసుకున్నారు. శాంతిభద్రతల విభాగం, కేంద్ర బలగాలతో పాటు అవసరమైన స్థాయిలో టీఎస్ఎస్‌పీ, సీఏఆర్, ఏఆర్ బలగాలు వాడుతున్నారు. నగరంలో ఓ పోలింగ్ లోకేషన్‌లో గరిష్టంగా 13 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. దీనిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ప్రతి పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్‌తో ఒకటి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌తో ఒకటి చొప్పున క్యూఆర్టీ (క్విక్ రియాక్షన్ టీమ్స్) ఉంటాయి. అలాగే ప్రతి ఏసీపీ పరిధిలో ఓ స్ట్రైకింగ్ ఫోర్స్ ఉంటుంది. ఇంటెలిజెన్స్ కలెక్షన్, లాజిస్టిక్ సపోర్ట్ కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటయ్యాయి. నగరంలోని 192 లా అండ్ ఆర్డర్ పికెట్లలో ఎస్ఐ స్థాయి అధికారి నేతృత్వంలో బృందాలు ఉన్నాయి. అలాగే 376 రూట్ మొబైల్స్ కూడా ఏర్పాటు చేశారు. పోలింగ్ నేపథ్యంలో సోమవారం నగర వ్యాప్తంగా మద్యం విక్రయాలను నిషేధించారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు ఇది అమలులో ఉండనుంది.

ఆ ఊరి కోసం 3 రోజుల ట్రెక్కింగ్!

హిమాచల్‌లో ఎన్నికల సిబ్బంది సాహసం

అది హిమాలయ పర్వత శ్రేణుల్లోని ఓ గ్రామం. పేరు బారా – భంగల్. సముద్ర మట్టానికి 2,575 మీటర్ల ఎత్తులో ఉంటుంది. దాన్ని ఆనుకునే రావి నదీ ప్రవాహం సాగిపోతుంటుంది.ఆ ఊరికి రోడ్డు మార్గం లేదు. చేరుకోవాలంటే ట్రెక్కింగ్ ద్వారానే సాధ్యం. పైగా అందుకు మూడు నాలుగు రోజులు పాటు సాహసయాత్ర చేయాల్సిందే! హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రా జిల్లా బైజంత్ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న ఈ కుగ్రామంలో 468 మంది ఓటర్లున్నారు. హిమాలయాల్లో ఎక్కడో మూలన విసిరేసినట్టుండే ఈ గ్రామం ఏడాదిలో ఆర్నెల్ల పాటు పూర్తిగా మంచుమయంగా మారుతుంది. దాంతో నవంబర్ నుంచి ఏప్రిల్ దాకా స్థానికులు కూడా సమీపంలోని బిర్‌కు వలస పోతారు. ఈ గ్రామాన్ని సందర్శించాలంటే మే నెల నుంచి అక్టోబర్ మధ్యే సాధ్యం! అయినా 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఈ గ్రామంలో అందరూ ఓటేయడం విశేషం! ప్రతికూల వాతావరణం వల్ల ఆ ఎన్నికలప్పుడు హెలికాప్టర్‌ను వాడటం కుదర్లేదు. దాంతో 18 మందితో కూడిన ఎన్నికల బృందం 40 కిలోమీటర్లు ట్రెక్ చేసి మరీ గ్రామానికి చేరుకుంది! ఈసారి కూడా ఎన్నికల సిబ్బంది ట్రెక్కింగ్‌నే నమ్ముకుంటున్నారు. ''వారు పోలింగ్‌కు కొన్ని రోజుల ముందే బయల్దేరతారు. రోడ్డు మార్గంలో రాజ్‌గుండ్ దాకా చేరుకుంటారు. అక్కడి నుంచి మూడు రోజులు ట్రెక్ చేసి బారా భంగల్ చేరతారు'' అని కాంగ్రా జిల్లా ఎన్నికల అధికారి హేమ్‌రాజ్ బైర్వా వివరించారు. ఈవీఎం తదితర పోలింగ్ సామగ్రి తరలింపు కోసం హెలికాప్టర్ సమకూర్చాలని కోరనున్నామన్నారు. ''గ్రామస్తుల్లో బారా భంగల్‌లో ఎవరున్నారు, బిర్‌లో ఎవరున్నారో ఎన్నికల ముందు సర్వే చేసి తెలుసుకుంటాం. తదనుగుణంగా ఓటర్ల జాబితాను వేరు చేసి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం'' అని ఆయన తెలిపారు. అన్నట్టూ, ఈ ఊళ్లో సెల్ నెట్‌వర్క్ కూడా ఉండదు. దాంతో ఎన్నికల సిబ్బంది శాటిలైట్ ఫోన్లు వాడతారు. ఇక్కడ జూన్ 1న చివరిదైన ఏడో విడతలో పోలింగ్ జరగనుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఒడిశాలో ఎన్నికల పోరుకు రంగం సిద్ధమైంది. నాలుగో విడతలో భాగంగా రాష్ట్రంలో సోమవారం తొలి దశ పోలింగ్ జరగనుంది. లోక్‌సభతో పాటు ఒడిశా అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరుగుతుండటంతో పార్టీలన్నీ హోరాహోరీ తలపడుతున్నాయి. రాష్ట్రంలో 21 లోక్‌సభ, 147 అసెంబ్లీ సీట్లున్నాయి. గత ఎన్నికల్లో బీజేడీ 12, బీజేపీ 8 లోక్‌సభ సీట్లు గెలుచుకున్నాయి. సోమవారం 4 లోక్‌సభ స్థానాలు, వాటి పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థుల జాతకాలు తేలిపోనున్నాయి. వీటిలో మూడు లోక్‌సభ స్థానాలు ఏపీ సరిహద్దు ప్రాంతాలే. అధికార బిజూ జనతాదళ్, ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమి మధ్య ఒడిశాలో త్రిముఖ పోరు జరుగుతోంది. బీజేడీని గద్దె దింపడంతో పాటు మెజారిటీ లోక్‌సభ స్థానాలు కొల్లగొట్టేందుకు బీజేపీ శ్రమిస్తోంది. కాంగ్రెస్ కూడా పూర్వ వైభవం కోసం సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఇక రెండు దశాబ్దాలకు పైగా సీఎం కుర్చీలో పాతుకుపోయిన బీజేడీ చీఫ్ నవీన్ పట్నాయక్ రెండు జాతీయ పార్టీలనూ నిలువరించేందుకు పోరాడుతున్నారు. పోలింగ్ జరగనున్న 4 లోక్‌సభ స్థానాల్లో పరిస్థితిపై ఫోకస్...

– సాక్షి, నేషనల్ డెస్క్



చిల్కా సరస్సులోని కాలీజయి ద్వీపం

సరిహద్దు సమరం

ఒడిశాలో బీజేడీ, కాంగ్రెస్, బీజేపీ హోరాహోరీ

- రాష్ట్రంలో లోక్‌సభతో పాటు అసెంబ్లీకి ఎన్నికలు
- నేడు 4 లోక్‌సభ స్థానాల పరిధిలో పోలింగ్
- వాటిలో మూడు ఏపీ సరిహద్దు స్థానాలే

బరంపూర్... జంపింగ్ జపాంగ్!

ఏపీతో సరిహద్దులు పంచుకుంటున్న ఈ నియోజకవర్గంలో తెలుగువారు ఎక్కువగా ఉంటారు. బరంపూర్ ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట. దివంగత ప్రధాని పీవీ నరసింహారావు 1996లో ఇక్కడి నుంచి గెలిచారు. 1999లో కాషాయ జెండా కూడా ఎగిరింది. 2009 నుంచీ బీజేడీ హవాయే సాగుతోంది.

ఇక్కడ బరిలో ఉన్న, గెలిచిన అభ్యర్థులు పార్టీలు మారిన వారే కావడం విశేషం. 2004 నుంచి 2019 మధ్య చంద్రశేఖర్ సాహు, ఒరియా సినీ నటుడు సిద్ధాంత మహాపాత్ర చెరో రెండుసార్లు గెలిచారు. సాహు 2004లో కాంగ్రెస్ తరఫున గెలిచి కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. 2009, 2014ల్లో బీజేడీ అభ్యర్థి మహాపాత్ర చేతిలో ఓడారు. తర్వాత సాహు కాంగ్రెస్‌ను వీడి బీజేడీలో చేరారు! 2019లో ఆ పార్టీ టికెట్‌పై గెలిచారు. ఈసారి మాత్రం బీజేపీ నుంచి వచ్చిన భృగు బాక్సిపాత్రకు బీజేడీ టికెటివ్వడం విశేషం. భృగు 2019లో బీజేపీ తరఫున పోటీ చేసి సాహు చేతిలో ఓడారు. బీజేపీ ఈసారి సీఎం నవీన్ మాజీ అనుచరుడు ప్రదీప్‌కుమార్ పాణిగ్రాహికి టికెటిచ్చింది. కాంగ్రెస్ అభ్యర్థి రష్మి రంజన్ పట్నాయక్ కూడా గట్టి పోటీ ఇస్తున్నారు.



• ప్రదీప్‌కుమార్ పాణిగ్రాహి



• భృగు బాక్సిపాత్ర

కలహండి... కమలానికి ఎదురుగాలి!

బీజేపీకి తొలి నుంచీ గట్టి పట్టున్న స్థానం. కానీ 2009లో కాంగ్రెస్, 2014లో బీజేడీ గెలిచాయి. 2019లో మళ్లీ బీజేపీ నెగ్గింది. ఈసారి సిట్టింగ్ ఎంపీ బసంత కుమార్ పండాను పక్కనపెట్టి కలహండి రాజ కుటుంబానికి చెందిన మాళవిక కేసరీ దేవ్‌కు టికెటిచ్చింది. స్థానికులు రాణి మాతగా పిలుచుకునే మాళవిక మాజీ ఎంపీ అర్కా కేసరీ దేవ్ భార్య. అర్కా తండ్రి విక్రమ్ కేసరీ దేవ్ ఇక్కడ మూడుసార్లు బీజేపీ తరఫున గెలవడం విశేషం. ఆయన మరణానంతరం అర్కా ఇక్కడి నుంచే బీజేడీ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. కానీ 2019లో బీజేడీ టికెట్ నిరాకరించడంతో పార్టీకి గుడ్‌బై చెప్పారు. 2023లో బీజేపీలో చేరారు. కాంగ్రెస్ అభ్యర్థి ద్రౌపది మఝి ఎస్టీ నేత. గిరిజనుల్లో బాగా పట్టుంది. నియోజకవర్గంలో 4 లక్షల ఎస్టీ ఓట్లుండటం ఆమెకు కలిసొచ్చే అంశం. గౌడ సామాజిక వర్గానికి చెందిన లంబూధర్ నియాల్‌ను బీజేడీ బరిలోకి దించింది. గత ఎన్నికల్లో బీజేపీకి 26 వేల ఓట్ల మెజారిటీయే వచ్చింది. ఈసారి కూడా త్రిముఖ పోరులో బీజేపీకి ఎదురుగాలి వీస్తోందంటున్నారు.



• లంబూధర్ నియాల్



• మాళవిక కేసరీ దేవ్

కోరాపుట్... బీజేడీ, కాంగ్రెస్ మధ్యలో బీజేపీ!

కనువిందు చేసే తూర్పు కనుమలు, అబ్బురపరిచే జలపాతాలతో ఒడిశా కశ్మీర్‌గా పేర్కొందిన కోరాపుట్ ఒకప్పుడు కాంగ్రెస్ దుర్గం. మాజీ సీఎం గిరిధర్ గమాంగ్ అడ్డా. ఇక్కడినుంచి తొమ్మిదిసార్లు ఎంపీగా గెలిచిన రికార్డు ఆయనది! 1999లో సీఎంగా ఉంటూ కేంద్రంలో వాజ్‌పేయి ప్రభుత్వం విశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటేసి గద్దె దించిన అపప్రథను గమాంగ్ మూటగట్టుకున్నారు. 2009, 2014ల్లో బీజేడీ చేతిలో ఓటమి చవిచూశారు. 2023లో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన గమాంగ్ అనంతరం బీఆర్ఎస్‌కు జై కొట్టడం విశేషం! 2019లో కాంగ్రెస్ అభ్యర్థి సప్తగిరి శంకర్ ఉలాక కేవలం 3,613 ఓట్ల మెజారిటీతో గెలిచారు. బీజేడీ నుంచి మాజీ ఎంపీ ఝినా హికాక భార్య కౌసల్య పోటీ చేస్తున్నారు. బీజేపీ కలిరామ్ మఝిని బరిలోకి దించింది. నియోజకవర్గంలో మంచి పట్టున్న జయరాం చేరికతో కాంగ్రెస్ మరింత బలోపేతమైంది. పోటీ ప్రధానంగా బీజేడీ, కాంగ్రెస్ మధ్యే ఉంది. దాంతో బీజేపీ చీల్చే ఓట్లు కీలకంగా మారాయి.



• కౌసల్య హికాక



• సప్తగిరి శంకర్ ఉలాక

నవరంగ్‌పూర్... టఫ్ ఫైట్

ఏపీ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉన్న మరో ఎస్టీ నియోజకవర్గమిది. ఇదీ గతంలో కాంగ్రెస్ కంచుకోటే. ఖగపాటి ప్రధాని రికార్డు స్థాయిలో వరుసగా తొమ్మిదిసార్లు గెలిచారు. తర్వాత నెమ్మదిగా బీజేపీ, ఆపై బీజేడీ ఇక్కడ పాగా వేశాయి. 2014లో బీజేడీ నుంచి బలభద్ర మఝి కేవలం 2,042 ఓట్ల తేడాతో కాంగ్రెస్‌ను ఓడించారు. ఆయన 2019లో పార్టీ మారి బీజేపీ తరఫున పోటీ చేశారు. బీజేడీ అభ్యర్థి రమేశ్ చంద్ర మఝి చేతిలో ఓటమి చవిచూశారు. ఈసారీ బీజేపీ నుంచి మళ్లీ బరిలో ఉన్నారు. బీజేడీ మాత్రం సిట్టింగ్‌ను పక్కన పెట్టి కాంగ్రెస్ నుంచి వచ్చిన మాజీ ఎంపీ ప్రదీప్ కుమార్ మఝికి టికెటివ్వడం విశేషం. కాంగ్రెస్ నుంచి సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే భుజబల్ మఝిని రంగంలో ఉన్నారు. ఇక్కడ పోటీ ప్రధానంగా బీజేడీ, కాంగ్రెస్ మధ్యే ఉంటున్నా బీజేపీకి భారీగా ఓట్లు పడుతున్నాయి. ఈసారి ఇక్కడ గెలుపును బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మోదీతో సహా బీజేపీ అగ్ర నేతలు ముమ్మరంగా ప్రచారం చేశారు. దాంతో పోటీ త్రిముఖంగా మారి ఉత్కంఠ రేపుతోంది!



• బలభద్ర మఝి



• ప్రదీప్ కుమార్ మఝి

తూర్పు భారతంలో కీలక రాష్ట్రమైన జార్ఖండ్‌లో ఎన్నికల పర్వానికి రంగం సిద్ధమైంది. సోమవారం తొలి దశ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలో 14 లోక్ సభ స్థానాలకు నాలుగు విడతల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. సోమవారం 4 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ జరగనుంది. కేంద్ర గిరిజన శాఖ మంత్రి, జార్ఖండ్ మాజీ సీఎం అర్జున్ ముండా, మాజీ సీఎం మధు కోడా భార్య గీత, మాజీ డీజీపీ విష్ణు దయాళ్ రామ్ తదితర ప్రముఖులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 10 జిల్లాల పరిధిలో విస్తరించిన ఈ నాలుగూ రిజర్వ్‌డ్ స్థానాలే కావడం విశేషం. పలాము ఎస్సీ, మిగతా మూడు ఎస్టీ నియోజకవర్గాలు. ప్రధాని మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తదితరులు ఇక్కడ ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో పోటీ ప్రధానంగా బీజేపీ; కాంగ్రెస్, జేఎంఎంలతో కూడిన విపక్ష ఇండియా కూటమి మధ్యే ఉంది. 2019 ఎన్నికల్లో ఈ నాలుగు స్థానాల్లో మూడు బీజేపీ, ఒకటి కాంగ్రెస్ నెగ్గాయి...

– సాక్షి, నేషనల్ డెస్క్



'బాస్ శిల్ప్' పేరిట జార్ఖండ్ గిరిజనులు తయారు చేసే వెదురు వస్తువులు

జార్ఖండ్‌లో నేడే తొలి దశ

- 4 లోక్‌సభ స్థానాలకు పోలింగ్
- మూడు బీజేపీ సిట్టింగ్ సీట్లే
- గిరిజనుల ఆధిపత్యమే ఎక్కువ

ఎవరికి రిజర్వ్‌డ్!

ఖుంటీ

కేంద్ర మంత్రి, బీజేపీ సిట్టింగ్ ఎంపీ అర్జున్ ముండా మరోసారి బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కాళీచరణ్ ముండాపై కేవలం 1,445 ఓట్ల ఆధిక్యంతో నెగ్గారాయన. కాంగ్రెస్ నుంచి మళ్లీ కాళీచరణే బరిలో ఉన్నారు. ఖుంటీ బీజేపీ కంచుకోట. ఆ పార్టీ నేత కరియా ముండా ఇక్కడ ఏకంగా ఎనిమిదిసార్లు గెలిచారు. గిరిజనుల ఆరాధ్యుడు బిర్సా ముండా స్వగ్రామం ఉలిహాట్ ఈ నియోజకవర్గ పరిధిలోనే ఉంది. గత నంబర్‌లో మోదీ ఈ గ్రామాన్ని సందర్శించి బిర్సా ముండాకు నివాళులర్పించారు. పేదరికం, మానవ అక్రమ రవాణా, మావోయిజం, నల్లమందు సాగు ఇక్కడి ప్రధాన సమస్యలు. కాంగ్రెస్ అభ్యర్థి కాళీచరణ్‌కు గిరిజనుల్లో పలుకుబడి ఉంది. రెండుసార్లు ఎమ్మెల్యేగా చేశారు. కూటమి భాగస్వామి జేఎంఎం మాజీ ఎమ్మెల్యే బసంత్ కుమార్ లోంగా రెబల్‌గా పోటీ చేస్తున్నారు. దాంతో ఆ పార్టీ నుంచి కాంగ్రెస్‌కు ఓట్ల బదిలీ ఏ మేరకు జరుగుతుందన్నది ప్రశ్నార్థకంగా మారింది.



• అర్జున్ ముండా



• కాళీచరణ్ ముండా

సింగ్‌భమ్

కాంగ్రెస్ పార్టీకి బలమైన స్థానమిది. ఐదుసార్లు కాంగ్రెస్, మూడుసార్లు బీజేపీ, ఒసారి జేఎంఎం, ఐదుసార్లు జార్ఖండ్ పార్టీ గెలిచాయి. సింగ్‌భమ్‌లో మాజీ సీఎం మధు కోడా కుటుంబానికి గట్టి పట్టుంది. 2009లో మధు కోడా స్వతంత్ర అభ్యర్థిగా గెలిచారు. 2014లో మాత్రం బీజేపీ నేత లక్ష్మణ్ గిలువా చేతిలో ఓటమి చవిచూశారు. 2019 ఎన్నికల్లో మధు కోడా భార్య గీత కాంగ్రెస్ టికెట్‌పై గెలిచారు. జార్ఖండ్‌లో కాంగ్రెస్ గెలిచిన ఏకైక స్థానం ఇదే. కానీ గీత గత ఫిబ్రవరిలో బీజేపీలో చేరి ఆ పార్టీ తరఫున బరిలో దిగారు. పొత్తులో భాగంగా కాంగ్రెస్ దీన్ని జేఎంఎంకు కేటాయించింది. దీంతో ఇక్కడ గెలుపును జేఎంఎం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. రాష్ట్ర మంత్రిగా చేసిన ఐదుసార్లు ఎమ్మెల్యే జోబా మాంఝిని రంగంలోకి దింపింది.



• గీతా కోడా



• జోబా మాంఝి

లోహర్దగ

ఇది బీజేపీ సిట్టింగ్ స్థానం. అయితే సిట్టింగ్ ఎంపీ సుదర్శన్ భగత్‌ను పక్కన పెట్టి సమీర్ ఒరాన్‌కు టికెటిచ్చింది. గత ఎన్నికల్లో ఓడిన కాంగ్రెస్ అభ్యర్థి సుఖ్‌దేవ్ భగత్ ఈసారీ బరిలో ఉన్నారు. జార్ఖండ్ పార్టీ నుంచి దియో కుమార్ ధాన్ పోటీ చేస్తున్నారు. బిష్ణుపూర్ జేఎంఎం ఎమ్మెల్యే చమ్రా లిండా కూడా ఇండిపెండెంట్‌గా బరిలో ఉండటం విశేషం! ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యే ఉంది. ఈ నియోజకవర్గంలో 70 శాతానికి పైగా గిరిజన జనాభాయే.



• సుఖ్‌దేవ్ భగత్



• సమీర్ ఒరాన్

పలాము

రాష్ట్రంలో ఏకైక ఎస్సీ రిజర్వ్‌డ్ లోక్‌సభ స్థానం. మాజీ డీజీపీ విష్ణు దయాళ్ రామ్ బీజేపీ టికెట్‌పై 2019లో 4.77 లక్షల ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. ఈసారీ ఆయనే బరిలో ఉన్నారు. ఇండియా కూటమి నుంచి ఆర్జేడీ తరఫున మమతా భూయాన్ పోటీలో ఉన్నారు. ఇక్కడ 2009లో జేఎంఎం గెలవగా 2014లో విష్ణు దయాళ్ బీజేపీ అభ్యర్థిగా తొలిసారి నెగ్గారు. ఆయనకు మద్దతుగా ప్రధాని మోదీ పలాములో భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు. మమతా భూయాన్ రాజకీయాలకు కొత్తయినా ఇక్కడ ఆమె సామాజిక వర్గం ఓటర్లు 4.5 లక్షలకు పైగా ఉంటారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఆరు అసెంబ్లీ సీట్లలో నాలుగు బీజేపీ చేతిలోనే ఉన్నాయి.



• మమతా భూయాన్



• విష్ణు దయాళ్ రామ్

అక్కడ తొలిసారి ఓటింగ్

సింగ్‌భమ్ లోక్‌సభ స్థానం పరిధిలో మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువ. దాంతో మారుమూల గ్రామాల్లోని వారికి ఓటేసే అవకాశం ఉండేది కాదు. అడవులు, కొండల్లోని అలాంటి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల ప్రజలు కూడా దశాబ్దాల విరామం తర్వాత ఈసారి ఓటేయనున్నారు. అనేక కష్టనష్టాలకోర్చి అక్కడ 118 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందుకోసం పోలింగ్ సిబ్బంది కిలోమీటర్ల కొద్దీ నడిచి వెళ్లారు. దట్టమైన అడవిలో ఉన్న సరండ అనే మారుమూల గ్రామానికైతే హెలికాప్టర్ ద్వారా ఎన్నికల సామగ్రిని తరలించారు. ఏ ఓటరూ ఓటింగ్‌కు దూరంగా ఉండొద్దన్నది తమ సంకల్పమని వెస్ట్ సింగ్‌భమ్ జిల్లా ఎన్నికల అధికారి కులదీప్ చౌదరి తెలిపారు.

మహిళల ఓట్లే కీలకం

సింగ్‌భమ్, ఖుంటి, లోహర్దగ స్థానాల్లో అభ్యర్థుల భవితవ్యం మహిళల చేతుల్లో ఉందని చెప్పాలి! ఎందుకంటే అక్కడ పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువ. జార్ఖండ్‌లో గిరిజన మహిళలు పురుషులతో సమానంగా సామాజిక, ఆర్థిక వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొంటారు. ఓటింగ్‌లోనూ చురుకైన పాత్ర పోషిస్తుంటారు. దాంతో మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు బీజేపీ, ఇండియా కూటమి అన్ని ప్రయత్నాలూ చేశాయి.

తోటల నగరంలో ఓట్ల వేట!



శ్రీనగర్ తులిప్ గార్డెన్

శ్రీనగర్. తోటల నగరం. నిషాత్ బాగ్, షాలిమార్ గార్డెన్స్, చష్మేషాహీ గార్డెన్, నెహ్రూ బొటానికల్ గార్డెన్, ఇందిరాగాంధీ తులిప్ గార్డెన్ వంటి అత్యంత అందమైన పూదోటలకు, ప్రఖ్యాత దాల్ సరస్సుకు నిలయం. జమ్మూ కశ్మీర్లోని ఐదు లోక్‌సభ స్థానాల్లో ఒకటైన శ్రీనగర్‌లో సోమవారం పోలింగ్ జరగనుంది. ముక్కోణపు పోటీలో ఎవరు గెలుస్తారన్నది ఆసక్తికరంగా మారింది....

– సాక్షి, నేషనల్ డెస్క్

శ్రీనగర్‌లో ముక్కోణపు పోరు

కీలకం

అబ్దుల్లాలదే ఆధిపత్యం

జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా, ఆర్టికల్ 370 రద్దయ్యాక జరుగుతున్న తొలి ఎన్నికలివి. రాష్ట్రంలో ఆరు లోక్‌సభ స్థానాలుండేవి. జమ్మూ కశ్మీర్, లద్దాక్ కేంద్రపాలిత ప్రాంతాలుగా మారాక ఐదు జమ్మూ కశ్మీర్ పరిధిలోకి, ఒకటి లద్దాఖ్ కిందకు వెళ్లాయి. శ్రీనగర్‌లో విజయం నేషనల్ కాన్ఫరెన్స్, జమ్మూ కశ్మీర్ పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (జేకేపీడీపీ) మధ్యే చేతులు మారుతుంటుంది. 2017 ఉప ఎన్నికలు, 2019 ఎన్నికల్లో ఎన్సీ అధినేత ఫరూక్ అబ్దుల్లా విజయం సాధించారు. అంతకుముందు 2014లో ఆయనపై పీడీపీ నేత తారిక్ హమీద్ కర్రా నెగ్గారు. 2009లో ఫరూక్ అబ్దుల్లా, 2004లో ఆయన కుమారుడు ఒమర్ అబ్దుల్లా విజయం సాధించారు. ఈసారి ఎన్సీ నుంచి ఆగా సయ్యద్ రుహుల్లా మెహెదీ, పీడీపీ నుంచి వహీదుర్ రెహమాన్ పర్రా, జమ్మూ కశ్మీర్ ఆప్నీ పార్టీ నేత మహమ్మద్ అష్రఫ్ మిర్ బరిలో ఉన్నారు. డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ అజాద్ పార్టీ, జమ్మూ కశ్మీర్ పాంథర్స్ పార్టీ, లోక్‌తాంత్రిక్ పార్టీతో పాటు 18 మంది స్వతంత్రులు కూడా పోటీలో ఉన్నారు. శ్రీనగర్ లోక్‌సభ స్థానంలో ఆది నుంచీ ఎన్సీదే ఆధిపత్యం. 13సార్లు ఎన్నికలు జరిగితే 10సార్లు ఆ పార్టీయే విజయం సాధించింది.

ఓటర్లలో నిరుత్సాహం...

శ్రీనగర్ లోక్‌సభ స్థానంలో 2009 లోక్‌సభ ఎన్నికల్లో 25.5 శాతం, 2014లో 25.86 శాతం పోలింగే నమోదైంది. ఇక 2019 ఎన్నికల్లో మరీ 14.43 శాతానికి పడిపోయింది! ఈసారి కూడా శ్రీనగర్ వాసుల్లో ఓటింగ్ పట్ల నిరుత్సాహమే కనిపిస్తోంది.

వలసదారులకు ఉన్నచోటే ఓటు!

జమ్మూ కశ్మీర్లోని శ్రీనగర్, బారాముల్లా, అనంతనాగ్ లోక్‌సభ స్థానాల పరిధిలో 1.13 లక్షల కశ్మీరీ వలసదారులు ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 52,100 మంది శ్రీనగర్ లోక్‌సభ స్థానంలో సోమవారం ఓటేయనున్నారు. వీరి కోసం జమ్మూలో 21, ఢిల్లీలో 4, ఉధంపూర్‌లో ఒకటి చొప్పున మొత్తం 26 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం విశేషం. అంతేగాక ఓటర్లను ఇంటి నుంచి పోలింగ్ కేంద్రాల వరకు తీసుకెళ్లి తిరిగి ఇంటి వద్ద దిగబెట్టే ఏర్పాట్లు కూడా చేశారు.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
260	98
72,664	22,055

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	16,341	▽	5
డోజోన్స్	39,513	▲	125
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,434	▲	52
డాక్స్	18,773	▲	86
షాంఘై	3,155	▲	1
నికాయ్	38,229	▲	155


అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	81.67	85.35
£	బ్రిటన్ పౌండ్	102.22	107.11
€	యూరో	87.81	92.26
¥	జపాన్ ఎన్ (100)	41.00	66.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	52.81	87.62
S$	సింగపూర్ డాలర్	59.33	64.05
SAR	సౌదీ రియాల్	21.37	22.93
UAE D	యూఏఈ దిర్హామ్	21.85	23.63
¥	చైనా యువాన్	10.44	12.51

పెట్టుబడి మొత్తం ఈక్విటీలకేనా?

సంపాదనను సంపదగా మార్చుకోవాలంటే అనుకూలమైన వేదికల్లో ఈక్విటీ ముందుంటుంది. రియల్ ఎస్టేట్ సైతం దీర్ఘకాలంలో మంచి సంపద సృష్టికి మార్గమవుతుంది. కానీ, ఈక్విటీ మాదిరి సులభమైన లిక్విడిటీ సాధనం రియల్ ఎస్టేట్ కాబోదు. మొత్తం పెట్టుబడిని ఒకటి రెండు రోజుల్లోనే వెనక్కి తీసుకోవడానికి స్టాక్ మార్కెట్ వీలు కల్పిస్తుంది. ఎక్కువ మంది ఇన్వెస్టర్లు ఈ విభాగం వైపు అడుగులు వేయడానికి గల కారణాల్లో ఇదీ ఒకటి. అయితే, ఒకరి పోర్ట్‌ఫోలియోలో ఈక్విటీ పెట్టుబడులు ఎంత మేర ఉండాలి..? రిటైల్ ఇన్వెస్టర్లలో చాలా మంది దీనికి సూటిగా బదులు ఇవ్వలేరు. ఈక్విటీల జిగేల్ రాబడులు చూసి చాలా మంది తమ పెట్టుబడులు మొత్తాన్ని స్టాక్స్‌లోనే పెట్టేస్తుంటారు. ఇలా చేయడం ఎంత వరకు సబబు? అసలు ఈ విధంగా చేయవచ్చా? ఒకరి పెట్టుబడుల కేటాయింపులు ఎలా ఉండాలి? ఈ విషయాలపై స్పష్టత కోసం కొన్ని కీలక అంశాలను ఒకసారి మననం చేసుకోవాల్సిందే.



- ఉన్నట్టుండి మార్కెట్లు కుప్పకూలితే?
- భయంతో దూరంగా వెళ్లిపోకూడదు
- అదనంగా పెట్టుబడులు పెట్టగలగాలి
- పతనాల్లో అమ్ముకోవడం ప్రతికూలం
- రిస్క్, రాబడుల అవసరాలు సమీక్షించుకోవాలి
- కాలవ్యవధి ఆధారంగా ఈక్విటీ కేటాయింపులు



మీరు ఎలాంటి వారు?

బుల్ మార్కెట్లో రిస్క్ తీసుకునేందుకు వెనుకాడకపోవడం.. బేర్ మార్కెట్లో రిస్క్‌కు దూరంగా ఉండడం రిటైల్ ఇన్వెస్టర్లలో కనిపించే సాధారణ లక్షణం. సుప్రసిద్ధ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ సూత్రానికి ఇది పూర్తి విరుద్ధం. "ఇతరులు అత్యాశ చూపుతున్నప్పుడు భయపడాలి.. ఇతరులు భయపడుతున్నప్పుడు అత్యాశ చూపాలి" అన్నది బఫెట్ స్వీయ అనుభవ సారం. మెజారిటీ రిటైల్ ఇన్వెస్టర్లు దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తుంటారు. పైగా తమ రిస్క్ స్థాయి ఎంతన్నది కూడా పరిశీలించుకోరు. పెట్టుబడిపై భారీ రాబడుల అంచనాలే వారి నిర్ణయాలను నడిపిస్తుంటాయి. దీర్ఘకాలంలో స్టాక్ మార్కెట్లో రాణించాలంటే ఇలాంటి ప్రతికూల ధోరణులు అస్సలు పనికిరావు.

అత్యవసర నిధి




ఉన్నట్టుండి ఉపాధి కోల్పోయి ఏడాది, రెండేళ్ల పాటు ఎలాంటి ఆదాయం రాకపోయినా జీవించగలరా? ప్రతి ఒక్కరూ ఒకసారి ఇలా ప్రశ్నించుకోవాలి. లేదంటే ఏడాది, రెండేళ్ల జీవన అవసరాలు తీర్చే దిశగా అత్యవసర నిధి ఏర్పాటు చేసుకోవాల్సిందే.

దీర్ఘకాలం కోసమేనా?



దీర్ఘకాలం అంటే ఎంత? అనే దానిపై ఇన్వెస్టర్లలో భిన్నమైన అంచనాలు ఉండొచ్చు. కొందరు 2–3 ఏళ్లు, కొందరు 5–10 ఏళ్లను దీర్ఘకాలంగా భావిస్తుంటారు. కానీ, ఈక్విటీలో ఇన్వెస్ట్ చేసే వారు స్వల్పకాలాన్ని మరిచి.. అవసరమైతే దశాబ్దాల పాటు ఆ పెట్టుబడులు కొనసాగించే మైండ్‌సెట్‌తో ఉండాలి.

బేర్ మార్కెట్ తట్టుకున్నారా?



కరోనా సమయంలో (2020 మార్చి) స్టాక్ మార్కెట్ భారీగా పడిపోవడం, కొన్ని నెలల వ్యవధిలోనే అంతా కోలుకోవడాన్ని ఇన్వెస్టర్లు చూసి ఉండొచ్చు. కానీ, మార్కెట్లు అన్ని సందర్భాల్లోనూ అంత వేగంగా కోలుకుంటాయని చెప్పలేం. చారిత్రక డేటాను పరిశీలిస్తే బేర్ మార్కెట్ ఆరంభం నుంచి రికవరీకి ఎంత లేదన్నా మూడేళ్లు పడుతుంది. కనుక బేర్ మార్కెట్ ఎంత కాలం పాటు కొనసాగినా, ధైర్యంగా వేచి చూడాలి.

సాహసం



బేర్ మార్కెట్‌లో తమ పోర్ట్‌ఫోలియో స్టాక్స్ భారీ నష్టాల పాలవుతుంటే దాన్ని చూసి తట్టుకోలేక రిటైల్ ఇన్వెస్టర్లు అమ్మకాలకు పాల్పడుతుంటారు. నిజానికి ఆ సమయంలో అదనపు పెట్టుబడులు పెట్టాలే కానీ, ఉన్న పెట్టుబడులను వెనక్కి లాగేసుకోకూడదన్నది మార్కెట్ పండితుల సూచన. ఇక్కడ చెప్పుకున్నట్టు అత్యవసరనిధి కలిగి, బేర్ మార్కెట్లో అదనంగా పెట్టుబడులు పెట్టే వెసులుబాటు.. లేదంటే ఉన్న పెట్టుబడులను కొనసాగించే మనో ధైర్యం ఉన్నవారు 100% పెట్టుబడులను ఈక్విటీలకు కేటాయించుకున్నా నష్టం లేదన్నది నిపుణుల నిర్వచనం.

రాబడులు

దీర్ఘకాలం పాటు ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తే కచ్చితంగా రాబడులే వస్తాయా? నిఫ్టీ 50 టీఆర్‌ఐ (రోలింగ్ రాబడులు) ఐదేళ్ల కాల పనితీరును గమనిస్తే ఒక్కో ఏడాది 47 శాతం పెరగ్గా, ఒక ఏడాది మైనస్ 1 శాతం క్షీణించింది. 2007 నుంచి 2023 మధ్య ఒక ఏడాది 52 శాతం, మరొక ఏడాది 25 శాతం వరకు నిఫ్టీ సూచీ నష్టపోయింది. కానీ, 55 శాతం, 76 శాతం రాబడులు ఇచ్చిన సంవత్సరాలూ ఉన్నాయి.

నిఫ్టీ 50 రాబడి

సంవత్సరం	+/-
2023	19.42
2022	4.32
2021	24.12
2020	14.90
2019	12.02
2018	3.15
2017	28.65
2016	3.01
2015	-4.06
2014	31.39
2013	6.76
2012	27.70
2011	-24.62
2010	17.95
2009	75.76
2008	-51.79
2007	54.77


నూరు శాతం కాదు..?

ఎన్ని చెప్పుకున్నా.. మధ్యమధ్యలో అనుకోని ఆర్థిక అవసరాలు ఎదురవుతుంటాయి. కనుక సామాన్య మధ్యతరగతి ఇన్వెస్టర్లు నూరు శాతం పెట్టుబడులను ఈక్విటీలకు కేటాయించుకోవడం సమంజసం కాదన్నది నిపుణుల అభిప్రాయం. ఇలాంటి వారు ఒకటి కంటే ఎక్కువ సాధనాల మధ్య పెట్టుబడులు వర్గీకరించుకోవాలి (అస్సెట్ అలోకేషన్). ఏ సాధనంలో ఎంతమేర అన్నది నిర్ణయించుకోవాలంటే.. విడిగా ఒక్కొక్కరి ఆర్థిక అవసరాలు, లక్ష్యాలు, ఆశించే రాబడులు, రిస్క్ సామర్థ్యం, పెట్టుబడులు కొనసాగించడానికి ఉన్న కాల వ్యవధి ఇవన్నీ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

అస్సెట్ అలోకేషన్ అంటే?



ఒకరు రూ.100 ఇన్వెస్ట్ చేయాలనుకుంటే.. ఇందులో ఈక్విటీకి ఎంత, డెట్‌కు ఎంత అన్నది నిర్ణయించుకోవడం. ఈ రెండు సాధనాలే కాదు, బంగారం, రియల్ ఎస్టేట్ తదితర సాధనాలు కూడా ఉన్నాయి. కానీ, ఎవరికైనా ఈ నాలుగు సాధనాలు సరిపోతాయి. మ్యూచువల్ ఫండ్స్ ద్వారా ఇన్వెస్ట్ చేస్తుంటే ఈక్విటీ ఫండ్స్, డెట్ ఫండ్స్, గోల్డ్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు.



డెట్‌లో రిస్క్

డెట్‌లో రిస్క్ లేదా? అంటే లేదని చెప్పలేం. ఇందులో వడ్డీ రేట్లు, క్రెడిట్ రిస్క్ ఉంటాయి. అందుకే ఏఏఏ రేటెడ్ సాధనాల ద్వారా క్రెడిట్ రిస్క్‌ను దాదాపు తగ్గించుకోవచ్చు. డెట్‌కు సింహ భాగం, కొంత శాతం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే 'ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్'ను సైతం అరుణ్ కుమార్ సూచించారు.

ఏ సాధనానికి ఎంత?



సాధారణంగా ఈక్విటీలకు ఎక్కువ కేటాయించుకోవడం వల్ల దీర్ఘకాలంలో మెరుగైన రాబడులకు అవకాశాలు ఉంటాయని చెప్పుకున్నాం. కనుక 20–30 ఏళ్ల వయసు వారు ఈక్విటీలకు 70–80 శాతం వరకు కేటాయించుకున్నా పెద్ద రిస్క్ ఉండబోదు. ఎందుకంటే వారు తమ పెట్టుబడులను దీర్ఘకాలంపాటు అంటే 20 ఏళ్ల పాటు కొనసాగించే వెసులుబాటుతో ఉంటారు. అదే 30–40 ఏళ్ల వయసు వారు ఈక్విటీలకు 50–70 శాతం మధ్య కేటాయించుకోవచ్చు. అంతకుపైన వయసున్న వారు 50 శాతం మించకుండా ఈక్విటీ పెట్టుబడులను కొనసాగించుకోవచ్చని నిపుణులు సూచిస్తుంటారు. 70 శాతం ఈక్విటీ కేటాయింపులు చేసుకునే వారు 20 శాతం డెట్‌కు, 10 శాతం బంగారంలో ఇన్వెస్ట్ చేయవచ్చు. 50 శాతం ఈక్విటీలకు కేటాయించే వారు 30–40 శాతం డేట్‌కు, బంగారానికి 10 శాతం వరకు కేటాయించొచ్చు. ఈ గణాంకాలన్నీ సాధారణీకరించి చెప్పినవి. విడిగా చూస్తే, 30 ఏళ్ల వయసున్న వ్యక్తికి 5 ఏళ్లలోపు వయసున్న ఇద్దరు పిల్లలు ఉన్నారని అనుకుందాం. అటువంటప్పుడు పిల్లల ఉన్నత విద్యకు 10–15 ఏళ్ల కాలంలో నిర్ణీత మొత్తం కావాల్సి వస్తుంది. అటువంటప్పుడు పెట్టుబడులకు 10–15 ఏళ్ల కాలం మిగిలి ఉంటుంది. కనుక ఈక్విటీలకు 70 శాతం వరకు, మిగిలినది డెట్, గోల్డ్‌కు కేటాయింపులు చేసుకోవచ్చు. పిల్లల వివాహం కోసం అయితే 20 ఏళ్లు, రిటైర్మెంట్ కోసం అయితే 30 ఏళ్ల కాలం ఉంటుంది. వీటి కోసం కూడా ఈక్విటీలకు గణనీయమైన కేటాయింపులు చేసుకోవచ్చు. ఒకవేళ ఐదేళ్లలోపు లక్ష్యాలు అయితే 80 శాతం డెట్‌కు, 20 శాతం ఈక్విటీలకు (ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్) కేటాయించుకోవచ్చు. మూడేళ్ల లక్ష్యాల కోసం అయితే పూర్తిగా డెట్‌కే పరిమితం కావడం శ్రేయస్కరం.

3టీ కార్యాచరణ

అస్సెట్ అలోకేషన్ విషయంలో మూడు 'టీ'ల కార్యాచరణను ఫండ్స్ ఇండియా రీసెర్చ్ హెడ్ అరుణ్ కుమార్ తెలియజేశారు. మొదటిది కాలం (టైమ్). ''చారిత్రకంగా చూస్తే దీర్ఘకాలంలో డెట్ (ఫిక్స్‌డ్ ఇన్‌కమ్)తో పోల్చినప్పుడు ఈక్విటీలే మెరుగైన పనితీరు చూపించాయి. కానీ స్వల్పకాలంలో 10–20 శాతం వరకు పతనాలు కనిపిస్తుంటాయి. అలాగే ఏడు–పదేళ్లకోసారి 30–60 శాతం వరకు పతనాలు కూడా సంభవిస్తుంటాయి. గత 40 ఏళ్ల చరిత్ర చూస్తే ఇదే తెలుస్తుంది. కానీ, ఈ 10–20 శాతం దిద్దుబాట్లు 30–60 శాతం పతనాలుగా ఎప్పుడు మారతాయన్నది ఎవరూ అంచనా వేయలేరు. ఇలాంటి పతనాలను ఎక్కువ మంది తట్టుకోలేరు. అందుకే పోర్ట్‌ఫోలియోలో డెట్‌ను చేర్చుకోవాలి. ఇది నిలకడైనది. దీర్ఘకాలంలో రాబడి 5–7 శాతం మధ్యే ఉంటుంది. కనుక ఈక్విటీలకు ఎంత కేటాయించాలన్న విషయంలో కాలాన్ని చూడాలి. ఎంత ఎక్కువ కాలం ఉంటే, ఈక్విటీలకు ఎక్కువ పెట్టుబడులు కేటాయించుకోవచ్చు. రెండోది టోలరెన్స్(టీ). అంటే నష్టాలను భరించే సామర్థ్యం. స్వల్పకాలంలో 10–20 శాతం పతనాలను తట్టుకునే సామర్థ్యం లేని వారు డెట్ కేటాయింపులు మరికాస్త పెంచుకోవచ్చు. ఈక్విటీలకు 50 శాతమే కేటాయించుకుంటే తరచూ వచ్చే పతనాల ప్రభావం తమ పోర్ట్‌ఫోలియోపై 10 శాతం, ఏడు–పదేళ్లకోసారి వచ్చే భారీ పతన ప్రభావాన్ని 25 శాతానికి తగ్గించుకోవచ్చు. మూడోది. ట్రేడాఫ్ (టీ). పెట్టుబడికి దీర్ఘకాలం ఉన్నప్పటికీ నష్టాల భయంతో రాబడుల్లో రాజీపడడం. ఏటా 12 శాతం రాబడి (ఈక్విటీల్లో దీర్ఘకాలం సగటు వార్షిక రాబడి) సంపాదిస్తే 20 ఏళ్లలో పెట్టుబడి 10 రెట్లు అవుతుంది. రాబడి ఏటా 10 శాతమే ఉంటే 20 ఏళ్లలో పెట్టుబడి ఏడు రెట్లే పెరుగుతుంది. 8 శాతం వార్షిక రాబడే వస్తే 20 ఏళ్లలో పెట్టుబడి ఐదు రెట్లే వృద్ధి చెందుతుంది. డెట్‌కు కేటాయింపులు పెంచుకున్నకొద్దీ అంతిమంగా నికర రాబడులు తగ్గుతుంటాయి'' అని అరుణ్ కుమార్ వివరించారు. నేరుగా ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే వారు 70–80 శాతం లార్జ్‌క్యాప్‌నకు, మిడ్‌క్యాప్ స్టాక్స్‌కు 10–15 శాతం, స్మాల్‌క్యాప్ స్టాక్స్‌కు 5–10 శాతం మధ్య కేటాయించుకోవచ్చని సూచించారు. ఫండ్స్ ద్వారా అయినా సరే ఇంతే మేర ఆయా విభాగాల ఫండ్స్‌కు కేటాయింపులు చేసుకోవచ్చు.




బాలాజీ అమైన్స్	సీడీ ఈక్విసెర్చ్	కొనొచ్చు

స్టాక్ వ్యూ

ప్రస్తుత ధర: రూ. 2,188 **టార్గెట్: రూ. 2,653**

ఎందుకంటే: గత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో స్పెషాలిటీ కెమికల్స్, ఫార్మా సంబంధ ప్రొడక్టుల కంపెనీ బాలాజీ అమైన్స్ నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో మొత్తం ఆదాయం 35 శాతం క్షీణించి రూ. 383 కోట్లకు పరిమితమైంది. ఇందుకు పలు కారణాలు ప్రభావం చూపాయి. చైనా సంస్థలు నిల్వలను తగ్గించుకోవడం(డీస్టాకింగ్), కంపెనీ ఉత్పత్తులను తుదిదశలో వినియోగించే పరిశ్రమలు సవాళ్లు ఎదుర్కోవడం, కీలక ఉత్పత్తుల ధరలు క్షీణించడం వంటి అంశాలు పనితీరును దెబ్బతీశాయి. అంతక్రితం అంటే 2022–23 క్యూ3లో రూ. 586 కోట్ల అమ్మకాలు సాధించింది. ఈ ప్రతికూలతలు డిమాండులోగల ప్రొడక్టుల విక్రయాలపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ఫలితంగా వీటి అమ్మకాలు 4.4 % నీరసించి 26,903 ఎంటీకి పరిమితమయ్యాయి.



అంతక్రితం ఏడాది క్యూ3లో ఇవి 28,147 ఎంటీగా నమోదయ్యాయి. అయితే రానున్న త్రైమాసికాలలో అమ్మకాల పరిమాణం తిరిగి పుంజుకోనుంది. ఇందుకు ఫార్మా, ఏపీఐ పరిశ్రమ జోరందుకోవడం సహకరించనుంది. చైనా కంపెనీల భారీ చౌక దిగుమతుల(డంపింగ్)కుతోడు.. తుదిదశ పరిశ్రమలకు స్థూల ఆర్థిక సవాళ్లు, ముడిసరుకుల ధరల్లో హెచ్చుతగ్గులు తదితర ప్రతికూలతలు గతేడాది తొలి 9 నెలల(ఏప్రిల్–డిసెంబర్) ఫలితాలను దెబ్బకొట్టాయి. చైనా దిగుమతులు తగ్గడం, ముడిసరుకుల ధరల్లో నిలకడ నేపథ్యంలో ప్రస్తుత 2024–25 నుంచి మార్జిన్లు మెరుగుపడే అవకాశముంది.

బంధన్ బ్యాంక్	జేఎం ఫైనాన్షియల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 188 **టార్గెట్: రూ. 263**

ఎందుకంటే: ప్రయివేట్ రంగ సంస్థ బంధన్ బ్యాంక్ క్రమంగా అన్‌సెక్యూర్డ్ రుణాలను తగ్గించుకుంటోంది. ప్రస్తుతం ఇవి 55 శాతానికిపైగా వాటాను ఆక్రమిస్తుండగా.. సెక్యూర్డ్ రుణాలు 45 శాతాన్ని ఆక్రమిస్తున్నాయి. ఇందుకు అనుగుణమైన వ్యూహాల అమలు ద్వారా అన్‌సెక్యూర్డ్ రుణ విభాగ వాటాను 50 శాతానికి తీసుకురానుంది. దీంతో రానున్న రెండేళ్లలో సెక్యూర్డ్ రుణాల వాటా 50 శాతానికి చేరనున్నట్లు బ్యాంక్ యాజమాన్యం పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో మధ్యకాలానికి నికర వడ్డీ మార్జిన్లు నెమ్మదిగా వెనకడుగు వేసే అవకాశముంది. అయితే మొండి రుణ ఒత్తిడి తగ్గడంతోపాటు.. ప్రస్తుతం రూ. 6,500 కోట్లమేర నమోదైన ఆర్‌ఐడీఎఫ్ పోర్ట్‌ఫోలియో విలువ క్షీణతకు అడ్డుకట్ట పడనుంది. బ్యాంక్ రుణ వ్యయాలు కొంతమేర సవాళ్లు విసురుతున్నప్పటికీ పోర్ట్‌ఫోలియో పర్యవేక్షణలో మార్పులు, వసూళ్లపై ప్రత్యేక దృష్టి కారణంగా స్లిప్పేజీలు తగ్గేందుకు అవకాశముంది. వెరసి కోవిడ్–19 తదుపరి కొనసాగుతున్న మొండి రుణ సవాళ్ల(స్ట్రెస్ సైకిల్)కు తెరపడనుంది. ఫలితంగా వృద్ధి, లాభదాయకత అంచనాలు, వీటిని సాధించగలిగే స్థాయికి బ్యాంక్ చేరనుంది. రుణ మిక్స్‌లో మార్పుల కారణంగా లాభదాయకత మందగించినప్పటికీ ఈ అంశంలో నిలకడకు వీలు చిక్కనుంది. క్లెయిములకు సంబంధించిన సీజీఎఫ్ఎంయూ పోర్ట్‌ఫోలియోపై ఆడిట్ ఫలితాల కోసం బ్యాంక్ ఎదురుచూస్తోంది. బ్యాంక్ బోర్డ్ ప్రస్తుత ఎండీ, సీఈవో ఘోష్ పదవీకాల పొడిగింపు(2024 జులై నుంచి మరో మూడేళ్లు) ప్రతిపాదనపై ఆర్‌బీఐ నిర్ణయం కోసం వేచిచూస్తోంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

బరోడా బీఎన్‌పీ పారిబా నుంచి రిటైర్మెంట్ ఫండ్



పదవీ విరమణ తర్వాత ఆర్థిక అవసరాలకు ఉపయోగపడే నిధిని పోగు చేసుకోవడంలో తోడ్పడేందుకు బరోడా బీఎన్‌పీ పారిబా మ్యుచువల్ ఫండ్ తాజాగా రిటైర్మెంట్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ ఓపెన్ ఎండెడ్ ఫండ్, అయిదేళ్ల లేదా 58 ఏళ్ల రిటైర్మెంటు వయస్సు (ఏది ముందైతే అది) లాకిన్ పీరియడ్‌తో ఉంటుంది. ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సాధనాలు, ఫిక్స్‌డ్ ఇన్‌కం సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా రాబడి అందించడం, పెట్టుబడిని పెంచడం లక్ష్యంగా ఈ స్కీము పని చేస్తుంది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్‌వో) మే 22తో ముగుస్తుంది. దీనికి క్రిసిల్ హైబ్రిడ్ 35+65 అగ్రెసివ్ ఇండెక్స్ అనేది బెంచ్‌మార్క్‌గా ఉంటుంది. ఏకమొత్తంగా లేదా సిప్ విధానంలో ఇన్వెస్ట్ చేయొచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-5-2024 ఫామ్ ధర...

విశాఖ	550–00
చిత్తూరు	608–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	540–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	535–00
వరంగల్	537–00
రిటైల్ ధర	5.95

వేర్వేరు లక్ష్యాలకు పెట్టుబడులు ఎలా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ప్రతీ లక్ష్యానికి విడిగా ప్రత్యేకమైన పోర్ట్‌ఫోలియో అవసరమా? – జోసెఫ్

ముందుగా సమీప కాలంలోని లక్ష్యాలను నిర్ణయించుకోండి. అలాగే, మధ్య కాలం, దీర్ఘకాల లక్ష్యాలను వేరు చేయండి. ఇప్పుడు స్వల్పకాల, మధ్యకాల లక్ష్యాలలో.. రాజీ పడేవి, రాజీపడలేనివి అంటూ రెండు భాగాలు చేయండి. రాజీపడలేని అంటే రిస్క్ తీసుకోలేని పెట్టుబడులు. రిస్క్ తీసుకోలేని స్వల్ప, మధ్యకాల లక్ష్యాల కోసం ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ (స్థిరాదాయ/డెట్) సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. వీటికోసం ఒక్కటే పోర్ట్‌ఫోలియో సరిపోతుంది. ఈ పెట్టుబడుల కోసం ఈక్విటీలపై ఆధారపడకూడదు. అవసరమైనప్పుడు వెంటనే తీసుకునేందుకు అనుకూలంగా ఉండాలి. ఇక దీర్ఘకాలం కోసం ఉద్దేశించిన పెట్టుబడులను అంటే వచ్చే ఐదేళ్లలోపు అవసరం లేని పెట్టుబడులను ఈక్విటీలకు కేటాయించుకోవాలి. ప్రతీ లక్ష్యానికి విడిగా ఎంత కాలం ఉంది? ఎంత చొప్పున కావాలి? ఎంచుకునే సాధనాలు? వాటిల్లో రాబడి ఎంత? ఈ అంశాల ఆధారంగా ఎంత మొత్తం ఇన్వెస్ట్ చేసుకోవాలన్నది నిర్ణయించుకోవడం సాధ్యపడుతుంది. మీ లక్ష్యానికి కావాల్సిన నగదు మీరు కోరుకున్న సమయంలో లభించేలా ప్రణాళిక ఉండాలి. ఉదాహరణకు వచ్చే మూడేళ్ల కాలంలో రూ.5 లక్షలు కావాలి, ఐదేళ్లలో రూ.5 లక్షల కావాలనుకుంటే లేదా 25–30 ఏళ్లలో రూ.కోటి రూపాయలు (రిటైర్మెంట్) కావాలనుకుంటే అందుకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకోవాలి. స్వల్పకాల లక్ష్యాల కోసం కేవలం బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్, డెట్ సాధానాల్లోనే ఇన్వెస్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఐదేళ్లకు మించిన ఏ లక్ష్యానికైనా డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్‌ను ఎంపిక చేసుకోవచ్చు.

మంచి ఇండెక్స్ ఫండ్‌ను ఎంపిక చేసుకునేందుకు ఏ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి? – వైదేహి

మ్యూచువల్ ఫండ్ ఎక్స్‌పెన్స్ రేషియోని చూడాలి. ఇండెక్స్‌తో పోలిస్తే, సదరు ఇండెక్స్ ఫండ్‌లో రాబడుల తీరు ఎలా ఉందన్నది పరిశీలించాలి. వ్యాల్యూ రీసెర్చ్ పోర్టల్‌లో అన్ని పథకాలకు సంబంధించిన పనితీరు, ఇతర డేటాను పరిశీలించుకోవచ్చు. ఇండెక్స్‌తో పోలిస్తే పథకం పనితీరు ఎలా ఉందన్న సమాచారం కూడా లభిస్తుంది. కొంత ట్రాకింగ్ లోపం ఉండే అవకాశం లేకపోలేదు. అంటే ఇండెక్స్ 2 శాతం పెరిగితే.. ఫండ్ పెట్టుబడుల విలువ అదే కాలంలో 2.01 శాతం, 1.99 శాతంగా చూపించొచ్చు. ముఖ్యంగా ఎక్స్‌పెన్స్ రేషియో కీలకం అవుతుంది. రెండు ఇండెక్స్ పథకాల్లో ఒకటి 10 బేసిస్ పాయింట్లు చార్జ్ చేస్తూ, మరో పథకం 25 బేసిస్ పాయింట్లు చార్జ్ తీసుకుంటుంటే.. అప్పుడు 10 బేసిస్ పాయింట్ల పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవడమే సరైనది. దీనివల్ల దీర్ఘకాలంలో అదనపు రాబడి సొంతం అవుతుంది.

గోల్డ్ ఈటీఎఫ్‌లలో అమ్మకాలు..

ఏప్రిల్‌లో లాభాల స్వీకరణ



న్యూఢిల్లీ: గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)లలో గత నెల (ఏప్రిల్) ఇన్వెస్టర్లు నికరంగా రూ. 396 కోట్ల మేర పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. అయితే, గోల్డ్ ఫండ్స్ నిర్వహణలో ఉన్న ఆస్తుల పరిమాణం (ఏయూఎం) మార్చి నెలాఖరున ఉన్న రూ. 31,224 కోట్ల నుంచి 5 శాతం పెరిగి రూ. 32,789 కోట్లకు చేరింది. రూపాయి మారకంలో చూస్తే పసిడి గత ఏడాది వ్యవధిలో మెరుగైన పనితీరే కనపర్చినప్పటికీ ఈక్విటీలతో పోలిస్తే తక్కువేనని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా అనలిస్ట్ మెల్విన్ శాంటారీటా తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈటీఎఫ్‌లలో మదుపరులు కొంత లాభాలు స్వీకరించి ఉంటారని ఆయన పేర్కొన్నారు. దీంతో ధర పెరిగినా ఈటీఎఫ్‌ల నుంచి పెట్టుబడులు నికరంగా తరలిపోయి ఉంటాయని వివరించారు. 2023 మార్చి తర్వాత గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి పెట్టుబడులను ఇన్వెస్టర్లు వెనక్కి తీసుకోవడం ఇదే ప్రథమం. మ్యుచువల్ ఫండ్స్ అసోసియేషన్ (యాంఫీ) డేటా ప్రకారం గతేడాది మార్చిలో నికరంగా రూ. 266 కోట్లు తరలిపోయాయి. తాజాగా మార్చిలో రూ. 373 కోట్లు వచ్చాయి. ఇక, గోల్డ్ ఈటీఎఫ్‌ల ఫోలియోల సంఖ్య మార్చిలో 50.61 లక్షలుగా ఉండగా.. ఏప్రిల్‌లో సుమారు 1 లక్ష పెరిగి రూ. 51.94 లక్షలకు చేరింది. 2022లో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రూ. 459 కోట్లు రాగా, 2023లో దానికి అనేక రెట్లు అధికంగా రూ. 2,920 కోట్లు వచ్చాయి. గతేడాది నెలకొన్న పరిస్థితుల కారణంగా సురక్షితమైన పెట్టుబడి సాధనంగా, ద్రవ్యోల్బణానికి తగిన హెడ్జింగ్ సాధనంగా పసిడికి ప్రాధాన్యం గణనీయంగా పెరిగింది. ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు పెరుగుతుండటం, భౌగోళిక రాజకీయ పరిస్థితులు ఆందోళనకరంగా మారడం తదితర అంశాల వల్ల ఇన్వెస్టర్లు బంగారం వైపు మొగ్గు చూపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.